సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 272
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'

దరఖాస్తుల జోరు.. పరీక్షకు రారు!

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో అభ్యర్థుల విచిత్ర వైఖరి

- ఉద్యోగ ప్రకటనల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపులు
- నోటిఫికేషన్ వెలువడగానే ఉత్సాహంగా దరఖాస్తులు
- వందల్లో ఉద్యోగాలు.. లక్షల్లో దరఖాస్తులతో తీవ్ర పోటీ
- సుదీర్ఘంగా సాగే భర్తీ ప్రక్రియ, పరీక్షల వాయిదాలతో అభ్యర్థుల్లో నిరుత్సాహం
- దీనితో అర్హత పరీక్షలకు పెద్ద సంఖ్యలో గైర్హాజరవుతున్న అభ్యర్థులు
- గతేడాది జరిగిన గ్రూప్–4 పరీక్షలకు హాజరు 80.20 శాతం
- ఈ ఏడాది జరిగిన గ్రూప్–2 పరీక్షలకు హాజరైంది 45 శాతమే..
- ఇతర పరీక్షల విషయంలోనూ ఇదే పరిస్థితి



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువడగానే దరఖాస్తులు పోటెత్తుతున్నాయి. వందల్లో పోస్టులు ఉంటే లక్షల మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. కానీ పెద్ద సంఖ్యలో అర్హత పరీక్షలకు గైర్హాజరవుతున్నారు. ఏళ్లుగా ఉద్యోగ నియామకాల కోసం ఎదురుచూస్తూ, సన్నద్ధమవుతున్నవారు కూడా ఇందులో ఉంటున్నారు. కనీసం హాల్‌టికెట్లు కూడా డౌన్‌లోడ్ చేసుకోనివారూ ఉన్నారు. భారీ సంఖ్యలో దరఖాస్తులు రావడంతో పోటీ విపరీతంగా ఉందనే ఆందోళనతో కొందరు పరీక్షలకు దూరమవుతుండగా.. నోటిఫికేషన్ నాటి నుంచి అర్హత పరీక్షలు పూర్తయ్యే నాటికి సుదీర్ఘకాలం పడుతుండటం.. కొన్ని సందర్భాల్లో పరీక్షలు వాయిదా పడుతుండటం.. ఆలోగా దరఖాస్తుదారులు ఏదో ఓ ఉద్యోగంలో చేరి బిజీ అయిపోవడం వంటివి దీనికి కారణంగా నిలుస్తున్నాయి. అత్యంత కీలకమైన కొలువులుగా

మిగతా 12వ పేజీలో ▶

సర్కారీ సంతాన సాఫల్య కేంద్రాలు

- గాంధీ, పేట్ల బురుజులో ఐవీఎఫ్ కేంద్రాలు ప్రారంభం.. వరంగల్‌లో ఏర్పాటుకు సర్కారు ఉత్తర్వులు

2 లో



క్రీస్తు బోధనలకు ప్రతీక మెదక్ చర్చి: గవర్నర్

- వందేళ్ల విశ్వాసానికి, దేవుని కృపకు నిదర్శనం
- చర్చి శతాబ్ది ఉత్సవాలకు హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

3 లో

రైతు భరోసా ఎగవేత కుట్రలు ఎదిరించండి

రైతులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ



- కొర్రీలతో సగానికి సగం ఎగవేసే ఎత్తుగడతో ప్రభుత్వం ఉంది
- రైతుబంధుపై దుష్ప్రచారంతో రైతాంగాన్ని దొంగలుగా చిత్రీకరిస్తున్నారు
- రైతులకు ఇస్తున్నది భిక్ష కాదు, వారి హక్కు అని తెలుసుకోవాలి

2 లో

అల్లు అర్జున్ ఇంటిపై విద్యార్థి సంఘాల దాడి

రేవతి కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్

- ఇంటిపై రాళ్లు విసిరిన ఆందోళనకారులు... పూల కుండీలు ధ్వంసం
- విద్యార్థి సంఘాల నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు...
- ఈ దాడి చట్ట వ్యతిరేక చర్య.. ఎవరినీ ఉపేక్షించబోమని హైదరాబాద్ సిటీ పోలీసు విభాగం ప్రకటన

2 లో

క్లుప్తంగా...

సినీ పరిశ్రమను టార్గెట్ చేస్తారా?

బీఆర్‌ఎస్ నేత శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: ప్రజా సమస్యలను వదిలేసి.. సినిమా పరిశ్రమ లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారని బీఆర్‌ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. వారు ఆదివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రైతుభరోసా అందక, రుణమాఫీ కాక, నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించక, గురుకులాల్లో నాణ్యమైన ఆహారం అందక తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న సమయంలో.. వాటిపై చర్చ జరపకుండా అసెంబ్లీలో సినీ నటుడు అల్లు అర్జున్‌ను తిట్టేందుకు గంటల కొద్దీ సమయం కేటాయించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. దేవాలయం లాంటి చట్టసభలో రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా వ్యక్తిగత కక్షతో వ్యవహరించడం సరి కాదని హితవు పలికారు.

పోలీసులపై అనుచితంగా మాట్లాడితే తోలుతీస్తాం

అల్లు అర్జున్‌ను ఉద్దేశించి డీఎస్పీ సబ్బతి విష్ణుమూర్తి వ్యాఖ్యలు



పంజగుట్ట (హైదరాబాద్): సినీ నటుడు అల్లు అర్జున్‌ను ఉద్దేశించి సస్పెన్షన్‌లో ఉన్న డీఎస్పీ సబ్బతి విష్ణుమూర్తి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ''మనం ఏదైనా పశువు చనిపోయినా ఏం జరిగిందని ఆరా తీస్తాం. తన సినిమా చూసేందుకు వచ్చి, తొక్కిసలాటలో మహిళ చనిపోయి, పసి పిల్లాడు ప్రాణాపాయస్థితిలో ఉంటే పరామర్శించకుండా వెళ్లిపోయిన అల్లు అర్జున్‌కు మానవత్వం లేదు. ఆయనలో సక్సెస్ మీట్స్‌కు వెళ్లలేకపోతున్నాననే ఆవేదనే తప్ప మనుషులు చనిపోయారన్న బాధ ఏ మాత్రం కనిపించడం లేదు''అని ఓ ప్రెస్‌మీట్‌లో పేర్కొన్నారు. సెలబ్రిటీలు చట్టాన్ని గౌరవిస్తూ మాట్లాడాలన్నారు. తొక్కిసలాటతో ఎవరికీ సంబంధం లేదని, అది ప్రమాదమేనని అల్లు అర్జున్ ఎలా చెబుతారని ప్రశ్నించారు. ఈ మధ్యకాలంలో సెలబ్రిటీలు, నాయకులు పోలీసులపై అనుచితంగా మాట్లాడటం ఫ్యాషన్ అయిపోయిందని.. అలా మాట్లాడితే తోలు తీస్తామని వ్యాఖ్యానించారు.

విష్ణుమూర్తి వ్యాఖ్యలు అనధికారికం: డీజీపీ ఆఫీసు

డీఎస్పీ సబ్బతి విష్ణుమూర్తి వ్యాఖ్యలపై డీజీపీ కార్యాలయం స్పందించింది. సబ్బతి విష్ణుమూర్తి ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారని, ఆయన అనధికారికంగా ప్రెస్‌మీట్ పెట్టారని ఓ ప్రకటనలో తెలిపింది. దీనిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది.

వారిలో పశ్చాత్తాపం కనిపించడం లేదు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: సినీ నటుడు అల్లు అర్జున్ వ్యవహారశైలి దారుణంగా ఉందని, ఆయనలో కనీసం పశ్చాత్తాపం కనిపించడం లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన విషయాలను తప్పుపట్టేలా మాత్రమే ఆయన తీరు ఉందని, రేవతి కుటుంబంపై కనీస సానుభూతి కూడా ఆయన చూపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తన కుమారుడు మూడీగా ఉంటున్నాడని అల్లు అరవింద్ అంటున్నారని, మరి రేవతి కుమారుడు శ్రీతేజ్ ప్రాణం ఐసీయూలో ఉలుకూ పలుకూ లేకుండా పడిఉన్న విషయం అరవింద్‌కు గుర్తు లేదా అని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తమ కారణంగా జరిగిన తప్పును సమర్థించుకోకుండా సరిదిద్దుకోవాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం సీఎల్పీలో ఆయన నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు మానవత్వంతో ఆదుకునే ప్రయత్నం చేయకుండా, ప్రభుత్వం తనపై తప్పుడు ప్రచారం చేస్తోందంటూ అల్లు అర్జున్ ఆరోపించడాన్ని ఆయన విమర్శించారు.

సర్కారీ సంతాన సాఫల్య కేంద్రాలు

గాంధీ, పేట్ల బురుజులో ఐవీఎఫ్ కేంద్రాలు ప్రారంభం

వరంగల్‌లో ఏర్పాటుకు సర్కారు ఉత్తర్వులు

హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, పాలమూరు, నిజామాబాద్‌లో మరో ఐదు కేంద్రాలకు ప్రణాళిక



సాక్షి, హైదరాబాద్: సంతానం కోసం ప్రైవేటు సంతాన సాఫల్య కేంద్రాల చుట్టూ తిరిగి లక్షలకు లక్షలు ఖర్చు చేసే స్థోమత లేనివారికి అండగా నిలువాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే హైదరాబాద్‌లో రెండు సర్కారీ సంతాన సాఫల్య కేంద్రాలను నెలకొల్పిన ప్రభుత్వం.. మరిన్ని జిల్లాల్లో ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. హైదరాబాద్‌లోని గాంధీ, పేట్ల బురుజు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసిన ఐవీఎఫ్ (ఇన్ విట్రో ఫెర్టిలిజేషన్) కేంద్రాలకు రాష్ట్రం నలుమూలల నుంచి పేదలు వస్తున్నారు. దీంతో మరిన్ని కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇప్పటికే వరంగల్‌లో కేంద్రం ఏర్పాటు పనులు సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాల్లో మరో 5 ఐవీఎఫ్ సెంటర్లను ప్రారంభించాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు.

ప్రైవేటు రంగంలో 358 ఫెర్టిలిటీ సెంటర్లు

తాజా అధ్యయనాల ప్రకారం రాష్ట్రంలో 26 శాతం మంది సంతాన లేమి సమస్య ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో 358 ప్రైవేట్ ఫెర్టిలిటీ సెంటర్లు ఉన్నాయి. చాలా సెంటర్లు సిట్టింగ్‌ల పేరుతో ఏళ్లకేళ్లు చికిత్సలు అందిస్తూ రూ.లక్షలకు లక్షలు వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని 2017లో అప్పటి ప్రభుత్వం నిర్ణయించి.. గాంధీ, పేట్ల బురుజు, వరంగల్ ఎంజీఎంలో ఏర్పాటుకు జీవో 520 విడుదల చేసింది. కానీ వివిధ కారణాల వల్ల అవి ఏర్పాటు కాలేదు. 2023 ఫిబ్రవరిలో మరోసారి జీవో విడుదల చేసి, అదే ఏడాది అక్టోబర్‌లో గాంధీలో ఐవీఎఫ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కానీ, డాక్టర్లు, రీ ఏజెంట్స్, ఔషధాలు అందుబాటులో లేకపోవడంతో నామ్‌కే వాస్తేగా మిగిలింది.

అక్టోబర్‌లో గాంధీ, పేట్ల బురుజులో ప్రారంభం

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో గాంధీ ఆసుపత్రిలోని ఐవీఎఫ్ సెంటర్‌లో ఎంబ్రియాలజిస్ట్, గైనకాలజిస్ట్, ఇతర డాక్టర్లను నియమించింది. ఏఆర్టీ యాక్ట్ ప్రకారం అనుమతులు తీసుకొని అక్టోబర్ 15న ఐవీఎఫ్ సేవలు అందుబాటులోకి తెచ్చారు. అవసరమైన అన్ని రీ ఏజెంట్స్, ఔషధాలు పంపిణీ చేశారు. పేట్లబురుజు ఆసుపత్రిలోనూ ఎంబ్రియాలజిస్ట్‌ను నియమించి, ఈ నెల 9న ఐవీఎఫ్ సేవలు ప్రారంభించారు. గాంధీలోని ఐవీఎఫ్ సెంటర్‌లో ఔట్‌పేషెంట్ (ఓపీ) కింద ఈ నెల 20 వరకు 271 మంది సంతానం కోసం రాగా, ఫాలిక్యులర్ స్టడీ కింద 66 మంది, ఐయూఐ కింద 26 మందికి పరీక్షలు నిర్వహించారు. ఐవీఎఫ్‌కు ఆరుగురు ఎంపికయ్యారు. పేట్ల బురుజులో 82 మంది ఓపీలో, ఫాలిక్యులర్ స్టడీకి 16 మంది, ఐయూఐకి 10 మందికి పరీక్షలు నిర్వహించారు. నలుగురిని ఐవీఎఫ్‌కు ఎంపిక చేశారు. హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్‌లలో మరిన్ని ఐవీఎఫ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మంత్రి రాజనర్సింహ ఇటీవలే శాసనమండలిలో ప్రకటించారు.

అల్లు అర్జున్ ఇంటిపై విద్యార్థి సంఘాల దాడి

- రేవతి కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్
- ఇంటిపై రాళ్లు విసిరిన ఆందోళనకారులు... పూల కుండీలు ధ్వంసం
- విద్యార్థి సంఘాల నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు... అల్లు అర్జున్ ఇంటివద్ద గట్టి బందోబస్తు



ఆదివారం అల్లు అర్జున్ ఇంటివద్ద ఆందోళన చేస్తున్న ఓయూ జేఏసీ నేతలు

బంజారాహిల్స్ (హైదరాబాద్): సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో మహిళ మృతికి కారణమయ్యారంటూ... సినీ నటుడు అల్లు అర్జున్ ఇంటి వద్ద ఓయూ జేఏసీ నేతృత్వంలో విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. ఆదివారం సాయంత్రం అల్లు అర్జున్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నివాసంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించాయి. కొందరు ఆందోళనకారులు ఇంటిపై రాళ్లు విసిరారు. ఆవరణలో ఉన్న పూల కుండీలను ధ్వంసం చేశారు. దీనితో కొంత సేపు ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థి సంఘాల నేతలను అదుపులోకి తీసుకున్నారు. అల్లు అర్జున్ ఇంటి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే ఈ ఘటన జరిగిన సమయంలో అల్లు అర్జున్ ఇంట్లో లేరు. భార్యాపిల్లలతో కలిసి బయటకు వెళ్లారు. సెక్యూరిటీ గార్డులు, ఇతర సిబ్బంది మాత్రమే ఉన్నారు. విషయం తెలుసుకున్న అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి.. అక్కడికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. ఘటనపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేవతి కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలి..

తొక్కిసలాటలో మృతి చెందిన రేవతి కుటుంబానికి తక్షణమే కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని ఓయూ జేఏసీ ప్రెసిడెంట్ బైరు నాగరాజుగౌడ్ డిమాండ్ చేశారు. చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న చిన్నారి శ్రీతేజ్‌ను అల్లు అర్జున్ తన బాధ్యతగా అమెరికాకు తరలించి చికిత్స చేయించాలన్నారు. అల్లు అర్జున్ ఇంటి వద్ద తాము శాంతియుతంగా ధర్నా చేస్తుంటే.. సెక్యూరిటీ గార్డులే దాడి చేశారని ఆరోపించారు. ఆదివారం సాయంత్రం ఓయూ జేఏసీ నేతలు శ్రీను ముదిరాజ్, బోనాల గణేశ్, మోహన్, ప్రకాశ్ తదితరులతో కలిసి ఆయన జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా.. అల్లు అర్జున్ ఇంటిపై దాడికి సంబంధించి అల్లు అరవింద్ మేనేజర్ కాంతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురు విద్యార్థి సంఘాల నేతలు బి.నగేశ్, రెడ్డి శ్రీను, సి.మోహన్, బి.నాగరాజు, బి.ప్రేమ్‌కుమార్‌గౌడ్, పి.ప్రకాశ్‌లపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

సంయమనం పాటించాలి: అల్లు అరవింద్

తమ ఇంటి వద్ద జరిగిన దాడి ఘటనను అందరూ చూశారని, పోలీసులు కేసు నమోదు చేశారని అల్లు అర్జున్ తండ్రి అల్లు అరవింద్ తెలిపారు. ఎవరూ కూడా ఇలాంటి దుశ్చర్యలను ప్రేరేపించకూడదని.. ప్రస్తుతం ఈ అంశంపై సంయమనం పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఇది చట్ట వ్యతిరేక చర్య

అర్జున్ ఇంటిపై దాడి ఘటన సరికాదని, అది చట్ట వ్యతిరేక చర్య అని హైదరాబాద్ నగర పోలీసు విభాగం పేర్కొంది. ఎవరు ఇలాంటి చర్యలకు పాల్పడినా ఉపేక్షించబోమని హెచ్చరించింది. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించింది.

సీఎంకు అల్లు అర్జున్ క్షమాపణ చెప్పాలి

- విలేకరుల సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ముఖ్యమంత్రిపై ఆయన ఎదురుదాడి చేయడం తగదని వ్యాఖ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పక్కన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

యాదగిరిగుట్ట: సినీనటుడు అల్లు అర్జున్ వెంటనే సీఎం రేవంత్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. తన ఇమేజ్‌ను దెబ్బతీశారంటూ సీఎం వ్యాఖ్యలపై అల్లు అర్జున్ ఎదురుదాడి చేయడం తగదని వ్యాఖ్యానించారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించేందుకు తన లీగల్ టీం ఒప్పుకోలేదని అల్లు అర్జున్ పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. అల్లు అర్జున్‌కు ఏదో అయినట్లు ఆయన ఇంటికి క్యూ కట్టిన సెలబ్రిటీలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడిని ఎందుకు పరామర్శించలేదని కోమటిరెడ్డి ప్రశ్నించారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు అల్లు అర్జున్‌కు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. తెలంగాణలో ఇకపై బెనిఫిట్ షోలు, ఎక్స్‌ట్రా షోలు రద్దు చేస్తున్నామని.. టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేశారు. సినీ పరిశ్రమకు తమ ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుందన్నారు. అందులో భాగంగానే చిత్రపురి కాలనీలో జూనియర్, పేద ఆర్టిస్టులకు ప్లాట్లు ఇస్తున్నట్లు వెల్లడించారు.

గులాబీ రంగు టవల్, కేసీఆర్ ఫొటో పెడతాం

రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం బీసీ కులగణన చేపట్టిందని మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. అయితే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సమగ్ర కుటుంబ సర్వేలో వివరాలు ఇవ్వలేదని ఆయన విమర్శించారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు రావడం లేదని, వచ్చే సమావేశాల్లో ఆయన కుర్చీలో గులాబీ రంగు టవల్, కేసీఆర్ ఫొటో పెడతామన్నారు. నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ మహమ్మారిని తరిమేసి బంగారు గడ్డగా తీర్చిదిద్దుతామని మంత్రి చెప్పారు. విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

నెగిటివ్ పోస్టులు చేస్తున్నవారికి దూరంగా ఉండండి

అభిమానులకు అల్లు అర్జున్ పిలుపు

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత పరిణామాల పట్ల తన అభిమానులంతా బాధ్యతాయుతంగా అభిప్రాయాలను వ్యక్తపరచాలని, ఎవరినీ కించపర్చే విధంగా పోస్టులు పెట్టవద్దని సినీ నటుడు అల్లు అర్జున్ విజ్ఞప్తి చేశారు. అభిమానుల ముసుగులో కొందరు నకిలీ ఐడీలు, నకిలీ ప్రొఫైల్స్‌తో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని.. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి వారిపట్ల అభిమానులు జాగ్రత్తగా ఉండాలని.. నెగిటివ్ పోస్టులు చేస్తున్నవారికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

తెలుగు సినీ పరిశ్రమపై సీఎం పగ

అల్లు అర్జున్‌కు అండగా ఉంటాం: బండి సంజయ్



శ్రీతేజ్ తండ్రితో మాట్లాడుతున్న సంజయ్

సాక్షి, హైదరాబాద్/రాంగోపాల్‌పేట్: తెలుగు సినీ పరిశ్రమపై సీఎం రేవంత్‌రెడ్డి పగబట్టారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. సంధ్య థియేటర్ ఘటనలో మహిళ మృతి చెందడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. గాయపడిన శ్రీతేజ్ కోలుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. సమస్య సద్దుమణుగుతున్న సమయంలో ఎంఐఎం సభ్యులతో పక్కా ప్రణాళిక ప్రకారం అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం సినిమా పరిశ్రమను దెబ్బతీసే కుట్ర చేస్తోందని మండిపడ్డారు. అధికారుల నిర్లక్ష్యంతో గురుకులాల్లో విషాహారం తిని విద్యార్థులు చస్తుంటే ఏనాడైనా పరామర్శించారా? అని ప్రశ్నించారు. సంక్షేమ హాస్టళ్లలో పురుగుల అన్నం తిని, పాము కాటుకు గురై విద్యార్థులు మృత్యువాత పడుతుంటే ఎన్నడైనా బాధ్యత వహించారా? అని నిలదీశారు. సినీనటుడు అల్లు అర్జున్‌కు తామంతా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాగా, కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను ఆదివారం రాత్రి సంజయ్ పరామర్శించారు. అనంతరం బాలుని తండ్రితో కొద్దిసేపు మాట్లాడి సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. బండి వెంట బీజేపీ అధికార ప్రతినిధి సంగప్ప తదితరులు ఉన్నారు.

సినీ ప్రముఖుల ఇళ్లపై దాడిని ఖండిస్తున్నా

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సినీ ప్రముఖుల ఇళ్లపై జరిగిన దాడిని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఖండించారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని డీజీపీ, నగర పోలీసు కమిషనర్‌ను ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. సంధ్య థియేటర్ ఘటనతో సంబంధం లేని పోలీసు సిబ్బంది స్పందించకుండా ఉన్నతాధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఏసీపీ విష్ణుమూర్తి ప్రెస్‌మీట్ ఉదంతాన్ని నేరుగా ప్రస్తావించకుండా ఈ మేరకు పరోక్ష సూచనలు చేశారు.

పీవీ సేవలు చిరస్మరణీయం: సీఎం

బహుభాషా కోవిదుడు దివంగత పీవీ నరసింహారావు ప్రధానిగా, ఉమ్మడి ఏపీ సీఎంగా, కేంద్ర మంత్రిగా అందించిన సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు. సంస్కరణలతో దేశ ఆర్థిక ప్రగతికి దిశా నిర్దేశం గావించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పీవీ వర్ధంతిని పురస్కరించుకొని ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

పశ్చాత్తాపం ప్రకటిస్తారనుకున్నాం

అల్లు అర్జున్ ఆత్మపరిశీలన చేసుకోవాలి: ఎంపీ కిరణ్, ఎమ్మెల్సీ వెంకట్

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన తర్వాత.. సినీ నటుడు అల్లు అర్జున్ ప్రెస్‌మీట్ పెడుతున్నారంటే సంధ్య థియేటర్ ఘటనపై పశ్చాత్తాపం వ్యక్తం చేస్తారేమోనని అనుకున్నామని కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, శాసనమండలి సభ్యుడు బల్మూరి వెంకట్ చెప్పారు. కానీ ఆయన రియల్ హీరోలా కాకుండా.. రీల్ హీరోలా వ్యవహరించారని విమర్శించారు. అల్లు అర్జున్ ప్రెస్‌మీట్‌పై ఎంపీ కిరణ్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. అర్జున్ ఏదో స్క్రిప్టు తీసుకొచ్చి చదివినట్టు మాట్లాడారన్నారు. అసలాయనేం చెబుతున్నారో ఆయనకే స్పష్టత లేదని ఎద్దేవా చేశారు. సినిమాల్లోనే కాకుండా బయట కూడా హీరోలాగా వ్యవహరించాలని హితవు పలికారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ అల్లు అర్జున్ ఆత్మ పరిశీలన చేసుకుని.. తన మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేవతి చనిపోయిన మర్నాడు.. అల్లు అర్జున్ తన ఇంటి వద్ద టపాసులు కాల్చారని ఆరోపించారు.

చట్టం ముందు అందరూ సమానులే..

డీజీపీ జితేందర్

- అల్లు అర్జున్, మోహన్‌బాబు కూడా
- ఇన్‌ఫార్మర్ల నెపంతో మావోయిస్టులు దాడులు చేస్తే ఊరుకోం
- భరోసా కేంద్రంతో బాలికలు, మహిళలకు భద్రత
- కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో భరోసా కేంద్రం ప్రారంభం



భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీజీపీ డాక్టర్ జితేందర్

కరీంనగర్ క్రైం: చట్టం ముందు అందరూ సాధారణ పౌరులేనని, నటులు అల్లు అర్జున్, మోహన్‌బాబు కూడా ఇందుకు అతీతులు కారని రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాన్ని ఆదివారం ఆయన మహిళా భద్రతా విభాగం డీఐజీ రెమా రాజేశ్వరితో కలసి ప్రారంభించారు. భరోసా కేంద్రంలోని అన్ని విభాగాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, చట్టం దృష్టిలో అల్లు అర్జున్ అయినా, మోహన్‌బాబు అయినా.. ఇతరత్రా ఎవరైనా అందరూ సమానులేనని, తప్పు చేస్తే ఎలాంటి తారతమ్యాలు లేకుండా చట్టపరంగా చర్యలుంటాయని తెలిపారు. మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ల పేరిట అమాయకులపై దాడులు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. బాలికలు, మహిళల భద్రత కోసం ప్రతి జిల్లాలో భరోసా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే రాష్ట్రంలోని 23 ప్రాంతాల్లో ఈ కేంద్రాలను ప్రారంభించామని వివరించారు. ఈ కేంద్రాలు కేవలం తెలంగాణలోనే ఉన్నాయని, వీటి పనితీరును సుప్రీంకోర్టు కూడా అభినందించిందని గుర్తు చేశారు. ఈ కేంద్రాలు పోక్సో కేసుల దర్యాప్తులో సహాయపడతాయని, నిందితులకు శిక్ష పడే శాతాన్ని పెంచుతాయని డీజీపీ చెప్పారు. బాధితులు, మద్దతుదారులకు భద్రత కల్పించడంతోపాటు సాక్ష్యాలను సేకరించి కోర్టులో నిందితులకు శిక్ష పడేలా ఈ కేంద్రాలు కృషి చేస్తాయన్నారు. బాధితులకు నష్టపరిహారం చెల్లించేలా పనిచేస్తుందని అన్నారు. ఎఫ్ఐఆర్ మొదలు.. తుది పరిష్కారం వరకు భరోసా కేంద్రం బాధితులకు బాసటగా నిలుస్తుందన్నారు. కాగా, కరీంనగర్ భరోసా కేంద్రంలో నియామకాలు చేపట్టామని, ఇక్కడ సేవలు అందుబాటులోకి వచ్చాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి, శిక్షణ ఐపీఎస్ వసుంధరాయాదవ్, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, భరోసా కేంద్రం ఏసీపీ మాధవి, ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బౌన్సర్లూ.. హద్దు దాటొద్దు

తెలంగాణ పోలీసుల హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: సినిమా తారలు, ఇతర ప్రముఖులకు రక్షణగా ఉండే బౌన్సర్లు, ప్రైవేటు బాడీగార్డులు.. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. బౌన్సర్లు, బాడీగార్డుల పేరిట.. చట్టానికి వ్యతిరేకంగా ఇతరులపై దాడులు, బెదిరింపులకు పాల్పడితే క్రిమినల్ కేసులతోపాటు జైలు శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. ఇలాంటి బౌన్సర్లు, బాడీగార్డులు, వీరిని సమకూర్చే సంస్థలు ప్రభుత్వ, పోలీస్ నిబంధనలకు లోబడి చట్టానికి అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఈ మేరకు తెలంగాణ పోలీస్ అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక ట్వీట్ పెట్టారు.



అదేమోగానీ.. మీ మేనిఫెస్టో అమలుపై ప్రజలు సున్నా మార్కులిచ్చార్సార్!!

రైతు భరోసా ఎగవేత కుట్రలు ఎదిరించండి

రైతులకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ

- కోతలు, కొర్రీలతో సగానికి సగం ఎగవేసే ఎత్తుగడతో ప్రభుత్వం ఉంది
- రైతుబంధుపై దుష్ప్రచారంతో రైతాంగాన్ని దొంగలుగా చిత్రీకరిస్తున్నారు
- రైతులకు ఇస్తున్నది భిక్ష కాదు, వారి హక్కు అని తెలుసుకోవాలి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా ఎగవేసేందుకు చేస్తున్న కుట్రలను ఎదిరించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతులకు పిలుపునిచ్చారు. అసెంబ్లీలో రైతుబంధు పథకంపై అబద్ధాలతో దుష్ప్రచారం చేశారని, చివరికి అన్నం పెట్టే రైతన్నను దొంగలా చిత్రీకరించే దుర్మార్గానికి ఒడిగట్టారని ధ్వజమెత్తారు. కోతలు, కొర్రీలతో రైతు భరోసాను సగానికి సగం ఎగవేసే ఎత్తుగడతో ఉన్నట్లు అర్థమవుతోందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన రైతులకు బహిరంగ లేఖ రాశారు. లేఖలోని ముఖ్యాంశాలు..

పెద్ద దోఖా జరగబోతోంది..

'రైతుబంధును బొంద పెట్టి పనికిమాలిన షరతులతో అరకొరగా రైతు భరోసా అమలు చేసి మిమ్మల్ని నిండా ముంచే ఒక పెద్ద దోఖా జరగబోతోంది. స్థానిక సంస్థల ఎన్నికల గండాన్ని దాటడం కోసం మాయోపాయాలు చేసి మమ అనిపించి, పెట్టుబడి సాయానికి పూర్తిగా ఘోరీ కట్టేలా ఘోరాలు చేయబోతున్నారు. వంచనను గ్రహించి, ఆంక్షలు వద్దని ఆందోళన చేయాల్సిన సమయం వచ్చింది. ఇప్పుడు మేల్కొనకపోతే భరోసా ఉండదు గోస మాత్రమే మిగులుతుంది.

రైతుబంధుతో రూ.73 వేల కోట్లు జమ

వానాకాలం.. యాసంగి రెండు పంటలకు అవసరమైన పైసలు నేరుగా బ్యాంకు ఖాతాల్లో పడే ఒక అపురూపమైన ఆలోచనకు ఆచరణే రైతుబంధు. మొత్తం 11 సీజన్లలో రూ.73 వేల కోట్లు కర్షకుల ఖాతాల్లో జమ చేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వం. అవినీతికి, లీకేజీలకు తావులేని అతిపెద్ద నగదు బదిలీ పథకం రైతుబంధు. దేశంలోని అనేక రాష్ట్రాలు ఈ పథకాన్ని ఆదర్శంగా తీసుకున్నాయి. ఇక రుణమాఫీ కింద రూ.28 వేల కోట్లు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో పడ్డాయి. ఈ రెండు పథకాల ద్వారానే అక్షరాలా లక్ష కోట్ల రూపాయలు అన్నదాతల ఖాతాల్లో నేరుగా జమయ్యాయి.

రైతులకు హామీ ఇచ్చి మోసం చేస్తున్న కాంగ్రెస్

రైతుబంధు కింద కేసీఆర్ ఎకరానికి ఏటా రూ.10 వేలే ఇస్తున్నాడని, మేం వస్తే రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల్లో చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడాది గడిచినా ఇంతవరకూ రైతు భరోసా జాడా పత్తా లేదు. రైతుబంధు కింద ఇచ్చే రూ.10 వేలను ఊడగొట్టారు. ఇప్పటికే రెండు పంట సీజన్లు అయిపోయి మూడో సీజన్ కూడా వచ్చేసింది. రేవంత్‌రెడ్డి సర్కారు మొత్తంగా ఒక్కో రైతుకు ఒక్కో ఎకరానికి రూ.17,500 బాకీ పడింది. రైతులకు హక్కుగా రావాల్సిన ఈ సొమ్మును వదులుకోవద్దు.

ఏ పంట పైసలు వేస్తారు?

ఈ సంక్రాంతి తర్వాత రైతు భరోసా వేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది. సంక్రాంతి తర్వాత వేసే రైతు భరోసా వానాకాలం పైసలా? యాసంగి పైసలా? ఏడాదికి ఒకే పంటకు ఇస్తారా? రెండు పంటలకు వేస్తారా? ఈ కుట్రను రైతాంగం గుర్తించాలి. ఇప్పుడు వేయాల్సింది ఎకరానికి రూ,7,500 కాదు..రూ.17500 డిమాండ్ చేయాలి.

పీఎం కిసాన్‌తో లింక్ చేస్తే సగం మందికి కూడా రాదు

ఆదాయం పన్ను కట్టేవాళ్లకు, పాన్ కార్డు ఉన్న వాళ్లకు రైతుబంధు కట్ అని పత్రికల్లో కథనాలు రాయించారు. లక్షలాది మంది ఉద్యోగులకు ఇక భూమితో బంధం తెంపేస్తారా? పీఎం కిసాన్ మార్గదర్శకాలనే రైతు భరోసాకు కూడా వర్తింపజేస్తే రాష్ట్రంలో సగం మంది రైతులకు కూడా పెట్టుబడి పైసలు రావు. 70 లక్షలకు పైగా రైతన్నలు ఉంటే 30 లక్షల మందికి కూడా పీఎం కిసాన్ రావట్లేదు.

రైతులను అవమానపరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

రూ.22 వేల కోట్లు రియల్ ఎస్టేట్ ప్లాట్లకు, క్రషర్లకు ఇచ్చారనే దుష్ప్రచారంతో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అవమానిస్తోంది. వానాకాలంలో పోల్చితే యాసంగిలో సాగు తగ్గుతుంది. పత్తి, పసుపు, చెరుకు వంటి పంటలు రెండు సీజన్లు వేయడం సాధ్యం కాదు. కానీ కేసీఆర్ ప్రభుత్వం యాసంగిలో కూడా వానాకాలం లెక్క ప్రకారమే రైతుబంధు పైసలు జమ చేసింది. అయితే యాసంగిలో వేసిన రైతుబంధు పైసలను దుర్వినియోగం లెక్కల్లో వేసి కాంగ్రెస్ సర్కారు అన్నదాతలను దొంగలుగా చూపుతోంది. రైతులందరికీ రైతుభరోసా అమలు చేయాలి. రైతులకు ఇస్తున్నది భిక్ష కాదు, వారి హక్కు అని ప్రభుత్వం తెలుసుకోవాలి. మేం రైతులకు అండగా ఉంటాం' అని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు.

క్రీస్తు బోధనలకు ప్రతీక మెదక్ చర్చి

- వందేళ్ల విశ్వాసానికి, దేవుని కృపకు నిదర్శనం
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- చర్చి శతాబ్ది ఉత్సవాలకు హాజరు


భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న గవర్నర్


కొల్చారంలోని రెసిడెన్షియల్ విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/ మెదక్ జోన్/దిలిప్‌చేడ్: మెదక్ చర్చి యేసు క్రీస్తుకు ప్రతీకగా నిలుస్తూ, ఆయన బోధనలకు జీవమిస్తోందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. వందేళ్ల విశ్వాసానికి, దేవుని కృపకు ఈ ఆలయం నిదర్శనమని, శాంతిని కోరుకునే వారికి మార్గ నిర్దేశాన్నిస్తుందని పేర్కొన్నారు. ఆదివారం ఆయన మెదక్ జిల్లాలో పర్యటించారు. చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ) సంఘ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్నారు. గవర్నర్ రాక పురస్కరించుకుని ప్రెసిబెటరి ఇన్‌చార్జి శాంతయ్య ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. మెదక్ చర్చి శతాబ్ది ఉత్సవాలు కేవలం వందేళ్ల సంబరమే కాదని, మానవ విశ్వాసం, దేవుని అమోఘమైన కృపకు నిదర్శనంగా నిలిచే ఒక మహత్తర ఘట్టమని అభివర్ణించారు. ఈ సందర్భంగా బైబిల్‌లోని.. 'ఎక్కడ ఇద్దరు లేదా ముగ్గురు నా నామమున కూడి ఉంటారో.. అక్కడ నేను ఉంటాను..'అనే క్రీస్తు వచనాలను గవర్నర్ ఉటంకించారు. ఈ చర్చి శతాబ్దంగా దైవ సాన్నిధ్యానికి కేంద్రంగా నిలిచిందని, ఒక విశ్వాసాన్ని పెంపొందించిన స్థలం గానే కాకుండా, అనేకమంది జీవితాలను మార్చిన ప్రదేశంగా నిలిచిందని చెప్పారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఇంతటి గొప్ప దేవాలయాన్ని మనకు ఇచ్చినందుకు దేవునికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని గవర్నర్ చెప్పారు.

విద్యార్థులు కలలు సాకారం చేసుకోవాలి

విద్యార్థులు దేశ భవిష్యత్తుకు పునాది లాంటి వారని, వారు సమస్యలను అధిగమిస్తూ లక్ష్యాలను సాధించాలని, కలలు సాకారం చేసుకోవాలని గవర్నర్ సూచించారు. విద్యాలయాలు దేవాలయాలతో సమానమని, విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో మంచి నాగరికతను పుణికి పుచ్చుకొని భవిష్యత్తుకు మార్గ నిర్దేశనం చేసుకోవాలని కోరారు. కొల్చారంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో జిష్ణుదేవ్ వర్మ పాల్గొన్నారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. తనకు బ్యాడ్మింటన్ క్రీడ అంటే ఇష్టమని, మాజీ ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ తనకు ఆదర్శమని తెలిపారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, మైనంపల్లి రోహిత్‌రావు, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, గవర్నర్ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, గురుకుల పాఠశాలల కార్యదర్శి అలుగు వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి సింగరేణి వెన్నెముక



కార్మికులకు భట్టి.. సింగరేణి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: సింగరేణి కాలరీస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ సంస్థలో పనిచేస్తున్న కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. బొగ్గు ఉత్పత్తి ద్వారా రాష్ట్రంతో పాటు దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో కీలకపాత్ర పోషిస్తూ తలమానికంగా నిలుస్తోన్న సింగరేణి సంస్థ రాష్ట్రాభివృద్ధికి వెన్నెముక లాంటిదని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలోని ఆరు జిల్లాల్లో ఉన్న లక్షల మంది ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనాధారమైన సింగరేణిని బొగ్గు ఉత్పత్తికే పరిమితం చేయకుండా ఇతర రంగాల్లోకి విస్తరించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. సింగరేణి భవిష్యత్తుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, శ్రమశక్తిని చాటుతూ సంస్థను అగ్రగామిగా నిలిపేందుకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

సింగరేణి.. సినర్జీ సాక్షి ఫ్యామిలీలో

అమరావతి పేరుతో మళ్లీ అదే తప్పు

ప్రాంతాల మధ్య అసమానతలు ఉన్నప్పుడు భావ సమైక్యత ఎలా సాధ్యం?

- 'సీమ'కు విదర్భ తరహా పాలనా ఏర్పాట్లు ఉండాలి
- నదీ జలాల పంపిణీలో తొలి ప్రాధాన్యత ఇవ్వాలి
- వెనుకబడిన ఉత్తరాంధ్ర, సీమలపై దృష్టి సారించాలి
- సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూలో పౌరహక్కుల ఉద్యమ నేత, ప్రొఫెసర్ జి.హరగోపాల్



కడప సెవెన్‌రోడ్స్: 'నవ్యాంధ్రప్రదేశ్ అవతరణ సమయంలో తెలంగాణ విడిపోయినప్పుడు రాజధానిని కోల్పోవాల్సి వచ్చింది. ఆ తర్వాత అమరావతిలోనే రాజధాని ఉండాలనే ఆ ప్రాంత వాసుల ఆకాంక్షల మేరకే చంద్రబాబు అక్కడ ఏర్పాటు చేశారు. అయితే అమరావతిపై మాత్రమే దృష్టి కేంద్రీకరించడమంటే తెలంగాణ విషయంలో చేసిన తప్పే మళ్లీ చేయడం. అభివృద్ధి అంతా ఒకేచోట పోగు వేయడం సరైంది కాదు. అభివృద్ధి కేంద్రీకరణ విషయంలో గతంలో ఉన్న న్యాయ భావన ఇప్పుడు లేదు. నూతన ఆర్థిక విధానాలు అమల్లోకి వచ్చాక ఆ భావనకు తావు లేకుండాపోయింది. ఇప్పుడు అంతా సంపద సృష్టే తప్ప ప్రజలను పట్టించుకునే పరిస్థితులు లేవు' అని ప్రొఫెసర్ జి.హరగోపాల్ కుండబద్దలు కొట్టారు. పౌరహక్కుల ఉద్యమ నేతగా జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న ప్రొఫెసర్ హరగోపాల్ ఓ సదస్సులో పాల్గొనేందుకు వైఎస్సార్ జిల్లా కడపకు వచ్చిన సందర్భంగా 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వెనుకబడ్డ రాయలసీమ సమగ్రాభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతం కూడా బాగా వెనుకబడి ఉంటుందని, ఆ ప్రాంత అభివృద్ధి కోసం బడ్జెట్ అనుమతులు, నిర్వహణ వంటివి గవర్నరే చేపడతారని చెప్పారు. రాయలసీమకు కూడా అలాంటి పరిపాలనా ఏర్పాటు జరగాలన్నారు. ఒకప్పుడు తెలంగాణ అభివృద్ధి బోర్డు ఉండేదని, ఆ తర్వాత దాన్ని రద్దు చేశారని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ డిమాండుకు ఇది కూడా ఓ కారణమైందని చెప్పారు. అలాంటివి పునరావృతం కాకుండా రాయలసీమ సమగ్రాభివృద్ధికి నీటి పారుదల, పరిశ్రమలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన తన అభిప్రాయాలు తెలియజేశారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రాంతాల మధ్య సమాన అభివృద్ధి అవసరం

ప్రాంతాల మధ్య సమాన అభివృద్ధి లేకుండా, సామాజిక న్యాయం జరగకుండా భాష ఒక్కటే రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచలేదన్న విషయం తెలంగాణ అనుభవం రుజువు చేసింది. అమరావతిలోనే అభివృద్ధి మొత్తం కేంద్రీకరించడం ద్వారా తెలంగాణ విషయంలో చేసిన తప్పే మళ్లీ చేస్తున్నారు. కృష్ణా, గోదావరి జలాల పంపిణీలో వెనుకబడిన రాయలసీమకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి. వైఎస్ రాజశేఖరరెడ్డి ఆ దిశగా కొంతమేరకు కృషి చేశారు. విదర్భ తరహాలో ఈ ప్రాంతానికి బడ్జెట్ కేటాయింపు కోసం ఒక పరిపాలనా ఏర్పాటు జరగాలి. అభివృద్ధినంతా ఒకే చోట పోగేయడం సరికాదు. ఒకసారి రాష్ట్ర విభజన జరిగినా, ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకోకుండా మళ్లీ అదే తప్పు చేయడం సమంజసం కాదు. ప్రాంతాల మధ్య అభివృద్ధిలో అసమానతలు ఉన్నప్పుడు భావ సమైక్యత ఎలా ఉంటుంది? సామాజిక న్యాయం జరగకుండా భాష ఒక్కటే రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచలేదు.

అలా జరగకపోవడంవల్లే ప్రాంతీయ అసమానతలు

ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ కరువు పీడిత ప్రాంతం. ఉత్తరాంధ్రలో నీళ్లు ఉన్నా వెనుకబడి ఉంది. కోస్తాలో కృష్ణా, గోదావరి నదులు ప్రవహిస్తున్నా ఒకప్పుడు అది కరువు ప్రాంతంగా ఉండేది. కరువును పారదోలడం, వరదల ముప్పు తప్పించడం కోసం 1852లో సర్ ఆర్థర్ కాటన్ ఆనకట్టలు నిర్మించడంతో ఆ ప్రాంతం సస్యశ్యామలమైంది. అక్కడి రైతులు వ్యవసాయంలో వచ్చిన అదనపు ఉత్పత్తిని మద్రాసులోని సినిమా రంగం, ఇతర వ్యాపారాల్లో పెట్టుబడిగా పెట్టారు. అలా సంపద పెరుగుతూ ఆ ప్రాంతం బాగా అభివృద్ధి చెందింది. నదీ జలాల్లో వెనుకబడ్డ ప్రాంతాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి. కానీ అలా జరగకపోవడం ప్రాంతీయ అసమానతలను పెంచింది. అభివృద్ధి చెందిన ప్రాంతాలకు ఉన్న రాజకీయ ప్రాబల్యం వెనుకబడ్డ ప్రాంతాలకు ఉండదు. అందుకే రాయలసీమకు చెందిన వారు ఎక్కువ మంది ముఖ్యమంత్రులుగా పనిచేసినప్పటికీ కోస్తాంధ్రుల ప్రాబల్యం వల్ల ఆ ప్రాంతానికే ప్రాధాన్యతనిస్తూ వచ్చారు.

రాష్ట్ర విభజన అనుభవాలు మరిచిపోకముందే..

రాజకీయ ప్రాబల్యాన్ని అనుసరించే అభివృద్ధి నమూనా ఉంటోంది. రాష్ట్ర విభజన అనుభవాలు ఇంకా మరిచిపోకమునుపే మళ్లీ అవే తప్పులు మళ్లీ చేస్తున్నారు. ఇక్కడి నాయకులు కూడా ఈ ప్రాంత సమస్యలు పట్టించుకోవడం లేదు. వివిధ చారిత్రక, రాజకీయ కారణాలతో రాయలసీమలో ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయి. గతంతో పోలిస్తే ఫ్యాక్షన్ ప్రభావం చాలా మేరకు తగ్గినప్పటికీ రక్షణ ఉండదని భావిస్తున్న ప్రజలు నేటికీ ఏదో ఒక నాయకుడి ప్రాబల్యం కింద ఉన్నారు. వీటి నుంచి బయట పడాల్సిన అవసరం ఉంది. చైతన్యవంతమైన ప్రజా ఉద్యమం ద్వారానే రాయలసీమకు న్యాయం జరుగుతుంది.

సింగరేణి ఇన్‌చార్జి సీఎండీ డిప్యుటేషన్ పొడిగింపు?

- త్వరలో పూర్తి స్థాయి సీఎండీగా నియామకం!



సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థ ఇన్‌చార్జి సీఎండీ ఎన్.బలరామ్ డిప్యుటేషన్‌ను కేంద్ర ప్రభుత్వం మరో ఏడాది పొడిగించినట్టు తెలిసింది. ఇండియన్ రెవెన్యూ సర్వీసెస్ (ఐఆర్ఎస్)కు చెందిన ఎన్.బలరామ్ డిప్యుటేషన్‌పై దాదాపుగా ఐదేళ్ల కింద సింగరేణి సంస్థ డైరెక్టర్ బాధ్యతలు స్వీకరించారు. జనవరి 1నుంచి ఇన్‌చార్జ్ సీఎండీగా అదనపు బాధ్యతల్లో కొనసాగుతున్నారు. ఆయన ఐదేళ్ల డిప్యుటేషన్ డిసెంబర్ 31తో ముగియనుండటంతో డిప్యుటేషన్‌ను మరో ఏడాది పొడిగించేందుకు కేంద్రం అంగీకరించినట్టు తెలిసింది. దీంతో ఆయనను పూర్తి స్థాయి సీఎండీగా నియమించే అవకాశాలున్నాయి.

నేడు భూభారతి చట్టంపై రైతులతో ముఖాముఖి

సాక్షి, హైదరాబాద్: జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా రైతు సేవా ఫౌండేషన్ (ఆర్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో భూభారతి చట్టం –2024పై సోమవారం రైతులతో ముఖాముఖి కార్యక్రమం జరగనుంది. నల్లగొండ జిల్లా చందంపేట మండలం కంబాలపల్లి గ్రామంలోని రైతులతో ఈ చట్టంపై భేటీ అవుతున్నట్టు ఆర్ఎస్ఎఫ్ చైర్మన్ ఎం.సునీల్‌కుమార్, అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ జయంతి సందర్భంగా జరుపుకునే కిసాన్ దివస్ సందర్భంగా కొత్త ఆర్‌వోఆర్ చట్టంపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు వారి అభిప్రాయాలను తీసుకోనున్నట్టు వెల్లడించారు. దేశం కోసం బీఎస్ఎఫ్, రైతుల కోసం ఆర్ఎస్ఎఫ్ అనే నినాదంతో రైతాంగ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ఈ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసినట్టు వారు తెలిపారు.



నిన్ను నువ్వు పూర్తిగా వినియోగించుకో!
నీకు ఉన్నది నువ్వు మాత్రమే!
– రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి
సోమవారం, 23 డిసెంబర్ 2024

దేశం పాడిన గాయకుడు

కిశోర్ కుమార్ మీద సంజయ్ గాంధీ కినుక వహించాడు. 'ఇరవై సూత్రాల పథకం' ప్రచారం కోసం దూరదర్శన్‌లో మొదలెట్టిన 'గీతోం భరీ షామ్'లో పాడమని కిశోర్‌ని సంజయ్ గాంధీ ఆదేశించాడు. డబ్బులు లేకుండా కిశోర్ పాడడు. ఆదేశిస్తే అసలు పాడడు. దాంతో కిశోర్ గొంతుకు రేడియోలో తాళం పడింది. సినిమాల్లో పాడిస్తే ఏం గొడవోనని నిర్మాతలు వెనక్కి తగ్గారు. 'ఆరాధన' సూపర్ హిట్ తర్వాత కిశోర్‌కు వచ్చిన తిప్పలు ఇవి. అప్పుడు కొంతమంది రఫీ దగ్గరకు వచ్చి 'కిశోర్‌కు శాస్తి జరిగింది. ఈ కాలాన్ని ఉపయోగించుకోండి' అన్నారు. రఫీ ఏం మాట్లాడలేదు. ఢిల్లీ వెళ్లి సంజయ్‌ను కలిశాడు. 'మీరు కిశోర్ మీద బ్యాన్ ఎత్తేయండి. అందుకు బదులుగా ఒకటి కాదు పది ప్రోగ్రామ్‌లు చేసిస్తాను' అన్నాడు. ఆ వెంటనే నౌషాద్‌ను వెంటబెట్టుకుని దూరదర్శన్‌లో ప్రోగ్రామ్ ఇచ్చాడు. కిశోర్ బ్యాన్ పోయింది.

పత్రికలు కూడా కిలాడీవి. రాజేష్ ఖన్నా స్టార్‌డమ్‌తో కిశోర్ గొంతు గిరాకీలోకి రాగానే 'రఫీ పని అయిపోయింది' అని రాయడం మొదలెట్టారు. రికార్డింగులు లేక రఫీ గోళ్లు గిల్లుకుంటున్నాడని రాశారు. కిశోర్ తైనాతీలు ఇవన్నీ తెచ్చి కిశోర్‌కి చూపించారు. కిశోర్ సంతోషించాడా? ప్రెస్‌మీట్ పెట్టి 'ఇలాంటి వెధవ రాతలు మానండి. ఆయనంటే నాకు చాలా గౌరవం. మీరు ఎవర్ని గెలిపించి ఎవర్ని ఓడిస్తారు?' అన్నాడు. ఈ ఇద్దరిని కొంతమంది ఫలానా మతం అనుకుంటారు. ఈ ఇద్దరు మాత్రం ఈ దేశవాసులు. రామ్, రహీమ్‌ల సన్మతి ఎరిగినవారు.

రంజాను మాసంలో రికార్డింగుకు వచ్చి 'హుక్కే మే ధువా' (హుక్కా పొగ) అనే పదం చూసి పాడనన్నాడు రఫీ ఉపవాసానికి భంగమని. మతం అంటే అంత నిష్ఠ. సాటి మతం పట్ల? అంతే నిష్ఠ. 'మన్ తర్‌పత్ హరి దర్శన్‌కో ఆజ్'.... 'బైజూ బావరా'లో రఫీ పాడితే కన్నీరు ఆగదు వినేవారికి. ఆ కాలంలో అనేక ఆలయాల్లో ఇది ప్రభాతగీతం. దీనిని పాడింది, రాసింది, స్వరం కట్టింది... రఫీ, షకీల్ బదాయునీ, నౌషాద్. 'నా గొంతు రొటీన్ అవుతోంది. నాకు భజనలు పాడాలని ఉంది' అని రఫీ వస్తే ఖయ్యాం ఆ కోరిక మన్నించి భజనలు పాడించి అపురూపమైన రికార్డు విడుదల చేశాడు. 'రఫీ గొంతులో దేవుడు ఉన్నాడు' అని అందరూ అనేవారే. ఆ దేవుడు అల్లాయా, ఈశ్వరుడా వెతకడం అల్పుల పని.

1950–70ల మధ్య మన దేశ సినీ సంగీతం దాదాపు అన్ని భాషల్లో స్వర్ణయుగం చూసింది. సినిమా – దేశవాసులను కలిపే కొత్త మతం అయ్యింది. కళాకారులు వినోద ఉల్లాసాలకే కాదు సామరస్య, సౌభ్రాతృత్వాలకు ప్రవక్తలుగా మారారు. దేశ విభజన చేదు నుంచి జనాన్ని బయట పడేయడానికి గుర్తెరిగి బాధ్యతగా నడుచుకున్నవారే అందరూ! 'తూ హిందు బనేగా నా ముసల్మాన్ బనేగా ఇన్‌సాన్ కీ ఔలాద్ హై ఔలాద్ బనేగా'... (నువ్వు హిందువువి కావద్దు, ముసల్మానువి కావద్దు, మనిషిగా పుట్టినందున మనిషిగా మిగులు) అని సాహిర్ రాయగా రఫీ పాడి చిరస్మరణీయం చేశాడు. మదన్‌మోహన్ ట్యూన్ చేసిన 'కర్‌చలే హమ్ ఫిదా'... రఫీ పాడితే నేటికీ సరిహద్దు సైనికులకు తేజోగీతమే. గాంధీజీని బలిగొన్నారన్న వార్త తెలియగానే సంగీత దర్శకులు హన్స్‌లాల్–భగత్‌రామ్, గీతకర్త రాజేంద్ర కిషన్ కలిసి ఆయనకు నివాళిగా 'సునో సునో అయ్ దునియావాలో బాపు కీ ఏ అమర్ కహానీ' రూపొందిస్తే ఇంకెవరు పాడతారు రఫీ తప్ప! బాపు పాదాల ఎదుట పారిజాతాల కుప్ప గదా ఈ పాట.

సరళత్వము, తీయదనము, స్వచ్ఛత... వీటిని ప్రదర్శించడం ద్వారా ముప్పై ఏళ్ల పాటు పాడి కోట్ల మంది అభిమానులను పొందిన అమృత గాయకుడు రఫీ. 'సుహానీ రాత్ ఢల్ చుకీ', 'చౌద్‌వీ కా చాంద్ హో', 'బహారో ఫూల్ బర్సావో', 'ఓ దునియా కే రఖ్‌వాలే', 'ఖోయా ఖోయా చాంద్', 'దీవానా హువా బాదల్', 'క్యా హువా తేరా వాదా'... ఈ పాటలకు అంతూ పొంతూ ఉందా? కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు... ఏ ప్రాంతమో ఏ భాషో... అందరూ రఫీ అభిమానులు. రోజువారీ పనిలో, కాయకష్టంలో, సేద తీరే వేళ, వేడుకల్లో రఫీ.. రఫీ... రఫీ! కూతురిని అత్తారింటికి సాగనంపేటప్పుడు ప్రతి తండ్రి తలుచుకుని ఉద్వేగాశ్రువులు రాల్చే పాట 'బాబుల్ కి దువాయే లేతీ జా'... షంషాద్ బేగం, గీతాదత్, లతా, ఆశా... అందరూ రఫీకి జోడీలే. దిలీప్ కుమార్, దేవ్ ఆనంద్, షమ్మీ కపూర్, అమితాబ్... అందరూ అభినయకర్తలే. రఫీ పాడటంతో సగం నటన. మిగిలిన సగమే వీరు చేయాల్సి వచ్చేది.

55 ఏళ్లకు మరణించాడు రఫీ. రేపటి డిసెంబర్ 24కు శత జయంతి. అయినా ఇన్నాళ్లకూ కాసింత కూడా మరపునకురాని సుర గాయకుడు. పాటనూ, ప్రేమనూ పంచి అందరి చేత 'రఫీ సాబ్' అనిపించుకున్నవాడు. ఆయన మృతదేహం ఆస్పత్రిలో ఉంటే 'భూపిందర్ సింగ్ – రఫీ తమ్ముడు' అని సంతకం పెట్టి ఇంటికి చేర్చిన గాయకుడు భూపిందర్‌ది ఏ మతం? చనిపోయిన అన్న రఫీది ఏ మతం? ఆ రోజు ఆకాశం నుంచి ఆగని వర్షం. ఇసుక వేస్తే రాలని జనం. గాంధీ గారు మరణించినప్పుడు ఇంత జనం వచ్చారట. రఫీ శత జయంతి ముగియనున్న ఈ వేళ అందరం వెలికి తీయవలసింది, జాగృత పరచవలసినది ఆయన పంచిన ఈ ప్రేమనే, ప్రేమమయ గీతాలనే! విద్వేష గీతాన్ని ఎవరు ఆలపించాలనుకున్నా కావలించుకుని వినిపిద్దాం రఫీ గీతం – జిందాబాద్ జిందాబాద్ అయ్ మొహబ్బత్ జిందాబాద్.

జీతే రహో రఫీ సాబ్! అభీనా జావో ఛోడ్‌కర్ కె దిల్ అభీ భరా నహీ...

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** బ.అష్టమి సా.5.14 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** ఉత్తర ఉ.10.03 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** రా.7.21 నుండి 9.05 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.24 నుండి 1.12 వరకు, తదుపరి ప.2.36 నుండి 3.24 వరకు, **అమృతఘడియలు:** తె.5.51 నుండి 7.36 వరకు (తెల్లవారితే మంగళవారం)

సూర్యోదయం : 6.30
సూర్యాస్తమయం: 5.27
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

ఒక దేశం ఒక ఎన్నికపై... ఒక మాట!

అభిప్రాయం



దిలీప్ రెడ్డి

'భిన్నత్వంలో ఏకత్వం' భారత లక్షణమే కాదు, విలక్షణ సంపద అని పలుమార్లు రుజువైంది. ఉద్వేగ నినాదంగా బాగున్నంత, 'ఒక దేశం ఒక ఎన్నిక' ఆచరణ గొప్పగా ఉంటుందనే నమ్మకం లేదు. ఇందులో పలు సమస్యలున్నాయి. దేశంలో రావాల్సిన ఎన్నికల సంస్కరణల్లో ఇదంత ప్రాధాన్యతాంశమేమీ కాదు! అంతకన్నా ప్రాధాన్య అంశాలెన్నిటికో దిక్కూదివాణం లేక ప్రజాస్వామ్యమే వెనుకడుగులోకి జారుతోంది. ముందు ఆ సంస్కరణలు ముఖ్యం. జమిలితో... అభివృద్ధికి ఉండే ఆటంకాలు తొలగిపోతాయి. సమయం, ఆర్థికమానవ వనరుల దుబారా తగ్గుతుందనేది ఓ ఆశ! కానీ, ప్రాంతీయ అస్తిత్వాలకు అదొక గొడ్డలిపెట్టు. సమాఖ్య స్ఫూర్తికి భంగకరం.

కేంద్ర ప్రభుత్వం ఆశిస్తున్నట్టుగానే... దేశమంతటా ఒకేసారి (జమిలి) ఎన్నికలు జరిపించే విషయంలో సమగ్ర చర్చ జరగాలి. శాసనసభల స్పీకర్లతో పాటు మేధావులు, సమాజంలోని విభిన్నవర్గాల ప్రతినిధుల్ని భాగం చేసి చర్చించాలి. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ సంప్రదింపుల్లో 32 పార్టీలు సానుకూలంగా మాట్లాడి, మద్దతు ప్రకటిస్తే 15 పార్టీలు పూర్తిగా వ్యతిరేకించాయి. వ్యతిరేకిస్తున్న పార్టీల్లో కాంగ్రెస్ ఉండటంతో... 1952 నుంచి 1967 వరకు, వరుస నాలుగు ఎన్నికల్లో కేంద్రం రాష్ట్రాల ఎన్నికల్ని కలిపి (జమిలి) నిర్వహించినపుడు, మరిప్పుడెందుకు సాధ్యపడదు? ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? అనే ప్రశ్న పాలకపక్షాలు లేవనెత్తుతున్నాయి.

స్వాతంత్య్రం వచ్చాక జరిగిన తొలి సభలు కావడంతో అది సాధ్యమైంది. తర్వాత ఎన్నో మార్పులొచ్చాయి. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల విభజన జరిగింది. అవిశ్వాసాల్లో కొన్ని సభలు అర్ధంతరంగా ముగిశాయి. కొన్ని ప్రభుత్వాలు కూలిపోయో, రాష్ట్రపతి పాలన విధింపుతోనో ఎన్నికల ద్వారా కొత్త సభలు ఏర్పడ్డాయి. ఇలా వేర్వేరు పరిణామాల వల్ల లోక్‌సభకు, వివిధ శాసనసభలకు ఎన్నికల గడువు కాలాలు మారుతూ వచ్చాయి. భారత ఎన్నికల సంఘానికున్న విచక్షణాధికార పరిధి, వెసులుబాటు వల్ల... అప్పటికి రద్దయిన, రాష్ట్రపతి పాలనలో ఉన్న రాష్ట్రాల సభల ఎన్నికల కాలాలు స్వల్పంగా అటిటు అవుతూ వచ్చాయి. అందుకే, 1970ల తర్వాత జమిలి సాధ్యపడలేదు. 'జమిలి కొత్తేం కాదు, ఇదివరకు జరిగిందే' అని అమిత్ షా అంటున్నా, ఇవాళ్టి పరిస్థితి వేరు. అదంత సాధారణమే అయితే, ఇపుడు చట్టాలనూ, రాజ్యాంగాన్నీ మార్చడమెందుకు?

ఎలా సమానం చేస్తారు?

అన్ని ఎన్నికల్ని ఒక తేదీకి లాగే క్రమంలో... ఎన్నో మార్పులు చేయాల్సి ఉంటుంది. మొదట, పొట్టికాలం నిడివి సభలు, పొడుగు కాలం నిడివి సభలు అనివార్యమవుతాయి. బలవంతపు రాష్ట్రపతి పాలనలూ ఉంటాయేమో? ఇప్పుడు ప్రతిపాదిస్తున్నట్టు 2027లోనో, మరెపుడో జమిలి ఎన్నికల్ని నిర్వహించాక కూడా... ఏ కారణం చేతైనా ఒక రాష్ట్ర అసెంబ్లీ రద్దయితే, తిరిగి ఎన్నికల ద్వారా ఏర్పడే కొత్త సభను ఆ మిగిలిపోయిన కాలానికే పరిమితం చేస్తారు. సభ రద్దయిన సమయాన్ని (నాలుగేళ్లకో, మూడేళ్లకో రద్దయింది అనుకుంటే) బట్టి కొత్త సభకు ఏడాదో, రెండేళ్లో మిగలవచ్చు. సాధారణ ఎన్నికల్లో జరిగినట్టే అన్ని నియోజకవర్గాల, అందరు ఓటర్ల నిర్ణయంతో జరిగే మధ్యంతర ఎన్నికలో గెలిచిన సభ్యుల కొత్తసభ అలా ఆరు మాసాలకో, ఏడాదికో పరిమితం కావాల్సి రావడం ఏ రాజ్యాంగ ప్రజాస్వామ్య స్ఫూర్తికి ప్రతీక? అది డబ్బు, మానవ వనరుల దుబారా కాదా? అనే ప్రశ్న సహజం. దీనికి రాజకీయ పార్టీలు ఎలా అంగీకరిస్తాయో చూడాలి. చాలా దేశాల్లో దేశవ్యాప్త ఎన్నికలు, ప్రాదేశిక



ఎన్నికలు వేటికవిగానే జరుగుతాయి. జమిలి జరిపే ఏడెనిమిది దేశాల్లో అధ్యక్ష తరహా పాలనకిది సానుకూలమే! జమిలి ఎన్నికల నిర్వహణా ఒక సంక్లిష్టమే! మొన్నటి హరియాణా ఎన్నికలతో, గడువు సమీపించిన మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్ని ఎందుకు కలపటం లేదని అడిగితే, '... శాంతి భద్రతలు, నిర్వహణ పరంగా ఇబ్బందులుంటాయ'ని ఎన్నికల సంఘం పేర్కొంది. నాలుగైదు రాష్ట్రాల్లోనే ఒకేసారి ఎన్నికలు నిర్వహించలేని వారు మొత్తం దేశవ్యాప్తంగా లోక్‌సభకు దాదాపు 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్ని కలిపి, రేపెప్పుడో స్థానిక సంస్థల ఎన్నికల్నీ కలిపి 'మహా జమిలి' ఎలా నిర్వహిస్తారు? అనే ప్రశ్న సహజం.

సంస్కరణల సవాళ్లెన్నో...

భారీ ఓటర్ల భాగస్వామ్యంతో భారత ఎన్నికల నిర్వహణ ప్రపంచంలోనే ఒక అబ్బురం! బ్యాలెట్ నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రా (ఈవీఎం) లకు మారిన తర్వాత కూడా, అభివృద్ధి చెందిన దేశాలు విస్మయం చెందే స్థాయిలో మన 'మహా ఎన్నికలు' జరుగుతున్నాయి. విడతలుగా జరిగిన ఎన్నికల సంస్కరణలు ప్రక్రియను చాలా వరకు పారదర్శకం చేశాయి. స్వేచ్ఛగా స్వతంత్రంగా ఓటర్లు తమ నిర్ణయాన్ని ప్రకటిస్తున్నప్పటికీ... ఎన్నికల్లో ధన ప్రవాహం, ప్రక్రియలో లోపిస్తున్న జవాబుదారీతనం ఆందోళన కలిగిస్తున్నాయి. 'దేశ ఎన్నికల ప్రక్రియలో ముదురుతున్న 'క్యాష్ క్యాన్సర్'ను నియంత్రించే సంస్కరణ అత్యవసరంగా రావాలి' అని సీనియర్ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయి ఇటీవల హైదరాబాద్‌లో చేసిన వ్యాఖ్య కీలకమైంది. 'మునుగోడు' అసెంబ్లీ ఉప ఎన్నికలో మనం కళ్లారా చూశాం. సరిగ్గా పోలింగ్‌కు ముందు లక్షల ఓట్లు గల్లంతయినా, నిన్న మహారాష్ట్రలో జరిగినట్టు ఒకటి, రెండు నెలల్లోనే లక్షలాది కొత్త ఓట్లు నమోదైనా... ఎన్నికల సంఘం నుంచి సరైన వివరణ, జవాబుదారీతనం లేకపోవడం దారుణం. ఈ సంస్కరణలు చేపట్టకుండా 'జమిలి'కి పట్టుబట్టడం సరికాదనే అభిప్రాయం కొన్ని పార్టీల వారు, మేధావులు వ్యక్తంచేస్తున్నారు. విడిగా ప్రజాప్రతినిధులు గానీ, స్థూలంగా పార్టీలు గానీ, ప్రభుత్వాలు గానీ ఆశించిన/నిర్దేశించిన స్థాయిలో పనిచేయకుంటే వారిని వెనక్కి రప్పించే (కాల్ బ్యాక్) పద్ధతి ఉండాలనే డిమాండ్ పెరుగుతున్న తరుణంలో... అయిదేళ్ల కొకమారు అన్ని ఎన్నికలూ జరిపేయాలి, మధ్యలో ఏ ఎన్నికలూ ఉండొద్దనే నిర్బంధమేమిటనే వాదన ఒకటుంది. మధ్యలో వేర్వేరు ఎన్నికలుంటేనే నాయకులైనా, పార్టీలైనా, ప్రభుత్వాలైనా కొద్దో గొప్పో భయంతో ఉంటాయనేది సాధారణ అభిప్రాయం. అందుకు, ఎన్నో సాక్ష్యాలు, తార్కాణాలు మన కళ్లముందే ఉన్నాయి. కాన్షీరామ్ అన్నట్టు 'ఏటా ఎన్నికలుండాలి' అనే వాదనను బలపరచకపోయినా... ఎన్నికల భయం ఉన్నపుడే ప్రభుత్వాలు ప్రజానుకూలంగా నడుచుకోవడం తరచూ జరిగేదే! అలా కాకుండా, ఒకసారి 'జమిలి' జరిగితే, ఇక అయిదేళ్లు ఏ ఎన్నికలుండవంటే... ప్రభుత్వాల ఏకస్వామ్యమే సాగుతుందనే భయాలున్నాయి. పైగా, భిన్నత్వ ప్రతీక అయిన దేశంలోని ప్రాంతీయ అస్తిత్వాలు, భావనలు, వాదనలు... 'జమిలి'లో ఆధిపత్యం వహించే జాతీయ ప్రవాహంలో కొట్టుకుపోతాయనే ఆందోళన కూడా ఉంది. అందుకే, పలు ప్రాంతీయ పార్టీలు దీన్ని వ్యతిరేకిస్తున్నాయి.

ఒక పార్టీ ఒక నాయకుడు అంటారేమో!

ఉభయ సభల్లో ఎన్డీయేకున్నది బొటాబొటీ మెజారిటీ! మూడింట రెండొంతుల మెజారిటీ ఉంటే తప్ప సాధ్యపడని రాజ్యాంగ సవరణలకు ఎలా సాహసిస్తున్నారనేది ప్రశ్న! రాజ్యసభలో 164/243 అవసరమైనచోట 122 (42 తక్కువ) సంఖ్యాబలమే ఉంది. లోక్‌సభలో 361/542 (ఒక ఖాళీ) అవసరం కాగా ఉన్నది 293 (63 కొరత) మాత్రమే! ఆ రోజు సభకు హాజరైన వారిలో మూడింట రెండొంతులు చాలు కనుక... ప్రత్యర్థి పార్టీల నుంచి క్రాస్ ఓటింగ్, గైర్హాజరీలను ప్రోత్సహిస్తారా? అని విపక్షంలో భయ సందేహాలున్నాయి. తరచూ ఎన్నికల వల్ల కోడ్ అమలు అభివృద్ధికి ఆటంకమనే భావనే తప్పని, ఓట్ల యావతో ఎన్నికలకు నెలల ముందే అభివృద్ధి పనులు చేయడం కాకుండా అయిదేళ్లపాటు జరిపితే కోడ్‌కు వెరవాల్సిన భయమేమిటని ప్రశ్నిస్తున్నారు. 'జమిలి'పై ఎందుకీ పంతం?' ఇదే పంథాలో సాగి, రేపు 'ఒక పార్టీ, ఒకే నాయకుడ'నే నినాదంతో ప్రజాస్వామ్యాన్ని అధ్యక్షతరహా పాలనవైపు నడిపే ప్రమాదాన్ని మొగ్గలోనే తుంచేయాలన్నది వ్యతిరేకవాదన వినిపించే వారి మాట!

వ్యాసకర్త 'పీపుల్స్ పల్స్' రీసెర్చ్ సంస్థ డైరెక్టర్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

వీడ్కోలు



క్రీడల్లో ఒక విషాదం ఏమిటంటే – నువ్వు ఎంత మంచివాడివైనా, నీ పట్ల నీకు ఎంత స్పృహ ఉన్నా, కెరీర్‌కు ఒక సరైన ముగింపును నియంత్రించలేవు. అది ఇతర అంశాల మీద చాలా ఎక్కువ ఆధారపడి ఉంటుంది.
– జాయ్ భట్టాచార్య, క్విజ్జర్

ప్రజాస్వామ్యమే మేలు



ఆధునిక కాలంలో ఏ మత రాజ్యమూ పౌరులకు సంతోషం, సంపదలను తేలేదు. ప్రజాస్వామ్యాన్ని ఎంతైనా విమ ర్శించు. అందులో లోపాలున్నాయని దాని సమర్థకులకూ తెలుసు. అయినప్పటికీ ప్రజాస్వామ్యానికి మత రాజ్యం ప్రత్యామ్నాయం కాదు. అదొక విఫల ఆలోచన.
– దారాబ్ ఫారూఖీ, సినీ రచయిత

చలి చలి చలి



మైనస్ 8.5 డిగ్రీల సెల్సియస్‌లో జీవించడం ఎలా ఉంటుంది? కుళాయిలు గడ్డకడతాయి. పంపులు చెడిపోతాయి. ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయవు. వాష్‌రూముల బోల్టులు రావు. ఒక్కోదాని మీద ఒక్కోటి దుస్తులు వేసుకుంటూనే ఉండాలి. పొద్దుటి అలారమ్ క్రమంగా 11.55కు వరకు వెళ్తుంది.
– పీర్‌జాదా ఆశిక్, కశ్మీర్ జర్నలిస్ట్

బలమైన చైనా



యూకే ఒక సంవత్సరం మొత్తం ఉత్పత్తి చేసే ఉక్కు కన్నా చైనా ఒక గంటలో చేసేది ఎక్కువ. యూఎస్ ఏడాదిలో ఉత్పత్తి చేసే ఉక్కు కన్నా చైనా పదిరోజుల్లో చేసేది ఎక్కువ. దీన్ని జీర్ణించుకోండి.
– డాన్ కాలిన్స్, యూట్యూబర్

నొప్పిని వదిలేయాలి!



మీరు ఎవరినైనా క్షమిస్తే, వాళ్లకేమీ 'ఫ్రీ పాస్' దొరకదు. కానీ మీరు ముందుకు సాగిపోవడానికి అది ఫ్రీ పాస్ కాగలదు. మీ పట్ల మీరు దయగా ఉండండి. మీ ప్రశాంతత విషయంలో రాజీ పడకండి. కొన్ని సార్లు ముందుకు సాగడమే మంచిది. మీరు ముందుకు సాగిపోతున్నారంటే దాన్ని మరిచిపోతున్నట్టు కాదు. కేవలం మీ నొప్పిని వదిలేస్తున్నారని అర్థం.
– ముఫ్తీ మెంక్, ఆధ్యాత్మిక బోధకుడు

వదిలేస్తేనే మేలు



మీ ఒత్తిడిని తగ్గించుకోవాలంటే, ప్రతి విషయం మీద బలమైన అభిప్రాయాలు ఉంచుకోవడం మానేయండి. తెలివైనవాళ్లు కొన్నింటి పట్ల కావాలని పట్టనట్లు ఉంటారు. ముఖ్యమైన వాటి మీద ఎక్కువ ఫోకస్ పెడతారు.
– వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

టాప్ 10 ఘట్టాలు



2024లో నా టాప్ టెన్ ప్రపంచ ఘట్టాలు: 1. యూఎస్ అధ్యక్ష ఎన్నికలు; 2. ఇస్రో చంద్రయాన్ విజయవంతం కావడం; 3. ప్యారిస్ ఒలింపిక్స్; 4. కృత్రిమ మేధ (ఏఐ) పురోగతి; 5. మాంద్య భయాలు; 6. వాతావరణ విధ్వంసాలు; 7. ఉక్రెయిన్ యుద్ధం; 8. గ్రీన్ ఎనర్జీ పరివర్తన; 9. ఎలక్ట్రిక్ వాహనాలు పెరగడం; 10. అంతరిక్ష పర్యాటకంలో ఉరవడి.
– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

ఇన్ బాక్స్

రిజిస్టర్డ్ బుక్ పోస్ట్‌ను పునరుద్ధరించాలి!

భారత తపాలా శాఖ రిజిస్టర్డ్ బుక్ పోస్ట్ సర్వీసులను అర్ధంతరంగా నిలిపివేసింది. రిజిస్టర్డ్ బుక్ పోస్టులో పుస్తకాలు పంపేవారు పుస్తకాన్ని పూర్తిగా మూసివేయకుండా ఒకవైపు కనిపించేటట్టు మాత్రం ప్యాక్ చేస్తూ, ఆ పుస్తకాల మధ్యలో ఎలాంటి ఉత్తరాలు, ఇతర కాగితాలు జతపరచకూడదన్న నియమం పాటిస్తే చాలు. రిజిస్ట్రేషన్ చార్జీ 17 రూపాయలకు అదనంగా మనం పంపించే పుస్తకాల బరువును బట్టి ప్రతి వంద గ్రాములకు రూపాయి చొప్పున తపాలా శాఖకు చెల్లిస్తే సరిపోయేది. దీనికి కొన్ని నెలల కిందట జీఎస్టీ చార్జీలు జతచేశారు. దానిని కూడా ఎవరూ పట్టించుకోలేదు.

తపాలా శాఖ చాలా ఏళ్లపాటు అందించిన ఈ సర్వీసు చిన్న ప్రచురణ కర్తలకు, రచయితలకు ఒక వరంలా ఉండేది. పోస్ట్ ఆఫీసు కాలక్రమంలో ఒక బ్యాంకు మాదిరిగా మారిపోతున్న సమయంలో రిజిస్టర్డ్ బుక్ పోస్ట్‌ను మాత్రమే నిలిపివేయడం చూస్తే చిన్న ప్రచురణకర్తల మీద పగబట్టినట్టుగా కనిపిస్తోంది. దీనివల్ల రచయితలు, ప్రచురణకర్తలు తమ పుస్తకాలను పాఠకులకు అందించడానికి విధిగా అధిక మొత్తం చెల్లించి ప్రైవేట్ కొరియర్ సర్వీసుల వెంట పడాల్సివస్తోంది. తిరిగి ఈ మొత్తాన్ని పొందడానికి పుస్తకం ధర అనివార్యంగా పెంచవలసి ఉంటుంది. చదివే అలవాటు తగ్గిపోవడానికి గల కారణాలలో పుస్తకాల ధర అందుబాటులో లేకపోవడం కూడా ఒకటి. తపాలా శాఖకు ఈ రిజిస్టర్డ్ బుక్ పోస్ట్ పెద్ద భారం కూడా కాబోదు. ప్రభుత్వం, సంబంధిత శాఖ మంత్రి దయతో చిన్న ప్రచురణకర్తల, రచయితల ఇబ్బందిని అర్థం చేసుకుని రిజిస్టర్డ్ బుక్ పోస్ట్ సర్వీసును పునరుద్ధరిస్తే బాగుండు!


– దుప్పల రవికుమార్, సిక్కోలు బుక్ ట్రస్ట్ ఎడిటర్

పురస్కారాలకు పుస్తకాలు

పదిహేడేళ్లుగా ప్రదానం చేస్తున్న కొలకలూరి పురస్కారాలకు 2025 సంవత్సరానికిగానూ ప్రతులను ఆహ్వానిస్తున్నారు. కొలకలూరి భాగీరథీ కవిత్వ పురస్కారం, కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం, కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారాలకు రచయితలు, ప్రచురణకర్తలు తమ పుస్తకాలను జనవరి 15లోగా పంపాలి. ఒక్కో పురస్కారానికి రూ. 15,000 ఇస్తారు. ఫిబ్రవరి 15న పురస్కార ప్రకటన, ఫిబ్రవరి 26న హైదరాబాద్‌లో ప్రదానం ఉంటాయి. కవిత్వం, నాటకాలను 'ఆచార్య కొలకలూరి మధుజ్యోతి (ఫోన్: 94419 23172), శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి–517502'; పరిశోధన గ్రంథాలను 'ఆచార్య కొలకలూరి సుమకిరణ్ (ఫోన్: 99635 64664), శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి' చిరునామాలకు పంపాలి.

ఉత్తరాంధ్రలో ఎగసిన పోరాట జెండా!

కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి అమరత్వం చెంది అయిదున్నర దశాబ్దాల కాలం నడిచింది. ఆయన స్మృతి ఈనాటికీ విప్లవోద్యమ ప్రభావాలలో ఒకటిగా కలగసిపోయింది. మానవ జీవితంలో పాణిగ్రాహి వంటి నూతన మానవులు ఉంటారా అనేది భారత సమాజానికి కలిగే సందేహం. నక్సల్బరీ వసంత మేఘగర్జన పిలుపు అందుకొని భారత పాలకవర్గాలకు వ్యతిరేకంగా కొనసాగించిన పోరాటంలో పాణిగ్రాహి చేతిలో ఉన్న సాంస్కృతిక ఆయుధం 'జముకు' మాత్రమే. ఒక సంప్రదాయ వాద్య పరికరం విప్లవాన్ని, అమరత్వాన్ని వాగ్దానం చేసింది. జీవితంలోని ఒక సాంస్కృతిక అల్లిక బీదరికం నుండి ప్రారంభమై, అమరత్వం దగ్గర ముగిసింది. ఈ పేదతనం తనకి మాత్రమే సంబంధించిన అంశం కాదు. ఆనాటి సమాజపు కోట్లాది అన్నార్తుల జీవన దృశ్యం అది.



సుబ్బారావు పాణిగ్రాహి

పాణిగ్రాహి శ్రీకాకుళం జిల్లాలో జన్మించాడు. సాహిత్య అభినివేశం, కళాత్మక సృజన కలగలిసిన ప్రజా వాగ్గేయకారుడు. గ్రామీణ నేపథ్యం నుండి బయలుదేరి కళాత్మక అంతరంగ ఘర్షణ నుండి విప్లవ మానవునిగా మారాడు. ఈ మార్పు వెనుక 1925లో ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ భావజాలం నుంచి స్ఫూర్తి పొందాడు. ఆయన అమరుడైనా ఆయన చూపిన దారిలో విప్లవోద్యమం కొనసాగుతూనే ఉంది.

'కమ్యూనిస్టులం మేము కష్ట జీవులం; అవునన్నా కాదన్నా అదే ఇష్టులం;' 'ఎరుపు అంటే కొందరికి భయం భయం, వారి కంటే పసిపిల్లలే నయం నయం' వంటి ఆయన పాటలను ఇవాళ్టి తెలుగు సమాజం తమ జీవితాలకు అన్వయించుకుంటున్నది. ఆధునిక గణతంత్ర రాజ్యం ముసుగు అనేకమంది గిరిజనోద్యమ విప్లవకారులను చంపి వేసింది. తామాడ అంకమ్మ, తెలకల సరస్వతి, పంచాది నిర్మల, రమేష్ చంద్ర సాహు, చెల్లూరి ఉమారాణి వంటివారు ఇందులో కొందరు. నామవాచకాలతో పనిలేదు. ఉద్దానం నెత్తురుతో ఈ ప్రాంత నదులన్నీ ప్రవహించాయి. ప్రజల పోరాటం వెనుక న్యాయబద్ధమైన నూతన ప్రజాస్వామిక భావన ఉన్నది. 55 ఏళ్ల క్రితం అమరత్వం నేల కోసం, భుక్తి కోసం సాగింది. అది ఆనాటి కనీస జీవన అవసరం.


ఇవాళ సందర్భం మారింది. భారతదేశ మధ్య ప్రాంతంలో ఆదివాసులకు–పాలక పక్షాలకు మధ్య యుద్ధం జరుగుతోంది. బస్తర్ ప్రాంతంలోని ఖనిజ సంపద కోసం దేశీయ, అంతర్జాతీయ బహుళ జాతి సంస్థలు డాలర్ల డేగల్లా కాచుకుని కూర్చున్నాయి. 'ఆపరేషన్ గ్రీన్ హంట్'ను భారత పాలక వర్గాలు కొనసాగిస్తున్నాయి. పైకి మాత్రం 'మావోయిస్టు నిర్మూలన'నే పదాన్ని పలికినా దీని వెనుక ఆదివాసులను విస్థాపనకు గురి చేయడమే పాలక వర్గాల అంతిమ నిర్ణయం. బస్తర్ 'భారతీయ వియత్నాం' అని అర్థమవుతుంది. అయితే న్యాయం ఎవరి వైపు ఉంటుందో చరిత్ర స్పష్టం చేస్తుంది.

అపారమైన సహజవనరుల కోసం ఆదివాసులపై వేట అనేక రూపాలలో కొనసాగుతోంది. అడవి నుండి బలవంతంగా తరిమేయడం లేదా విస్థాపనకు గురి చేయడం ద్వారా భారత పాలకవర్గాలు సహజ వనరులను తమ తైనాతీయులకు కట్టబెట్టడం అవగతమయితే కగార్‌ను అర్థం చేసుకోవచ్చు. సుబ్బారావు పాణిగ్రాహి అమరత్వాన్ని ఎత్తి పట్టడం అంటే ఇవాళ దేశంలో జరుగుతున్న వివిధ వర్గాలపై దాడులను నిరసించడమే. ఆధిపత్య సంస్కృతి స్థానే ప్రజా సంస్కృతిని వ్యాప్తి చేయడమే.

– అరసవిల్లి కృష్ణ | 92472 53884
(నేడు సుబ్బారావు పాణిగ్రాహి వర్ధంతి)

ఈశ్వరీదేవి ఆరాధన

జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞాని, తత్వవేత్త, సంఘ సంస్కర్తగా ప్రసిద్ధి చెందారు. ఆయన తత్వ వారసురాలిగా శ్రీ ఈశ్వరీదేవి పేరు పొందారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైఎస్ఆర్ కడప జిల్లా మైదుకూరు నియోజకవర్గం కందిమల్లయ్య పల్లెలో బ్రహ్మంగారు 1693లో సజీవ సమాధి నిష్ఠ పొందేందుకు సంకల్పించారు. ఆ సందర్భాన దీన వదనంతో ఉన్న తన రెండో కుమారుడైన గోవిందస్వామిని ఆయన ఆశీర్వదించి... 'నీకు పరాశక్తి స్వరూపిణి, లక్ష్మీదేవి అంశ ఉన్న కుమార్తె జన్మిస్తుంది' అని తెలిపారట. 'ఆమె బ్రహ్మజ్ఞానియై ప్రజల్లో ఆధ్యాత్మిక జ్యోతులు వెలిగించి, మన ఇంటి ప్రతిష్ఠను మరింత ఇనుమడింప చేస్తుంద'నీ పేర్కొన్నారని భక్తులు అంటారు. బ్రహ్మంగారు వైశాఖ శుద్ధ దశమి నాడు సజీవ సమాధి చెందారు. ఆ ప్రాంతం 'బ్రహ్మంగారి మఠం'గా విలసిల్లుతోంది.



1703లో గోవిందస్వామి, గిరియమ్మ దంపతులకు శ్రీ ఈశ్వరీదేవి జన్మించారు. జేజినాయన చెప్పినట్లుగానే... ఆమె చిన్నప్పటి నుంచే సంస్కృతం, తెలుగు భాషలపై పాండిత్యం సంపాదించారు. భారత, భాగవతాది గ్రంథాలను స్వయంగా వర్ణించే వారు. బ్రహ్మంగారి మఠానికి సమీపాన ఉన్న నల్లమల అడవుల్లోని గుహలో 14 ఏళ్లు కఠోర తపస్సు చేసి... అష్టాంగ యోగాది, జ్ఞాన వాక్సిద్ధి పొందారంటారు. లోక కల్యాణార్థం స్వీయ కల్యాణాన్ని త్యజించి, బ్రహ్మచర్య దీక్ష బూనారు. ఆత్మతత్వ బోధనలు రచించారు. శిష్య సమేతంగా లోక పర్యటన చేసి, భక్తి తత్వాన్ని ప్రచారం చేశారు. వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞాన తత్వాలను ప్రజలకు బోధించారు. మానవుల్లో దుష్ట సంస్కారం పారదోలి, శిష్ట లక్షణాలు పెంపొందించారు. జేజినాయన సజీవ సమాధి పొందిన సమీప ప్రాంతంలోనే... ఆమె 1789లో మార్గశిర బహుళ నవమి నాడు సజీవ సమాధి నిష్ఠ వహించారు. నాటి నుంచి లోకకల్యాణార్థం యోగ నిద్రముద్రితురాలై భక్తజనుల నిత్య నీరాజనాలు స్వీకరిస్తున్నారనేది భక్తుల నమ్మకం. ఆ ప్రాంతం 'శ్రీ ఈశ్వరీదేవి మఠం'గా పేరొందింది. ఏటా మార్గశిర బహుళ నవమి నాడు అమ్మవారి ఆరాధన గురుపూజా మహోత్సవం జరుగుతుంది. ఈ నెల 22 నుంచి 27 వరకు ఉత్సవాలు జరుగుతాయి. 24న ప్రధాన వేడుక. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు తరలి వస్తారు.

– వి. మల్లికార్జున ఆచార్య
(డిసెంబర్ 24న ఈశ్వరీదేవి సజీవ సమాధి నిష్ఠ పొందిన రోజు)

క్లుప్తంగా...

ఆదివాసీ సంప్రదాయం ప్రకారం ఆలయాలు నిర్మించాలి

- మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు



మాట్లాడుతున్న సిద్దబోయిన జగ్గారావు

ఎస్ఎస్ తాడ్వాయి: ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం మేడారంలోని శ్రీసమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయాలను నిర్మించాలని పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు అన్నారు. ఆదివారం ములుగు జిల్లా మేడారంలోని ఎండోమెంట్ డార్మిటరీ హాల్లో సమ్మక్క–సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు పూజారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదాద్రి తరహాలో అమ్మవార్ల ఆలయాల నిర్మాణం జరుగుతుందని అధికారులు ప్రచారం చేస్తున్నారని, ఆదివాసీ సంస్కృతికి విరుద్ధంగా చేపట్టే నిర్మాణాలను ఒప్పుకునేది లేదన్నారు. ఆలయాలను విస్తరించి పూజా కార్యక్రమాలకు ఇబ్బంది కలుగకుండా కిటికీలు పెద్దగా, కలపతో తయారుచేసిన దర్వాజలను ఏర్పాటు చేయాలన్నారు. ఆలయాల గోడలు, ప్రహరీలపై ఆదివాసీ సంస్కృతి ఉట్టిపడేలా చిత్రాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు పూజారుల సమక్షంలో తీర్మానం చేసినట్లు వివరించారు. సమావేశంలో పూజారుల సంఘం కార్యదర్శి కాక సారయ్య, ఉపాధ్యక్షుడు చందా రఘుపతి, పూజారులు పాల్గొన్నారు.

రాలిపోయిన యువ రైతు

- అప్పుల భారంతో బలవన్మరణం



తేజావత్ శ్రీను

కురవి: మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం కాంపల్లి శివారు సక్రాంనాయక్ తండాకు చెందిన యువ రైతు తేజావత్ శ్రీను (38) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలివి. శ్రీను 30 గుంటల భూమిలో మిర్చి పంట సాగు చేశాడు. పంట పెట్టుబడి తోడు కుటుంబ అవసరాల కోసం రూ.3 లక్షల వరకు అప్పు చేశాడు. ఈ క్రమంలో మిరప తోటకు బూజు తెగులు వచ్చి పంట మొత్తం పోయింది. అప్పులకు వడ్డీలు కట్టలేక సతమతమవుతున్న శ్రీను.. మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరుకున్న అతన్ని గమనించి కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుని అన్న తేజావత్ శక్రు ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీరోలు ఎస్ఐ నగేశ్ తెలిపారు. మృతునికి భార్య మంగమ్మ, కుమార్తె గాయత్రి ఉన్నారు.

చెన్నై ఎగ్మోర్ ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలో పొగలు

- గద్వాల స్టేషన్‌లో రైలు నిలిపివేత



రైలు బోగీ నుంచి వస్తున్న పొగలు

గద్వాల క్రైం: చెన్నై ఎగ్మోర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఏసీ బోగీలో పొగలు వ్యాపించడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. చెన్నై నుంచి హైదరాబాద్ బయల్దేరిన చెన్నై ఎగ్మోర్ రైలు గద్వాల రైల్వేస్టేషన్ 1వ ప్లాట్‌ఫాంపైకి ఆదివారం రాత్రి 8:06 గంటలకు చేరుకుంది. అయితే 8వ ఏసీ బోగీ నుంచి దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన ప్రయాణికులు భయాందోళనతో ఒక్కసారిగా బయటికి వచ్చారు. విషయం తెలుసుకున్న రైల్వే సిబ్బంది క్షణాల్లో అక్కడికి చేరుకుని తక్షణ చర్యలు చేపట్టారు. రైలు వేగం ధాటికి పట్టాలపై వేడి రావడంతో ఏసీ బోగి బ్యాటరీ, డైమా బెల్టు వద్ద ఉష్ణోగ్రత పెరిగి పొగలు వ్యాపించినట్లు గుర్తించారు. రైలు పట్టాలపై వచ్చే స్పీడ్‌తో ఏసీ బ్యాటరీ, డైమా బెల్టుపై నిప్పు రవ్వలు పడటంతో ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని రైల్వే సాంకేతిక సిబ్బంది చెబుతున్నారు. కొద్దిసమయంలోనే సమస్యను పరిష్కరించడంతో గద్వాల స్టేషన్ నుంచి 8:20 నిమిషాలకు రైలు బయల్దేరి వెళ్లింది.

‘టీటీడీ కేసు ఉపసంహరించాలి’

సాక్షి, హైదరాబాద్: బీసీ సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై కేసు పెట్టాలనుకుంటున్న తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను టీటీడీ అనుమతించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై మాజీమంత్రి శ్రీనివాస్ చేసిన ఆరోపణల్లో వాస్తవం ఉందని స్పష్టం చేశారు. దీనిపై పలువురు అగ్రకుల ప్రతినిధులు వ్యాఖ్యలు చేసినా పట్టించుకోని టీటీడీ.. ఒక బీసీ నేతపై కేసు నమోదుకు దిగడం సరికాదని వ్యాఖ్యానించారు.





రీచింగ్ ది అన్‌రీచ్‌డ్..!

వాళ్లంతా ఆదివాసులు.. కొండకోనల్లో ఎక్కడో విసిరేసినట్లు ఉండే వారికి జీవించటానికి కనీస మౌలిక సదుపాయాలు కూడా ఉండవు. రోడ్లు, కరెంటు మాటే తెలియదు. జన బాహుళ్యంలోకి రావాలంటే కొన్ని కిలోమీటర్ల దూరం నడవాల్సిందే. ఇక వారి పిల్లలకు చదువు అంటే ఏమిటో తెలియదనే చెప్పాలి. తరతరాలు ఆదివాసుల జీవితాలు ఇలాగే తెల్లారిపోతున్నాయని కలత చెందిన కొందరు యువకులు.. వారికి అక్షర జ్ఞానం అందించాలని సంకల్పించారు. భీం చిల్డ్రన్ హ్యాపీనెస్ సెంటర్ (బీసీహెచ్‌సీ) పేరిట చిన్న సంస్థను నెలకొల్పి పిల్లలకు పాఠాలు చెప్పడం ప్రారంభించారు. దీనిని గుర్తించిన ఉస్మానియా యూనివర్సిటీలోని ఈఎంఆర్‌సీ డైరెక్టర్ రఘుపతి రావు.. ఆ సంస్థ సేవలపై డాక్యుమెంటరీ నిర్మించారు. దీనికి యూజీసీ ఆధ్వర్యంలో జోధ్‌పూర్‌లో జరిగిన 16వ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మొదటి బహుమతి లభించింది.

సాక్షి, హైదరాబాద్

ఆదివాసీలకు అక్షర జ్ఞానం అందిస్తున్న బీసీహెచ్‌సీ

- రోజూ అడవుల్లో కిలోమీటర్ల దూరం వెళ్లి పాఠాలు
- ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో అక్షర యజ్ఞం
- వీరి సేవలపై రీచింగ్ ది అన్‌రీచ్‌డ్ పేరుతో డాక్యుమెంటరీ
- జోధ్‌పూర్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో బెస్ట్ షార్ట్‌ఫిల్మ్ అవార్డు

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని అడవుల్లో జీవించే ఆదివాసీ గూడేలకు వెళ్లేందుకు కనీసం రోడ్డు కూడా ఉండదు. రాళ్లు రప్పల దారుల్లో కిలోమీటర్ల దూరం నడవాల్సిందే. వారి భాష, వేషం, నమ్మకాలు పూర్తిగా భిన్నంగా ఉంటాయి. పిల్లలను స్కూల్‌కు పంపడం తల్లిదండ్రులకు ఇష్టం ఉండదు. బయటి వ్యక్తులను కనీసం నమ్మరు కూడా. అలాంటివారికి విద్యాబుద్ధులు నేర్పుతోంది బీసీహెచ్‌సీ. సంతోష్ ఈస్రం అనే యువకుడి ఆలోచనల నుంచి పుట్టిందే ఈ సంస్థ.

అసాధ్యాన్ని సుసాధ్యం చేసి..

కొంతమంది మిత్రులతో కలిసి ఆయన.. తమ ఉద్దేశాన్ని ఆ గిరిజనులకు వివరించి ఒప్పించడానికే రెండున్నర నెలల పాటు కష్టపడ్డారు. వారి భాష కూడా నేర్చుకున్నారు. పిల్లలను బడికి రప్పించేందుకు రోజూ కోడిగుడ్లు ఇచ్చారు. అలా వారితో కలిసిపోయి నెమ్మదిగా పాఠాలు చెప్పడం మొదలు పెట్టారు. చివరికి 2020 జూన్ 23న బీసీహెచ్‌సీ పేరుతో సంస్థను స్థాపించారు. తాడ్వాయి మండలంలోని నీలంగోతు అనే చిన్న పల్లెలో గుడిసె కట్టి అందులో 10 ఏళ్ల లోపు ఉన్న 45 మంది చిన్నారులకు పాఠాలు చెప్పడం ప్రారంభించారు.

కొండ కోనల్లో నడిచి..

నీలంగోతులో పాఠశాల విజయవంతం కావడంతో భూపాలపల్లి జిల్లాల్లోని బండ్ల పహాడ్, సారలమ్మగుంపు, తక్కెళ్లగూడెం, ఐలాపురం, ప్రాజెక్ట్ నగర్, కల్వపల్లి, దండుపల్లి, ముసలమ్మ పెంటలో గుడిసె బడులు తెరిచి ఒక్కో టీచర్‌ను నియమించారు. వాళ్లు రోజూ ఏకంగా 10 నుంచి 18 కిలోమీటర్లు సైకిల్‌పై వెళ్లి పిల్లలకు పాఠాలు చెబుతున్నారు. వీరితో పాటు అనేకమంది వలంటీర్లు ఈ బృహత్ కార్యంలో పాలుపంచుకుంటున్నారు. వీరి సేవలను గుర్తించిన ప్రభుత్వం.. పిల్లలకు చదువు చెప్పేందుకు వీలుగా ఒకచోట పక్కా భవనం నిర్మించింది.

డాక్యుమెంటరీకి అవార్డు..

భీం చిల్డ్రన్ హ్యాపీనెస్ సెంటర్ కార్యకలాపాల గురించి తెలుసుకున్న ఓయూలోని ఎడ్యుకేషనల్ మల్టీ మీడియా రిసెర్చ్ సెంటర్ డైరెక్టర్ రఘుపతి.. ఆయా ప్రాంతాల్లో కొన్ని రోజుల పాటు ఉండి, పిల్లల స్థితిగతులు.. టీచర్ల కృషిని చూసి ముగ్ధుడయ్యారు. ‘రీచింగ్ ది అన్‌రీచ్‌డ్’ పేరిట డాక్యుమెంటరీ తీశారు. తాజాగా రాజస్తాన్‌లోని జోధ్‌పూర్‌లో జరిగిన 16వ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో డెవలప్‌మెంట్ కేటగిరీలో దీనికి బెస్ట్ షార్ట్‌ఫిల్మ్ అవార్డు లభించింది. అలాగే మానవ హక్కుల కేటగిరీలో కూడా స్క్రీనింగ్‌కు ఎంపికైంది. దీనికి వచ్చిన రూ.50 వేల నగదు బహుమతిని ఆయన బీసీహెచ్‌సీకే అందజేశారు.

“ఎంతో కష్టపడాల్సి వచ్చింది..”

ఆదివాసుల కష్టాలు కళ్లారా చూశాను. నేను కూడా దాదాపు అదే నేపథ్యం నుంచి వచ్చాను. వాళ్ల గూడేల్లోకి వెళ్లాలంటే కనీసం రోడ్డు కూడా లేదు. అలాంటి వారికి చదువుకోవటం అనేది చాలా పెద్ద విషయం. తల్లిదండ్రులు కూడా పిల్లలకు చదువు నేర్పించేందుకు సుముఖత చూపించరు. ఎంతో కష్టపడి వారిని ఒప్పించి బడి వరకు రప్పించాం. మా సంస్థపై తీసిన డాక్యుమెంటరీకి అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది.



-సంతోష్ ఈస్రం, భీం చిల్డ్రన్ హ్యాపీనెస్ సెంటర్ వ్యవస్థాపకుడు

ఇక మరింత ‘సహకారం’

- వ్యవసాయ సహకార సంఘాల్లో ప్రాయోజిత సేవలు
- ఆర్థిక, వ్యవసాయ, ఆరోగ్య, ఆన్‌లైన్ సేవలు కూడా
- మీసేవ, బిల్లుల చెల్లింపు, బస్, రైల్వే టికెట్లు
- కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ.. సాంకేతికతపై దృష్టి

సాక్షి, హైదరాబాద్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేవలం రైతుల అవసరాలకే పరిమితమైన ఈ సంఘాల్లో వివిధ సేవలను అందుబాటులోకి తెచ్చే దిశగా అడుగులు వేస్తోంది. అందుకోసం వ్యవసాయ పరపతి సంఘాల్లోని సిబ్బందికి ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహిస్తోంది. ఇప్పటివరకు వ్యవసాయదారులకు ఎరువులు, విత్తనాలు, యంత్ర పరికరాలు, రుణ వితరణలో మాత్రమే పరపతి సంఘాలు కీలక భూమిక పోషిస్తున్నాయి. పరిమిత స్థాయిలో సేవలందించడం ద్వారా ఇవి భవిష్యత్తులో మనలేవని భావించిన సర్కారు.. వీటిని పటిష్టం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోంది. కేంద్ర సహకార శాఖ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్న హోంశాఖ మంత్రి అమిత్‌షా.. సహకార రంగాన్ని బలోపేతం చేయాలని భావిస్తున్నారు. 54 సర్వీసులతోపాటు అనుబంధంగా మరో 340 బహుళ ఆర్థిక సేవలను కూడా సహకార సంఘాల్లో అందుబాటులోకి తేనున్నారు. ఈ ప్రాయోజిత సేవలపై సొసైటీ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇస్తున్నారు.

ఆర్థికం, ఆరోగ్యం.. అన్ని రకాల సేవలు

ఆదాయ పన్ను, ఇంటి పన్ను, విద్యుత్తు బిల్లుల చెల్లింపు, రిజిస్ట్రేషన్లు, నగదు తీసుకునే విధంగా మినీ ఏటీఎం, మీసేవ, ఇతర అన్ని రకాల లావాదేవీలు సొసైటీల్లో జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు,నిత్యావసర సరుకులు, దుస్తులు.. ఇలా అవసరమైన ప్రతి వస్తువు కొనుగోలు చేసేందుకు సంఘంలోనే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తారు. జనరిక్ మందులను అందుబాటులో ఉంచటం, ఆరోగ్యపరమైన సమస్యలను పరిష్కరించేందుకు కార్పొరేట్ వైద్యుల ద్వారా ఆన్‌లైన్‌లో సలహాలు, సూచనలు, రక్త నమూనాల సేకరణ, ఫలితాల విశ్లేషణలు అందేలా చూస్తారు. విమాన, రైల్వే, బస్సు టికెట్లు రిజర్వేషన్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు.

దశలవారీగా అమలు

సహకార సంఘాల్లో దశలవారీగా అన్ని రకాల ఆన్‌లైన్ సేవలను చేపడుతున్నాం. ఇటీవల ఇచ్చిన శిక్షణలో ప్రజలకు అందించాల్సిన సేవల గురించి తెలిపాం. శిక్షణతో పాటు సందేహాలు నివృత్తి చేశాం. సహకార సంఘాల ద్వారా ప్రజలకు విస్తృత సేవలు అందించటమే ప్రధాన లక్ష్యం. సేవలు అందుబాటులోకి వస్తే వ్యాపారాలు పెరిగి సంఘాలు మరింత బలోపేతం అవుతాయి. ఇది ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటోంది.

– వెంకట్‌రెడ్డి, జిల్లా సహకారశాఖాధికారి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

చెల్పాక ఎన్‌కౌంటర్ బూటకం

- ఆహారంలో విషం పెట్టి మావోయిస్టులను చంపారు
- పౌర హక్కుల సంఘం నేతల ఆరోపణ
- ఎన్‌కౌంటర్ స్థలాన్ని పరిశీలించిన సంఘం నాయకులు



చెల్పాక అడవుల్లో పరిశీలిస్తున్న పౌరహక్కుల సంఘం నాయకులు

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక అడవుల్లో ఈ నెల ఒకటో తేదీన జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నారాయణ, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు చిలుక చంద్రశేఖర్ ఆరోపించారు. ఆహారంలో విషం పెట్టి మావోయిస్టులను కాల్చి చంపారని తెలిపారు. ఎన్‌కౌంటర్ స్థలాన్ని ఆదివారం వారు పరిశీలించారు. అనంతరం ఏటూరునాగారంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. చెల్పాక ఎన్‌కౌంటర్‌పై పౌరహక్కుల సంఘం నేతల నిజ నిర్ధారణ కమిటీ అధ్యయనం చేసిందని తెలిపారు. ఇక్కడ పోలీసులకు, మావోయిస్టులకు ఎదురు కాల్పులు జరగలేదని, ఏకపక్ష కాల్పులు జరిగినట్లు తెలుస్తోందని అనుమానం వ్యక్తంచేశారు. మృత దేహాలను తీకువచ్చేటప్పుడే వాసన వచ్చినట్లు మోసుకొచ్చిన వారు చెబుతున్నారంటే.. అంతకు చాలా సమయం ముందే వారిని చంపినట్లు స్పష్టమవుతోందని అన్నారు. ఒక్క చెట్టుకు కూడా తుపాకీ తూటా తగిలిన ఆనవాళ్లు కనిపించలేదని చెప్పారు. ఇన్‌ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో అన్నంలో విషం పెట్టి, చిత్రహింసలకు గురిచేసి ఏడుగురు మావోయిస్టులను పోలీసులు అతికిరాతకంగా చంపారని ఆరోపించారు. సంఘటన స్థలంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న తుపాకులు లాక్ తీయకుండా ఉన్నాయని, అలాంటప్పుడు కాల్పులు ఎలా జరుపుతారని ప్రశ్నించారు. రఘునాథపాలెం, దామెరతోగు, చెల్పాక ఎన్‌కౌంటర్లన్నీ బూటకమేనని మండిపడ్డారు.

మైనార్టీ గురుకులంలో విద్యార్థిని మృతి

- సిబ్బంది నిర్లక్ష్యం వల్లే చనిపోయింది: బాలిక తండ్రి
- పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలి: ఎమ్మెల్యే మాణిక్‌రావు



సాధియా

జహీరాబాద్‌టౌన్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని బూచినెల్లి గ్రామ శివారులో ఉన్న అల్గోల్ బాలికల మైనార్టీ గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి ఓ బాలిక అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పట్టణంలోని జమాలియా కాలనీకి చెందిన హనీఫ్ పెద్ద కూతురు సాధియా(14) అల్గోల్ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. సాధియా రాత్రి 9 గంటల సమయంలో గురుకులంలోని మెస్‌లో భోజనం చేసి తన హాస్టల్ రూమ్‌కు వెళ్తున్న క్రమంలో మెట్లపై నుంచి జారి పడింది. తీవ్ర గాయాలైన ఆమెను వెంటనే జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం బాలికను హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ సాధియా మృతి చెందింది. విద్యార్థులు సరదాగా మెట్ల రెయిలింగ్‌పై నుంచి కిందకు జారుతుంటారని, సాధియా కూడా రెయిలింగ్‌పై నుంచి జారుతున్న క్రమంలో అదుపుతప్పి ప్రమాదవశాత్తూ కింద పడిందని గురుకులం ప్రిన్సిపాల్ రుబీనా పేర్కొన్నారు. ఇదిలా ఉండగా గురుకులం ప్రిన్సిపాల్, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తన కుమార్తె మృతి చెందిందని తండ్రి హనీఫ్ ఆరోపించారు. రాత్రి 9 గంటలకు ప్రమాదం జరిగితే తనకు 10.30 గంటల వరకు సమాచారం ఇవ్వలేదన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ ఘటనపై చిరాగ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

సాధియా కుటుంబానికి అండగా ఉంటాం

సాధియా మృతి పట్ల ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ ఎం.శివకుమార్‌లు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. అల్గోల్ గురుకుల పాఠశాల మంచి వాతావరణంలో ఉందని, ఇక్కడ ఇలాంటి ఘటన జరగడం బాధాకరమని అన్నారు. సాధియా మృతిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో ప్రభుత్వం ఆదుకుని ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. సాధియా కుటుంబానికి అండగా ఉంటామని పేర్కొన్నారు.

ప్రతి 35 కిలోమీటర్లకు ఒకటి..

- హైవేలపై ట్రామాకేర్ సెంటర్లు ఏర్పాటు
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ



జీజీహెచ్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ. చిత్రంలో షబ్బీర్ అలీ, సుదర్శన్‌రెడ్డి

రెంజల్ (బోధన్)/నిజామాబాద్ నాగారం: జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో మరణాలను నివారించేందుకు ప్రతి 35 కిలోమీటర్లకు ఒక ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆదివారం ఆయన నిజామాబాద్ జిల్లా రెంజల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంకా 300 వరకు హెల్త్ సబ్‌సెంటర్లు, 170 వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలలో కేన్సర్ చికిత్స కేంద్రాలతో పాటు వాస్క్యులర్ యాక్సెస్ సెంటర్‌లను త్వరలో ప్రారంభిస్తామన్నారు.

జీజీహెచ్‌లో ఏం జరుగుతోందో నాకు తెలుసు..

‘నిజామాబాద్‌లోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)లో ఏం జరుగుతోందో నాకు తెలుసు. 60 శాతం మంది వైద్యులు విధులకు గైర్హాజరు అవుతున్నారు. నా వద్ద పూర్తి సమాచారం ఉంది’ అని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యులు ప్రైవేట్‌గా ప్రాక్టీస్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వందరోజుల్లో మళ్లీ వస్తానని, అప్పటిలోగా మార్పు రాకుంటే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఆదివారం ఆయన జీజీహెచ్‌ను సందర్శించారు. ఆస్పత్రిలో పైపులైన్ లీకేజీ, భవనాలపై పిచ్చిమొక్కలు పెరగడం, కిటికీల అద్దాలు పగిలిపోవడం, లిఫ్టులు చెడిపోవడం, ఎలుకలు తిరుగుతుండటాన్ని గమనించి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌పై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జీజీహెచ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆస్పత్రి అభివృద్ధి కోసం రూ. 7 కోట్లు మంజూరు చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమాలలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రాకేశ్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పాల్గొన్నారు.

గోదాంలో సిలిండర్ పేలి ఒకరి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు



నారాయణ

మద్దూరు: గోదాంలో సిలిండర్ పేలడంతో ఓ వ్యక్తి మృతి చెందగా.. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మద్దూరు పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాంలాల్, డీటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆనంద్‌ల కథనం మేరకు.. కోయిలకొండ మండలం అభంగపట్నంకు చెందిన చింతకింది వెంకటేశ్ హైదరాబాద్‌లో హోటల్స్‌కు కమర్షియల్ సిలిండర్‌లను సరఫరా చేస్తున్నాడు. ఆయన దగ్గర గుండుమాల్‌కు చెందిన నారాయణ, కృష్ణ, అభంగపట్నంకు చెందిన నవీన్ పనిచేస్తున్నారు. శనివారం రాత్రి వీరు 72 కమర్షియల్ ఖాళీ సిలిండర్లను తీసుకొని మద్దూరులోని సిద్ధి వినాయక హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీకి వచ్చారు. అక్కడ డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల నుంచి కమర్షియల్ సిలిండర్లలోకి గ్యాస్‌ను రీఫిల్లింగ్ చేస్తున్న సమయంలో ఒక సిలిండర్ పేలింది. దీంతో అక్కడే ఉన్న నారాయణ, నవీన్ తీవ్రంగా గాయపడ్డారు. కృష్ణకు స్వల్పంగా గాయాలయ్యాయి. పోలీసులకు, 108కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన నారాయణ చికిత్స పొందుతూ మృతిచెందాడు. నవీన్‌కు 40 శాతం గాయాలు కావడంతో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. నారాయణ తండ్రి ఫిర్యాదు మేరకు గ్యాస్ ఏజెన్సీ యజమాని చంద్రప్ప (చందు), చింతకింది వెంకటేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఘటన విషయం తెలుసుకున్న నారాయణపేట డీఎస్ఓ సుదర్శన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్ ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు.

హైదరాబాద్‌లో హత్య.. కోదాడలో శవం

- తొమ్మిది నెలల తర్వాత వీడిన యువకుడి హత్య కేసు మిస్టరీ
- పాతిపెట్టిన మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు



కోదాడ సమీపంలోని కొమరబండ చెరువులో పాతిపెట్టిన శవాన్ని జేసీబీ సాయంతో వెలికితీస్తున్న పోలీసులు

కోదాడ: సామాజిక మాధ్యమంలో చురుగ్గా ఉండే ఓ బాలిక చేసిన తప్పిదం ఆమె తల్లిదండ్రులను హంతకులుగా మార్చగా, మరో యువకుడు ప్రాణాలు కోల్పోయేలా చేసింది. ఈ ఏడాది మార్చి నెలలో హైదరాబాద్‌లో హత్యకు గురై.. నాగార్జునసాగర్ కాలువలో శవంగా తేలిన యువకుడి కేసును పోలీసులు తొమ్మిది నెలల తర్వాత ఛేదించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడకు చెందిన ఓ కారు డ్రైవర్ తన భార్యతో కలిసి బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌కు వలసవచ్చి జగద్గిరిగుట్ట సమీపంలో నివాసముంటున్నారు. వీరికి 10వ తరగతి చదువుతున్న కుమార్తె ఉంది. సామాజిక మాధ్యమాల్లో చురుకుగా ఉండే సదరు బాలిక తరచూ రీల్స్ చేస్తూ పోస్ట్ చేసేది. ఈ పోస్టులను బోరబండకు చెందిన వివాహితుడైన ఆటో డ్రైవర్ కుమార్ గమనించి ఆమెకు ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టి పరిచయం పెంచుకున్నాడు. ఈ ఏడాది మార్చిలో కుమార్ బాలికకు సినిమా అవకాశాలు ఇప్పిస్తానని చెప్పి ఇంటి నుంచి తీసుకెళ్లి ఒక దగ్గర బంధించాడు.

ట్యాబ్ సాయంతో కనిపెట్టి..

తమ కుమార్తె కనిపించకపోవడంతో బాలిక తల్లిదండ్రులు అన్ని ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే పరువు పోతుందని భావించారు. ఈ క్రమంలో బాలిక ట్యాబ్‌ను ఓపెన్ చేసి కుమార్‌తో చేసిన చాటింగ్‌ను గుర్తించారు. దీంతో బాలిక తల్లి మరో స్త్రీగా సామాజిక మాధ్యమంలో ఆటో డ్రైవర్ కుమార్‌తో పరిచయం పెంచుకుని తమ ఇంటికి ఆహ్వానించింది. ఆటోలో కుమార్ జగద్గిరిగుట్టకు వచ్చాడు. కుమార్ రాగానే అతడిని బంధించి తమ కుమార్తె ఆచూకీ చెప్పాలని ప్రాధేయపడ్డారు. ఎంత బతిమిలాడినా కుమార్ ఆచూకీ చెప్పకపోవడంతో అతడిపై తీవ్రంగా దాడి చేశారు. ఆ దాడిలో కుమార్ అపస్మారకస్థితికి చేరడంతో అతడి కాళ్లు, చేతులు కట్టేసి కారులో విజయవాడ వైపు తీసుకొచ్చారు. సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలో మునగాల వద్ద హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న నాగార్జునసాగర్ ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద ముక్త్యాల మేజర్ కాలువలో కుమార్‌ను పడేసి తిరిగి హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. కుమార్ మృతదేహం కోదాడ సమీపంలోని బాలాజీనగర్ వద్ద కాలువ ఒడ్డుకు చేరింది. పోలీసులు గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి స్థానిక కొమరబండ చెరువు అంచున ఖననం చేశారు.

టెక్నాలజీ పట్టించింది..

మార్చిలో జరిగిన ఈ ఘటన తర్వాత బాలిక తల్లిదండ్రులు హైదరాబాద్ చేరుకుని తమకు ఏమీ తెలియనట్లు వారి పనులు వారు చేసుకోసాగారు. సదరు బాలిక కూడా హైదరాబాద్‌లోని నింబోలిఅడ్డాలోని ఓ అనాథశరణాలయంలో ఉందని తెలుసుకొని ఆమెను ఇంటికి తీసుకొచ్చారు. కుమార్ కనిపించకపోవడం, ఆటో కూడా దొరక్కపోవడంతో కుమార్ భార్య బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో కుమార్ ఆటోకు ఉన్న నంబర్ ప్లేట్ మార్చి సదరు బాలిక తండ్రి ఉపయోగిస్తున్నాడు. దానిపై ఉన్న పేటీఎం క్యూఆర్ కోడ్‌ను మాత్రం తొలగించలేదు. ఆటోకు ఉన్న ప్రత్యేకమైన బంపర్‌ను కూడా అలాగే ఉంచారు. ఈ ఆనవాళ్లతో 10 రోజుల క్రితం పోలీసులు ఆటోను పట్టుకొని దానిని ఉపయోగిస్తున్న బాలిక తండ్రిని అదుపులోకి తీసుకొని విచారించగా హత్య విషయం బయటపడింది. బోరబండ పోలీసులు రెండు రోజుల క్రితం కోదాడకు వచ్చి మృతదేహాన్ని జేసీబీ సాయంతో తవ్వించారు. ఎముకలను డీఎన్ఏ పరీక్షలకు పంపి అది కుమార్ మృతదేహమా.. కాదా అని నిర్ధారిస్తామని పోలీసులు తెలిపారు. బాలిక తల్లిదండ్రులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం బాలిక ఒంటరిగా మారగా, కుమార్ భార్య భర్తను కోల్పోయి రోడ్డున పడింది.

అంబేడ్కర్‌పై బురద జల్లేందుకు బీజేపీ యత్నం

- రాజ్యసభ సభ్యుడు అనిల్ యాదవ్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై ఏదో రకంగా బురద జల్లేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ ఆరోపించారు. పార్లమెంట్ సాక్షిగా అమిత్‌షా అంబేడ్కర్‌ను అవమానిస్తూ మాట్లాడడాన్ని తాము తీవ్రంగా ఖండించామని చెప్పారు. ఆదివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర గిరిజనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీశ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. దేశంలో నివసించే పౌరులందరికీ సమాన హక్కులుండాలని కాంగ్రెస్ పార్టీ పోరాడుతుంటే.. బీజేపీ మాత్రం నియంతలా వ్యవహరిస్తోందన్నారు. బీజేపీ తీరుకు నిరసనగా తాము పార్లమెంట్‌లో శాంతియుత నిరసనలు చేస్తున్నామని, ఇప్పటికైనా అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పి తన పదవి నుంచి తప్పుకోవాలని అన్నారు. దేశ ప్రజలందరి హక్కుల కోసం పోరాడుతున్న రాహుల్‌గాంధీపై తప్పుడు కేసులు పెట్టడం బీజేపీ అవివేకానికి నిదర్శనమని పేర్కొన్నారు. ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ మాట్లాడుతూ, ప్రధానిగా మోదీ, హోంమంత్రిగా అమిత్‌షాలు దేశాన్ని ఏలుతున్నది రాజ్యాంగం కారణంగానే అనే విషయాన్ని మర్చిపోతే ఎలా అని ప్రశ్నించారు.

పేదలంటే చిన్నచూపా

రాష్ట్రంలోని సినీ ప్రముఖులకు పేద ప్రజలంటే చిన్నచూపా అని ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ప్రశ్నించారు. పోలీసు కేసు నమోదయినందుకే అల్లు అర్జున్‌ను పెద్దఎత్తున సినీ నటులు పరామర్శించారని, కానీ తొక్కిసలాటలో చనిపోయిన రేవతి కుటుంబాన్ని మాత్రం ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు.

రేపు సూర్యుడి సమీపానికి 'నాసా' పార్కర్

న్యూయార్క్: సూర్యుడికి అత్యంత సమీపానికి వెళ్లిన స్పేస్‌క్రాఫ్ట్‌గా 'నాసా' పార్కర్ సోలార్ ప్రోబ్ రికార్డు సృష్టించబోతోంది. సూర్యగోళంపై పరిశోధనల కోసం అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 2018లో అంతరిక్ష నౌకను ప్రయోగించింది. అప్పటినుంచి సూర్యుడి దిశగా సుదీర్ఘ ప్రయాణం సాగిస్తూనే ఉంది. మంగళవారం ఇది లోకబాంధవుడికి అత్యంత సమీపంలోకి వెళ్లనుంది. అంటే భాస్కరుడి ఉపరితలం నుంచి 3.8 మిలియన్ మైళ్ల(6 మిలియన్ కిలోమీటర్లు) దూరానికి చేరుకుంటుంది. ఒక ఫుట్‌బాల్ మైదానాన్ని ఊహించుకుంటే ఒకవైపు సూర్యుడు, మరోవైపు భూమి ఉంటాయని, 4-యార్డ్ లైన్ వద్ద పార్కర్ ఉంటుందని నాసా సైంటిస్టు



జో వెస్ట్‌లేక్ చెప్పారు. సూర్య భగవానుడికి ఇంత సమీపంలోకి వెళ్లిన అంతరిక్ష నౌక ఇప్పటిదాకా ఏదీ లేదు. సూర్యుడికి దగ్గరిగా వెళ్లిన తర్వాత పార్కర్ నుంచి సమాచారం నిలిచిపోనుంది. అప్పుడు దాని పరిస్థితి ఏమటన్నది అంచనా వేయలేకపోతున్నారు. క్షేమంగా వెనక్కి వస్తుందా? లేక ఏదైనా జరుగుతుందా? అనే ఉత్కంఠ నెలకొంది. ఇప్పటిదాకా రూపొందించిన అంతరిక్ష నౌకల్లో పార్కర్ అత్యంత వేగవంతమైనది. ఇది గంటకు 6.90 లక్షల కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. సూర్యుడి నుంచి వెలువడే ఉష్ణానికి దెబ్బతినకుండా బలమైన హీట్ షీల్డ్ అమర్చారు. ఇది 1,371 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను కూడా తట్టుకోగలదు. సూర్యుడికి దగ్గరగా వెళ్లిన తర్వాత వచ్చే ఏడాది సెప్టెంబర్ దాకా అదే కక్ష్యలోకి సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తుంది. సూర్యుడి ఉపరితలం కంటే కరోనా ఎందుకు వందల రెట్లు ఎక్కువ వేడిగా ఉంటుందన్న సంగతి తెలుసుకోవడానికి పార్కర్ తగిన సమాచారం ఇస్తుందని నాసా సైంటిస్టులు భావిస్తున్నారు.

మరో మూడు నెలల్లో 'నిసార్' ప్రయోగం

ఇస్రో, నాసా ఉమ్మడి మిషన్‌కు రంగం సిద్ధం

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో), అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' ఉమ్మడి ప్రయోగానికి రంగం సిద్ధమైంది. నాసా-ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్(నిసార్) శాటిలైట్‌ను వచ్చే ఏడాది మార్చి నెలలో ప్రయోగించబోతున్నారు. ఈ మిషన్ విలువ రూ.5,000 కోట్లు. అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనల్లో రెండు దేశాల మధ్య సహకారంలో ఇదొక మైలురాయిగా మారబోతోంది. అంతరిక్షంపై అత్యాధునిక పరిశోధనల కోసం నిసా



ర్‌ను ప్రయోగిస్తున్నారు. 2009లో మొదలైన ఈ ఆలోచన వాస్తవం రూపం దాల్చబోతోంది. నిసార్ ఉపగ్రహం బరువు 2.8 టన్నులు. భూమిపై జరిగే మార్పులను ఈ ప్రయోగంతో అత్యంత కచ్చితత్వంతో గుర్తించవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. సంప్రదాయ శాటిలైట్ల కంటే ఇది పూర్తిగా భిన్నమైనది. ఇందులో అడ్వాన్స్‌డ్ సింథటిక్ అపెర్చర్ రాడార్ టెక్నాలజీ ఉపయోగించారు. సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి జీఎస్ఎల్‌వీ ఎంకే-2 రాకెట్ ద్వారా నిసార్‌ను ప్రయోగించనున్నారు. ఇది మిషన్ కాల వ్యవధి మూడేళ్లు. మరోవైపు స్పేస్ డాకింగ్ ఎక్స్‌పరిమెంట్(స్పేడెక్స్) ఉపగ్రహాల చిత్రాలను ఇస్రో విడుదల చేసింది. పీఎస్ఎల్‌వీ-సి60 రాకెట్ ద్వారా వీటిని త్వరలో ప్రయోగించనున్నారు. ఈ రెండు ఉపగ్రహాలతో స్పేస్ డాకింగ్ టెక్నాలజీలో భారత్ ముందంజ వేయనుంది. స్పేడెక్స్ మిషన్‌లో భాగంగా పీఎస్ఎల్‌వీ ఆర్బిటాల్ ఎక్స్‌పరిమెంట్ మాడ్యూల్-4(పోయెం-4) ద్వారా 24 శాస్త్రీయ ప్రయోగాలు చేయాలని ఇస్రో నిర్ణయించింది.

మోదీ చర్యలతో ఈసీ సమగ్రతకు దెబ్బ

- ఎన్నికల నియమావళిలో మార్పులపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ఆగ్రహం
- ప్రజాస్వామ్యంపై దాడిని అడ్డుకుంటామని స్పష్టీకరణ



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో మార్పులు తీసుకురావడాన్ని ఆయన తప్పుబట్టారు. ఎన్నికల నిర్వహణ నిబంధనలు-1961లోని రూల్ 93(2)(ఏ)ను ఎన్నికల సంఘం సిఫార్సు మేరకు శుక్రవారం కేంద్ర న్యాయశాఖ సవరించడం తెలిసిందే. ఈ చర్య ఈసీ సమగ్రతను దెబ్బతీసేందుకు చేసిన కుట్రగా ఖర్గే అభివర్ణిస్తూ ఆదివారం 'ఎక్స్'లో పలు వ్యాఖ్యలు చేశారు. 'మోదీ ప్రభుత్వం ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో చేసిన మార్పులు ఈసీ సమగ్రతకు భంగం కలిగించే ప్రణాళిక బద్ధమైన కుట్రలో భాగమే. ఈసీని నిర్వీర్యం చేసేందుకు మోదీ గతంలో ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేసే ప్యానెల్ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించారు. ఇప్పుడు హైకోర్టు ఆదేశాల తర్వాత కూడా ఎన్నికల సమాచారాన్ని దాచిపెడుతున్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు తొలగింపు, ఈవీఎంల్లో పారదర్శకత లోపించడం వంటి అవకతవకలపై కాంగ్రెస్ ఈసీకి లేఖలు రాసిన ప్రతీసారీ కించపరిచే ధోరణితో స్పందించింది. తీవ్రమైన ఫిర్యాదులను కనీసం స్వీకరించనూలేదు. ఈసీ స్వతంత్రంగా వ్యవహరించడం లేదు. ఈసీ సమగ్రతను దెబ్బ తీయడమంటే, రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై మోదీ ప్రభుత్వం ప్రత్యక్షంగా దాడి చేయడమే. దీన్ని అడ్డుకుని తీరతాం'' అన్నారు.

భారత్, కువైట్ మధ్య... సుదృఢ బంధం

- కీలక రంగాల్లో మరింత సహకారం
- కువైట్ రాజుతో ప్రధాని మోదీ భేటీ
- భారత్‌లో పర్యటించాలని ఆహ్వానం

కువైట్ సిటీ: మిత్రదేశాలైన భారత్, కువైట్ మధ్య బంధం మరింత దృఢపడింది. రెండు దేశాల నడుమ సంబంధాలు కీలక వ్యూహాత్మక భాగస్వామ్యంగా మారాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం కువైట్ సిటీలోని మెజెస్టిక్ బయన్ ప్యాలెస్‌లో కువైట్ రాజు, ప్రధాని షేక్ మెషల్ అల్-అహ్మద్ అల్-జబేర్ అల్-సబాతో సమావేశమయ్యారు. మోదీకి రాజు సాదర స్వాగతం పలికారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను నూతన శిఖరాలకు చేర్చే దిశగా చర్చలు జరిపారు. ఐటీ, ఫార్మాస్యూటికల్స్, ఫిన్‌టెక్, మౌలిక సదుపాయాలు, భద్రత తదితర కీలక రంగాల్లో పరస్పర సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంపై విస్తృతస్థాయిలో సంప్రదింపులు జరిపారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయానికొచ్చారు. కువైట్‌లో నివసిస్తున్న 10 లక్షల మంది భారతీయుల సంక్షేమానికి సహకరిస్తున్నందుకు కువైట్ రాజుకు ప్రధాని మోదీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. తమదేశ అభివృద్ధి ప్రయాణంలో భారతీయులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వెలకట్టలేని సేవలు అందిస్తున్నారని రాజు ప్రశంసించారు. భారత్‌లో పర్యటించాలని కువైట్ రాజును మోదీ ఆహ్వానించారు. షేక్ మెషల్ అల్-అహ్మద్ అల్-జబేర్ అల్-సబాతో అద్భుతమైన భేటీ జరిగిందని మోదీ పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టుచేశారు. కీలక రంగాల్లో పరస్పర సహకారంపై చర్చించామని తెలిపారు. రెండు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని వ్యూహాత్మక స్థాయికి తీసుకెళ్లామని ఉద్ఘాటించారు. రాబోయే రోజుల్లో భారత్, కువైట్



కువైట్ రాజు అల్-సబాతో మోదీ ఆలింగనం

సంబంధాలు ఉన్నతంగా పరిఢవిల్లాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధాని మోదీ శనివారం కువైట్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే. తొలి రోజు ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కువైట్‌లోని భారతీయులతో సమావేశమయ్యారు. రెండో రోజు ఆదివారం కువైట్ రాజుతో చర్చల్లో పాల్గొన్నారు. అనంతరం పర్యటన ముగించుకుని మోదీ భారత్ చేరుకున్నారు. 43 ఏళ్ల తర్వాత కువైట్‌లో పర్యటించిన తొలి భారత ప్రధాని ఆయనే కావడం విశేషం.

అవగాహన ఒప్పందాలు

ప్రధాని మోదీ, కువైట్ రాజు చర్చల సందర్భంగా భారత్, కువైట్ మధ్య పలు అవగాహన ఒప్పందాలు కుదిరాయి. రక్షణ, క్రీడలు, సంస్కృతి, సోలార్ ఎనర్జీ విషయంలో ఒప్పందాలు కుదిరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. రక్షణపై కుదిరిన ఒప్పందంలో రక్షణ పరిశ్రమలు, రక్షణ పరికరాల సరఫరా, ఉమ్మడిగా సైనిక విన్యాసాలు, శిక్షణ, నిపుణులు, జవాన్ల మార్పిడి, పరిశోధన-అభివృద్ధిలో పరస్పర సహకారం వంటి అంశాలను చేర్చారు. ప్రస్తుతం కువైట్ నాయకత్వం వహిస్తున్న గల్ఫ్ కో-ఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ)తో సహకారాన్ని మరింత పెంచుకోవడానికి భారత్ ఆసక్తి చూపింది.

మోదీకి కువైట్ అత్యున్నత పురస్కారం

ప్రధాని నరేంద్రమోదీకి కువైట్ అత్యున్నత పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్-కబీర్' లభించింది. కువైట్ రాజు షేక్ మెషల్ అల్-అహ్మద్ అల్-జబేర్ అల్-సబా ఆదివారం ఆయనకు ఈ అవార్డు ప్రదానం చేశారు. ఇది మోదీకి దక్కిన 20వ అంతర్జాతీయ గౌరవం. స్నేహానికి చిహ్నంగా దేశాధినేతలు, విదేశీ దౌత్యవేత్తలు, విదేశీ రాజకుటుంబ సభ్యులకు కువైట్ ఇచ్చే అత్యున్నత పురస్కారం ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్ అవార్డు. గతంలో బిల్ క్లింటన్, ప్రిన్స్ చార్లెస్, జార్జ్ బుష్ వంటి విదేశీ నేతలు ఈ పురస్కారం అందుకున్నారు.



ఉగ్రవాదాన్ని ఉమ్మడిగా ఎదుర్కొందాం

ఉగ్రవాద భూతాన్ని ఉమ్మడి ఎదిరించాలని మోదీ, కువైట్ రాజు నిర్ణయించుకున్నారు. పెనుముప్పుగా ఉగ్రవాదాన్ని అరికట్టే విషయంలో పరస్పర సహకారాన్ని మరింత పెంచుకోవాలని తీర్మానించుకున్నారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ఇరువురు నేతలు తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అంతం చేయాల్సిందేనని తేల్చిచెప్పారు. ఉగ్రమూకలకు ఆర్థిక సాయం అందే మార్గాలను మూసివేయడంతోపాటు ఉగ్రవాదానికి స్వర్గధామంగా మారిన దేశాలపై కఠిన ఆంక్షలు విధిస్తే పరిస్థితిలో కచ్చితంగా మార్పు వస్తుందని మోదీ, కువైట్ రాజు అభిప్రాయపడ్డారు. ఇద్దరు నాయకుల భేటీపై ఈ మేరకు ఉమ్మడి ప్రకటన విడుదలైంది.

నేటి నుంచి ఆప్ పథకాల రిజిస్ట్రేషన్

- మహిళా సమ్మాన్, జీవని యోజన్
- ఇంటింటికీ నమోదు బృందాలు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ రెండు కీలక పథకాల రిజిస్ట్రేషన్‌ను సోమవారం నుంచి ప్రారంభించనుంది. ఆదివారం ఆప్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ చీఫ్ కేజ్రీవాల్ మహిళా సమ్మాన్ యోజన్, సంజీవని యోజన్‌ల రిజిస్ట్రేషన్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సీఎం అతిశీ, సీనియర్ నేత మనీశ్ సిసోడియా పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ..'సోదరీ మణులకు మహిళా సమ్మాన్ యోజన కింద నెలు రూ.2,100 బోనస్, 60 ఏళ్లు పైబడ్డ వారికి ఉచిత వైద్య చికిత్స కోసం 'సంజీవని యోజనను అమలు చేయనున్నామన్నారు. వృద్ధుల ఉచిత వైద్యానికి అయ్యే ఖర్చుకు పరిమితమంటూ ఏమీ లేదు. ఈ స్కీమ్‌ల రిజిస్ట్రేషన్లు సోమవారం నుంచి మొదలవుతుంది. లబ్ధిదారులను గుర్తించేందుకు తనతోపాటు ముఖ్యమంత్రి అతిశీ, సీనియర్ నేత మనీష్ సిసోడియా ప్రజల వద్దకే వెళ్తామన్నారు. రిజిస్ట్రేషన్ కోసం సిబ్బంది బృందాలు ప్రతి ఇంటికీ వెళ్తాయన్నారు. మహిళా యోజన ద్వారా 35-40 లక్షల మందికి, సంజీవని ద్వారా 10-15 లక్షల మందికి లబ్ధి కలుగుతుందని భావిస్తున్నామని కేజ్రీవాల్ తెలిపారు. ఆప్ పథకాలు ఢిల్లీ మహిళలను మరోసారి మోసగించే ప్రయత్నమని బీజేపీ మండిపడింది. కేజ్రీవాల్‌ను ప్రపంచంలోనే పెద్ద మోసగానిగా అభివర్ణించింది.

ఢిల్లీ శకటంపై రాజకీయం: కేజ్రీవాల్

గణతంత్ర వేడుకల్లో ఈసారి ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ శకటానికి మోదీ సర్కారు స్థానం కల్పించకపోవడం దారుణమని కేజ్రీవాల్ మండిపడ్డారు. దేశ రాజధానిగా ఢిల్లీ శకటానికి వేడుకల్లో చోటుదక్కి తీరాలి. దాన్నీ అడ్డుకుంటున్నారు. రాజకీయ స్పర్థను రాష్ట్రంపై చూపడమా?'' అంటూ దుయ్యబట్టారు.

నేనింకా బతికే ఉన్నా

బ్రిటన్ రాజు చార్లెస్ సరదా వ్యాఖ్యలు

లండన్: పరిచయస్తులు చాలా రోజులకు కనిపిస్తే అడిగే మొదటి ప్రశ్న 'ఎలా ఉన్నారు?' అని. క్యాన్సర్‌తో పోరాడుతూ బాహ్య ప్రపంచానికి దూరంగా గడుపుతూ అరుదుగా మీడియా ముందుకొస్తున్న బ్రిటన్ రాజు చార్లెస్-3 ఆ ప్రశ్నకు సరదాగా స్పందించారు. శుక్రవారం తూర్పు లండన్ పరిధిలోని వాల్త్‌హ్యామ్‌స్టోలోని ఫెలోషిప్ స్క్వేర్ వద్ద సామూహిక ప్రార్థనల కార్యక్రమం జరిగింది. వేడుకకు రాజు చార్లెస్, భార్య కెమిల్లా దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిక్కు వర్గానికి చెందిన హర్వీందర్ రథన్



రాజుతో కరచాలనం చేశాడు. ''రాజు గారూ! శుభోదయం. బాగున్నారా?'' అంటూ కుశల ప్రశ్నవేశారు. దానికి ఛార్లెస్ వెంటనే 'నేనింకా బతికే ఉన్నా' అంటూ బదులివ్వడంతో అంతా పగలబడి నవ్వారు. రాజు క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు 2022 ఫిబ్రవరిలో బ్రిటన్ రాజకుటుంబం అధికారికంగా ప్రకటించింది. ఆయనకు చికిత్స వచ్చే ఏడాది కూడా కొనసాగుతుందని తెలుస్తోంది.

రాహుల్‌కు బరేలీ కోర్టు సమన్లు

బరేలీ(యూపీ): లోక్‌సభ ఎన్నికల సమయంలో పేద వర్గాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి యూపీలోని బరేలీ కోర్టు సమన్లు జారీ చేసింది. ఆల్ ఇండియా హిందూ మహాసభ సంస్థ మండల్ అధ్యక్షుడు పంకజ్ పాఠక్ చేసిన ఫిర్యాదుపై జనవరి 7వ తేదీన తమ ఎదుట హాజరు కావాలంటూ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సుధీర్ కుమార్ శనివారం సమన్లు పంపారు. పిటిషనర్ పాఠక్ ఆగస్టులోనే ఎమ్మెల్యే/ఎంపీ కోర్టును ఆశ్రయించారు. ఆ కోర్టు తిరస్కరించడంతో సెషన్స్ కోర్టులో పిటిషన్ వేశారు. 'సమాజంలో బలహీన వర్గాల వారే అత్యధికంగా ఉన్నారు. అయినప్పటికీ, వారి వద్ద ఉన్న సంపద మాత్రం చాలా తక్కువ. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే మెజారిటీ వర్గం ప్రజలు సంపదలో మరింత వాటా కోసం డిమాండ్ చేయచ్చు'అని లోక్‌సభ ఎన్నికల సభలో రాహుల్ అన్నారనీ, రాజకీయ లాభం కోసమే పేదలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని పిటిషనర్ ఆరోపించారు.

గాజాపై దాడులు... 22 మంది దుర్మరణం

డెయిర్ అల్-బలాహ్: గాజాలోని పాలస్తీనియన్లు కనీసం తాగునీరు కూడా దొరకని దుర్భర పరిస్థితుల్లో అల్లాడుతున్నా ఇజ్రాయెల్ ఆర్మీ దాడులను యథేచ్ఛగా సాగిస్తోంది. శనివారం రాత్రి మొదలైన వైమానిక దాడులు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ దాడుల్లో ఐదుగురు చిన్నారులు సహా 22 మంది మృత్యువాతపడ్డారు. గాజా నగరంలోని శరణార్థులు తలదాచుకుంటున్న పాఠశాలపై జరిగిన దాడిలో ముగ్గురు చిన్నారులు సహా 8 మంది చనిపోయారు. అయితే, అక్కడ హమాస్ మిలిటెంట్లున్నారని ఇజ్రాయెల్ మిలటరీ పేర్కొంది. డెయిర్ అల్-బలాహ్ నగరంలోని ఓ ఇంటిపై శనివారం రాత్రి జరిగిన మరో దాడిలో ముగ్గురు మహిళలు, ఇద్దరు చిన్నారులు సహా ఎనిమిది మంది మృతి చెందారని పాలస్తీనా ఆరోగ్య విభాగం తెలిపింది. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన దాడుల్లో మరో ఆరుగురు చనిపోయినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇలా ఉండగా, గాజాలో స్వల్ప సంఖ్యలో ఉన్న క్రైస్తవులు క్రిస్మస్ ముందస్తు వేడుకలు జరిపేందుకు ఆ ప్రాంతంలోకి ఆదివారం కార్డినల్ పియెర్‌బటిస్టా పిజ్జబల్లాను ఇజ్రాయెల్ ఆర్మీ అనుమతించింది. వేడుకలు జరుగుతుండగా ఆ ప్రాంతంపై ఇజ్రాయెల్ ఆర్మీ డ్రోన్లతో పహారా కాసింది. ఇజ్రాయెల్ ఆంక్షల వల్ల బిషప్ గాజాలోకి వెళ్లలేకపోయినట్లు పోప్ ఫ్రాన్సిస్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

యుద్ధం కాదది.. క్రూరత్వం!

- ఇజ్రాయెల్‌పై పోప్ ఫ్రాన్సిస్ ధ్వజం
- ద్వంద్వ ప్రమాణాలన్న ఇజ్రాయెల్



జెరూసలేం: గాజాలో ఇజ్రాయెల్ దమనకాండను పోప్ ఫ్రాన్సిస్ మరోసారి తీవ్రంగా ఖండించారు. అమాయక చిన్నారులపై బాంబు దాడిని క్రూరమైన చర్యగా అభివర్ణించారు. ''అది యుద్ధం కాదు. ఇజ్రాయెల్ క్రూరత్వం'' అని ఆవేదన వెలిబుచ్చారు. ఆదివారం వాటికన్ సిటీలోని కార్డినల్స్‌ను ఉద్దేశించి ప్రసంగిస్తూ గాజాలో ఇజ్రాయెల్ వైమానిక దాడులను ప్రస్తావించారు. పోప్ సాధారణంగా సంఘర్షణలు, యుద్ధాలపై బహిరంగంగా అభిప్రాయాలు వెల్లడించరు. అయితే, ''జెరూసలేంకు చెందిన కాథలిక్ బిషప్ శుక్రవారం గాజా స్ట్రిప్‌లోకి ప్రవేశించి అక్కడి కాథలిక్‌లను కలిసేందుకు ప్రయత్నించారు. అందుకు ఇజ్రాయెల్ అనుమతించలేదు. ఇది నన్ను బాధించింది కాబట్టి ఈ మాటలు చెప్పదలుచుకున్నా'' అని పోప్ వివరించారు. ఆయన వ్యాఖ్యలను ఇజ్రాయెల్ ప్రభుత్వం ఖండించింది. పోప్‌వి ద్వంద్వ ప్రమాణాలని ఇజ్రాయెల్ మంత్రి ఆరోపించారు. ఈ దాడులకు తెరలేపింది, తమను బలవంతంగా యుద్ధంలోకి దింపింది హమాసేనని గుర్తు చేశారు. ''యుద్ధంలో అమాయక చిన్నారులు చనిపోవడం ఒకరకంగా క్రూరమైన చర్యగా భావిస్తారు. నిజమేగానీ ఈ మరణకాండ వెనుక దాక్కున్న ఉగ్రవాదులు 100 మంది ఇజ్రాయెలీలను 442 రోజులుగా బందీలుగా ఉంచి చిత్రహింసలు పెడుతున్నారు. వారిలోనూ చిన్నారులున్నారు. ఈ దురాగతాలను పోప్ విస్మరించడం దురదృష్టకరం'' అన్నారు.

మేమొచ్చాకే త్రిపురలో అభివృద్ధి: షా



అగర్తలా: త్రిపుర వెనుకబాటుతనానికి వామపక్ష ప్రభుత్వ పాలనే కారణమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా విమర్శించారు. కమ్యూనిస్టులు రాష్ట్రంలో 35 ఏళ్లపాటు అధికారంలో కొనసాగినా ఏమాత్రం అభివృద్ధి చేయలేదన్నారు. 2018లో బీజేపీ వచ్చాకనే త్రిపుర అభివృద్ధి పథంలో పయనించడం మొదలైందని చెప్పారు. కమ్యూనిస్టుల హయాంలో మూడు దశాబ్దాల్లో జరగని అభివృద్ధి బీజేపీ వచ్చాక కేవలం పదేళ్లలోనే జరిగిందని ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కూడా కొంతకాల అధికారంలో ఉందన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు పేదల కోసమే పనిచేస్తున్నామని చెప్పుకునే వారని చెప్పారు. ధలాయ్‌లో ఆదివారం జరిగిన బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించారు. తిరుగుబాటు గ్రూపులతో మూడు ఒప్పందాలు, బ్రూ రియాంగ్ వర్గంతో ఒక ఒప్పందం కుదుర్చుకుని శాంతిని నెలకొల్పినట్లు అమిత్ షా వివరించారు. బ్రూ గిరిజనులకు పునరావాసం కల్పించామని చెప్పారు. సెంట్రల్ డిటెక్టివ్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(సీడీటీఐ)సహా రూ.668 కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులకు మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈశాన్యంలో ఎదురయ్యే భద్రతాపరమైన సవాళ్లపై సీడీటీఐలో అధ్యయనం జరుగుతుందని చెప్పారు. జిరానియాలో రూ.120 కోట్లతో అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటయ్యే సీడీటీఐ నిర్మాణ పనులు త్వరలోనే మొదలవనున్నాయని వివరించారు.

అమెరికా యుద్ధ విమానం కూల్చివేత

తమ బలగాలే పొరపాటున కూల్చాయన్న సైన్యం

దుబాయ్: యెమెన్‌లోని హౌతీ రెబల్స్ పనిపట్టేందుకు ఎర్ర సముద్ర జలాల్లో మోహరించిన అమెరికా బలగాలు పొరపాటున తమ యుద్ధ విమానాన్ని క్షిపణితో కూల్చి వేశాయి. అయితే, ఆదివారం చోటుచేసుకున్న ఈ ఘటనలో అదృష్టవశాత్తూ విమాన పైలట్లు ఇద్దరూ సురక్షితంగా బయటపడ్డారు. సముద్ర జలాల నుంచి వీరిద్దరినీ వెంటనే కాపాడారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టామని తెలిపింది. ఆదివారం యూఎస్ఎస్ హ్యారీ ఎస్.ట్రూమన్ విమాన వాహక నౌక నుంచి టేకాఫ్ తీసుకున్న ఎఫ్/ఏ-18ను గైడెడ్ మిస్సైల్ డెస్ట్రాయర్ యూఎస్ఎస్ గెట్టిస్‌బర్గ్ కాసేపటికే కూల్చివేసింది. ఇదెలా జరిగిందో వెల్లడించలేదు.

నిప్పుతో ఆటలాడుతున్నారు

తైవాన్‌కు అమెరికా రక్షణ సాయంపై చైనా వార్నింగ్

బీజింగ్: తైవాన్‌కు అమెరికా రక్షణ సాయం అందించడంపై చైనా ఆగ్రహం వ్యక్తం చేసింది. అమెరికా నిప్పుతో చెలగాటమాడుతోందని హెచ్చరించింది. తైవాన్‌కు ఆయుధాలు ఇవ్వడం ఆపాలని అమెరికాకు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ సూచించింది. తైవాన్‌కు రక్షణసాయంగా 57.1 కోట్ల డాలర్ల సహాయం అందించేందుకు అమెరికా అధ్యక్షుడు బైడెన్ శనివారం ఆమోదం తెలిపిన నేపథ్యంలో చైనా ఘాటుగా స్పందించింది. 26.5 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాల విక్రయానికి అమెరికా విదేశాంగ శాఖ అంగీకరించింది. తైవాన్‌కు ఆయుధాలివ్వడం, తైవాన్ జలసంధిలో శాంతి, సుస్థిరతలకు విఘాతం కలిగించే ప్రమాదకర చర్యలను ఆపాలని చైనా ఒక ప్రకటనలో అమెరికాకు సూచించింది.

అంతర్జాతీయ డ్రగ్ రాకెట్ గుట్టురట్టు

రెండు కిలోల నిషేధిత కెటమైన్ పట్టివేత, నలుగురు అరెస్ట్

అహ్మదాబాద్: నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) అధికారులు గుజరాత్‌లో అంతర్జాతీయ డ్రగ్ రాకెట్ గుట్టురట్టు చేశారు. ముగ్గురు నైజీరియన్లు సహా నలుగురిని అరెస్టు చేసి, రెండు కిలోల కెటమైన్ అనే ఖరీదైన మాదక ద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 'డేట్ రేప్'డ్రగ్ అని కూడా పిలిచే కెటమైన్‌ను అమెరికా నిషేధించారు. వివిధ రకాల బ్రాండ్లతో సుగంధ ద్రవ్యాల పేరుతో తయారు చేసిన ప్యాకెట్లలో ఈ కేటమైన్‌ను కొరియర్ సర్వీసుల ద్వారా అమెరికాకు పంపిస్తున్నట్లుగా ఈ నెల 3న అహ్మదాబాద్‌లోని ఎన్‌సీబీ అధికారులకు అప్పందింది. అద్నాన్ ఫర్నిచర్‌వాలా అనే వ్యక్తికి ఢిల్లీలో ఉన్న నైజీరియా నేరగాళ్లు కొరియర్ ద్వారా కెటమైన్‌ను సరఫరా చేసినట్లు తేలింది. ఈ నెల 8న అద్నాన్‌ను, 18న నైజీరియా ముఠాను పట్టుకున్నారు. పుణేకు అద్నాన్‌ను డ్రగ్ స్మగ్లింగ్ నేరాలపై అక్కడి అధికారులు బహిష్కరించారు. భారత్‌లో ఉంటూనే డ్రగ్స్ రవాణాకు పాల్పడుతుండటంతో గతేడాది ఎన్‌సీబీ అధికారులు అతనిపై కేసు పెట్టారు.

వైన్‌తో గుండె పదిలం

పరిమితంగా సేవిస్తే మేలే • స్పెయిన్ పరిశోధనలో వెల్లడి

వైన్ చరిత్ర ఇప్పటిది కాదు. ప్రాచీన కాలంలోనే పులిసిన ద్రాక్ష రసాన్ని సేవించే వారని చెప్పడానికి ఆధారాలున్నాయి. వైన్ మంచిదా, కాదా అనే దానిపై భిన్నాభిప్రాయాలున్నాయి. దీనిపై రకరకాల అధ్యయనాలు, పరిశోధనలు జరిగాయి. జరుగుతూనే ఉన్నాయి. వైన్ ఆరోగ్యానికి మంచిదని కొన్ని , నష్టమేనని మరికొన్ని చెబుతుంటాయి. అయితే మితంగా సేవిస్తే గుండె భద్రంగా ఉంటుందని స్పెయిన్‌లో జరిగిన తాజా పరిశోధన వెల్లడించింది. రోజూ చిన్న గ్లాస్ పరిమాణంలో వైన్ తీసుకుంటే హృదయం పదిలమని సైంటిస్టులు గుర్తించారు. అంతేకాదు, వైన్ సేవించాక మాంసాహారం కాకుండా శాకాహారం తీసుకుంటే మరింత చక్కటి ఫలితాలుంటాయని వారు పేర్కొనడం విశేషం! 60 ఏళ్లు దాటాక గుండె జబ్బుల ముప్పు అధికంగా ఉంటుంది. ఇలాంటి వారిపైనే పరిశోధన చేశారు. 1,232 మందిని అధ్యయనం కోసం ఎంచుకున్నారు. వీరంతా టైప్ 2 డయాబెటీస్ లేదా అధిక కొలెస్ట్రాల్, రక్తపోటు, అధిక బరువు, స్థూలకాయం వంటి సమస్యలతో బాధపడుతున్నవారే. గుండె జబ్బుల బాధితుల కుటుంబాల నుంచి వచ్చినవారు కూడా ఉన్నారు. వారికి నిత్యం సగం, లేదా గ్లాసు వైన్ ఇచ్చారు. వైన్ సేవించని వారితో పోలిస్తే వీరిలో హార్ట్ అటాక్, హార్ట్ స్ట్రోక్ ముప్పు 50 శాతం తగ్గినట్లు తేల్చారు. యూరోపియన్ హార్ట్ జర్నల్‌లో ఈ వివరాలు ప్రచురితమయ్యాయి.

- పరిమితంగా వైన్ తీసుకుంటే ఆరోగ్యానికి మేలు జరుగుతుందనడంలో సందేహం లేదు. కానీ రోజుకు గ్లాసు కంటే అధికంగా సేవిస్తే కొత్త రోగాలు కొని తెచ్చుకున్నట్లేనని అధ్యయన సారథి, యూనివర్సిటీ ఆఫ్ బార్సిలోనాకు చెందిన డాక్టర్ రమోన్ ఈస్ట్రచ్ చెప్పారు.
- చక్కటి ఆహారానికి తోడు ఒక గ్లాసు వైన్‌తో మంచి ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చని సూచించారు.
- ఈ పరిశోధన ఫలితాలపై నిపుణులు అభ్యంతరం వెలిబుచ్చుతున్నారు. గుండెకు సంబంధించే పరిశోధన సాగింది తప్ప అల్కహాల్‌తో తలెత్తే ఇతర అనారోగ్యాలను పరిగణనలోకి తీసుకోలేదంటున్నారు.
- వైన్ కూడా మద్యమే. తక్కువ మోతాదులో సేవించే వైన్‌తో కార్డియోవాస్క్యులర్ డిసీజ్ (సీవీడీ) రిస్క్ తగ్గుతుందని స్పెయిన్ పరిశోధన తేల్చింది. కానీ ఇతర అవయవాల సంగతి ఏమిటన్నది గుర్తించలేదని బ్రిటిష్ హార్ట్ ఫౌండేషన్‌కు చెందిన సీనియర్ డైటీషియన్ ట్రాసీ పార్కర్ చెప్పారు. ''వైన్‌తో సహా ఏ రకమైన మద్యమైనా ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తుంది. గుండెతో పాటు లివర్ దెబ్బతింటుంది. అధిక రక్తపోటు, కొన్ని రకాల క్యాన్సర్ల బారిన కూడా పడతారు'' అన్నారు.
- గుండె ఆరోగ్యానికి వైన్ మంచిదన్నది చాలామందిలో ఉన్న అభిప్రాయమేనని యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్‌కు చెందిన ప్రొఫెసర్ పాల్ లీసన్ అన్నారు. ''ఇతర అవయవాల పరిస్థితినీ దృష్టిలో పెట్టుకోవాలి. మోతాదు మించితే గుండెతోపాటు కీలకావయవాలు దెబ్బతింటాయి'' అని చెప్పుకొచ్చారు.




- వైన్‌తో గుండె భద్రంగా ఉంటుంది కదా అని అదే ఏకైక మార్గం అనుకోవద్దని నిపుణులు చెబుతున్నారు. ''గుండెను కాపాడుకోవాలంటే మరెన్నో ఆరోగ్యకరమైన మార్గాలున్నాయి. సమతుల ఆహారం, క్రమంతప్పకుండా వ్యాయామం. బరువు పెరగకుండా జాగ్రత్తపడడం, పొగ మానేయడం వంటివి గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి'' అని సూచిస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

డల్లేవాల్ పరిస్థితి విషమం

27వ రోజుకు చేరిన రైతు నేత దీక్ష



చండీగఢ్: 27 రోజులుగా ఆమరణ దీక్ష సాగిస్తున్న పంజాబ్ రైతు నేత జగ్జీత్ సింగ్ డల్లేవాల్ (70) ఆరోగ్యం విషమంగా ఉందని వైద్యులు ఆదివారం తెలిపారు. పంజాబ్-హరియాణా సరిహద్దుల్లోని ఖనౌరీ వద్ద ఉన్న దీక్షా శిబిరంలో డల్లేవాల్‌కు వైద్యులు పరీక్షలు జరిపారు. గుండెపోటు, అవయవాల వైఫల్యం ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రోగ నిరోధక శక్తి బాగా క్షీణించిందని, ఇన్ఫెక్షన్‌కు గురయ్యే ప్రమాదం పెరిగిందని వివరించారు. కాళ్లు, చేతులు చల్లబడిపోయాయని, రక్తపోటు తరచూ మారుతోందని చెప్పారు. పంటల కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)కు చట్టబద్ధత వంటి పలు డిమాండ్లతో నవంబర్ 26 నుంచి ఆయన దీక్ష సాగిస్తున్నారు. వైద్యుల సూచన మేరకు ఆదివారం డల్లేవాల్ నిరసన వేదికపైకి రాలేదని రైతు సంఘాలు తెలిపాయి.

సాక్షి హైదరాబాద్

సోమవారం ॥ 23 ॥ డిసెంబర్ ॥ 2024



ఉల్లాసంగా.. ఉత్సాహంగా..
'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్పెల్ బీ' సెమీ ఫైనల్స్‌కు విశేష స్పందన లభించింది. ఆదివారం నాలుగు కేటగిరీల్లో ఈ పోటీలు నిర్వహించారు. .-8లో



ఆర్ట్ ఫుల్.. ఫెస్టివల్..
క్రిస్మస్ అంటే దయా, కరుణల జన్మదినం. ఇచ్చిపుచ్చుకోవడంలోని ఆనందం. అంతేనా.. క్రిస్మస్ అంటే కళాత్మకత కూడా అని నిరూపిస్తున్నారు సిటిజనులు. - సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం 30.0/20.0

వాతావరణం
నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు అలుముకుంటుంది. గరిష్ఠంగా 30, కనిష్ఠంగా 20 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

పసికందు విక్రయానికి తల్లిదండ్రుల యత్నం

కొనేందుకు ప్రయత్నించిన భార్యాభర్తల అరెస్టు

రాంగోపాల్‌పేట్: ఉత్తరప్రదేశ్‌కు చెందిన భార్యాభర్తలు తమ 15 రోజుల కుమారుడిని అమ్మేందుకు హైదరాబాద్‌కు రాగా వారితో పాటు బాబును కొనేందుకు బేరం కుదుర్చుకున్న భార్యాభర్తలను గోపాలపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రజిని (30), చోటాకాన్ (31)లు భార్యాభర్తలు కార్మికులుగా పని చేస్తున్నారు. వీరికి గతంలో ముగ్గురు కుమారులు ఉండగా 15 రోజుల క్రితం మరో బాబు జన్మించాడు. నగరంలోని నల్లకుంటకు చెందిన కృష్ణవేణి (26), మెడికల్ రిప్రెజెంటేటివ్‌గా పని చేసే రవికుమార్‌లు భార్యభర్తలు. కృష్ణవేణి దంపతులకు పిల్లలు పుట్టరని వైద్యులు చెప్పడంతో బాబును పెంచుకోవాలని ఆలోచించారు. ఫేస్‌బుక్ ద్వారా రజిని పరిచయం కావడంతో తమకు బాబును ఇస్తే రూ.4 లక్షలు ఇస్తామని చెప్పారు. దీంతో ఈ నెల 21న లక్నో నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చారు. అక్కడ వేచి ఉన్నారు. అదే సమయంలో పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులకు అనుమానం వచ్చి వారిని ప్రశ్నించగా అసలు విషయం చెప్పారు. దీంతో ఈ దంపతులతో పాటు బాబును కొనుగోలు చేసేందుకు సిద్ధమైన దంపతులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చిన్నారిని అమీర్‌పేట్‌లోని శిశు విహార్‌కు తరలించారు.

మెడకు చున్నీ బిగుసుకుని బాలుడి మృత్యువాత



సాత్విక్ (ఫైల్)

గచ్చిబౌలి: విల్లా టెర్రస్‌పై దుస్తులు ఆరవేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మెడకు చున్నీ బిగుసుకోవడంతో ఊపిరాడక ఓ బాలుడు మృత్యువాత పడిన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మోతె మండలం వైబలాపురంనకు చెందిన జిల్లా రమేష్, లక్ష్మి దంపతులు బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చారు. కొండాపూర్‌లోని శ్రీరాంనగర్ కాలనీ సీ బ్లాక్‌లోని పామ్ రిడ్జ్ విల్లాస్‌లో లక్ష్మి పని చేస్తోంది. అక్కడే సర్వెంట్ రూమ్‌లో కుమారుడు సాత్విక్ (12)తో కలిసి నివాసం ఉంటోంది. మసీద్‌బండలోని ప్రభుత్వ పాఠశాలలో సాత్విక్ 5వ తరగతి చదువుతున్నాడు. భర్త రమేష్ అప్పుడప్పుడూ వీరి వద్దకు వచ్చి వెళుతుంటాడు. ఆదివారం మధ్యాహ్నం ఉతికిన దుస్తులను ఆరవేసేందుకు బకెట్‌లో వేసుకొని సాత్విక్ విల్లా టెర్రస్‌పైకి వెళ్లాడు. చాలాసేపటి వరకు కుమారుడు రాకపోవడంతో తల్లి లక్ష్మి టెర్రస్‌పైకి వెళ్లి చూడగా సాత్విక్ మెడకు చున్నీ బిగుసుకుని కింద పడి ఉన్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న బాలుడిని కొండాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఇనుప దండెంపై చున్నీ ఆరవేసే క్రమంలో ఆడుకునే ప్రయత్నం చేయగా.. మెడకు చున్నీ బిగుసుకుని ఊపిరాడకపోవడంతోనే మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పోస్ట్‌మార్టం నివేదికలో వివరాలు తెలిసే అవకాశం ఉందని వారు తెలిపారు. బాలుడి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడటంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

కేబీఆర్ పార్కు ప్రవేశ రుసుము పెంపు



బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని ప్రతిష్ఠాత్మక కాసు బ్రహ్మానందరెడ్డి జాతీయ వనం (కేబీఆర్) వాకర్లు, సందర్శకులకు అటవీ శాఖ అధికారులకు న్యూ ఇయర్‌గా గిఫ్ట్‌గా ఎంట్రీ ఫీజును పెంచారు. ప్రతియేటా ప్రవేశ రుసుము పెరుగుతుండగా ఆ మేరకు పార్కు లోపల సౌకర్యాలు పెంచడంలో మాత్రం అధికారులు విఫమవుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇవేమీ పట్టని అధికారులు పార్కు ప్రవేశ రుసుమును ఇష్టానుసారంగా పెంచేస్తూ నిర్ణయాలు తీసుకుంటున్నారని పలువురు పేర్కొంటున్నారు. 2025 జనవరి 1వ తేదీ నుంచి కేబీఆర్ పార్కుకు వెళ్లాలంటే పెద్దలకు రూ.50 (ప్రస్తుతం రూ.45 ఉంది), పిల్లలకు రూ.30 (ప్రస్తుతం రూ.25 ఉంది)కి పెంచారు. అలాగే నెలవారీ పాస్ ప్రస్తుతం రూ.850 ఉండగా, వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి రూ.1000కి పెంచారు. జనవరి 1వ తేదీ నుంచి ప్రవేశ రుసుము పెంచుతున్నట్లుగా ప్రధాన గేటు వద్ద నోటీసులు అతికించారు.



పుస్తక ప్రదర్శనలో సందర్శకుల కిటకిట



స్టాల్‌లో పుస్తకాలు పరిశీలిస్తూ..



పుస్తకం పిలిచింది!

- బుక్‌ఫెయిర్‌కు సందర్శకుల తాకిడి
- సెలవు రోజు పెరిగిన రద్దీ
- విద్యార్థులు, యువత రాకతో కిటకిట



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో కొలువుదీరిన హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన ఆదివారం సందర్శకులతో పోటెత్తింది. సెలవురోజు కావడంతో పుస్తక ప్రియులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. యువత, విద్యార్థులు, పిల్లలతో స్టాళ్లు కిటకిటలాడాయి. ముఖ్యంగా చిన్నారులు తమకిష్టమైన ఆంగ్ల కథలు, క్లాసిక్స్ పుస్తకాలను విరివిగా కొనుగోలు చేశారు. ఒకవైపు పుస్తక ఆవిష్కరణలు, మరోవైపు సాంస్కృతిక కార్యక్రమాలు, పుస్తక సమీక్షలు, అమ్మకాలతో సందడి నెలకొంది. పుస్తక ప్రదర్శన కేవలం పుస్తకాల అమ్మకాలకు మాత్రమే పరిమితం కాకుండా రచయితలను, పాఠకులను ఒకచోట చేర్చే వేదికగా మారింది. ప్రదర్శన ప్రారంభమై నాలుగు రోజులైంది. రెండు రోజులుగా పుస్తక ప్రియుల నుంచి అనూహ్య స్పందన కనిపిస్తోందని నిర్వాహకులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'కొత్త సంవత్సరం పుస్తక పఠనంతో ప్రారంభం కావాలనే ఆకాంక్షతో ఎక్కువ మంది తమకు నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. సాధారణంగా వయోధికులే ఎక్కువగా పుస్తకాల పట్ల ఆసక్తి, అభిరుచి కలిగి ఉంటారనే అభిప్రాయాన్ని పటాపంచలు చేస్తూ యువత పెద్ద సంఖ్యలో కనిపించడం విశేషం.

రాజ్యాంగం 5 రకాలుగా..

భూమిపుత్ర, బహుజన పుస్తక ప్రచురణ సంస్థలకు చెందిన స్టాల్ నంబర్లు 203, 204లలో భారత రాజ్యాంగం గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి. బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పిల్లలు, పెద్దలు నచ్చేలా 5 రకాలుగా ముద్రించి ప్రదర్శనలో ఉంచారు.

నేడు పుస్తక నడక..

పుస్తక పఠనంపై ప్రజల్లో ఆసక్తిని, అభిరుచిని, అవగాహనను పెంపొందించే లక్ష్యంతో సోమవారం పుస్తక నడక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని హైదరాబాద్ బుక్ ఫెయిర్ కమిటీ నిర్వాహకులు తెలిపారు. లోయర్ ట్యాంక్‌బండ్ నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు జరగనున్న ప్రదర్శనలో పాఠకులు, రచయితలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొననున్నారు.



తీవ్ర నేరాలు తగ్గాయ్!

కేసులు మాత్రం పెరిగాయ్

నగరంలో ఈ ఏడాది 35,944 కేసులు నమోదు

- హత్యలు, హత్యాయత్నాలు వంటివి తగ్గుదల
- సాధారణ చోరీలు, ప్రమాదాల్లో పెరుగుదల
- 2025 కోసం కొత్తగా అనేక లక్ష్యాలు నిర్దేశం
- నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడి

కీలక గణాంకాలు ఇవి:

	2023	2024
మొత్తం కేసులు	25,488	35,944
బాడీలీ క్రైమ్	5,098	8,447
తీవ్రమైన బాడీలీ క్రైమ్	563	700
సాధారణ బాడీలీ క్రైమ్	4,535	7,747
సొత్తు సంబంధిత నేరాలు	3,551	5,328
వీటిలో తీవ్రమైనవి	213	315
సాధారణమైనవి	3,338	5,013
మహిళలపై నేరాలు	2,424	2,482
పోక్సో కేసులు	371	449

రోడ్డు ప్రమాదాలు...

	2023	2024
రోడ్డు ప్రమాదాలు	2,548	2,745
మరణాలు	335	227
క్షతగాత్రులు	2,596	3,065
పాదచారుల మరణాలు	137	89

చోరీలు.. రికవరీలు... కోట్లలో..

	2023	2024
ప్రజలు కోల్పోయిన సొత్తు విలువ	రూ.38.38	రూ.38.85
రికవరీ	రూ.21.05	రూ.9.65
శాతం	71	54



నేర గణాంకాల విడుదల

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో గత ఏడాది కంటే ఈ ఏడాది కేసుల సంఖ్య పెరిగినా.. హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన నేరాలు తగ్గాయని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. 2025లో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించి ప్రత్యేక వ్యూహాలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2024కు సంబంధించిన వార్షిక విలేకరుల సమావేశాన్ని ఆయన ఆదివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (టీజీ సీసీసీ) నిర్వహించి ఈ ఏడాది నవంబర్ వరకు నేర గణాంకాలను విడుదల చేశారు. ఆనంద్ వెల్లడించిన అంశాలివీ..

ఈ కారణాల వల్లే పెరుగుదల...

ఈ ఏడాది ఇప్పటి వరకు 35,944 కేసులు నమోదయ్యాయి. గత ఏడాది కంటే 40 శాతం పెరుగుదల నమోదైంది. తీవ్రమైన నేరాలుగా పరిగణించే హత్య, హత్యాయత్నం, తీవ్రమైన దాడి వంటి కేసులు తగ్గాయి. అయితే సాంకేతిక కారణాల వల్లే కేసుల సంఖ్య పెరిగింది. సెల్‌ఫోన్ దొంగనాలను దోపిడీలుగా, మైనర్ల మిస్సింగ్ కేసులను కిడ్నాపులుగా నమోదు చేస్తుడటంతో ఆ కేసుల్లో పెరుగుదల నమోదైంది. చిన్న చిన్న నేరాలైన సింపుల్ థెఫ్ట్, వాహన చోరీలు, సాధారణ దాడులు సంఖ్య కూడా పెరిగింది. అటెన్షన్ డైవర్షన్లు, సర్వెంట్ థెఫ్ట్ తదితర కేసుల సంఖ్యలోనూ స్వల్ప పెరుగుదల నమోదైంది. ఈ ఏడాది నిందితులను దోషులుగా నిరూపించే కన్విక్షన్ రేటు 68 శాతానికి పెరిగింది.

రూ.1332 కోట్లు కొట్టేసిన 'తెల్లదొరలు'..

వైట్ కాలర్ అఫెన్సులుగా పిలిచే నమ్మక ద్రోహం, మోసాలు వంటి ఆర్థిక నేరాలతో పాటు సైబర్ నేరగాళ్లు కొట్టేసిన మొత్తం రూ.1332 కోట్లుగా ఉంది. ఈ ఏడాది సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో నమోదైన 4042 కేసుల్లో నగర వాసులు కోల్పోయిన మొత్తం రూ.296.32 కోట్లుగా ఉంది. అత్యధికంగా ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్స్ కేసులు ఉన్నాయి. సైబర్ నేరాల్లో బ్యాంకు ఖాతాల ఫ్రీజింగ్ 102 శాతం, రిఫండ్ 100 శాతం, అరెస్టులు 16 శాతం, నేరాల ఛేదన 30 శాతం పెరిగింది. సీసీఎస్‌లో నమోదైన 248 కేసుల్లో బాధితులు నష్టపోయింది రూ.1036 కోట్లుగా ఉంది. ఆయా సెక్షన్ల కింద నమోదైన కేసుల్లో సీసీఎస్ పోలీసులు 324.24 కోట్ల విలువైన 117 ఆస్తులను ఎటాచ్ చేశారు. అలాగే సీసీఎస్ అధీనంలోని డ్రగ్ డిస్పోజల్ కమిటీ (డీడీసీ) ఈ ఏడాది రూ.10.56 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలను ధ్వంసం చేసింది.

మృతులతో కూడిన ప్రమాదాల తగ్గుదల..

నగర ట్రాఫిక్ విభాగం అధికారులు ఈ ఏడాది వివిధ ఉల్లంఘనలకు సంబంధించి వీటిలో 48,81,352 కేసులు నమోదు చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ 46,468 మంది చిక్కారు. వీరిలో 2153 మందికి న్యాయస్థానాలు జైలు శిక్ష విధించాయి. రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగినా... మృతులతో కూడిన ప్రమాదాలు ఈ ఏడాది 33 శాతం తగ్గాయి. గత ఏడాది రోడ్డు ప్రమాదాల్లో 335 మంది చనిపోగా.. ఈ ఏడాది ఆ సంఖ్య 227గా ఉంది. మద్యం తాగి వాహనాలు నడుపుతూ చిక్కుతున్న వారిలో 85 శాతం ద్విచక్ర వాహన చోదకులే. పాదచారులకు సంబంధించిన రోడ్డు ప్రమాదాలు సైతం గత ఏడాది 906 జరగ్గా ఈ ఏడాది 819కి తగ్గాయి. ట్రాఫిక్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఈ ఏడాది 33766 మంది విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సిటీ పోలీసు 'విజన్–2025' ఇదే..

- సైబర్ నేరాల పెరుగుదలకు బ్యాంకింగ్ వ్యవస్థలో ఉన్న లోపాలు సహకరిస్తున్న బ్యాంకు అధికారులే కారణమని పోలీసులు గుర్తించారు. సరైన ఫీల్డ్ వెరిఫికేషన్ లేకుండా కరెంట్ ఖాతాలు తెరిచేస్తున్నారు. వచ్చే ఏడాది దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి బాధ్యుల్ని అరెస్టు చేయనున్నారు. కరెంట్ ఖాతాలు తీసుకునే సంస్థలకు ఎడాపెడా లైసెన్సులు ఇచ్చే విధానాన్నీ సమీక్షించనున్నారు.
- ట్రాఫిక్ ఇక్కట్లు తీర్చడానికి నగరంలో ప్రారంభించిన ఆపరేషన్ రోప్‌ను మరింత పక్కాగా చేయనున్నారు. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ అవసరాల కోసం డ్రోన్లు ఖరీదు చేయడంతో పాటు డ్రోన్ మెయింటినెన్స్ వింగ్ ఏర్పాటు చేస్తారు.

బౌన్సర్లు ఓవర్ చేస్తే 'ప్రముఖుల'పైనా చర్యలు



ఇటీవల కాలంలో నగరంలో బౌన్సర్ల సంస్కృతి పెరిగిపోయింది. వీఐపీలు, వీవీఐపీలు అయిన ప్రముఖుల వెంట వస్తున్న వీళ్లు ఓవర్ చేస్తున్నారు. ఇకపై ఇలా ప్రజలకు ఇబ్బందికరంగా ప్రవర్తిస్తే ఉపేక్షించం. యూనిఫాంలో ఉన్న అధికారి, సిబ్బందిని టచ్ చేస్తే తీవ్రమైన చర్యలు ఉంటాయి. వారికి సరఫరా చేస్తున్న ఏజెన్సీలతో పాటు నియమించుకున్న ప్రముఖుల పైనా చర్యలు తీసుకుంటాం.
– సీవీ ఆనంద్, నగర పోలీసు కమిషనర్

రూ.5 వేల కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు

– మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: గత టీఆర్ఎస్ హయాంలో విద్యా వ్యవస్థను గాలికి వదిలేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో రూ.5 వేల కోట్లతో అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం, కేంద్ర మాజీ మంత్రి జి. వెంకటస్వామి 10వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు వెంకటస్వామి విగ్రహానికి స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఆయన నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో సమానంగా 12వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం విద్య అందించాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటివ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రారంభిస్తామన్నారు. జాతీయ రాజకీయాల్లో 'కాకా' కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తన చివరి శ్వాస వరకు పేద ప్రజల కోసమే 'కాకా' పని చేశారని కొనియాడారు. 80 వేల మంది పేదలకు నీడ కల్పించిన మహోన్నత వ్యక్తి అన్నారు. త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సును తమ కళాశాలలో ప్రవేశపెడుతున్నట్లు అంబేడ్కర్ విద్యా సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వినోద్ కుమార్, ఎంపీ వంశీకృష్ణ, కరస్పాండెంట్ సరోజా వివేక్, వెంకటస్వామి కుమార్తెలు వీణ, విజ్జీ, మాజీ మంత్రి డాక్టర్ శంకర్‌రావు, డైరెక్టర్లు డాక్టర్ విష్ణుప్రియ, ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

సొంత తమ్ముడే సూత్రధారి!

- అన్న ఎదుగుదలను ఓర్వలేకనే దోపిడీకి ప్లాన్
- గుట్టు వీడిన దోమలగూడ బందిపోటు దొంగతనం
- రౌడీషీటర్లు పాత్రధారులు.. పథకం ఓ న్యాయవాదిది
- 12 మందిని అరెస్టు చేసిన మధ్యమండల టాస్క్‌ఫోర్స్
- రూ.1.2 కోట్ల సొత్తు, వాహనం, ఆయుధాలు స్వాధీనం
- పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలింపు ముమ్మరం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని దోమలగూడ ఠాణా పరిధిలో ఈ నెల 12న తెల్లవారుజామున చోటు చేసుకున్న బందిపోటు దొంగతనం కేసును మధ్య మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఛేదించారు. బాధితుడి తమ్ముడే దీనికి సూత్రధారిగా తేల్చారు. దొంగతనానికి పథకం ఓ న్యాయవాది వేయగా... ఇద్దరు రౌడీషీటర్లు తమ అనుచరులతో కలిసి అమలు చేసినట్లు గుర్తించారు. మొత్తం 15 మంది నిందితుల్లో 12 మందిని అరెస్టు చేశామని, వీరి నుంచి రూ.1.2 కోట్ల విలువైన సొత్తు, వాహనం, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. డీసీపీలు అక్షాంశ్ యాదవ్, వైవీఎస్ సుధీంద్రలతో కలిసి బంజారాహిల్స్‌లోని టీజీ సీసీసీలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ వెల్లడించిన వివరాల ప్రకారం..

తన వ్యసనాలకు అన్నను బాధ్యుణ్ని చేస్తూ..

పశ్చిమ బెంగాల్‌కు చెందిన అన్నదమ్ములు రంజిత్ ఘోరాయ్, ఇంద్రజిత్ ఘోరాయ్ కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చారు. దోమలగూడలోని అర్వింద్‌నగర్‌లో ఒకే ఇంట్లో వేర్వేరు పోర్షన్లలో నివసిస్తూ బంగారు ఆభరణాల తయారీ వ్యాపారం చేస్తున్నారు. రంజిత్ ప్రస్తుతం 50 మందికి ఉద్యోగం ఇచ్చే స్థాయికి చేరగా... ఇంద్రజిత్ తనకు ఉన్న వ్యవసాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, జల్సాలతో ఆర్థికంగా చితికిపోయాడు. ఇటీవలే రంజిత్ తన భార్య పేరుతో దోమలగూడలో రెండు ఇళ్లు ఖరీదు చేశాడు. దీంతో అన్నపై ఇంద్రజిత్ ఈర్ష్య పెంచుకున్నాడు. అన్న వద్ద ఉండే బంగారం వివరాలు గమనిస్తూ వచ్చిన ఇంద్రజిత్.. ఇటీవల ఆ వివరాలను తన వాకింగ్ మేట్స్ అల్తాఫ్ మహ్మద్ ఖాన్, సయ్యద్ ఇర్ఫాన్ అహ్మద్‌లకు చెప్పాడు. ఆ బంగారం దోచుకుని తీసుకువస్తే అందరికీ లాభమని అన్నాడు. దీనికి అంగీకరించిన అల్తాఫ్, ఇర్ఫాన్ విషయాన్ని బాలాపూర్‌కు చెందిన రౌడీషీటర్ హబీబ్ హుస్సేన్ ద్వారా షేక్ మైలార్‌దేవ్‌పల్లికి చెందిన షబ్బీర్‌కు చెప్పాడు.

గ్యాంగ్‌తో రంగంలోకి దిగిన అర్బాజ్..

ఇంద్రజిత్ ద్వారా రంగంలోకి దిగిన మైలార్‌దేవ్‌పల్లి రౌడీషీటర్ మహ్మద్ అర్బాజ్ దోపిడీ చేయడానికి అంగీకరించాడు. వీరంతా పలుమార్లు వివిధ హోటళ్లలో కూర్చుని వాటాపై బేరసారాలు చేసుకున్నారు. ఇవి కొలిక్కిరావడంతో అర్బాజ్ తన అనుచరులైన షోయబ్ ఖాన్, షేక్ ఉస్మాన్, షేక్ అల్లాఉద్దీన్, షేక్ అక్రమ్, షహబాజ్, నజీర్, జహీర్‌లతో కలిసి రంగంలోకి దిగాడు. ఇంద్రజిత్‌తో చర్చించడంతో పాటు వాహనం ఖరీదు చేసిన అర్బాజ్.. రంజిత్ ఇంటి వద్ద రెక్కీ సైతం పూర్తి చేయించాడు. ఈ నేరం ఎలా చేయాలి? పోలీసులకు చిక్కకుండా ఎలా తప్పించుకోవాలి? అనే అంశాలు చర్చించడానికి వీళ్లు బహదూర్‌పురకు చెందిన న్యాయవాది మహ్మద్ నూరుల్లా సహాయం తీసుకున్నారు. నేరం చేయడానికి పది రోజుల ముందు మైలార్‌దేవ్‌పల్లిలోని ఓ రెస్టారెంట్‌లో కీలక నిందితులతో సమావేశమైన నూరుల్లా పథకం అమలు చేయడం ఎలా? ఆధారాలు లేకుండా జాగ్రత్తపడటం ఎలా? అనే అంశాలను వారికి వివరించాడు.



నిందితులు వాడిన గొడ్డలిని పరిశీలిస్తున్న సీపీ

షబ్బీర్ ఇంటి నుంచి బయలుదేరిన ఆరుగురు...

ఈ నెల 12 రాత్రి అర్బాజ్ నేతృత్వంలో హబీబ్ హుస్సేన్, షోయబ్, సైఫ్, గులాం మగ్దూం, షేక్ అల్లావుద్దీన్.. షబ్బీర్ ఇంట్లో సమావేశమయ్యారు. అక్కడ నుంచి వాహనంలో షబ్బీర్ మినహా మిగిలిన వాళ్లు బయలుదేరి రంజిత్ ఇంటి వద్దకు వచ్చారు. తమతో పాటు ప్రత్యేకంగా తయారు చేయించిన ఓ భారీ గొడ్డలితో పాటు ఇతర గొడ్డళ్లు, కత్తులు, తుపాకీ మాదిరిగా కనిపించే లైటర్ తీసుకు వచ్చారు. ఇంద్రజిత్ సాయంతోనే ఇంట్లోకి ప్రవేశించిన వీళ్లు రంజిత్ కుటుంబాన్ని బంధించి, వారి పిల్లల మెడపై కత్తి పెట్టి, అడ్డుకునే ప్రయత్నం చేసిన రంజిత్ చేతిని గాయపరిచి తీవ్ర భయభ్రాంతులకు గురి చేశారు. ఆపై ఇంట్లో ఉన్న రెండు కేజీల బంగారం, 616 గ్రాముల వెండితో పాటు పూజ గదిలో ఉన్న రెండు కేజీల ఇత్తడి సామాను సైతం దోచుకుపోయారు. పోలీసులకు ఏమాత్రం ఆధారాలు దొరక్కుండా, సీసీ కెమెరాల్లో రికార్డు కాకుండా జాగ్రత్తపడ్డారు. ఈ కేసు ఛేదించడానికి మధ్య మండల టాస్క్‌ఫోర్స్ రంగంలోకి దిగింది.

ముమ్మర గాలింపుతో..

ఎలాంటి ఆధారాలు లేకుండా ఉన్న ఈ కేసు చిక్కుముడి విప్పడానికి ఇన్‌స్పెక్టర్ ఖలీల్ పాషా నేతృత్వంలో ఎస్సైలు నవీన్‌కుమార్, నాగేష్, శ్రీకాంత్ తమ బృందాలతో దర్యాప్తు చేసి సాంకేతిక ఆధారాలు సేకరించారు. షహబాజ్, నజీర్, జహీర్ మినహా మిగిలిన 12 మందిని ఆదివారం పట్టుకున్నారు. వీరి నుంచి రూ.2.9 లక్షల నగదు, కారు, ఆయుధాలతో పాటు 1,228 గ్రాముల బంగారం, 616 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు రెండు కేజీల ఇత్తడి వస్తువులు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1.2 కోట్లు ఉంటుందని, పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నామని కొత్వాల్ ఆనంద్ తెలిపారు. ఈ కేసు ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన అధికారులకు ప్రత్యేక రివార్డులు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.




'స్పెల్ బీ' పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు..



హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు..

ఉల్లాసంగా..ఉత్సాహంగా..

సాక్షి 'స్పెల్ బీ'కి విశేష స్పందన

- వివిధ జిల్లాల నుంచి 1200 మంది విద్యార్థులు హాజరు
- నాలుగు కేటగిరీలుగా సెమీ ఫైనల్స్ నిర్వహణ

దుండిగల్: 'సాక్షి' మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్పెల్ బీ' సెమీ ఫైనల్స్‌కు విశేష స్పందన లభించింది. మేడ్చల్ జిల్లా, దుండిగల్ మున్సిపాలిటీ, బౌరంపేటలోని శిఖర స్కూల్‌లో ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నాలుగు కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి కేటగిరీలో 1,2 తరగతులు, రెండో కేటగిరీలో 3,4, మూడో క్యాటగిరీలో 5,6,7, నాల్గో కేటగిరీలో 8,9,10 తరగతులకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని 80 పాఠశాలల నుంచి 1200 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు.

SAKSHI SPELL Bee 2024-25



రిజిస్ట్రేషన్ చేసుకుంటూ..

సుదూర ప్రాంతాల నుంచి..

డ్యూక్స్ వెఫి, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్, రాజమండ్రి సౌజన్యంతో 'సాక్షి' మీడియా గ్రూప్ నిర్వహించిన 'స్పెల్ బీ' పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రాష్ట్రంలోని సుదూర ప్రాంతాల నుంచి తల్లిదండ్రులు తమ పిల్లలను పోటీలకు తీసుకువచ్చారు. మొదటి, రెండు దఫాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు సెమీ ఫైనల్స్‌లో తమ అదృష్టాన్ని పరీక్షించేందుకు ఉత్సాహం కనబర్చారు. విద్యార్థుల్లోని నైపుణ్యాభివృద్ధి, పోటీతత్వాన్ని అలవర్చుకునేందుకు విద్యార్థుల్లో భయాన్ని తొలగించేందుకు స్పెల్ బీ పోటీలు నిర్వహించినందుకు విద్యార్థుల తల్లిదండ్రులు 'సాక్షి' యాజమాన్యాన్ని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మవిశ్వాసం పెరుగుతుంది



మా అబ్బాయి విశ్వక్‌సాయి ఆల్ఫోర్స్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. కరీంనగర్‌లో 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు పోటీల్లో ప్రతిభ కనబర్చాడు. సెమీ ఫైనల్స్ కోసం హైదరాబాద్‌కు వచ్చాం. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం. – వాసవి, పేరెంట్, కరీంనగర్

చాలా మంచి కార్యక్రమం



విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇది చాలా మంచి ప్రోగ్రాం. పిల్లల్లో ఉన్న భయాలు తొలగడంతో పాటు నూతనంగా ఎన్నో విషయాలు నేర్చుకునేందుకు ఇదో చక్కటి వేదిక.. – తేజస్విని, పేరెంట్, కరీంనగర్

నైపుణ్యం పెరుగుతుంది



ఇంగ్లీషు పదాలు, ఉచ్చరణ, నైపుణ్యత పెంచే విధంగా ఇలాంటి కార్యక్రమం చేపట్టినందుకు 'సాక్షి'కి ప్రత్యేకంగా అభినందనలు.విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు దోహదపడే 'స్పెల్ బీ' కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగిస్తున్నందుకు కృతజ్ఞతలు. – శ్రీను, పేరెంట్, ఖమ్మం

టెన్షన్‌గా ఉంది..



నేను సూర్యాపేటలోని జయ హైస్కూల్‌లో సెవెన్త్ క్లాస్ చదువుతున్నాను. ఇప్పటి వరకు రెండు పోటీల్లో విజయం సాధించారు. సెమీ ఫైనల్స్ కోసం హైదరాబాద్ వచ్చాను. చాలా ఎగ్జైట్‌మెంట్‌తో పాటు కొంచెం టెన్షన్‌గాను ఉంది. – అనన్య, విద్యార్థిని, సూర్యాపేట..

ఆనందంగా ఉంది



ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. 'సాక్షి' స్పెల్ బీ నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. గతంలో కంటే మెరుగ్గా చదువుతున్నా. మొదటి, రెండు పోటీల్లో విజయం సాధించా. ఆ నమ్మకంతోనే సెమీ ఫైనల్స్‌లో పాల్గొనేందుకు వచ్చా. చాలా హ్యాపీగా ఉంది. – కార్తికేయ ఓంకార్, విద్యార్థి, మల్కాజిగిరి

క్రియేటివ్ స్కిల్స్ పెరుగుతాయి



పిల్లల్లో క్రియేటివ్ స్కిల్స్ పెంపొందించడంతో పాటు ఇంగ్లిష్‌లో తెలియని పదాలను తెలుసుకునేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయి. 'సాక్షి' యాజమాన్యానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు. భవిష్యత్తులో మరిన్ని పోటీలు నిర్వహించాలి. – ఉదయ్‌కిరణ్, పేరెంట్, రాజేంద్రనగర్

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విజయం సాధిస్తా



జెఎస్ఎం హై స్కూల్‌లో ఏడవ తరగతి చదువుతున్నాను. ముందుగా పోటీల్లో పాల్గొనేందుకు భయపడ్డా. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మొదటి, రెండు పోటీల్లో విజయం సాధించా. చాలా యాంగ్జైటీగా ఉంది. ఇక ముందు నిర్వహించే అన్ని పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నా. – శ్రీనిధి, విద్యార్థిని, వరంగల్

మా పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు



మా శిఖర స్కూల్‌లో రెండో సంవత్సరం 'సాక్షి' ఆధ్వర్యంలో 'స్పెల్ బీ' కార్యక్రమం నిర్వహించడం గర్వంగా ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుండి వెయ్యి మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు, ఇలాంటి పోటీల ద్వారా విద్యార్థుల్లో ఆంగ్ల భాషాభివృద్ధి, ధారణ సామర్థ్యం, ఆరోగ్యకరమైన పోటీ తత్వం పెరుగుతుంది. అందరూ ఫైనల్ 'స్పెల్ బీ ' పరీక్షకు అర్హత సాధించాలని కోరుకుంటున్నా. – ఎం.హేమలత, డైరెక్టర్, శిఖర స్కూల్

ముగిసిన 'బ్రిగ్‌కాన్-2024' సదస్సు



కార్యక్రమంలో పాల్గొన్న ఏపీటీఐ ప్రతినిధులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బ్రిలియంట్ గ్రామర్ స్కూల్ ఎడ్యుకేషనల్ సొసైటీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లో అసోసియేషన్ ఆఫ్ ఫార్మాసుటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియన్(ఏపీటీఐ) ఆధ్వర్యంలో బ్రిగ్‌కాన్-2024 పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి అవగాహన సదస్సు ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీటీఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ వీరారెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఫార్మారంగంలోని పరిశోధనలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని అకాడమిక్ డైరెక్టర్ రఘోత్తం రెడ్డి సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఫార్మాసూటికల్ టీచర్స్ ఆఫ్ ఇండియా సౌత్ రీజియన్ ప్రెసిడెంట్ డాక్టర్ కృష్ణమోహన్ చిన్నాల, రఘునందన్, రమేష్, కళాశాల డైరెక్టర్స్ నరేంద్రకుమార్, పెన్లన్‌పాల్దాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ కంట్లమ్, ఏఓ రవీందర్‌రెడ్డిలతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దర్గాను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే 'పట్నం'

షాబాద్: మండల కేంద్రంలోని పహిల్వాన్‌షావలి దర్గాను ఆదివారం కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధికి ఎంతో కృషి చేసిందని గుర్తు చేశారు. దర్గా అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. ఆయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జడల రాజేందర్‌గౌడ్, మతీన్, ఆయూబ్‌ఖాన్, ఆరీఫ్, మజీద్, ఇమ్రాన్, మునీర్, బాబషీర్, తౌసిప్ తదితరులు ఉన్నారు.



సాధనతో ఏదైనా సాధ్యమే

- ధ్యాన గురువు పరిణీత పత్రి
- రెండో రోజుకు చేరిన ధ్యాన మహాయాగం
- హాజరైన సినీ స్టంట్ మాస్టర్స్ రామ్‌లక్ష్మణ్
- వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ధ్యానులు



మాట్లాడుతున్న స్టంట్ మాస్టర్స్ రామ్‌లక్ష్మణ్

కడ్తాల్: సాధనతో సాధించలేనిదంటూ ఏదీ లేదని ధ్యానగురువు పరిణిత పత్రి అన్నారు. మహేశ్వర మహాపిరమిడ్ ధ్యాన కేంద్రంలో కొనసాగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగం ఆదివారానికి రెండో రోజుకు చేరుకుంది. ఉదయం 5 నుంచి 8 గంటల వరకు సంజయ్ కింగి ఆధ్వర్యంలో ప్రాతఃకాల సంగీత ధ్యానం నిర్వహించారు. అనంతరం ధ్యానులను ఉద్దేశించి పరిణిత పత్రి మాట్లాడుతూ నిరంతరం నేర్చుకోవాలనే తపన ఉండాలని, దానికి సాధనే మార్గమన్నారు. ధ్యాన యజ్ఞం నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. ధ్యానాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రతి ఒక్కరికీ ధ్యానం నేర్పుతూ పత్రీజీ సంకల్పాన్ని నెరవేర్చాలని కోరారు. ప్రపంచాన్ని ధ్యానమయం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సినీ స్టంట్ మాస్టర్స్ రామ్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా దానిలోని సూక్ష్మాన్ని గ్రహించి సత్యం తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆత్మజ్ఞానాన్ని తెలుసుకోవాలని, ఆత్మజ్ఞానం తెలుసుకున్న వారే ధ్యానులన్నారు. అనంతరం సుభాష్‌పత్రీజీ, స్వర్ణమాల పత్రిజీల వీడియో సందేశం అందించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు గురువులు ఆధ్యాత్మిక, ధ్యాన సందేశం వినిపించారు. పిరమిడ్ మాస్టర్‌లు తమ ధ్యాన అనుభవాలను వివరించారు. ఆదివారం కావడంతో వేడుకలకు తెలుగు రాష్ట్రాలతో పాటు, దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన ధ్యానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



అలరించిన సంజయ్ కింగి సంగీత ధ్యానం



వేడుకలకు హాజరైన ధ్యానులు



కళాకారిణుల కూచిపూడి నృత్య ప్రదర్శన

పత్రీజీ మార్గంలో నడవాలి

ఏ జీవినీ చంపి తినే హక్కు ఎవరికీ లేదని బీఏపీఎస్ స్వామి నారాయణ్ అక్షర్‌ధామ్ మందిర్ పూజ్య జ్ఞాన వత్సల్ స్వామీజీ అన్నారు. ఆదివారం రాత్రి మహేశ్వర మహాపిరమిడ్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ధ్యానులను ఉద్దేశించి మాట్లాడారు. ధ్యాన గురువు పత్రీజీ చూపిన ధ్యాన మార్గంలో నడవాలని సూచించారు. పిరమిడ్ మాస్టర్లను కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తున్న పిరమిడ్ నిర్వాహకులను అభినందించారు.

యువకుడి దారుణ హత్య

- కత్తులతో పొడిచి చంపిన ఆగంతకులు
- ప్రేమ వివాహమే కారణమై ఉండవచ్చని అనుమానం



సమీర్ మృతదేహం

కంటోన్మెంట్: ఓ యువకుడిని గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేసిన సంఘటన శనివారం రాత్రి బోయిన్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక హర్షవర్ధన్ కాలనీలో సమీర్ (20) అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి 11.00 గంటల సమయంలో హోండా యాక్టివాపై వచ్చిన ముగ్గురు యువకులు కత్తులు, సర్జికల్ బ్లేడ్‌లతో అతడిపై దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సమీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. నార్త్‌జోన్ డీసీపీ సాధన పెరుమాల్, బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణ బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి, ఎస్ఐ నాగేంద్ర బాబు తదితరులు ఘటనాస్థలిని పరిశీలించి స్థానికులు, ప్రత్యక్ష సాక్షులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కాగా మృతుడు సమీర్ ఏడాది క్రితం నాచారం ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నట్లు తెలిసింది. భార్యా, భర్తల మధ్య గొడవల కారణంగా ఆమె మూడు నెలల క్రితం నాచారంలోని పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో అతడి భార్య కుటుంబ సభ్యులే ఈ ఘాతుకానికి పాల్పడి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు సీసీ టీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

అన్న చేతిలో తమ్ముడు హతం

ఆస్తి వివాదాలే కారణం



సందీప్ (ఫైల్)

దుండిగల్: ఆస్తి వివాదాల నేపథ్యంలో ఓ వ్యక్తి సొంత తమ్ముడినే హత్య చేసిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మెదక్ జిల్లా, రాయిలాపూర్ గ్రామానికి చెందిన సందీప్(30), చింతల్‌లో ఉంటున్న సంతోష్(33) అన్నదమ్ములు. కాగా సందీప్ తన వాటాగా వచ్చిన ఆస్తిని అమ్ముకున్నాడు. ఈ విషయమై అన్నదమ్ముల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సంతోష్ తన బంధువు మన్నె శేఖర్‌కు ఫోన్ చేసి తన సోదరుడు సందీప్‌ను హైదరాబాద్‌కు తీసుకురావాలని చెప్పాడు. అతని సూచన మేరకు శేఖర్ ఈ నెల 21న సందీప్‌ను తీసుకుని బహదూర్‌పల్లిలోని సాయినాథ్ సొసైటీ వచ్చాడు. ఈ సందర్భంగా అన్నదమ్ముల మధ్య మాటామాట పెరగడంతో ఆగ్రహానికి లోనైన సంతోష్ తన వెంట తెచ్చుకున్న రాడ్డుతో సందీప్ తలపై మోదడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

మల్లాపూర్: నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా ఢిల్లీ, హర్యానా రాష్ట్రాలకు చెందిన మద్యాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌టీఎఫ్ పోలీసులు శనివారం రాత్రి దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శశాంక్ అనే వ్యక్తి గత కొన్ని నెలలుగా ఢిల్లీ, హర్యానా ప్రాంతాల నుంచి మద్యం తీసుకువచ్చి నాచారం కార్తికేయనగర్ లోని అక్షిత్ అనే వ్యక్తి ఇంట్లో ఉంచి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో శనివారం రాత్రి ఇంటిపై దాడి చేసిన పోలీసులు రూ. 1.5 లక్షల విలువైన 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దాడుల్లో ఎస్టీఎఫ్ సీఐ భిక్షారెడ్డి, ఎస్ఐ బాలరాజ్, కానిస్టేబుల్ యాదగిరి, కౌశిక్, సాయికిరణ్, నితిన్ పాల్గొన్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎస్టీఎఫ్ బృందాన్ని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు.

క్లుప్తంగా

హిట్ అండ్ రన్ కేసులో నిందితుడి అరెస్టు

పంజగుట్ట: హిట్ అండ్ రన్ కేసులో నిందితుడిని పంజగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విద్యానగర్‌కు చెందిన పున్నం లోకేష్ (21) బాచుపల్లిలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం అతను స్నేహితుడితో కలిసి బైక్‌పై కాలేజీకి వెళుతుండగా అమీర్‌పేట బిగ్ బజార్ వద్ద వెనక నుంచి వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీ కొనడంతో లోకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సీసీ కెమెరాల ఆధారంగా ప్రమాదానికి కారణమైన బస్సును గుర్తించారు. గో టు ట్రావెల్స్‌కు చెందిన బస్సును ప్రమాద సమయంలో డ్రైవర్ ఓం ప్రకాష్ నడుపుతున్నట్లు గుర్తించారు. శనివారం రాత్రి అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు బస్సును సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినీ కార్మికుడి ఆత్మహత్య..



పట్టాభిరామయ్య (ఫైల్)

బంజారాహిల్స్: ఓ సినీ కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, ఐనవల్లి గ్రామానికి చెందిన మండపల్లి పట్టాభిరామయ్య (35) నాలుగేళ్ల క్రితం నగరానికి వలసవచ్చి సినీ పరిశ్రమలో ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ శ్రీకృష్ణానగర్‌లో గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అతను మద్యానికి బానిస కావడంతో అతడి భార్య సూర్య భారతి కుమారుడితో సహా పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో గత కొన్ని నెలలుగా డ్యూటీకి వెళ్లకుండా మద్యం తాగుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో ఒంటరిగా ఉన్న అతను ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ పట్టివేత...

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్, అయ్యప్ప సొసైటీ ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో శనివారం రాత్రి దాడి చేసిన ఎస్టీఎఫ్ పోలీసులు పాములపర్తి నవదీప్, సాయి చరణ్ అనే యువకులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 3.2 గ్రాముల ఎండీఎంఏ, 66 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న ఎస్టీఎఫ్ బృందాన్ని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి అభినందించారు.

కోడిపందేల స్థావరంపై దాడి..

11 మంది అరెస్ట్




పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్‌లు

జీడిమెట్ల: కోడిపందేల స్థావరంపై దాడి చేసిన జీడిమెట్ల పోలీసులు 11మందిని అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఉదయం కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్ సమీపంలో కొందరు వ్యక్తులు కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కోడిపందేలు ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15,440 నగదు 9 సెల్‌ఫోన్‌లు, 16 కత్తులు, ఆరు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారుతో ఢీకొట్టి.. కిలోమీటర్ ఈడ్చుకెళ్లి..

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



సుభాష్‌నగర్: రోడ్డు పక్కన నిద్రిస్తున్న వ్యక్తిని కారు ఢీకొని కిలోమీటర్ మేర ఈడ్చుకెళ్లిన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సూరారం మెయిన్ రోడ్డు సాయిబాబానగర్ చౌరస్తాలో శనివారం రాత్రి రోడ్డు పక్కన నిద్రిస్తున్న గుర్తు తెలియని వ్యక్తిని సూరారం నుంచి షాపూర్‌నగర్ కారు ఢీ కొట్టింది. అంతటితో ఆగకుండా జీడిమెట్ల బస్ డిపో వరకు (కిలోమీటర్) ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే మృతుడి వివరాలు తెలియరాలేదు. కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భరత్ కుమార్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖైరతాబాద్: సైఫాబాద్ డివిజన్ పరిధిలో సోమవారం విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్, చెట్ల తొలగింపులో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని సైఫాబాద్ డీఈ నెహ్రూ నాయక్ తెలిపారు. నారాయణగూడ, పబ్లిక్ గార్డెన్,లేక్ వ్యూ,నిజాంకాలేజ్,పబ్లిక్ గార్డెన్ సబ్ స్టేషన్ల పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సిటీ సెంట్రల్ లైబ్రరీ, సుధా హోటల్ ఏరియా, బాపూజీనగర్, చిక్కడపల్లి కొంత భాగం, వివేక్‌నగర్, మోర్‌సూపర్ మార్కెట్,ఆర్టీసీ ఎక్స్‌రోడ్డు, పబ్లిక్ గార్డెన్ ఏరియా, చాపల్ రోడ్డు, ఎస్ఎస్‌సీ బోర్డు ఏరియా, చంద్రవిహార్, కేర్ హాస్పిటల్, ఏసీబీ ఆఫీస్,డాక్ సదన్ ఆఫీస్, సంతోష్ స్వప్న టాకీస్, అబిడ్స్ మెయిన్ రోడ్డు, ఇస్కాన్ భవన్ ఏరియా, ఎల్అండ్‌టీ కన్‌స్ట్రక్షన్ బిల్డింగ్, ఫూల్ బాక్ ఏరియాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, దీనిని గమనించి సహకరించాలని కోరారు.

గ్యార్వీ ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీక

కాచిగూడ: గ్యార్వీ ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి అన్నారు. హిమాయత్‌నగర్ డివిజన్ దత్తనగర్‌లో ఆదివారం జరిగిన గ్యార్వీ ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ ఖాద్రీ జిలానీ, కాంగ్రెస్ పార్టీ నేతలు రామన్ గౌడ్, ఎం.ఏ.నయీమ్, శౌన్, జఫార్, సలీమ్, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లోని స్టడీ సర్కిల్ వెనుక ఉన్న బాప్టిస్ట్ చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు కనులపండువగా నిర్వహించారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ఈ వేడుకలకు విచ్చేసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో క్రిస్మస్ కానుకలు ప్రభుత్వం అధికారికంగా పంపిణీ చేసేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇవి రద్దయ్యాయని ఆరోపించారు.

సభ్యుల సహకారంతోనే సొసైటీ పురోగతి

రహమత్‌నగర్: సొసైటీ అభివృద్ధికి ప్రతీ సభ్యుడు తన సహకారాన్ని అందించాలని ఎస్ఆర్ఆర్‌పురం కో ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు షేక్ యూసుఫొద్దీన్ కోరారు. సైట్-3 ఆచార్య జయశంకర్ కమ్యూనిటీ హాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సహకార చట్టాలకు లోబడి సొసైటీ పనిచేస్తుందని ఆయన గుర్తుచేశారు. సభ్యుల శ్రేయస్సు కోసం సొసైటీ ఎల్లప్పుడు కట్టుబడి ఉందన్నారు. తమ సొసైటీకి ఆడిట్‌లో ఏ గ్రేడ్ రావడం ఆనందంగా ఉందన్నారు. కో- ఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్ భీంరాజ్ మాట్లాడుతూ వయస్సు మీదపడిన వారు ఎంతో మంది సొసైటీలో నిస్వార్థంగా సేవలందించడం అభినందనీయమన్నారు. సొసైటీ ఉపాధ్యక్షులు ఇమామ్ గోరి, వైస్ ప్రెసిడెంట్ చెట్ల ఈలయ్య, కోశాధికారి సత్యనారాయణ, మేనేజింగ్ కమిటీ సభ్యులు అక్తర్ సుల్తానా, అమృత, రామ్‌మోహన్‌రావు, అహ్మద్‌అలీ, సుజాత, సాయినాథ్‌రావు, రహ్మాన్, కౌన్సిల్ సభ్యులు దేవరాజ్, కలీముద్దీన్, వేణుగోపాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేతకారుల కళాత్మక ఉత్పత్తులు

ఆంధ్రప్రదేశ్ ముఖ్య కార్యదర్శి కె.సునీత



శ్రీనగర్‌కాలనీ: సంస్కృతి-సంప్రదాయాలకు నిలయంగా చేనేతకారుల కళాత్మక ఉత్పత్తులు ఉంటాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్య కార్యదర్శి కె.సునీత అన్నారు. ఆదివారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఏపీ చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో చేనేత ఎగ్జిబిషన్‌ను ముఖ్య కార్యదర్శి కె.సునీత, చేనేత, జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చేనేత కళాకారుల ఉత్పత్తులను తిలకించి వారిని అభినందించారు. ఏపీకి చెందిన కళాత్మక చీరలకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌ను అందించేలా, చేనేతలకు పలు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను సుమారు 50 స్టాల్స్‌లో ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 27 వరకూ ఈ ఎగ్జిబిషన్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు.

స్పా సెంటర్‌పై కేసు

బంజారాహిల్స్: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న స్పాసెంటర్ నిర్వాహకురాలిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎల్బీనగర్‌కు చెందిన ఓ మహిళ బంజారాహిల్స్ రోడ్డునెంబర్-11లోని ఆర్‌కే రెసిడెన్సీలో గ్రీన్ సెలూన్ అండ్ స్పా నిర్వహిస్తోంది. అయితే ఇది నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతుందని సమాచారం అందటంతో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో స్పా నిర్వహణకు ప్రొఫెషనల్ థెరపిస్ట్ లేకపోవడం, మసాజ్ కోసం నియమించిన మహిళలను తరచూ మార్చుతుండటంతోపాటు నిబంధనలు పాటించనందుకు నిర్వాహకురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సివిల్ తగాదాల్లో తగ్గిన జోక్యం!

- డ్రంకన్ డ్రైవ్‌లతో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం
- డయల్100 ఫిర్యాదులపై పెరిగిన స్పందన
- సీసీ కెమెరాల ద్వారా త్వరితగతిన కేసుల ఛేదన
- వెస్ట్‌జోన్ వార్షిక నివేదిక 2024



తనిఖీలు నిర్వహిస్తున్న, బంజారాహిల్స్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్...(ఫైల్)

బంజారాహిల్స్: పబ్‌లు, క్లబ్‌లు, బడా వ్యాపార సంస్థలు, ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రులు, మంత్రులు, మాజీ మంత్రులు, శాసనసభ్యులు, బడా పారిశ్రామిక వేత్తలు, ఖరీదైన భూములు కలిగి ఉన్న వెస్ట్‌జోన్ పరిధిలో ఈ ఏడాది కేసుల పరిష్కారంలో పురోగతి కనిపించింది. నగరానికే గుండెకాయ లాంటి వెస్ట్‌జోన్ పరిధిలో నిత్యం నేరాలపై కేసులు ఎక్కడో దగ్గర నమోదవుతూనే ఉంటాయి. ఈ మిస్టరీని ఛేదించడంలో 2024వ సంవత్సరంలో ఇక్కడి పోలీసులు తగిన శ్రద్ధ కనబరిచారు. 2024వ సంవత్సరంలో నేరాలు-పురోగతిపై ఆదివారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ వివరాలు వెల్లడించారు. ఇందులో వెస్ట్‌జోన్ పరిధిలో ఈ ఏడాది నమోదైన కేసులు, పరిష్కారం, శిక్షలు తదితర అంశాలపై ఆయన మాట్లాడారు. వెస్ట్‌జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మాసబ్‌ట్యాంక్, పంజగుట్ట, మధురానగర్, బోరబండ, ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ ఏడాది మొత్తం 7,727 కేసులను పరిశోధించారు.

పౌరులకు ఎఫ్ఐఆర్ కాపీలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. అలాగే సివిల్ కేసుల్లో సెటిల్‌మెంట్లకు తావులేకుండా అన్ని పోలీస్‌స్టేషన్లలో నేరస్తులపై కేసులు నమోదు చేశారు. రౌడీలు, అసాంఘిక శక్తులు, అసభ్యకర కార్యకలాపాలకు పాల్పడుతూ చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిని సీఆర్‌పీసీ, బీఎన్ఎస్ఎస్ కింద బైండోవర్ చేశారు. ప్రతిరోజూ కాలనీల్లో సమావేశాలు ఏర్పాటు చేసి నేను సైతం కార్యక్రమంలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసు కునే విధంగా చర్యలు తీసుకున్నారు. నైట్ పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహించి ప్రార్థనా మందిరా లు, మసీదులు, ఆలయాల వద్ద మత విద్వేషాలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్నారు. మానసిక స్థితి సరిగ్గా లేని వారిని, నిరాశ్రయులను గుర్తించి వారిని షెల్టర్లకు తరలించారు. అదే విధంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు తప్పనిసరిగా డ్రంకన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి మద్యం సేవించి వాహనం నడుపుతున్న వారికి శిక్షలు విధించడమే కాకుండా వారి డ్రైవింగ్ లైసెన్సును రద్దు చేయించారు.

కేసుల వివరాలు

- 7,727 కేసుల్లో 4,740 కేసులు పరిష్కారమయ్యాయి.
- 16035 పిటిషన్లను విచారించారు.
- డయల్ 100కు వచ్చిన 52,279 కాల్స్‌ను అటెండ్ చేశారు.
- 243 కమ్యూనిటీ సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు.
- 7241 నేనుసైతం సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు.
- సీసీ టీవీ కెమెరాల ద్వారా 725 కేసులను పరిష్కారం చేశారు.
- 174 కమ్యూనిటీ ప్రోగ్రాంలను ఏర్పాటు చేయగా ఇందులో 17 కేసులు పరిష్కారం అయ్యాయి.
- పోక్సో కేసులో ఒకరికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.5,000 జరిమానా పడింది.
- మరొకరికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జైలు శిక్ష విధించారు.
- 25,979 ఇ-పెట్టీ కేసులను పరిష్కరించారు.
- 25 గేమింగ్ యాక్ట్ కేసులు నమోదయ్యాయి.
- 97 ఎన్‌డీపీఎస్ కేసుల్లో నిందితులను పట్టుకున్నారు.
- మూడు గుట్కా కేసులు నమోదయ్యాయి.
- రేషన్ బియ్యం తరలిస్తున్న 14 మందిని పట్టుకున్నారు.
- బెల్టు షాపుల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా 90 కేసులు నమోదయ్యాయి.
- వ్యభిచార గృహాలపై దాడులు చేసి 34 కేసులను నమోదు చేశారు.

ఐదెకరాల ప్రభుత్వ స్థలం కబ్జా

అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు : కవితారెడ్డి



వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి..

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లో ఐదెకరాల ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి ఆరోపించారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె స్థలం వివరాలను ఆధారాలతో సహా చూపించారు. మూడునెలలుగా ప్రైవేటు వ్యక్తులు తట్టిఖానా సెక్షన్ పక్కన స్థలం కబ్జా చేస్తున్నారని అధికారులకు చెప్పినా ఏమాత్రం పట్టించుకోలేదని తెలిపారు. రెవెన్యూ వాళ్లు చూసుకుంటారని జలమండలి అధికారులు చెప్పారని, మాకేం సంబంధం..జలమండలికి ఇచ్చేశామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారన్నారు. రెండు శాఖల అధికారుల నిర్లక్ష్యంతో ప్రైవేటు వ్యక్తులు స్థలాన్ని కబ్జా చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరోనా లాక్‌డౌన్‌లో అప్పటి తహశీల్దార్ చంద్రకళ జలమండలి చుట్టుపక్కల ఉన్న 18 ఎకరాల ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయించి కాపాడారని గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రెవెన్యూ ఆధీనంలో ఉన్న స్థలం ఇప్పుడు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లినట్లు తెలుస్తోందన్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని స్థలాన్ని కాపాడాలన్నారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లో ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి లేకపోవడంతో ఎంతోమంది మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, జలమండలి పక్కన ఉన్న స్థలాన్ని ఆస్పత్రి కోసం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. లేకుంటే డివిజన్ ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు.

చేనేత ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి

శ్రీదేవి విజయ దాస్



చేనేత పట్టు వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న శ్రీదేవి విజయదాస్

బంజారాహిల్స్: చేనేతకారులు, చేనేత ఉత్పత్తులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని హస్తకళా ఆర్టిషన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శ్రీదేవి విజయ దాస్ అన్నారు. ఆదివారం బంజారాహిల్స్ రోడ్‌నెంబర్-12లోని కళింగ కల్చరల్ హాలులో ఏర్పాటైన జాతీయ చేనేత పట్టు వస్త్ర ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఇక్కడి కొలువుదీరిన చేనేతకారుల వస్త్రోత్పత్తులు తిలకిస్తూ, చేనేత కారులతో విభిన్న రకాల హ్యాండ్లూమ్ చీరల తయారీ విధానం, ప్రత్యేకతలు తెలుసుకున్నారు. భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని తెలిపారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీ వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి 75 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను అందుబాటులో ఉంచామని తెలిపారు.

ఏసుప్రభు బోధనలు అనుసరణీయం

లిబర్టీ: విశ్వమానవాళికి ఏసుప్రభు బోధనలు అనుసరణీయమని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి అన్నారు. ప్రజల కోసం రోమన్ చక్రవర్తులు ఎదిరించి ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు. ఆదివారం దళ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను అనాథ పిల్లల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసుప్రభు బోధనలు అనుసరిస్తూ ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల ప్రేమ, దయ, కరుణ చూపాలని అన్నారు. సమాజం ఏసు బోధనలు ఆచరించాల్సిన అవసరం ఉందన్నారు. ఏసుప్రభు సూక్తులను పౌరులు ఆచరిస్తే శాంతి సామరస్యంతో సమాజం ముందుకు సాగుతుందని కుమారస్వామి పేర్కొన్నారు.

మద్యం మత్తులో కత్తితో దాడి

రహమత్‌నగర్: మద్యం మత్తులో ఇద్దరు యువకులు మధ్య మొదలైన ఘర్షణ చివరకు కత్తిపోట్ల వరకు దారితీసింది. బోరబండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వినాయకరావునగర్‌లో నివసించే వంశీ, ఖైరతాబాద్‌కు చెందిన ముకేష్ (30)లు ఇద్దరు శనివారం రాత్రి మద్యం సేవించి వినాయకరావునగర్‌లోని వంశీ నివాసం వద్దకు చేరుకున్నారు. మద్యం మత్తులో ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో ముకేష్ తన వద్ద ఉన్న పదునైన ఆయుధంతో వంశీపై దాడి చేశాడు.ఈ దాడితో వంశీ గాయపడ్డాడు. సమాచారం అందుకున్న బోరబండ పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని గాయపడ్డ వంశీని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గణితంలో సత్తా చూపితే మంచి భవిష్యత్

ప్రిన్సిపాల్ డాక్టర్ అస్మతున్నీసా



వెంకటలక్ష్మీని సత్కరిస్తున్న అస్మతున్నీసా

బంజారాహిల్స్: విద్యార్థుల భవిష్యత్ మంచిగా ఉండాలంటే గణితంలో సత్తా చాటాల్సిందేనన్న సహజ సూత్రాన్ని మ్యాథ్స్ టీచర్లు విద్యార్థులకు తెలియజేయాలని జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-10లోని గాయత్రీహిల్స్ లిటిల్‌స్టార్ హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అస్మతున్నీసా సూచించారు. భారత గణిత పాటవాన్ని ప్రపంచానికి తెలియజెప్పడమే కాకుండా సంక్లిష్ట సమస్యలను పరిష్కరించిన గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యాథ్స్ టీచర్లు వెంకటలక్ష్మీ, శ్రీనివాసులును ఆమె శాలువాతో సత్కరించిన అనంతరం మాట్లాడుతూ రోజువారీ జీవితంలో గణితం పోషించే పాత్ర ఇంతా ఇంతా కాదన్నారు. అయితే విద్యార్థులకు గణితం అంటే గుండె దడ అని, లెక్కలు మాస్టార్లు పిల్లల్లోని భయాన్ని తొలగించేందుకు సృజనాత్మకంగా, రసవత్తరంగా బోధించాలన్నారు. ప్రతీ విద్యార్థి గణితంపై ఆసక్తిని పెంపొందించేవిధంగా ఉపాధ్యాయులు కీలకం కావాలన్నారు.

దుప్పట్ల పంపిణీ

ఖైరతాబాద్: ఐఐఎంసీ కళాశాల, ఎన్ఎస్ఎస్ అండ్ ఎన్‌సీసీ యూనిట్లు, హైదరాబాద్ ఆర్య వైశ్య మహాసభ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కోఠి ప్రసూతి హాస్పిటల్‌లో బాలింతలకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఐఐఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. 200మంది బాలింతలకు మాజీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ చేతుల మీదుగా ఈ దుప్పట్ల పంపిణీ చేసినట్లు తెలిపారు.ప్రతి సంవత్సరం చలికాలంలో కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వాలంటీర్ల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

కాకా, పీవీ రావుల కృషి ఎనలేనివి



మాట్లాడుతున్న చెన్నయ్య తదితరులు

ఖైరతాబాద్: బడుగు, బలహీన వర్గాల ప్రజలకు నిలువు నీడ అందించేందుకు కాకా, పీవీరావులు చేసిన కృషి ఎనలేనివని మాల మహానాడు అధ్యక్షుడు జి.చెన్నెయ్య అన్నారు. ఆదివారం మింట్ కాంపౌండ్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్మార్తి భవన్‌లో పి.వీ రావు, గడ్డం వెంకటస్వామి వర్ధంతి సభకు చెన్నయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజలకు నిలువు0నీడ అందించేందుకు అనునిత్యం కాక పరితపించారన్నారు. 70వేల కుటుంబాలకు గుడిసెలు వేయించి గుడిసెల వెంకటస్వామిగా పేరు గడించారన్నారు. కేంద్ర మంత్రిగా ఉండి పేద పేదలకు రేషన్ విధానాన్ని ప్రవేశ పెట్టారన్నారు. అంబేడ్కర్ పేరిట విద్యాసంస్థలు స్థాపించి లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపారని చెన్నయ్య కొనియాడారు. అనంతరం మింట్ కాంపౌండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు.

అమిత్‌షా వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

పంజగుట్ట: బీజేపీ కేంద్ర మంత్రి అమీత్‌షా డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో ఉపయోగించిన పదాలు ప్రజల హృదయాలను గాయపర్చిందని, వెంటనే ఆయన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ మరణానంతరం కాంగ్రెస్ పార్టీ చరిత్ర పుటల నుంచి ఆయన పేరును, రాజ్యాంగ నిర్మాణంలో ఆయన చేసిన కృషిని తుడిచివేయటానికి ప్రయత్నించిందని, కాంగ్రెస్‌కు ఏగతి పట్టిందో రాబోయే రోజుల్లో బీజేపీకి కూడా అదేగతి పడుతుందని ఆయన అన్నారు. దేశంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, ప్రజాస్వామికవాదులు అందరూ అమిత్‌షా మాటలను ఖండిస్తూ ఈ నెల 24వ తేదీన దేశవ్యాప్తంగా బహుజన సమాజ్‌వాదీ పార్టీ తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి మద్దతు తెలపాలని ఆయన కోరారు.

లారీ డ్రైవర్‌పై కేసు

బంజారాహిల్స్: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన లారీ డ్రైవర్‌పై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... బంజారాహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ గోవర్ధన్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి శ్రీనగర్ కాలనీ ప్రాంతంలో ఆదివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్నారు. అదే సమయంలో టీఎస్ 34787255 నెంబర్ గల లారీ నిషేధిత సమయంలో నిషేధిత ప్రాంతానికి రావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో కొడంగల్‌కు చెందిన లారీ డ్రైవర్ ఓక్లహోమాపై కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఎస్ఐ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు.

12న ఎంబీసీ, డీఎన్‌టీ అట్టడుగు వర్గాల సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న సంగెం సూర్యారావు

పంజగుట్ట: ఎన్నికలకు ముందు ఎంబీసీలకు మంత్రిత్వ శాఖ ఇస్తామని ప్రస్తుత ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని కానీ ఎన్నికలు పూర్తయ్యాక కనీసం అసెంబ్లీలో ఎం.బీసీల గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం బాధాకరమని జాతీయ ఎంబీసీ, డీఎన్‌టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బంగారు నర్సింహసాగర్ అన్నారు. ఒక సినీ హీరో కోసం గంటసేపు అసెంబ్లీలో మాట్లాడిన ముఖ్యమంత్రి జనాభాలో 30 శాతం ఉన్న ఎంబీసీల ప్రస్తావన తీసుకురాకపోవడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఎంబీసీల సమస్యలు చర్చించేందుకు జనవరి 12వ తేదీన హైదరాబాద్‌లో ఎంబీసీ, డీఎన్‌టీ, అట్టడుగువర్గాల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ సమాజ్ అధ్యక్షుడు సంగెం సూర్యారావు, సంఘం గౌరవాధ్యక్షుడు ఓర్సు కృష్ణయ్య, సత్యం వంశరాజ్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎం.బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో రావల్సిన వాటా ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం ఎం.బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్లు ప్రకటించిందని కానీ నిధులు విడుదల చెయ్యకపోవడం, కార్పొరేషన్‌కు పూర్తిస్థాయిలో పాలకవర్గం ఏర్పాటు చేయకపోవడంతో ఎక్కడవేసిన గొంగడి అక్కడే ఉన్నట్లు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి పూర్తిస్థాయి పాలకమండలి ఏర్పాటు చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం




ప్రిన్సిపాల్ జి.లలిత

బంజారాహిల్స్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ విద్యార్థులకు ఐదో తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షకు సోమవారం (నేడు) నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని కిష్టాపూర్ మేడ్చల్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.లలిత తెలిపారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఆన్‌లైన్‌లో రూ.100లు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. సాంఘిక గిరిజన గురుకులాలతో పాటు మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ప్రవేశం కోసం ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాను యూనిట్‌గా చేసుకుని ప్రవేశాలు ఉంటాయని, వచ్చే ఏడాది ఫిబ్రవరి 23న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల విద్యార్థినీ, విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. అలాగే విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం విద్యార్థుల మెనూలో పోషక పదార్థాలను మెరుగ్గా అందించేందుకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచినట్లు తెలిపారు. ఇటువంటి సదవకాశాన్ని పేద విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

వ్యాధి నిర్ధారణతోనే మెరుగైన వైద్య సేవలు

సాక్షి, సిటీబ్యూరో: వ్యాధిని నిర్ధారిస్తేనే మెరుగైన వైద్య సేవలు అందుతాయని వాస్క్యులర్, ఎండ్రోవాస్క్యులర్, పోడియాట్రిక్ సర్జన్ డా.నరేంద్రనాథ్ మేడా అన్నారు. ఆదివారం ఎసాహొటె బ్రాండ్ తమ అత్యాధునిక ఓ-స్కాన్ ఎంఆర్ఐని నగరవాసులకు అందుబాటులోకి తెచ్చింది. ఈ సందర్భంగా ది ఫుట్ డాక్టర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో డా.నరేంద్రనాథ్ మాట్లాడుతూ వ్యాధికి సంబంధిన కచ్చితమైన సమాచారంతో రోగికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈ యంత్రంతో పోడియాట్రిక్ (పాదాలు, కీలమండలానికి సంబంధించిన ఆరోగ్య సమస్యలు) రోగులకు మరింత మెరుగైన చికిత్స అందించేందుకు వీలవుతుందన్నారు. ఈ సమావేశంలో రేడియాలజిస్ట్ శిరీష చనుమోలు, ఎసాహొటె బిజినెస్ డైరెక్టర్ ధీరజ్ నాసా తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ కాగడాల ర్యాలీ



కాగడాలతో ర్యాలీ నిర్వహిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

కాచిగూడ: పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన అహంకార పూరిత వ్యాఖ్యలకు నిరసనగా యూత్ కాంగ్రెస్ హైదరాబాద్ మాజీ అధ్యక్షుడు మోత రోహిత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి కాగడాల ప్రదర్శన నిర్వహించారు. హిమాయత్‌నగర్, లిబర్టి చౌరస్తా నుంచి ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీలో యూత్ కాంగ్రెస్ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోత రోహిత్ ముదిరాజ్ మాట్లాడుతూ అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన అమిత్ షాకు తగ్గిన బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. అమిత్ షా క్షమాపణ చెప్పే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన అన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మేఘాలయ వీసీ శేఖర్ తదితరులు

వెంగళరావునగర్: నైతిక విలువలకు కట్టుబడిన జర్నలిస్టులలో మానికొండ చలపతిరావు ఒకరని రచయిత, సీనియర్ జర్నలిస్టు ఆకుల అమరయ్య తెలియజేశారు. మిరియాల వెంకట్రావు 84వ జయంతి ఉత్సవాలు యూసుఫ్‌గూడలోని మహమూద్ ఫంక్షన్ హాల్‌లో మిరియాల వెంకట్రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా భారతీయ జర్నలిజం ధ్రువతార మానికొండ చలపతిరావు పుస్తకావిష్కరణ జరిగింది. మేఘాలయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కొట్టు శేఖర్, పుస్తక రచయిత అమరయ్య, జర్నలిస్టులు చందు జనార్దన్, రామ్మోహన నాయుడు, సమ్మెట నాగమల్లేశ్వరరావు తదితరులతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమరయ్య మాట్లాడుతూ వర్ధమాన జర్నలిస్టులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. చలపతిరావు చరిత్రతో పాటు జర్నలిజం విలువల గురించి ప్రముఖులు రాసిన 30 వ్యాసాలు ఇందులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయ విశ్లేషకులు కటారి అప్పారావు, అరవ రామకృష్ణ, మాజీ ఐపీఎస్ ఆఫీసర్ తోట గోపాలకృష్ణ, సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి, రామ్మోహననాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పుస్తక రచయిత ఆకుల అమరయ్యను ఘనంగా సన్మానించారు.



క్రమక్రమంగా అక్రమ నిర్మాణాలు


భగత్‌సింగ్‌నగర్ దోబీఘాట్ స్థలంలో నిర్మించిన ఆరు గదులు

- కబ్జాకు గురవుతున్న దోబీఘాట్ స్థలం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు
- ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన స్థానికులు

కుత్బుల్లాపూర్: ఒకవైపు హైడ్రా కూల్చివేతలు కొనసాగుతుంటే.. మరోవైపు డోంట్ కేర్ అన్నట్టుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో రూ.కోట్లు విలువచేసే ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి వారం రోజులుగా గదులను నిర్మిస్తున్నా మండల రెవెన్యూ, గ్రేటర్ అధికారులు సైలెంట్‌గా ఉండటం విమర్శలకు తావిస్తోంది. గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లోని సర్వే నంబర్ 155లో ఒకచోట 29 గుంటలో భూమి మరోచోట 22 గుంటల ప్రభుత్వ స్థలం ఉంది. ఈ రెండింటి మధ్యలో 2 ఎకరాల 39 గుంటల విస్తీర్ణంలో అప్పట్లో గాంధీ వాషర్‌మెన్ కో–ఆపరేటివ్ సొసైటీ కింద 20 సంవత్సరాల క్రితం దోబీఘాట్ నిర్మించారు. రెండు ప్రభుత్వ స్థలాలకు మధ్యలో దోబీఘాట్ ఉండటంతో రెండు వైపులా స్థలం తమదేనంటూ దోబీఘాట్ వాసులు కబ్జా చేసేందుకు పలుమార్లు ప్రయత్నించారు. ఇటీవల కొంతమంది కబ్జాదారులతో చేతులు కలిపి అధికారులను మచ్చిక చేసుకుని ఇక్కడ కొత్త నిర్మాణాలకు తెర లేపారు. గతంలో 29 గుంటల స్థలానికి 90 శాతం మేర ఫెన్సింగ్ వేయగా కేవలం 10 శాతం మాత్రమే మిగిలి ఉంది. దీనికి ఫెన్సింగ్ వేయాలని భగత్‌సింగ్‌నగర్ చెందిన ఒక వ్యక్తి పోరాటం చేస్తూ వస్తున్నాడు. దీంతో 2023 డిసెంబర్‌లో 10 శాతం ఫెన్సింగ్ వేయాలని అధికారులను కోరగా వారు ఇష్టారాజ్యంగా సుమారు 11 గుంటల స్థలాన్ని తగ్గించి ప్రహరీ నిర్మించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో హైకోర్టుకు వెళ్లగా 29 గుంటల స్థలానికి మిగిలిపోయిన 10 శాతం ఫెన్సింగ్ చేయాలని, రెండు ఎకరాల 39 గుంటల స్థలానికి హద్దులు ఏర్పర్చాలని 21 మే 2024న అధికారులను ఆదేశించింది. దీంతో ఎత్తుకు పైఎత్తు అన్న రీతిలో దోబీఘాట్‌కు ఆనుకొని ఉన్న మరోచోట సుమారు రూ.5 కోట్ల విలువచేసే 22 గుంటల ప్రభుత్వ స్థలంలో వారం రోజులుగా అక్రమ నిర్మాణాలు చోటుచేసుకుంటున్నాయి. కొంతమంది కబ్జాదారులు, దోబీఘాట్‌వాసులు కలిసి ఇప్పటివరకు 6 గదులను నిర్మించి రేకులు వేసి సున్నం కూడా వేసి విద్యుత్తు కనెక్షన్లకు దరఖాస్తులు అందజేసినట్లు తెలుస్తోంది. ఈ 22 గుంటల ప్రభుత్వ స్థలం సర్వే నంబర్–155లో ఉండగా మరో నూతన సర్వే నంబర్ వేసి నిర్మాణాలు చేపడుతున్నట్లు భగత్‌సింగ్‌నగర్‌లో పలువురు చర్చించుకోవడం హాట్ టాపిక్‌గా మారింది.

రూ.5 కోట్ల స్థలాన్ని, 16 ప్లాట్లుగా విభజించి..

మొత్తం 22 గుంటల ప్రభుత్వ స్థలం ఉండగా ఇప్పటికే రోడ్డు వేసి చదును చేసిన కబ్జాదారులు.. తాజాగా వీటిని 80 గజాల చొప్పున ప్లాట్లు చేసి రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఓ మాజీ సర్పంచ్, స్థానికంగా ఉండే సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మరో వ్యక్తి ముగ్గురు కలిసి 16 ప్లాట్లను విభజించి దోబీఘాట్ వాసులకు 5 మిగిలిన 11 ప్లాట్లను పైన పేర్కొన్న ముగ్గురు పంచుకున్నట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. గతంలో ఇక్కడ నిర్మాణాలు జరిగిన క్రమంలో సాక్షిలో కథనం రాగా కూల్చివేతలు చేపట్టారు. తాజాగా అదే ప్రాంతంలో 6 గదులు వారం రోజుల వ్యవధిలో నిర్మించడం చూస్తే.. పక్కా ప్రణాళికతో ఇక్కడ నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కొంతమంది రాజకీయ నాయకులు వీరికి మద్దతు పలుకుతున్నట్లు.. ఇక్కడ నిర్మాణాలను అడ్డుకునే దిశగా రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు ప్రయత్నాలు చేసినప్పటికీ రాజకీయ ఒత్తిళ్లతో వెనక్కి తగ్గినట్లు సమాచారం. సుమారు రూ.5 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలం కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే మేడ్చల్ జిల్లా కలెక్టర్, ఆర్డీవో, మండల తహసీల్దార్, హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే వివేకానందకు ఫిర్యాదు

ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలపై ఎమ్మెల్యే వివేకానందగౌడ్‌ను భగత్‌సింగ్‌నగర్ వాసులు కలిసి వినతి పత్రం అందజేశారు. దోబీఘాట్ సమీపంలో ఖాళీగా ఉన్న ప్రదేశాన్ని ప్రజల సౌకర్యార్థం వినియోగించుకోవాలని సూచించారు. స్పందించిన ఎమ్మెల్యే మండల రెవెన్యూ అధికారులు, గ్రేటర్ సర్కిల్ అధికారులకు ఫోన్ చేసి సదరు స్థలంలో కొనసాగుతున్న నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు.


భగత్‌సింగ్‌నగర్‌వాసుల ఫిర్యాదు మేరకు అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చాం



ప్రభుత్వ స్థలంలో కొనసాగుతున్న నిర్మాణాలను వెంటనే తొలగించాలి. లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవు. గతంలో ఇక్కడ అక్రమణలు చోటు చేసుకుంటే వెంటనే కట్టడి చేశాం.. అయినప్పటికీ కొంతమంది మళ్లీ ఇక్కడ నిర్మాణాలు చేపట్టినట్లు తెలియగానే నోటీసులు జారీ చేశాం. ఈ విషయంలో ఎవరైనా సరే వదిలిపెట్టేది లేదు.

– మల్లారెడ్డి, ఉపకమిషనర్, గాజులరామారం

వెంటనే కూల్చేస్తాం..



భగత్‌సింగ్‌నగర్ దోబీఘాట్ సమీపంలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను త్వరలోనే తొలగిస్తామని కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ సాక్షికి తెలిపారు. స్థానికంగా కొంతమంది కబ్జాదారులు కూల్చివేతలకు వెళ్తే గొడవ చేస్తున్నారని, పోలీస్ ప్రొటెక్షన్‌తో వెళ్లి అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం.

– అబ్దుల్ రెహమాన్‌ఖాన్, మండల తహసీల్దార్

ఘనంగా ముత్యాలమ్మకు బోనాలు


అమ్మవారి సేవలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ఘనంగా బోనాలు సమర్పించారు. ఇటీవలే అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ వైభవంగా నిర్వహించగా అమ్మవారికి ప్రస్తుతం బోనం, సాక సమర్పించారు. అంతకుముందు ఫలహార బండి ఊరేగింపు నిర్వహించి బస్తీ ప్రజలందరూ కలిసి ఎంతో వైభవంగా ఉత్సవాలను జరుపుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని, అనేక ఆలయాలను ధ్వంసం చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమర్థవంతమైన పోలీసు వ్యవస్థ ఉన్నా మజ్లిస్ పార్టీ, ప్రభుత్వమే వారిని అడ్డుకుంటోందని ఆరోపించారు. మతోన్మాద మూకలను అణిచివేయాలని ఆయన డిమాండ్ చేశారు.


బోనాలు తీసుకెళ్తున్న భక్తులు, ఎమ్మెల్యే శ్రీగణేష్

నిరుపేద కుటుంబం నుంచి మిస్ సౌత్ ఇండియా విజేతగా..

శ్రీతేజకు అభినందనలు తెలిపిన ప్రిన్సిపాల్



నాంపల్లి: నిరుపేద కుటుంబంలో పుట్టి ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థి మిస్ ఇండియా పోటీలు–2024కు ఎంపికయ్యారు. ఢిల్లీలోని రాడిసన్ బ్లూ హోటల్ పశ్చిమ విహార్‌లో శనివారం నిర్వహించిన పోటీల్లో మన రాష్ట్రం నుంచి మిస్ సౌత్ ఇండియా–2024 ప్రైడ్ టైటిల్‌ను గెలుచుకున్నారు. ముషీరాబాద్ గంగపుత్ర కాలనీకి చెందిన విద్యార్థిని వంగరి శ్రీతేజ నాంపల్లిలోని ఇందిరాప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల(ఐపీజీడీసీడబ్ల్యూ)లో బీఎస్సీ లైఫ్ సైన్సెస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. జీవితాన్ని మార్చే ఈ అవకాశాన్ని తాను ఉపయోగించుకున్నట్లు శ్రీతేజ తెలిపారు. మిస్ యూనివర్స్–2025లో ప్రపంచ వేదికపై మన దేశానికి ప్రాతినిధ్యం వహించేందుకు తాను సిద్ధం అవుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రముఖర్జీ ఆమెను అభినందించారు.

నగరంలో నేడు

- హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఆధ్వర్యంలో 37వ జాతీయ పుస్తక ప్రదర్శన ఎన్టీఆర్ స్టేడియంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయి.
- మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఎస్‌బీఐ మెగా ప్రాపర్టీ షో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుంది.
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తారు.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫొటో ఫెస్టివల్ కొనసాగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో అంతర్జాతీయ హస్తకళామేళా ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

పుస్తకావిష్కరణ



గన్‌ఫౌండ్రీ: ఆగమ భారతంలో పురాతన ఆలయ నృత్య, సంగీత వ్యవస్థకు విశిష్ట స్థానం ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. రవీంద్రభారతిలో సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్, పరంపర డ్యాన్స్ మ్యూజిక్ ఫోరంల సంయుక్త ఆధ్వర్యంలో పద్మభూషణ్ పురస్కార గ్రహీత స్వప్నసుందరి రచించిన ఆగమ భారతం పుస్తకావిష్కరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంస్కృతిక చరిత్రపై కఠోర పరిశోధన చేసి ఆలయ నృత్య ప్రయాణాన్ని పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయం అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పరిశోధనలు చేసి పుస్తకాలను పాఠకులకు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్, సంస్థ డైరెక్టర్ పద్మ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీప్‌శిఖా మహిళా క్లబ్ వజ్రోత్సవాలు


దీప్‌శిఖా మహిళా క్లబ్ వజ్రోత్సవాల్లో జయేష్‌రంజన్ తదితరులు

సనత్‌నగర్: ప్రముఖ మహిళా సంస్థ దీప్‌శిఖా మహిళా క్లబ్ వజ్రోత్సవాలను ఆదివారం సాయంత్రం బేగంపేటలోని మాలనీ హౌస్‌లో ఘనంగా నిర్వహించారు. వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ ఇండస్ట్రీస్, కామర్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాల చీఫ్ సెక్రటరీ జయేష్‌రంజన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళాశక్తి ఎనలేనిదని, సమాజ రూపురేఖలు మార్చగలిగే సత్తా వారికే ఉంటుందన్నారు. నిరుపేద మహిళల అవసరాలను తెలుసుకుని వారికి విశేష సేవలు అందిస్తున్న దీప్‌శిఖా మహిళా క్లబ్ సభ్యులను అభినందించారు. క్లబ్ అధ్యక్షురాలు రాధిక మాలనీ మాట్లాడుతూ 1964 సంవత్సరంలో ప్రారంభమైన ఈ క్లబ్ అవసరమైన మహిళలకు నిరంతరం మద్దతు ఇస్తూ, పేదలు, అనాథ పిల్లలకు నాణ్యమైన విద్య అందిస్తోందన్నారు. 1987 నుంచి కన్యా గురుకుల్ హైస్కూల్ నిర్వహణ ద్వారా దాదాపు 1400 మంది పిల్లలకు విద్య అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మనీష్‌సాబూ, విప్మావీర్, సరోజ్‌బజాజ్, ప్రశాంత్ గార్గ్, పెర్సీ ఇటాలియా, నరేందర్, కమిటీ సభ్యులు సునీత గగ్గర్, ప్రియాంక బహేటి, సంగీతజైన్, భావనసంఘి, మీనాక్షిభూరియా, శివని తిత్రేవాల్, ఇంద్ర డోచానియా, సలహాదారు ఉషా సంఘీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

చిన్నారులకు చేయూతగా..

- బేర్ ఫుట్ వేదికగా క్రిస్మస్ వేడుకలు..
- శైలజా ఆర్యన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం

సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్‌లోని బేర్ ఫుట్ కేఫ్ వేదికగా శైలజా ఆర్యన్ ఫౌండేషన్, రీచ్ బియాండ్ ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకలు ఆకట్టుకున్నాయి. శైలజా ఆర్యన్ ఫౌండేషన్, రీచ్ బియాండ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో విభిన్న వర్గాలకు చెందిన చిన్నారులు పాల్గొని ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శైలజారెడ్డి మాట్లాడుతూ ఇంటరాక్టివ్ కేక్ మిక్సింగ్ ఈవెంట్లో చిన్నారులు ఎంతో ఆసక్తిగా పాల్గొని వారి అనుభవాలు పంచుకున్నారని తెలిపారు. అందరి చిన్నారుల మాదిరిగానే ఇలాంటి వెనుకబడిన వర్గాలకు చెందిన బాలలకు రిచ్ స్నాక్స్, లవ్ మ్యూజిక్ వంటి అధునాతన సంస్కృతిని చేరువ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు సామాజికవేత్తలు హెచ్‌బీ అండ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 10కే రన్



రాంగోపాల్‌పేట్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సహారా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నెక్లెస్ రోడ్‌లోని సంజీవయ్య పార్కు నుంచి జలవిహార్ వరకు 10కే రన్ నిర్వహించారు. దివ్యాంగులతో పాటు పెద్ద ఎత్తున యువత రన్‌లో పాల్గొని వారికి బాసటగా నిలిచారు. ఈ సందర్భంగా సహారా ఫౌండేషన్ చైర్మన్ శంకర్ మాట్లాడుతూ.. దివ్యాంగులు ఇతరులతో పోటీ పడేందుకు అనేక అవరోధాలు ఉంటాయని, వాటిని అధిగమించి ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు తమవంతు సహకారం అందిస్తున్నామని చెప్పారు. వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు ఈ పరుగు నిర్వహిస్తున్నామని, తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

వెంకటస్వామి సేవలను దేశం మరువదు

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్
- ట్యాంక్‌బండ్ వద్ద నివాళులర్పించిన పలువురు


వెంకటస్వామి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్

కవాడిగూడ: బడుగుల ఆశాజ్యోతి, కేంద్ర మాజీ మంత్రి దివంగత జి.వెంకటస్వామి దేశానికి చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. సామాన్య కార్యకర్త నుంచి కేంద్రమంత్రి స్థాయికి ఎదిగి అట్టడుగు వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని, ముఖ్యంగా ఇళ్లులేని నిరుపేదలకు ఆయన చేసిన సేవలు మరువలేనివని, అందుకే ఆయన గుడిసెల వెంకటస్వామిగా పేరు పొందారని కొనియాడారు. అంబేద్కర్ విద్యా సంస్థలను ఏర్పాటు చేసి ఎంతో మంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారని, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన ప్రధాన పాత్రపోషించారన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. వెంకటస్వామి 10వ వర్ధంతిని సందర్భంగా ట్యాంక్‌బండ్‌లోని ఆయన విగ్రహం వద్ద శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు నాగరాజు, జి.వివేక్ వెంకటస్వామి, వినోద్ కుమార్, మాజీ మంత్రి శంకర్‌రావు హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు. షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు ఉస్తాద్ రాజు, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ మన్నె శ్రీధర్‌తో పాటు దళిత సంఘాల నేతలు, అభిమానులు హాజరై నివాళులర్పించారు.

పద్మశాలి డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సాక్షి, సిటీబ్యూరో: పద్మశాలి డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. నగరంలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. జిల్లాస్థాయి పద్మశాలి ఉద్యోగుల ఆత్మీయ సమావేశాలు, ప్రతిభా పురస్కార కార్యక్రమాలు నిర్వహించిన జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులకు సమావేశం అభినందనలు తెలిపింది. సంఘాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించింది. పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలని పేర్కొంది. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ మెంబర్లు తిరందాసు యాదగిరి, శిరందాసు యాదగిరేందర్, గంజి రాంమోహన్, కడవేరు లక్ష్మీపతి, చింతకింది సుజాత, వడ్లకొండ వెంకట్‌రావు, నోముల చంద్రశేఖర్, గుండు శ్రీనివాసులు, విజయలక్ష్మి, వివిధ జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాసబత్తిని రాజేశం, పున్న శ్రీనివాసులు, కొలిపాక సారయ్య, పరిగిపండ్ల కోటేశం, సుభాష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు

ఖాళీలన్నీ భర్తీ చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఉన్న ఖాళీలు, ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరుద్యోగులతో చర్చలు జరిపి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, నిరుద్యోగ ఐకాస చైర్మన్ నీల వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో నిర్వహించిన నిరుద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే రెండున్నర లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే నామమాత్రంగా నోటిఫికేషన్లు ఇస్తూ నిరుద్యోగులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. నిరుద్యోగుల అండదండలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ఖాళీలన్నీ భర్తీ చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగుల ఉద్యమాన్ని కూడా చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నందగోపాల్, సుధాకర్, సతీష్‌కుమార్, పృథ్వి, నిఖిల్, వెంకటేష్, బలరామ్, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

బిర్యానీలో బ్లేడ్ ముక్కలు

పీఎస్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు



ఘట్‌కేసర్: ఓ బార్, రెస్టారెంట్‌లో బిర్యానీ తినడానికి వెళ్లగా బిర్యానీలో బ్లేడు ముక్కలు వచ్చిన ఘటన ఘట్‌కేసర్‌లో శనివారం రాత్రి జరిగింది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్‌లో నివాసముండే బీబీనగర్ మండలం మక్తఅనంతారం గ్రామానికి చెందిన బింగి ఐలయ్య స్నేహితులతో కలిసి బిర్యానీ తినడానికి పట్టణలోని ఆదర్శ్ బార్, రెస్టారెంట్‌కు వెళ్లాడు. బిర్యానీ ఆర్డర్ అనంతరం సర్వ్ చేశారు. బిర్యానీలో బ్లేడ్ ముక్కలు రావడంతో అవాక్కయ్యారు. వెంటనే రెస్టారెంట్ నిర్వాహకులను నిలదీయగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. దీంతో బాధితులు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై రెస్టారెంట్ యాజమాన్యాన్ని సమాచారం కోరగా మూడు సార్లు బియ్యం కడుగుతామని, అప్పుడు కనిపించని బ్లేడు ముక్కలు బిర్యానీలో ఎలా వస్తాయని ప్రశ్నించారు. బిల్లు చెల్లించకుండా ఉండేందుకు కావాలనే ఆరోపణలు చేస్తున్నారని వారు తెలిపారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్‌, సోమవారం, 23, డిసెంబర్‌, 2024





ఆర్ట్ ఫుల్.. ఫెస్టివల్..

కళాత్మకంగా క్రిస్మస్ అలంకరణలు..

క్రిస్మస్ అంటే దయా, కరుణల జన్మదినం. ఇచ్చి పుచ్చుకోవడంలోని ఆనందం. అంతేనా.. క్రిస్మస్ అంటే కళాత్మకత కూడా అని నిరూపిస్తున్నారు సిటిజనులు. క్రీస్తు జన్మదినానికి కొన్ని రోజుల ముందుగానే నగరంలో మొదలయ్యే వేడుకలు ఆద్యంతం కళాత్మకతకు అద్దం పడతాయి. పండుగ సంప్రదాయాన్ని పాటిస్తూనే ఇటు వైవిధ్యానికీ అటు సృజనాత్మకతకు పెద్దపీట వేస్తాయి. ముఖ్యంగా క్రిస్మస్ చెట్టు, ఇతర అలంకరణలకు సంబంధించిన సందడి నెల రోజుల ముందు నుంచే మొదలవుతుంది.. ఈ నేపథ్యంలో దీనిపై మరిన్ని విశేషాలు..

- సాక్షి, సిటీబ్యూరో



- ప్రతి అలంకరణ వెనుకా ఓ ప్రత్యే'కథ'..
- శాంటా క్లాజ్.. సర్వత్రా క్రేజ్..
- ఇటు సంప్రదాయం.. అటు వైవిధ్యం
- నగరంలో యేటా పెరుగుతున్న క్రిస్మస్ సందడి
- విద్యుత్ కాంతులకూ ఓ ప్రత్యేకత



క్రిస్మస్ ముందు రాత్రి సమయంలో వచ్చి, అనుకోని విధంగా మంచి పిల్లలకు మాత్రమే బహుమతులు పంచే శాంటాక్లాజ్ పాత్రకు నేపథ్యం చర్చిఫాదర్ సెయింట్ నికోలస్ అని చరిత్ర చెబుతోంది. క్రిస్మస్ వేడుకల కోసం శాంటాక్లాజ్‌లను తయారు చేయడంలో నగరంలో వివిధ రకాల కొత్త పద్ధతులు, గెటప్స్ పుట్టుకొస్తున్నాయి. ఎరుపు రంగు దుస్తుల్లో పొడవైన తెల్లని గెడ్డం, క్యాప్... ఈ మూడూ ప్రధానంగా తీసుకుని, మిగిలిన గెటప్స్‌కూ సృజనాత్మకతను జోడిస్తూ వెరైటీ 'శాంటా'లను సృష్టిస్తూ పిల్లలను ఆకట్టుకుంటున్నారు.

పండుగ బీట్.. డిజైనర్ 'ట్రీ'ట్..

దాదాపు 15వ శతాబ్దపు ప్రాంతంలో క్రిస్మస్ రోజున కుటుంబ సభ్యులు తామే చెట్లు తయారు చేసి దాని చుట్టూ పరస్పరం ఇచ్చి పుచ్చుకునే బహుమతులను ఉంచేవారట. చిన్నా పెద్దా దాని చుట్టూ ఆడిపాడేవారట. వీటిని యులె ట్రీ అని కూడా పిలిచేవారట. అలా ఇది ఒక సంప్రదాయంగా స్థిరపడింది. సాధారణంగా ఈ చెట్టును పీవీసీతో లేదా ప్లాస్టిక్‌తో తయారు చేస్తారు. నగరంలో క్రిస్మస్ ట్రీ రూపకల్పనకు ఆకాశమే హద్దు అన్నట్టు డిజైనర్ ట్రీలు వచ్చేస్తున్నాయ్ 'రెండు వారాల కిందటే కాలనీలో క్రిస్మస్ ట్రీని తయారు చేశాం. రోజుకో అలంకరణ జత చేస్తున్నాం. పండుగ రోజున దీన్ని అనూహ్యమైన రీతిలో అలంకరించి అందరినీ థ్రిల్ చేయనున్నాం' అని కూకట్‌పల్లి నివాసి జెఫ్రీ చెప్పారు. ఎత్తు విషయంలోనూ ఇంతింతై అన్నట్టుగా.. క్రిస్మస్ ట్రీలు 3 నుంచి 30 అడుగుల వరకూ చేరుకున్నాయి. 'సగటున మేం రోజుకు 20 క్రిస్మస్ చెట్లు అమ్ముతున్నాం. రూ.1000 నుంచి రూ.3000 వరకూ ధర ఉండేవి బాగా అమ్ముడవుతున్నాయి' అని సికింద్రాబాద్‌లోని ఓ షాపు యజమాని చెప్పారు.

స్టార్.. సూపర్..

అవతారపురుషుని రాకకు చిహ్నంగా ముందుగా ఒక ప్రత్యేకమైన నక్షత్రం ఉద్భవించింది. అందుకే ఈ వేడుకల్లో స్టార్‌కు చాలా ప్రాధాన్యత ఉంటుంది. నక్షత్రమార్గం అంటే దేవుని మార్గం. దేవుని వైపు దారి చూపించేదిగా దీన్ని భావిస్తారు. ఈ వేడుకల్లో భాగంగా నగరంలో రకరకాల లైట్ల వెలుతురులో మెరిసిపోయే స్టార్స్ క్రిస్మస్ సందడిని రెట్టింపు చేస్తున్నాయి.

ప్రేమ సందేశమే ప్రధానం..

ఈ పండుగ వేడుకల్లో ప్రధానమైన శాంతాక్లజ్, ట్రీ, క్రిబ్.. వంటివన్నీ పండుగ విశిష్టతకు, సేవాభావపు ఔన్నత్యానికి అద్దం పట్టేవే. వీటిని నగరంలో ఎవరికి నచ్చినట్టు వారు అందంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇది మంచిదే అయినా ఆయా విశేషాలు అందించే ప్రేమ సందేశాలను కూడా తెలుసుకోవడం, తెలియజెప్పడం అవసరం అంటున్నారు సికింద్రాబాద్‌లోని అమృతవాణి డైరెక్టర్ ఫాదర్ ఉడుముల బాలశౌరి.

విశేషాల క్రిబ్.. వెరైటీలకు కేరాఫ్

ఏసు జన్మించిన స్థలానికి సంబంధించిన విశేషాలను తెలియపరిచే క్రిబ్.. 1223లో తొలిసారి సెయింట్‌ఫ్రాన్సిస్ అనే వ్యక్తి రూపకల్పన చేశాడంటారు. దీనినే నేటివిటీ సీన్ లేదా మ్యాంగర్ సీన్ వంటి పేర్లతోనూ పిలుస్తారు. పశువులపాకలో ఏసు పుట్టాడనేదానికి సూచికగా దీనిని అందంగా ఏర్పాటు చేస్తుంటారు. పలు జంతువులతో పాటు పేదలు, రాజులు ఇలా అందరూ ఉండే చోట కొలువుదీరేలా దీన్ని నెలకొల్పే విధానం ఆకట్టుకుంటుంది. గడ్డిని తెచ్చి పాకను వేసి చిన్నారి క్రీస్తును కొలువుతీర్చి.. ఇలా చక్కగా డిజైన్ చేసే క్రిబ్ నగర క్రిస్మస్ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. క్రిస్మస్ రోజుల్లో దాదాపు ఒకటి రెండు రోజుల పాటు సమూహాలుగా ఈ క్రిబ్ తయారీలో పాల్గొనడం కూడా చాలా మందికి నచ్చే విషయం.



సినిమా గ్లామర్ ప్రపంచం..

సెలూన్ ప్రారంభంలో సినీ నటి ఫరియా అబ్దుల్లా



సాక్షి, సిటీబ్యూరో: అందానికి, సినిమా రంగానికీ అవినాభావ సంబంధం ఉందని, ఇది గ్లామర్ ప్రపంచం అని సినీ నటి ఫరియా అబ్దుల్లా పేర్కొన్నారు. అంజాద్ హబీబ్ సెలూన్ శిక్షణ అకాడమీ కుకట్‌పల్లి శాఖను ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ అందంగా కనిపించాలని కోరుకుంటారు. ఒక వ్యక్తిని చూసి నలుగురు మెచ్చేలా తీర్చిదిద్దడంలో బ్యూటీషియన్ల పాత్ర చాలా ప్రత్యేకమన్నారు. హెయిర్ స్టైల్, చర్మం, నెయిల్, సంబంధిత రంగాల్లో నిపుణులైన వారికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. బ్యూటీషియన్లుగా శిక్షణ పొందేందుకు అధునాతన శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

నగరానికి ఆంథోనీ లజారో..



సాక్షి, సిటీబ్యూరో: ఇటలీకి చెందిన ప్రముఖ పాప్ గాయకుడు ఆంథోనీ లజారో నగరానికి వస్తున్నారు. క్రిస్మస్ పండుగ సంబరాల నేపథ్యంలో ఈ నెల 25న తనదైన శైలి సంగీతంతో నగరవాసుల్ని పలకరించనున్నారు. ప్రస్తుతం తాను నిర్వహిస్తున్న ఇండియా టూర్‌లో భాగంగా కాఫీ కప్, లవ్ లెటర్, ది సిటీ లైట్స్.. తదితర తన పాపులర్ సాంగ్స్‌తో వీనుల విందు చేయనున్నారు. మాదాపూర్‌లోని మైండ్‌స్పేస్ సోషల్‌లో రాత్రి 7 గంటల నుంచి ఆయన సంగీత కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎంట్రీలను ఆ లైన్‌లో కొనుగోలు చేయవచ్చు.



క్రిస్మస్ వేళ.. వింటర్ ఉత్సవ్ మేళా..



ఖైరతాబాద్ : నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజాలో క్రిస్మస్ సందడి మొదలైంది. ఆదివారం వీకెండ్ కావడంతో భారీగా సందర్శకులు తరలివచ్చారు. వింటర్ ఉత్సవ్ మేళాకు తరలివచ్చిన సందర్శకులకు స్వాగతం పలుకుతూ శాంటాక్లాస్ అందర్నీ ఆకట్టుకున్నాడు. సందర్శకులు శాంటాక్లాస్‌తో ఫొటోలు దిగుతూ సందడి చేశారు. ఈ మేళాకు వచ్చినవారికి గిఫ్టులు అందజేయడంతో పాటు న్యూ ఇయర్ వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకుడు మిర్జా రఫీక్ బేగ్ తెలిపారు.

విజ్ఞానం.. వికాసం..





కవాడిగూడ : ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న 37వ జాతీయ పుస్తక ప్రదర్శనలోని బోయి విజయ భారతి వేదికపై తెలంగాణ బాలోత్సవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సాహితీ ప్రియులను, సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సిరీ ఆర్ట్స్ ఆధ్వర్యంలో పెయింటింగ్ పోటీలు, అనిల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల బృంద నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. డాక్టర్ సీఏ ప్రసాద్ నిర్వహణలో ప్రముఖ మహిళల ప్రదర్శన ఆలోచింపజేసింది. పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసి వారిలోని విజ్ఞాన వికాసానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని చొక్కాపు వెంకటరమణ, భూపతి వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులుగా పుస్తకాలను అందజేశారు.

స్మార్ట్‌తో సమయం ఆదా..

ప్రముఖ సినీ తారలు

బంజారాహిల్స్: వ్యాపార రంగంలో సాంకేతికంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా పరుగులు తీయాలని ప్రముఖ సినీ సెలబ్రిటీలు అన్నారు. బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో మనడ ఎంబ్రాయిడరీ మెషీన్ సొల్యూషన్ టీవీ, టాలీవుడ్ సీనియర్ నటులు అన్నపూర్ణమ్మ, కవిత, యాడ్ ఫిల్మ్ డైరెక్టర్ యమున కిషోర్, టెలివిజన్ నటులు కౌశిక్, సెల్వరాజ్, గిరీష్‌లు ఆవిష్కరించారు. నటి కవిత మాట్లాడుతూ ప్రస్తుతం ఏ రంగాన్ని తీసుకున్నా సాంకేతికంగా పరుగులు తీస్తుందన్నారు. అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ మగువల ఫ్యాషన్‌కు తగ్గట్లు విభిన్న రకాల కట్టింగ్స్, ఎంబ్రాయిడరీ డిజైన్స్ అందించే స్మార్ట్ యంత్రాలు ఎంతో సమయాన్ని ఆదా చేస్తాయన్నారు. మనడ ఎంబ్రాయిడరీ యండి మనోజ్, జియం తనుజా ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు అవార్డులను అందజేశారు.





సీసీ కెమెరా ఇదొక నిఘా నేత్రం.. అంతేకాదు 100 మంది పోలీసులతో సమానం.. బడా షాపింగ్ మాల్స్, బంగారం అమ్మే దుకాణాలు, సంపన్నుల ఇళ్లు, వ్యాపార సముదాయాల వద్ద కనబడే సీసీ కెమెరాలు.. ప్రస్తుతం పంట పొలాల వరకూ వీటి వినియోగం పెరిగింది. సోలార్‌తో పనిచేసే సీసీ కెమెరాలు సైతం మార్కెట్‌లో అందుబాటులోకి రావడంతో విద్యుత్ సరఫరా లేని పంట పొలాలు, కూరగాయల తోటల్లో రైతులు వీటిని అమర్చుకుంటున్నారు. ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని పంటపొలాలు, కూరగాయల తోటల్లో సీసీ కెమెరాల వినియోగంపై సాక్షి ప్రత్యేక కథనం.. - శామీర్‌పేట్

నిఘా సాగు..

- పంటపొలాల్లో సీసీ కెమెరాల వినియోగం
- కూరగాయల తోటల్లో విరివిగా ఏర్పాటు
- మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పొలాల్లో దర్శనం
- సోలార్, సాంకేతిక పరికరాలపై రైతుల దృష్టి

హైదరాబాద్ మహానగరానికి ఆనుకొని ఉన్న మేడ్చల్ జిల్లా, ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని రైతులు పంటపొలాల్లో సీసీ కెమెరాలను వినియోగం విరివిగా కనిపిస్తుంది. సాగుపై నిఘా కోసం సోలార్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మండలంలోని రైతులు ఎక్కువగా కూరగాయలు, వాణిజ్య పంటలను సాగు చేస్తుంటారు. దీంతో తోటల్లో వ్యవసాయ కూలీల పనితీరును గమనించడంతో పాటు రాత్రి వేళల్లో దొంగల నుండి దిగుబడులను కాపాడుకునేందుకు సీసీ కెమెరాలను వినియోగిస్తున్నారు. నగర వాసులతో సమానంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ.. ఏ ప్రాంతంలో ఉన్నా తమ ఫోన్‌లోని యాప్ ద్వారా పంటలను పర్యవేక్షిస్తున్నారు.



పంట దొంగల నుంచి రక్షణగా..

సుమారు 12 ఎకరాల్లో కూరగాయలు సాగుచేస్తున్నా. తోటలు ఊరికి చివరగా ఉండటంతో కొందరు దుండగులు తోటలోకి ప్రవేశించి కూరగాయలను ఎత్తుకెళుతున్నారు. దీంతో దిగుబడి తగ్గిపోయి నష్టాలు చవిచూసేవాళ్లం. ప్రస్తుతం సీసీ కెమెరాల ఏర్పాటుతో ఎలాంటి చోరీలూ జరగడంలేదు. అంతేకాకుండా కూలీల పనితీరును నిత్యం గమనిస్తున్నాను.

- హరిమోహన్‌రెడ్డి, పోతారం రైతు (మూడుచింతలపల్లి)





సదస్సులో ప్రదర్శించిన గాంధీ విగ్రహాలు

500 గాంధీ విగ్రహాల ప్రదర్శన

- 120 మంది విద్యార్థులతో చరఖా ప్రదర్శన
- యాదగిరిగుట్టలో 'జాతీయ గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు -2024'
- ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

యాదగిరిగుట్ట: గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ఆధ్వర్యంలో 'జాతీయ గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు -2024'ను యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని రెడ్డి సంక్షేమ భవన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలసి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ సదస్సును ప్రారంభించారు. ఈ సదస్సులో 500 గాంధీ విగ్రహాలను ప్రదర్శించారు. అంతేకాకుండా 120 మంది విద్యార్థులు చరఖా ప్రదర్శన, 100 మంది విద్యార్థులు గాంధీ వేషధారణతో అలరించారు. అలాగే 204 ప్రపంచదేశాల స్టాంపులు, నాణేలు, కరెన్సీ నోట్లను ప్రదర్శించారు. వీటితో పాటు రాజులకాలం నాటి రాజముద్రలు పురాతన చార్మినార్ నమూనా నాణేలు, భక్త రామదాసు కాలం నాటి శ్రీసీతారామ కల్యాణం మోడల్ నాణేలు, 100 రకాల పక్షుల స్టాంపులు, 100 దేశాల్లోని వివిధ జాతులకు సంబంధించిన గుర్రాల స్టాంపులు, బ్రిటిష్ కాలంనాటి అరుదైన భారత నాణేలను స్టాల్స్‌లో ప్రదర్శనకు ఉంచారు. అలాగే వివిధ రకాల తినుబండారాలు, మధుమేహ నియంత్రణకు ప్రత్యేక బియ్యం, గానుగ నూనె తయారీ, బయోగ్యాస్ తయారీ విధానాన్ని తెలియజేసే అంశాలకు సంబంధించి స్టాల్స్ ఏర్పాటు చేశారు. వీటిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి తదితరులు సందర్శించారు. అలాగే ఈ సదస్సులో తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 115 మంది ఉత్తమ రైతు జంటలకు పుడమి పుత్ర అవార్డులు అందజేశారు. కాగా, వ్యవసాయ అనుబంధ రంగాల్లో విశిష్ట సేవలందించిన 35 మంది అధికారులు, శాస్త్రవేత్తలు, జర్నలిస్టులకు కిసాన్ సేవా రత్న అవార్డులు ప్రదానం చేశారు. మంత్రి కోమటిరెడ్డి, ఐలయ్య, ఎంపీ చామల, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా వీటిని అందజేశారు.

సాక్షి, హైదరాబాద్

భాగ్యనగరంలో కాలుష్యమయంగా మారిన మూసీ నదికి నాలుగు దశల్లో పునరుజ్జీవం కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. తొలి విడతలో నదీ జలాల శుద్ధితో పాటు వర్షపునీటి నిర్వహణ, వ్యర్థాలు, వరదల నియంత్రణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. అలాగే రెండో దశలో ల్యాండ్‌స్కేపింగ్‌ను అభివృద్ధి చేసి నది సహజసిద్ధ లక్షణాన్ని పునరుద్ధరించాలనుకుంటోంది. ఇక మూడో విడతలో మూసీ పరీవాహక కారిడార్‌లలో రవాణా హబ్‌లను ఏర్పాటు చేయాలని, నాలుగో దశలో ఆదాయార్జన కోసం మూసీ చుట్టూ వాణిజ్య, సాంస్కృతిక ఆదాయ వనరులను గుర్తించాలనుకుంటోంది. ఈ ప్రాజెక్టును అమలు చేసేందుకు అవసరమైన నిధుల కోసం కసరత్తు మొదలుపెట్టిన మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) తొలి విడత పనులకు రూ. 5,863 కోట్లు అవసరమని అంచనా వేసింది. అందులో రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం (రూ. 1,763 కోట్లు) నిధులను సమకూరిస్తే మిగిలిన 70 శాతం (రూ. 4,100 కోట్లు) నిధులను ప్రపంచ బ్యాంక్ నుంచి రుణం తీసుకోవాలని భావిస్తోంది. ఈ మేరకు వరల్డ్ బ్యాంక్ నుంచి రుణానికి అనుమతి ఇవ్వాలంటూ రాష్ట్ర సర్కారు కేంద్ర ప్రభుత్వానికి ప్రిలిమినరీ ప్రాజెక్ట్ రిపోర్ట్ (పీపీఆర్)ను అందజేసినట్లు విశ్వసనీయ సమాచారం.



తొలివిడత పనులకు ఏ సంవత్సరంలో ఎంత ఖర్చు పెట్టనున్నారంటే.. (రూ. కోట్లలో)			
	తొలి ఏడాది	రెండో ఏడాది	మూడో ఏడాది
	500	1,000	1,000
	నాలుగో ఏడాది	ఐదో ఏడాది	ఆరో ఏడాది
	1,000	1,000	1,363

చతుర్భుజం.. మూసీ పునరుజ్జీవం..!

నాలుగు భాగాలుగా మూసీ పునరుద్ధరణ ప్రణాళికలు

- తొలి విడతలో మూసీ నీటిశుద్ధి, నిర్వహణ, వ్యర్థాలు, వరదల నియంత్రణ
- రెండో దశలో ల్యాండ్ స్కేపింగ్ అభివృద్ధి.. మూడో దఫాగా రవాణా హబ్‌ల ఏర్పాటు
- నాలుగో విడతలో మూసీ చుట్టూ వాణిజ్య, సాంస్కృతిక ఆదాయ వనరుల గుర్తింపు
- తొలి దశ పనులకు రూ. 5,863 కోట్లు అవసరమని ఎంఆర్‌డీసీఎల్ అంచనా
- ప్రపంచ బ్యాంకు నుంచి 70% రుణానికి అనుమతివ్వాలని కేంద్రానికి వినతి

2030 డిసెంబర్ 30 నాటికి ప్రాజెక్టు పూర్తి..

హైదరాబాద్ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూనే ప్రపంచ స్థాయిలో మూసీ పునరుద్ధరణకు నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం.. మూసీ నదిని శుద్ధి చేసి పర్యాటక, వాణిజ్య ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రూపొందించింది. 2030 డిసెంబర్ 30 నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఈస్ట్-వెస్ట్ కారిడార్ నిర్మాణం..

మూసీ ప్రాజెక్టు వల్ల నిరాశ్రయులయ్యే కుటుంబాలకు పునరావాసం కల్పించడంతోపాటు మూసీ భవిష్యత్తు అభివృద్ధికి అవసరమైన భూముల కోసం ల్యాండ్ పూలింగ్‌ను ప్రభుత్వం చేపట్టనుంది. నది వెంట తూర్పు, పడమర ప్రాంతాలను కలుపుతూ కారిడార్‌ను నిర్మించనుంది. దీని వల్ల ఔటర్ రింగ్‌రోడ్ నుంచి ప్రధాన నగరంలోకి రవాణా సులువు కానుంది. అలాగే మూసీ చుట్టూ 16–18 ప్రాంతాల్లో హెరిటేజ్ బ్రిడ్జీలను నిర్మించడంతోపాటు ఆయా ప్రాంతాల్లో వ్యాపారస్తుల కోసం స్థలాలను కేటాయించనుంది. మూసీ వెంబడి రిక్రియేషనల్ జోన్లు, పార్కులను కూడా ఏర్పాటు చేయనుంది.

రీసైకిల్ వాక్‌వేలు, పార్కింగ్ ప్లేస్‌లు..

మూసీ పరిసర ప్రాంతాల్లో రీసైకిల్ చేసిన వస్తువులు, ఉత్పత్తులతో వాక్ వేలు, పార్కింగ్ ప్రాంతాలను ప్రభుత్వం నిర్మించనుంది. అలాగే వాతావరణ మార్పులను దృష్టిలో పెట్టుకొని రెయిన్ గార్డెన్‌లు, గ్రీన్ రూఫ్‌లను ఏర్పాటు చేయనుంది. వరదలు, విపత్తుల నిర్వహణకు ఎలివేటెడ్ స్ట్రక్చర్లు, ఫ్లడ్ బారియర్లను కట్టనుంది. వరద ముప్పును పసిగట్టడం, నీటి నాణ్యత, నీటి ప్రవాహాలను సమర్థంగా నిర్వహించడంతోపాటు వనరుల కేటాయింపు, ప్రణాళిక, నిర్వహణ వ్యవస్థలను మెరుగుపరిచేందుకు భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్), కృత్రిమ మేధ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతలను వినియోగించనుంది.

ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం..

పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) ద్వారా పర్యాటకం, ఆతిథ్యం, స్థిరాస్తి రంగాల నుంచి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) కింద నిధులను సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆయా నిధులను సమకూర్చే సంస్థలకు గ్రీన్‌బాండ్లను జారీ చేయనున్నట్లు తెలిసింది. అలాగే మూసీ చుట్టూ ఉమ్మడి అభివృద్ధి ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్ అభివృద్ధి కార్యక్రమాలతోపాటు స్పాన్సర్‌షిప్‌లు, పేర్ల హక్కులు, పర్యాటక కార్యకలాపాలతో ఆదాయ వనరులను సృష్టించనుంది.

దరఖాస్తుల జోరు.. పరీక్షకు రారు!

▶ మొదటి పేజీ తరువాయి

భావించే గ్రూప్-1, 2, 3, 4 ఉద్యోగాల విషయంలోనూ పరిస్థితి ఇలాగే ఉండటం గమనార్హం.

సాగదీతలు.. వాయిదాలతో..

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో దాదాపు 11 వేల గ్రూప్ ఉద్యోగాల భర్తీ కోసం 2022లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్లు జారీ చేసింది. 2022 ఏప్రిల్‌లో 503 గ్రూప్-1 ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీకాగా.. రెండు సార్లు ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించాక ఆ నోటిఫికేషన్ రద్దయింది. దాని స్థానంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో 563 పోస్టులతో మళ్లీ నోటిఫికేషన్ జారీ చేసింది. గతంలో దరఖాస్తు చేసుకున్న వారిని కొనసాగిస్తూనే... కొత్త అభ్యర్థుల నుంచి కూడా దరఖాస్తులను స్వీకరించింది. దాదాపు రెండున్నరేళ్ల పాటు సాగిన ఈ గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఇప్పుడు చివరిదశకు చేరింది. ఇక గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్లు కూడా 2022 డిసెంబర్‌లో వెలువడ్డాయి. గ్రూప్-4 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఇటీవలే పూర్తికాగా.. గ్రూప్-2, 3 పరీక్షలు పూర్తయ్యాయి. ఇందులో గ్రూప్-2 అర్హత పరీక్షలు మూడుసార్లు వాయిదా పడగా.. గ్రూప్-3 పరీక్షలు రెండుసార్లు వాయిదా పడ్డాయి. ఇలా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఏళ్ల తరబడి సాగుతుండటంతో అభ్యర్థుల్లో ఉత్సాహం తగ్గిపోతుందని.. వాటికోసం వేచి చూసే బదులుగా ప్రత్యామ్నాయ ఉద్యోగాల వైపు చూస్తున్నారని నిపుణులు చెబుతున్నారు.

హాజరుశాతం.. క్రమంగా పతనం..

గత ఏడాది జూలైలో గ్రూప్-4 పరీక్షలు జరిగాయి. ఒకే రోజు రెండు సెషన్లలో ఈ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 9.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. హాజరైనవారు సుమారు ఏడున్నర లక్షల మంది మాత్రమే. అంటే 80 శాతం మందే పరీక్షలు రాశారు. ఇక గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు హాజరైనవారు 74 శాతమే. ప్రిలిమినరీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిలో నుంచి.. ఒక్కో పోస్టుకు 50మంది చొప్పున మెయిన్స్‌కు 31,403 మందిని కమిషన్ ఎంపిక చేసింది. బాగా ప్రిపేరైన వారే మెయిన్స్‌కు ఎంపికవుతారు. అలాంటి మెయిన్స్‌కు కూడా 67.17శాతం మందే హాజరవడం గమనార్హం. గ్రూప్-3 పరీక్షలకు కేవలం 50.24 శాతం మంది, గ్రూప్-2 పరీక్షలకు మరీ తక్కువగా 45.57 శాతమే హాజరయ్యారు.

టీజీపీఎస్సీ భర్తీ చేపట్టిన గ్రూప్స్ పోస్టులివీ..	కేటగిరీ	పోస్టులు
	గ్రూప్-1	563
	గ్రూప్-2	783
	గ్రూప్-3	1,388
	గ్రూప్-4	8,180

గ్రూప్స్ పరీక్షలకు దరఖాస్తులు, హాజరుశాతం తీరు ఇదీ..

పరీక్ష	తేదీ	దరఖాస్తులు	హాజరైనవారు	శాతం
గ్రూప్-4 (ఉదయం)	01.07.2023	9,51,205	7,62,872	80.20
గ్రూప్-4 (మధ్యాహ్నం)	01.07.2023	9,51,205	7,61,198	80.02
గ్రూప్-1 ప్రిలిమ్స్	09.06.2024	4,03,645	3,02,000	74.00
గ్రూప్-1 మెయిన్స్	అక్టోబర్ 21-27	31,403 (ఎంపిక)	21,093	67.17
గ్రూప్-3 (డే-1)	17.11.2024	5,36,400	2,72,173	50.70
గ్రూప్-3 (డే-2)	18.11.2024	5,36,400	2,69,483	50.24
గ్రూప్-2 (డే-1)	15.12.2024	5,51,855	2,55,490	46.30
గ్రూప్-2 (డే-2)	16.12.2024	5,51,855	2,51,486	45.57

ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మారాలి



ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రక్రియ ఆశాజనకంగా ఉండటం లేదు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు ఉంటున్నా క్రమం తప్పకుండా భర్తీ చేయడం లేదు. ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థులు నిరాశలో కూరుకుపోతున్నారు. పైగా నోటిఫికేషన్లు జారీ చేశాక పరీక్షల నిర్వహణ, వాయిదాలతో సుదీర్ఘ జాప్యం జరుగుతోంది. దరఖాస్తు చేసినవారు పరీక్షల నాటికి ఇతర ఉద్యోగాల వైపు వెళ్తున్నారు. దీనితో దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తుండగా.. హాజరు అంతంత మాత్రంగానే ఉంటోంది. ఈ పరిస్థితిని అధిగమించాలంటే క్రమం తప్పకుండా నోటిఫికేషన్లు జారీ చేస్తూ.. భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలి.

– అబ్దుల్ కరీం, సీనియర్ ఫ్యాకల్టీ, హైదరాబాద్

కాలయాపన వల్లే ఆసక్తి చూపడం లేదు

ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో తీవ్ర కాలయాపన జరుగుతోంది. గతంలో ప్రైవేటు సెక్టార్‌లో అవకాశాలు తక్కువగా ఉన్న సమయంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం లక్ష్యాన్ని నిర్దేశించుకుని సన్నద్ధమయ్యేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఒక ఉద్యోగం కాకుంటే మరో ఉద్యోగం వైపు పరుగెత్తాల్సి వస్తోంది. దీంతో ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వెలువడినప్పుడు వస్తున్న దరఖాస్తుల సంఖ్యతో పోలిస్తే.. పరీక్షలకు హాజరయ్యే వారి సంఖ్య భారీగా తగ్గుతోంది. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు చేస్తున్నవారు కూడా ప్రభుత్వ నోటిఫికేషన్లకు దరఖాస్తు చేస్తున్నారు. పరీక్షల నాటికి వారి లక్ష్యాలు మారిపోతున్నాయి.

– భవాని శంకర్ కోదాలి, నిపుణులు, కెరీర్ గైడ్

ముండ్లమూరులో మళ్లీ భూకంపం

రిక్టర్ స్కేల్‌పై 2.1గా నమోదు


భూకంపం ధాటికి శ్లాబ్‌కు పగుళ్లు

ముండ్లమూరు(దర్శి): ప్రకాశం జిల్లా ముండ్లమూరులో ఆదివారం మళ్లీ స్వల్ప భూకంపం వచ్చింది. ఉదయం 10.41 గంటల సమయంలో భూమి కంపించడమే కాకుండా పెద్ద శబ్దం వచ్చింది. దీంతో స్థానికులు ఇళ్ల లోపలి నుంచి బయటకు పరుగులుతీశారు. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 2.1 నమోదైందని, భూకంప కేంద్రం గుండ్లకమ్మ నదీ ప్రాంతంలో ఉందని శాస్త్రవేత్తలు చెప్పారు. శనివారం భూకంపం రావడం, ఆ మరుసటి రోజే మళ్లీ భూమి కంపించడంతో మండల ప్రజలు భయపడిపోతున్నారు. అద్దంకి గురుకుల పాఠశాల సమీపంలో భూకంపాలను కనుగొనే కేంద్రం ఉంది. ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో మొత్తం ఆరుసార్లు భూకంపం వచ్చినట్టు చెబుతున్నారు. 1967 మార్చి 27న వచ్చిన భూకంపం రిక్టర్ స్కేల్‌పై 5.4గా, 1975 ఫిబ్రవరి 25న వచ్చిన భూకంపం 3.9గా, 2004 మే 28న వచ్చిన భూకంపం 3.5గా, 2015 ఫిబ్రవరి 25న వచ్చిన భూకంప తీవ్రత 3.7గా నమోదైంది. శనివారం ఉదయం వచ్చిన భూకంపం రిక్టర్ స్కేల్‌పై 3.1గా నమోదైంది.

తెలంగాణ అస్తిత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బ

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలను ప్రజలంతా కలసికట్టుగా ఎదుర్కోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను దూరం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తెలంగాణ మహిళలను, పండుగలను అవమానించిందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్, తెలంగాణ జాగృతి ఎన్నారై విభాగాల ఆధ్వర్యంలో ఆదివారం వివిధ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ వాసులతో జరిగిన ఆన్‌లైన్ సమావేశంలో కవిత మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నారైలు పోషించిన పాత్రను మరువలేమని అన్నారు. ఉద్యమ సమయంలో ఎన్నో అవహేళనలకు గురైనా కూడా తెలంగాణ తల్లి మనలో స్ఫూర్తిని నింపిందని పేర్కొన్నారు. తెలంగాణ తల్లికి ఉద్యమకారులు, కవులు, కళాకారులు కలసి రూపం ఇచ్చారని, అటువంటి తల్లి రూపాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్చడం విషయంలోనూ ప్రభుత్వం గోప్యత పాటించిందని, అంత అవసరం ప్రభుత్వానికి ఎందుకని ప్రశ్నించారు. ఉద్యమ తెలంగాణ తల్లి కోసం మరొక పోరాటం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. కొత్త తెలంగాణ తల్లి రూపానికి గెజిట్ జారీ చేసి ప్రభుత్వం ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని విమర్శించారు. కాగా, బతుకమ్మ పండుగకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు రావడానికి ఎమ్మెల్సీ కవిత ఎంతగానో కృషి చేశారని ఎన్నారై నాయకులు అన్నారు. తెలంగాణ అస్తిత్వంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దాడిని తిప్పికొట్టడంలో తాము కూడా భాగస్వాములవుతామని ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ వేదికలపై కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగడుతామని తెలిపారు. ఈ ఆన్‌లైన్ సమావేశంలో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం, జాగృతి రాష్ట్ర నాయకుడు నవీన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూలు గుటకాయ స్వాహా!

చెన్నై టీ.నగర్ సమాచారం కేంద్రం నుంచి బ్లాక్‌మార్కెట్‌కు..

- ఇక్కడకు ప్రతీవారం 8 వేల నుంచి 10 వేల చిన్న లడ్డూలు, 300 పెద్ద లడ్డూలు, 300 వడలు సరఫరా
- ఇందులో కొన్నే సామాన్య భక్తులకు అమ్మకాలు
- మిగిలినవి సింహభాగం భారీఎత్తున ధర పెంచి విక్రయాలు
- రెండు చిన్నవి, ఒక పెద్ద లడ్డూ, వడ కలిపి రూ.1,500లు..
- సీసీ కెమెరాల పర్యవేక్షణ లేకుండా పక్కదారి
- నిద్ర మత్తులో విజిలెన్స్ అధికారులు
- 'సాక్షి' నిఘాలో వెల్లడైన ఆసక్తికర విషయాలు

భక్తులు పరమ పవిత్రంగా భావించే తిరుమల శ్రీవారి లడ్డూలు పక్కదారి పడుతున్నాయి. ఇంటిదొంగల నిర్వాకంతో బ్లాక్‌మార్కెట్‌కు తరలిపోతున్నాయి. వారం వారం తిరుమల నుంచి వచ్చే ఈ లడ్డూ ప్రసాదాల్లో కొన్నింటినే సామాన్య భక్తులకు విక్రయించి సింహభాగం స్వాహా చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకూ శ్రీవారి లడ్డూల్లో కల్తీ జరిగిందంటూ తెగ గుండెలు బాదుకున్న ముఖ్యనేతలు, ఉన్నతాధికారులు ఇప్పుడీ చేతివాటం గురించి తెలీదనుకోవాలా? తెలిసీ తేలీనట్లు నటిస్తున్నారనుకోవాలా? నిఘా విభాగం కూడా ఏమీ పట్టనట్లు ఉంటోంది. లోగుట్టు శ్రీవారికే ఎరుక. తమిళనాడు రాజధాని చెన్నై టి.నగర్ సమాచార కేంద్రంగా సాగుతున్న ఈ దందాపై 'సాక్షి' నిఘాలో పలు ఆసక్తికర విషయాలు తెలిశాయి. ఇవిగో ఆ వివరాలు..

తిరుమల: శ్రీవారి ప్రసాదాలను సామాన్య భక్తులకు అందుబాటులోకి తీసుకెళ్లాలని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సంకల్పించింది. ఇందులో భాగంగా.. తిరుమల శ్రీవారి లడ్డూ పోటు నుంచి నేరుగా చెన్నై, బెంగళూరు సమాచార కేంద్రాలు.. విజయవాడ, విశాఖపట్నంలోని టీటీడీ కళ్యాణ మండపాలు.. హైదరాబాద్‌లోని టీటీడీ ఆలయాలకు వీటిని తరలించి భక్తులకు అందుబాటులో ఉంచుతోంది. ఎంతో సత్సంకల్పంతో శ్రీకారం చుట్టిన ఈ విధానానికి కొందరు ఇంటిదొంగలు శ్రీవారి ప్రసాదాన్ని పక్కదారి పట్టిస్తూ తూట్లుపొడుస్తున్నారు. చెన్నై నడివీధుల్లో బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తున్నారు. చిన్నలడ్డూలు 2, ఒక పెద్ద లడ్డూ, ఒక వడ కలిపి ప్రత్యేక ప్యాకింగ్ చేసి రూ.1,500కు అమ్మేసుకుంటున్నారు.

చెన్నైలో బ్లాక్‌మార్కెట్లోకి..


తిరుమలలో ఉన్న పోటు ఏఈఓ ఏ సెంటర్‌కు ఎన్ని లడ్డూలు పంపించాలన్న ఇండెంట్, డిమాండ్ ఆధారంగా వాటిని పంపిస్తారు. చెన్నై, బెంగళూరు సమాచార కేంద్రాల్లో ఎక్కువ డిమాండ్ ఉన్నందున చెన్నై కేంద్రానికి ప్రతీవారం 8 వేల నుంచి 10 వేల చిన్న లడ్డూలు, 300 పెద్ద లడ్డూలు, 300 వడలు పంపిస్తున్నారు. కానీ, చెన్నై టి.నగర్‌లోని టీటీడీ సమాచార కేంద్రంలో లడ్డూ ప్రసాదాలు విక్రయాలు జరిగే దగ్గరే పెద్దఎత్తున లడ్డూలు పక్కదారి పడుతున్నాయి. ఇక్కడ పదేళ్లుగా చెన్నైలో తిష్టవేసిన ఇద్దరు అసిస్టెంట్ షరాబులు 'శ్రీనివాసుడి' ప్రసాదాలను సామాన్య భక్తులకు అందకుండా సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. తిరుమల నుంచి టీటీడీ వాహనంలో వచ్చిన స్టాక్‌ను ఇక్కడి సిబ్బంది శ్రవణం హాల్లో దించి అటునుంచి అటే తెల్లవారుజామున 3 గంటల సమయంలో లడ్డూలను ట్రేల నుంచి బాక్స్‌లకు మార్చి ఓ ప్రైవేట్ వాహనంలో తరలించేస్తున్నారు. వచ్చిన లడ్డూల్లో కొన్నింటిని మాత్రమే విక్రయించి.. ఆ తర్వాత చిన్న లడ్డూల స్టాక్ అయిపోయిందంటూ 'నో స్టాక్' బోర్డు పెట్టేస్తున్నారు. 300 పెద్ద లడ్డూలు, 300 వడలు ఏనాడూ సామాన్య భక్తులకు విక్రయించిన దాఖలాల్లేవు.

నిఘా వైఫల్యం..

తిరుమలలో ఒక లడ్డూ ప్రసాదం అధిక ధరకు విక్రయిస్తే తీవ్రంగా పరిగణించే విజిలెన్స్ అధికారులు.. ఇక్కడ వేలకు వేలు లడ్డూలు ప్రైవేట్ వాహనంలో పక్కదారి పడుతున్నా.. నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంలో కంచే చేను మేస్తోందా అనే సందేహాలూ తలెత్తుతున్నాయి. చెన్నై టి.నగర్ సమాచార కేంద్రం నుంచి ప్రైవేట్ వాహనాల్లో స్టాక్ తరలిపోతుంటే సెక్యూరిటీ విభాగం ఏం చేస్తోందని భక్తులు ప్రశ్నిస్తున్నారు. లోపలికి వచ్చే ప్రతి వాహనాన్ని భద్రతా సిబ్బంది రికార్డుల్లో ఎంట్రీ చేయాలి. కానీ, అలాంటిదేమీ జరుగుతున్న దాఖలాలేవీ కనిపించట్లేదు.

వాళ్లకు ఎలాంటి సంబంధం లేదంట?

ఇదిలా ఉంటే.. చెన్నైలో జరుగుతున్న ఈ అవకతవకలపై తమకెలాంటి సంబంధంలేదని సంబంధిత అధికారులు అంటున్నారు. కేవలం స్టాక్ పంపించడం వరకే తమ బాధ్యత అని చేతులెత్తేస్తున్నారు. తిరుమల నుంచి టీటీడీ విజిలెన్స్ సిబ్బంది పర్యవేక్షణలో టీటీడీ వాహనంలోనే ప్రసాదాలను పంపిస్తామని స్పష్టంచేస్తున్నారు.



శ్రీవారి లడ్డూ విక్రయాలకు లెక్కా పత్రం లేదు..

ఇక చెన్నైలో లడ్డూ ప్రసాదాల విక్రయాలకు లెక్కాపత్రం లేదు. సీసీ కెమెరాల నిఘా అంతకన్నాలేదు. అక్రమార్కుల ఆగడాలు చెల్లుబాటయ్యేలా సమాచార కేంద్రంలో ఉన్న శ్రవణం హాల్‌ను కేంద్రంగా చేసుకుని ఇష్టారాజ్యంగా బయటకు తరలించేస్తున్నట్లు 'సాక్షి' నిఘాలో బట్టబయలైంది. నిజానికి.. లడ్డూ ప్రసాదం విక్రయం సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరగాలి. తిరుమలలో ఇస్తున్నట్లుగా ఆధార్ కార్డు ప్రామాణికంగా భక్తులకు రెండు లడ్డూలే ఇవ్వాలి. కానీ, ఇక్కడ అలాంటివేమీ జరుగుతున్నట్లు లేదు. సామాన్య భక్తులకు లడ్డూ ప్రసాదాలు అందకుండా ఏఈవో, అసిస్టెంట్ షరాబులు పక్కదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పదేళ్లుగా ఇక్కడ తిష్టవేసిన సిబ్బందిపై లోతుగా విచారణ జరపాల్సి ఉంది. లడ్డూ ప్రసాదాలు విక్రయించే కౌంటర్ నుంచి కాకుండా.. శ్రవణం హాల్ నుంచి విక్రయాలు చేస్తుండడంపై కూడా దృష్టిపెట్టాలని భక్తులు కోరుతున్నారు.

ఉత్తర 'రింగు' అలైన్‌మెంటుకు ఓకే

- కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ ఆమోదం
- త్వరలోనే ట్రిపుల్ ఆర్‌కు ఎక్స్‌ప్రెస్ వే నంబరు కేటాయింపు
- అలైన్‌మెంటులో మార్పులకు ఇక అవకాశం లేనట్టేనా..!



సాక్షి, హైదరాబాద్: రీజినల్ రింగురోడ్డు ఉత్తర భాగానికి సంబంధించిన అలైన్‌మెంటును కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఆమోదించింది. గతంలోనే జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఆమోదించగా, ఇప్పుడు కేంద్ర మంత్రిత్వ శాఖ తుది ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించిన ఆదేశాలు వెలువడాల్సి ఉంది. ఇక ట్రిపుల్ ఆర్‌కు ఎక్స్‌ప్రెస్ వే నంబరు కూడా త్వరలో రానుంది. అలైన్‌మెంటు ఓకే అయిన నేపథ్యంలో మరో వారం పది రోజుల్లో ఉత్తర భాగానికి టెండర్లు పిలవనున్నారు.

అలైన్‌మెంటు మార్పు వినతుల సంగతేంటి?

ఉత్తర భాగం అలైన్‌మెంటులో కొన్ని మార్పులు చేయాలని ఇటీవల కొందరు ప్రజా ప్రతినిధులు సూచించారు. ఈ మేరకు కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కలిసి వినతులు అందించారు. సంగారెడ్డి సమీపంలో, యాదాద్రి సమీపంలోని రాయగిరి, చౌటుప్పల్ ఇంటర్‌ఛేంజ్ కూడలి.. ఇలా పలుచోట్ల అలైన్‌మెంటును కొంతమేర సవరించాలని కోరారు. ఇందులో ముగ్గురు ఎంపీలు, రాష్ట్ర మంత్రి ఒకరు ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో భూసేకరణకు సంబంధించి కొన్ని భూముల వివరాలు 3డీ గెజిట్‌లో నమోదు కాలేదు. ఆ గెజిట్ విడుదలైతేనే భూసేకరణ జరుగుతుంది. ఎలాగూ గెజిట్‌లో వివరాలు నమోదు కానందున, అలైన్‌మెంటు మార్పు పెద్ద కష్టం కాదనేది నేతల అభిప్రాయం. అయితే కేవలం సాంకేతిక కారణాలతోనే ఆయా భూముల వివరాలు 3డీ గెజిట్‌లోకి రాలేదని, అలాంటి భూములు మొత్తం భూముల్లో కేవలం 0.4 శాతం లోపేనని ఎన్‌హెచ్‌ఏఐ వారికి చెప్పినట్టు తెలిసింది. ఈ సమయంలో అలైన్‌మెంటులో మార్పులు చేస్తే, కొత్త ప్రాంతాల్లో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని కూడా చెప్పినట్టు సమాచారం. అయితే ఆ వినతులను పూర్తిగా కొట్టిపడేయలేదు. దీంతో అలైన్‌మెంటులో మార్పులు జరిగే అవకాశం ఉందన్న ఊహాగానాలు వ్యక్తమయ్యాయి. కానీ తాజాగా కేంద్ర మంత్రిత్వ శాఖ అలైన్‌మెంటుకు ఆమోదముద్ర వేయటంతో మార్పుల అంశంపై ఇచ్చిన వినతులను పరిగణనలోకి తీసుకోలేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఎన్‌హెచ్‌ఏఐ నుంచి స్పష్టత రావాల్సి ఉంది. గతంలో జాతీయ రహదారులకు సంబంధించిన అలైన్‌మెంట్లకు ఎన్‌హెచ్‌ఏఐ ఆమోదంతో సరిపోయేది. అయితే మూడేళ్ల క్రితం కేంద్ర మంత్రిత్వశాఖ కచ్చితంగా ఆమోదముద్ర వేయాలనే నిబంధన వచ్చింది. ఆ మేరకు మంత్రిత్వ శాఖలో కొత్తగా అలైన్‌మెంటు అప్రూవల్ కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ భేటీలోనే ఉత్తర భాగం అలైన్‌మెంటుకు ఆమోదం తెలుపుతూ నిర్ణయం తీసుకున్నారు.

నంబర్ వస్తేనే పర్యావరణ అనుమతులు

త్వరలో టెండర్లు పిలిచేందుకు ఎన్‌హెచ్‌ఏఐ ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో ఆ రోడ్డుకు ఎక్స్‌ప్రెస్ వే నంబరు కేటాయింపు కీలకంగా మారింది. ఆ నంబరు కేటాయిస్తేనే పర్యావరణ అనుమతులు లభిస్తాయి. అవి ఉంటేనే టెండర్లను తెరిచేందుకు వీలుంటుంది. ఈ నేపథ్యంలోనే ఎక్స్‌ప్రెస్ వే నంబరును వీలైనంత త్వరలో కేటాయించాలని నిర్ణయించారు.


ఆదివారం జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నిజామాబాద్ ఎంపీ అరవింద్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్

సాక్షి ఫ్యామిలీ
సన్నిధి
హైదరాబాద్
సోమవారం
23-12-2024

సువార్త



ప్రభువునందు ఆనందించుటే ఆత్మసంబంధ పండుగ

'ఆయన భుజములపై రాజ్య భారముండును','నీ ఇంటిని గూర్చిన ఆసక్తి నన్ను భక్షించియున్నది' అను భవిష్యత్ ప్రవచనాలు క్రీస్తు నందు క్రీస్తు సంఘమనే రాజ్య స్థాపన ద్వారా నెరవేర్చబడ్డాయి. అపొస్తలుల బోధకు కట్టుబడి విధేయంగా దానికి తలవంచే క్రీస్తు ప్రభువు సంఘాలలో ఆత్మసంబంధిత పండుగ వాతావరణం ఎప్పుడూ కనిపిస్తూనే ఉంటుంది.

అపొస్తలుడైన పౌలు బోధ ప్రకారంగా 'ఎల్లప్పుడూ ప్రభువు నందు ఆనందించుడి. మరల చెప్పుదును. ఆనందించుడి'(ఫిలిప్పీ 4:4). ఒకరు ఇలా ఎల్లప్పుడూ క్రీస్తు నందు ఆనందిస్తే అతనికి నిత్యమూ పండుగే. క్రీస్తు సువార్త విని లోబడి ఒక పాపి రక్షించబడితే ఇలా మరణంలో నుండి జీవములోనికి దాటితే పరలోకంలో గొప్ప పండుగ వాతావరణం నెలకొంటుంది. భూలోకం వైపు తొంగి చూస్తూ దేవ దూతలు, దేవ దూతలు సమక్షంలో దేవదూతలే చేసుకోనే పండుగ అది. నిజానికి క్రీస్తు మరణ సత్య సువార్తే ఇంతటి గొప్ప పండుగ వాతావరణాన్ని ఇక్కడ అక్కడ అంతటా సృష్టించ గలదు. సత్య సువార్త అంతటి శక్తిమంతమైనది మరి. ఎందుకంటే ఇది మనిషి యోచన వలన కలిగినది కాదు.

సమాజంగా కూడి క్రీస్తు పునరుత్థాన దినమనే ప్రభువు దినమును పరిశుద్ధ దిన ఆచారంగా ఎంచి క్రీస్తు ద్వారా దేవున్ని ఆరాధిస్తూ ఇలా ఆత్మసంబంధంగా ఆనందిస్తే అదే సంఘమునకు అసలు సిసలైన పండుగ వాతావరణం. దీన్నే ఇశ్రాయేలీయుల రాజైన క్రీస్తు ప్రభువు నందు ఆనందించడంగా చెప్పవచ్చు. ఇది పండుగ కంటే మించినది. వారమునకు ప్రప్రథమ దినములైన ఒక సంవత్సరంలోని యాభై రెండు ఆదివారాలు ప్రభువు నందు ఆనందించగలిగితే అవి క్రైస్తవులకు ఎప్పుడూ పండుగ దినములే. ప్రతి ఆదివారం క్రీస్తు ద్వారా దేవున్ని ఆరాధించడం దేవుని రాజ్యానికి ఆయన నీతికి ప్రప్రథమ స్థానం ఇవ్వడంగా, వాటిని మొదట వెదకడంగా గ్రంథం చెబుతుంది.

దేవుడు ఘనపరచి గొప్ప చేసిన ఉపదేశ క్రమాన్ని అనుసరించి చూస్తే,అపొస్తలుల బోధ ప్రకారంగా క్రైస్తవులు పరిశుద్ధ లేఖనాలను మీరి తమకు నచ్చినట్టుగా ఏ పండుగలు చేయకూడదు. దేవుడు చేయమని ఆజ్ఞాపించి చెప్పిన పండుగలు అన్నీ పాత నిబంధనలోనే ఉన్నాయి. ఇప్పుడైతే, భౌతిక సంబంధ ఆచార వ్యవహారాలతో ముడిపడిన పండుగలు చేసి దేవుని ఏనాడూ ఘనపరచలేరు. ధర్మశాస్త్రంలోని ముఖ్యమైన ఏడు పండుగలు అన్నీ కొత్తనిబంధన ఆత్మ సంబంధ ఆరాధనలోకి వచ్చి చేరి ఇలా విలీనం అయ్యి అందు ఒద్దికగా నిండుగా నిక్షిప్తమవడం విశేషం. కాబట్టి ఇప్పుడు క్రీస్తు ద్వారా అద్వితీయ సత్యదేవుని ఆత్మతో సత్యముతో ఆరాధించుటను మించిన పరిశుద్ధ దినం, ఇట్టి పండుగ వాతావరణం మరొకటి ఎక్కడా కానరాదు. మనోనేత్రాలు వెలిగించబడితేనే ఈ సత్యం అర్థమవుతుంది. భౌతికపరమైన పండుగలు ఆచార వ్యవహారాలు అన్నీ క్రీస్తునందు సిలువలో కొట్టివేయబడ్డాయి. మృత్యుంజయుడైన క్రీస్తును బట్టి నూతన సృష్టి అనబడే క్రైస్తవులకు సంవత్సరంలోని ప్రతి ఒక్క ఆదివారం ఆత్మ సంబంధ పండుగ దినమే.

అపొస్తలులు, ఆదిమ సంఘము వారు ఆత్మ సంబంధులుగా సత్య సంబంధులుగా పరిశుద్ధ దినాన్ని పరిశుద్ధంగా ఆచరించారు తప్ప వారు ఎలాంటి పండుగలు చేయలేదు. వారి బోధలు, వారి వారి నడతలు మనకు ఎప్పుడూ శిరోధార్యమే అనుటలో ఎలాంటి సందేహం లేదు. క్రొత్త నిబంధన పూర్తిగా ఆత్మ సంబంధమైనది. దాన్ని అలాగే మనం ఆచరించబద్దులము.

– జేతమ్

'ఒకని జన్మ దినము కంటె మరణ దినమే మేలు' అన్నది దేవుని దృష్టికోణం. ఉన్నతంగా చెప్పబడిన ఈ మాట అందరి గూర్చి అయినా, మరి ముఖ్యంగా, ఒక్క క్రీస్తును గురించి మాత్రమే ఇది చెప్పబడిందంటూ బైబిలు పండితులు వ్యాఖ్యానిస్తుంటారు. సువార్తలు రెండు మూడు లేవు. నాలుగైదు లేనే లేవు. ఒక్కటే సువార్త. అదే క్రీస్తు మరణ సువార్త. ఒక్క క్రీస్తు మరణాన్ని సువార్తగా కాకుండా ఇక వేరే ఏది సువార్తగా ప్రకటించిన వాడు శాపగ్రస్తుడని బైబిలు చాలా ఖండితంగా చెప్పటను ప్రతి ఒక్కరూ మనస్సు పెట్టి అలోచించాలి. (గలతీ 1:6-10).



ఆత్మదర్శిని



జ్ఞాన గమ్యం

నీవు ఆత్మతత్వంలో ఉన్నంతవరకు నీలో సంస్కారాలు లేవు, అలసట లేదు, పోరాటం లేదు, వివాదం లేదు. నేను శరీరాన్ని అని నమ్మినపుడు నీ చుట్టూ ఇతర వ్యక్తులు కూడా ఉంటారు. ఇతరులు అనేవారు ఉన్నప్పుడు పోటీలు, పోలికలు, స్పర్థలు, భయాలు, కోపాలు, అసూయలు, ప్రత్యేక గుర్తింపు కోసం తపన వంటివి ఉంటాయి. శరీరం, మనస్సులే నేను అని నమ్మినప్పుడు నీలో సంవేదనలు మొదలవుతాయి. ఇతర వ్యక్తులు మరియు సమాజం పట్ల నీ ప్రతిస్పందనలే ఈ సంవేదనలు. అందుకే ఈ సంఘర్షణకు, దుఃఖానికి కారణం నీవే. శరీరం–మనస్సులనే సరిహద్దులు ఏర్పరచుకున్నంతవరకు దుఃఖం తప్పదు. ఆత్మస్థితిలో ఉన్నది ఒక్కటే చైతన్యం. భిన్నత్వమే లేదు. సంఘర్షణే లేదు. ద్వైతమే లేదు. నేను ఆత్మను, ద్రష్టను అనే సత్యం తెలియకపోవడమే ఈ దుఃఖానికంతటికీ కారణం. నీవు ఆత్మగా, సాక్షి చైతన్యంగా ఉన్నప్పుడు అసలు సృష్టి అనేదే లేదు. నీవు ఆ అనంత చైతన్యస్థితి నుండి జారిపోవడమే సృష్టికి మూలకారణం. నీ నిజస్థితి ఐన ఆత్మస్థితినుండి వేరుపడి నేను శరీరము–మనస్సు అనే పరిమితిని సృష్టించుకున్నాము. నేనే శరీరము–మనస్సు అని జన్మజన్మలుగా నమ్ముతూ వస్తున్నాం. అదే సత్యమని గాఢంగా నమ్ముతూ అందులోనే కూరుకునిపోయాం. అందువల్లే మన నిజస్థితి ఆత్మస్థితి అని తెలుసుకోలేకపోతున్నాం. సత్యాన్ని అన్వేషించటం, తెలుసుకోవడం అనేవి సులువైన విషయాలు కావు. అసలు నీవు పుట్టలేదు, చావు కూడా నీకు లేదు. నీవు ఎవరూ కాదు. నేను వ్యక్తిని అనే నమ్మకం కేవలం భ్రమనే. ఈ శరీరం, ఆలోచనలు, నమ్మకాలు మొదలైనవన్నీ నువ్వు సృష్టించుకున్నవే. ఇది ఒక విషయంగా అస్సలు అర్థం కాదు. నీ కర్మలు అంతమయ్యే సమయం వచ్చినప్పుడే ఇది అనుభవంలోకి వస్తుంది. నేను ఆత్మను అని నీకు తెలిసిన క్షణంలోనే కర్మబంధాలనుండి బయటపడతావు. ఒక్కొక్కరు ఒక్కో సమయంలో సత్యాన్ని తెలుసుకుంటారు.

అంతిమంగా ప్రతి ఒక్కరూ ఈ స్థితిని చేరుకుంటారు. ఆత్మనే సత్యం అని ఒక విషయంగా తెలుసుకున్నంత మాత్రాన ఆ స్థితి నీకు అనుభవంలోకి రాదు. ఒకరు చెబితే వినడం, పుస్తకాలలో చదవడం వలన సత్యం అనుభవంలోకి రాదు. ధ్యానం పట్టుబడితే కానీ నీ నిజస్థితి నీకు అనుభవం కాదు. అనుభవపూర్వకంగా తెలుసుకున్నప్పుడే నీకు జ్ఞానం కల్గుతుంది.

ఆత్మనే నీవని తెలుస్తుంది. అదే ఆత్మసాక్షాత్కారం. ఎందరో గురువులు. యోగులు బోధించినది ఇదే. ఆత్మసాక్షాత్కారంతోనే దుఃఖం అంతమవుతుంది, సచ్చిదానందం అనుభవమవుతుంది. అందుకే ఇది ప్రతి వ్యక్తి ధ్యేయం కావాలి.

– స్వామి మైత్రేయ



ముగ్గు ముచ్చట



ఏ. మహాలక్ష్మి
టాటానగర్
బెంగళూరు



17 చుక్కలు : 17 వరుసలు



కాసర సింధు
జంగారెడ్డిగూడెం
ప.గో. జిల్లా



18 చుక్కలు, 4 వరుసలు
4 వరకు – సరిచుక్కలు



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు–ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్–34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

సినిమా



● రజనీకాంత్

సంక్రాంతికి కొత్త కబురు

రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రూపొందిన 'జైలర్' (2023) సినిమా బ్లాక్‌బస్టర్ హిట్ సాధించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాకు సీక్వెల్ కథను రెడీ చేస్తున్నారు నెల్సన్ దిలీప్‌కుమార్. ఈ స్క్రిప్ట్ వర్క్ దాదాపు పూర్తయిందని, ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ కూడా పూర్తి కావొచ్చాయని కోలీవుడ్ సమాచారం. అంతేకాదు... 'జైలర్ 2' సినిమాను అధికారికంగా ప్రకటించడానికి, రజనీకాంత్ పాల్గొనగా నెల్సన్ అండ్ టీమ్ ఓ వీడియోను రికార్డు చేసిందని, సంక్రాంతికి 'జైలర్ 2' అధికారిక ప్రకటన రానుందని టాక్. ప్రస్తుతం రజనీకాంత్ 'కూలీ' సినిమా చేస్తున్నారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఇటీవల జైపూర్‌లో పూర్తయింది. తదుపరి షెడ్యూల్‌ను కోయంబత్తూర్‌లో ఆరంభించాలనుకుంటున్నారు. ఈ చిత్రం వచ్చే వేసవిలో విడుదల కానుంది.



● రవితేజ

డిష్యూం... డిష్యూం...

విలన్స్ బెండు తీస్తున్నాడు లక్ష్మణ్ భేరి. డిష్యూం... డిష్యూం అంటూ అదిరిపోయే ఫైట్ చేస్తున్నాడు. ఈ లక్ష్మణ్ భేరి ఎవరంటే... రవితేజ అన్న మాట. రవితేజ హీరోగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ 'మాస్ జాతర'లో ఆయన పాత్ర పేరు ఇది. రవితేజ కెరీర్‌లోని ఈ 75వ సినిమాకు భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. 'ధమాకా' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత రవితేజ, శ్రీలీల మళ్లీ జంటగా ఈ సినిమాలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఎస్‌ఐ లక్ష్మణ్ భేరీ పాత్రలో రవితేజ నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారు. యాక్షన్ కొరియోగ్రాఫర్ పృథ్వీ మాస్టర్ ఈ యాక్షన్ సీక్వెన్స్‌ను డిజైన్ చేస్తున్నారట. ఈ షెడ్యూల్ తర్వాత చిత్రయూనిట్ అరకు వెళ్లనుందని తెలిసింది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న విడుదల కానుంది. ఈ సినిమాకు సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

కొడుకులకు కనువిప్పు కలిగేలా...



● కేవీ రమణాచారి

వివా రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఓ తండ్రి తీర్పు'. రాజేంద్ర రాజు కాంచనపల్లి రచన, దర్శకత్వ పర్యవేక్షణలో ప్రతాప్ భీమవరపు దర్శకత్వం వహించారు. ఆరిగపూడి విజయ్ కుమార్ సమర్పణలో ఏవీకే ఫిలిమ్స్ బ్యానర్‌పై శ్రీరామ్ దత్తి నిర్మించారు. మాజీ ఐఏఎస్ అధికారి డా. కేవీ రమణాచారి ఆశీస్సులతో ఈ సినిమా ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా కేవీ రమణాచారి మాట్లాడుతూ– ''ఓ తండ్రి తీర్పు' ద్వారా వివా రెడ్డి హీరోగా పరిచయం అవుతున్నాడు. నేటి తరంలో తల్లిదండ్రుల ఆస్తులపై ఉన్న ప్రేమ తల్లిదండ్రులపై లేదు. ఈ కారణంగా వారు ఎంతటి మానసిక క్షోభకు గురవుతున్నారనే నేపథ్యంలో తీసిన సినిమా ఇది. వివా రెడ్డి పాత్ర చాలామంది కొడుకులకు కనువిప్పు కలిగించేలా ఉంటుంది. ఒక మంచి కుటుంబ కథా చిత్రాన్ని నేను విడుదల చేస్తున్నందుకు సంతోషంగా ఉంది. కుటుంబమంతా కలిసి చూడాల్సి సినిమా ఇది'' అని చెప్పారు.

మర్రిచెట్టు కింద..



● హీరో హీరోయిన్లపై క్లాప్ ఇస్తున్న బాబూ మోహన్

ప్రమోద్ దేవా, రణ్‌ధీర్, కీర్తన స్వర్గం, ముస్కాన్ రాజేందర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'మర్రిచెట్టు కింద మనోళ్ళు'. నరేష్ వర్మ ముద్దం దర్శకత్వంలో శ్రీ నారసింహ చిత్రాలయ అండ్ టీమ్ నిర్మిస్తున్న ఈ సినిమా ఆదివారం హైదరాబాద్‌లో ఆరంభమైంది. తొలి సన్నివేశానికి బాబూ మోహన్ క్లాప్ ఇవ్వగా, ఆర్టిస్టు నాగ మహేశ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ వేడుకలో ప్రమోద్, రణధీర్ మాట్లాడుతూ– ''ఇలాంటి క్రేజీ ప్రాజెక్ట్‌లో అవకాశం రావడం సంతోషంగా ఉంది'' అన్నారు. ''మా కెరీర్‌కు హెల్ప్ అయ్యే ఫిల్మ్ ఇది'' అని తెలిపారు కీర్తన, ముస్కాన్. ''సినిమా టైటిల్ బాగుంది. ఈ చిత్రంలో నేనో రోల్ చేస్తున్నాను'' అని చెప్పారు బాబూ మోహన్. ''ప్రేక్షకులందర్నీ అలరించే ఫిల్మ్ ఇది'' అన్నారు నరేష్ వర్మ. ఈ సినిమాకు సంగీతం: అర్జున్, కెమెరా: వినోద్ కే సినగం.



'సలార్ 2' అంచనాలకు మించి ఉంటుంది – ప్రశాంత్ నీల్

ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సలార్'. ఈ సినిమా తొలి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' 2023 డిసెంబరులో విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమా గురించి దర్శకుడు ప్రశాంత్ నీల్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 'కన్నడ 'ఉగ్రం' (2014) సినిమాకు మెరుగైన వెర్షన్‌గా 'సలార్: సీజ్‌ఫైర్' తీశారు. ఈ సినిమా మీకు దర్శకుడిగా సంతృప్తినిచ్చిందా?' అని ఓ విలేకరి ప్రశ్నించగా... ప్రశాంత్ నీల్ స్పందిస్తూ– ''సలార్: సీజ్‌ఫైర్' సినిమా కోసం నేను పడిన కష్టంతో పోల్చుకున్నప్పుడు సినిమా ఫలితం నన్ను కాస్త నిరుత్సాహపరిచింది. ఎక్కడో 'కేజీఎఫ్ 2' సినిమా గుర్తులు గుర్తొచ్చాయా? అనిపించింది. అయితే 'సలార్: శౌర్యంగాపర్వం' (సలార్ 2) విషయంలో ఏ పొరపాట్లు జరగవు. నా కెరీర్‌లోనే ఓ బెస్ట్ మూవీగా ఉండేలా 'సలార్ 2' తీస్తాను. ప్రేక్షకుల అంచనాలను మించేలా 'సలార్ 2' ఉంటుంది'' అని పేర్కొన్నారు. ఇక ప్రస్తుతం ఎన్టీఆర్‌తో 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే పీరియాడికల్ ఫిల్మ్ తీసేందుకు ప్రశాంత్ నీల్ రెడీ అవుతున్నారు. 2026 జనవరి 9న 'డ్రాగన్' సినిమాను రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ఆల్రెడీ ప్రకటించారు. 'డ్రాగన్' చిత్రీకరణను పూర్తి చేసిన తర్వాత ప్రభాస్‌తో 'సలార్ 2' సినిమాను ప్రశాంత్ నీల్ ప్రారంభిస్తారని తెలుస్తోంది.

వినోదంగా...



● సుమంత్ ప్రభాస్

సుమంత్ ప్రభాస్ హీరోగా సుభాష్ చంద్ర దర్శకత్వంలో ఓ మ్యూజిక్ రొమాంటిక్ కామెడీ మూవీ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ ఈ మూవీని నిర్మిస్తోంది. ఈ చిత్రంతో నిధీ ప్రదీప్ హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. ఈ సినిమా తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయింది. రేలంగి, వేల్పూరి, భీమవరం వంటి లొకేషన్స్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరిపారు. జగపతిబాబు, రాజీవ్ కనకాల లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్రంలో హర్ష వర్ధన్, సుదర్శన్, రాజ్‌కుమార్ కసిరెడ్డి, 'వైవా' రాఘవ్, రీను, రోహిత్ కృష్ణ కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ సినిమాకు సంగీతం: నాగవంశీ కృష్ణ.

కిస్మత్‌తో ఎంట్రీ



● కోమల్

సామాజిక, జాతీయ భద్రతా సమస్యలపై రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'కిస్మత్ 2025'. ఈ చిత్రంలో విశాల్ హీరోగా నటించనున్నారు. ముంబైలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన కోమల్ స్వర్ణకర్ ఈ చిత్రంతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఈ సినిమాను నూతన దర్శకుడు రవి రోహిత్ తెరకెక్కించనున్నారు. త్వరలోనే ఈ సినిమా గురించిన మరిన్ని వివరాలను వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు.

ఓటీటీ
ఇది చూడొచ్చు

కదలకుండా కట్టిపడేసే థ్రిల్లర్

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'క్యారీ ఆన్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

థ్రిల్లర్ జోనర్ అనేది సినిమా మొత్తం క్యారీ చేయడం దర్శకుడికి కత్తి మీద సాము లాంటిది. సినిమా ఓ లైన్‌లో వెళుతున్నప్పుడు దాని జోనర్‌ని కమర్షియల్ యాంగిల్‌లో కూడా బ్యాలెన్స్ చేస్తూ క్యారీ చేయడం చాలా కష్టం. ఒకవేళ అలా పట్టు సడలకుండా క్యారీ చేస్తే మాత్రం ఆ సినిమా సూపర్ హిట్ అయినట్టే. 'క్యారీ ఆన్' ఆ కోవకు చెందిన సినిమానే. ఇదో హాలీవుడ్ యాక్షన్ థ్రిల్లర్. ఈ మధ్య కాలంలో థ్రిల్లింగ్ జోనర్‌లో వచ్చిన అరుదైన సినిమా అని చెప్పొచ్చు. ఈ సినిమాకి జేమ్ కలెక్ట్ సేరా దర్శకుడు. ప్రముఖ హాలీవుడ్ నటులు టారస్, సోఫియా లీడ్ రోల్స్‌లో నటించారు. ఇక ఈ సినిమా కథ విషయానికొస్తే... భార్యాభర్తలైన ఈథన్ కోపెక్, నోరా పార్స్ అమెరికాలోని ఎయిర్‌పోర్టులలో లగేజ్ సెక్యూరిటీ తనిఖీ సంస్థ అయిన టీఎస్‌ఏలో పని చేస్తూ ఉంటారు. అది క్రిస్మస్ కాలం. ఎయిర్‌పోర్టు పండగ వాతావరణంలో ప్రయాణీకులతో రద్దీగా ఉంటుంది. కొపెక్ తన ప్రమోషన్ కోసం ప్రయత్నిస్తుంటాడు. అందుకని ఆ రోజు వేరే వాళ్లు ఉండాల్సిన స్థానంలో తన పోస్ట్ వేయించుకుంటాడు. అది లగేజ్ స్క్రీన్ స్పెషలిస్ట్ డ్యూటీ. తాను రొటీన్‌గా ప్రయాణీకుల లగేజ్ స్క్రీన్ చేస్తుండగా అనూహ్యంగా ఓ బ్లూటూత్ దొరుకుతుంది. ఆ బ్లూటూత్ కొపెక్ ధరించడంతో అసలు కథ మొదలవుతుంది. ఓ అనామకుడు కొపెక్‌ను బ్లూటూత్ ద్వారా తాను చెప్పింది చెయ్యకుంటే అదే ఎయిర్‌పోర్టులో పని చేస్తున్న అతని భార్య నోరాని చంపుతానని బెదిరిస్తాడు. ఆ ఆగంతకుడు ఓ బాంబుని ఫ్లైట్‌లోకి తరలించడానికి ప్రయత్నిస్తుంటాడు. ఆ బాంబు బ్యాగేజీని లగేజ్ స్క్రీన్ దగ్గర అడ్డుకోకూడదని అజ్ఞాత వ్యక్తి హెచ్చరిస్తూ బ్లూటూత్ ద్వారా కొపెక్‌కు సూచనలిస్తుంటాడు. అసలే పండగ కాలం... ఎయిర్‌పోర్టు నిండా జనం. ఒకవేళ ఏదైనా జరగ రానిది జరిగితే పెద్ద సంఖ్యలో అపార ప్రాణ నష్టం. అందుకే కొపెక్ ఓ పక్క ఆ లగేజ్‌ని ఆపాలని మరో పక్క తన భార్యను కాపాడుకోవాలని చేసిన ప్రయత్నం సినిమాకే హైలైట్. ముందుగా తనకు కనపడకుండా తనను లక్ష్యంగా చేసుకుని ఇంతటి దారుణానికి ఒడిగడుతున్న అతడ్ని వెతకడానికి ప్రయత్నిస్తుంటాడు. కొపెక్ ఆ ఆగంతకుడితో పాటు బాంబుని కనుక్కున్నాడా? అలాగే తన భార్యని కాపాడుకున్నాడా... ఈ ప్రశ్నలకు సమాధానం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న 'క్యారీ ఆన్' సినిమాని చూడడం. ఈ సినిమా స్క్రీన్‌ప్లే ప్రేక్షకుడిని కట్టిపడేస్తుంది. సినిమాలో పాత్రలు పరిచయం అయ్యే దాకా రొటీన్ సినిమా అనిపించినప్పటికీ బ్లూటూత్ దొరికినప్పటి నుండి కథ వేగంగా పరిగెడుతూ ప్రేక్షకుడిని కదలకుండా చేస్తుంది. తెలుగు డబ్బింగ్ వెర్షన్ నెట్‌ఫ్లిక్స్‌లో లభ్యమవుతోంది. ఈ 'క్యారీ ఆన్' వర్త్ టు వాచ్. సో యూ ఆల్సో క్యారీ ఆన్ ఫర్ క్యారీ ఆన్.



– ఇంటూరు హరికృష్ణ

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.



వివాహబంధంలోకి భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు

ఉదయ్‌పూర్: కోర్టుల్లో రాకెట్ పట్టి ప్రత్యర్థులతో పోటీపడి సెమీస్, ఫైనల్స్ ప్రవేశించే తెలుగింటి ఆడపడుచు సింధు ఇప్పుడు నవవధువుగా ముస్తాబై మూడుముళ్ల బంధంలోకి ప్రవేశించింది. రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో రాజమహల్‌లాంటి వేదికపై ఆదివారం రాత్రి జరిగిన వివాహ వేడుకలో ఆమె తమ ఫ్యామిలీ ఫ్రెండ్ వెంకట దత్తసాయిని వివాహమాడింది. పెద్దలు కుదిర్చిన ఈ వివాహానికి ఇరు కుటుంబాల బంధుమిత్రులతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ నెల 24న (మంగళవారం) హైదరాబాద్‌లో వీరి వివాహ రిసెప్షన్‌ను ఏర్పాటు చేశారు. దీనికి తెలుగు సినీ, క్రీడా రంగ ప్రముఖులతో పాటు తెలుగు రాష్ట్రాల రాజకీయ, ప్రభుత్వ పెద్దలు హాజరయ్యే అవకాశముంది.

‘ఆసియా’ యువ భారత్‌దే

- అండర్–19 మహిళల టి20 క్రికెట్ టోర్నీ చాంపియన్ టీమిండియా
- ఫైనల్లో బంగ్లాదేశ్‌పై 41 పరుగులతో గెలుపు
- రాణించిన త్రిష, ఆయుషి



కౌలాలంపూర్: ఆద్యంతం ఆధిపత్యం చలాయించిన భారత యువ మహిళల జట్టు తొలిసారి నిర్వహించిన అండర్–19 టి20 ఆసియా కప్ క్రికెట్ టోర్నీలో విజేతగా అవతరించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో నిక్కీ ప్రసాద్ నాయకత్వంలోని భారత జట్టు 41 పరుగుల తేడాతో గెలుపొందింది. తెలంగాణకు చెందిన టీనేజ్ ఓపెనర్ గొంగడి త్రిష (47 బంతుల్లో 52; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో రాణించి భారత విజయంలో కీలకపాత్ర పోషించింది. ఈ టోర్నీలో భారత్ అజేయంగా టైటిల్‌ను సాధించడం విశేషం. ఒక్క మ్యాచ్‌లోనూ ఓటమి ఎరుగని యువ భారత జట్టు తుదిపోరులో త్రిష బ్యాటింగ్, బౌలర్ల సమష్టి కృషితో బంగ్లాదేశ్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచిన బంగ్లాదేశ్ ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 117 పరుగులు చేసింది. భారత ఇన్నింగ్స్‌లో తొమ్మిది మంది బ్యాటర్లు క్రీజులోకి దిగితే ఒక్క త్రిష మాత్రమే అర్ధసెంచరీతో ఆదుకుంది. మిగతా వారెవరూ కనీసం 20 పరుగులైనా చేయలేకపోయారు.


‘ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ’ త్రిష

ప్రత్యర్థి బౌలర్లలో ఫర్జానా 4, నిషిత 2 వికెట్లు తీశారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన బంగ్లాదేశ్ అమ్మాయిల జట్టు 18.3 ఓవర్లలో 76 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్లు ఆయుషి శుక్లా (3/17), పారుణిక సిసోడియా (2/12), సోనమ్ యాదవ్ (2/13), జోషిత (1/11) సమష్టిగా బంగ్లాదేశ్ బ్యాటర్ల భరతం పట్టారు. బంగ్లాదేశ్ జట్టులోని 11 మందిలో తొమ్మిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఈ టోర్నీలో రెండు అర్ధసెంచరీలతో నిలకడగా ఆడిన త్రిషకే ‘ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్’తో పాటు ‘ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ’ అవార్డులు లభించాయి.


స్మృతి

స్మృతి 91... రేణుక 5/29

వడోదర: భారత పర్యటనకు వచ్చిన వెస్టిండీస్‌పై మ్యాచ్ మ్యాచ్‌కీ స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన పరుగుల జోరు పెరుగుతోంది. ముంబైలో జరిగిన మూడు టి20ల్లో వరుసగా 54, 62, 77 పరుగులు సాధించిన ఆమె తాజాగా మొదలైన వన్డే సిరీస్ లోనూ రెచ్చిపోయింది. 9 పరుగుల తేడాతో సెంచరీ అవకాశాన్ని కోల్పోయిన స్మృతి (102 బంతుల్లో 91; 13 ఫోర్లు) కరీబియన్ అమ్మాయిలపై వరుసగా నాలుగో అర్ధశతకాన్ని బాదింది. బౌలింగ్‌లో ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ రేణుక సింగ్ (10–1–29–5) నిప్పులు చెరిగే స్పెల్‌తో విండీస్‌ను వణికించింది. దీంతో ఆదివారం జరిగిన తొలి వన్డేలో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత మహిళల జట్టు 211 పరుగుల భారీ తేడాతో జయభేరి మోగించింది. తద్వారా మూడు వన్డేల సిరీస్‌లో 1–0తో ముందంజ వేసింది. మహిళల వన్డే క్రికెట్‌లో పరుగుల పరంగా భారత్‌కిది రెండో భారీ విజయం. టాస్ నెగ్గిన విండీస్ ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 314 పరుగుల భారీస్కోరు చేసింది. తొలి వన్డే ఆడుతున్న ఓపెనర్ ప్రతీక రావల్ (69 బంతుల్లో 40; 4 ఫోర్లు), వన్‌డౌన్ బ్యాటర్ హర్లీన్ డియోల్ (50 బంతుల్లో 44; 2 ఫోర్లు, 1 సిక్స్), హర్మన్‌ప్రీత్ (23 బంతుల్లో 34; 3 ఫోర్లు, 1 సిక్స్), రిచా ఘోష్ (13 బంతుల్లో 26; 4 ఫోర్లు, 1 సిక్స్), జెమీమా రోడ్రిగ్స్ (19 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ప్రతీకతో తొలి వికెట్‌కు 110 పరుగులు జోడించిన స్మృతి, హర్లీన్‌తో రెండో వికెట్‌కు 50 పరుగులు జతచేసి నిష్క్రమించింది. తర్వాత హర్లీన్, హర్మన్ మూడో వికెట్‌కు 66 పరుగులు జోడించారు. కరీబియన్ బౌలర్ జైదా జేమ్స్ (5/45) భారీస్కోరు ఇంకా పెరిగిపోకుండా చూసింది. హేలీ మాథ్యూస్‌కు 2 వికెట్లు దక్కాయి. అనంతరం కొండంత లక్ష్యాన్ని చూడగానే భయపడినట్లుగా వెస్టిండీస్ ఆడి... కుప్పకూలింది. 26.2 ఓవర్లలో 103 పరుగులకే ఆలౌటైంది. అఫీ ఫ్లెచర్ (22 బంతుల్లో 24; 3 ఫోర్లు), షెమైన్ క్యాంప్‌బెల్ (39 బంతుల్లో 21; 2 ఫోర్లు) వీళ్లిద్దరు ఇరవై పైచిలుకు స్కోరు చేయగలిగారు. ప్రియా మిశ్రా 2, దీప్తి శర్మ, టిటాస్ సాధు చెరో వికెట్ తీశారు. ఇరుజట్ల మధ్య మంగళవారం ఇక్కడే రెండో వన్డే జరుగనుంది.

తొలి వన్డేలో భారత మహిళల భారీ విజయం

- 211 పరుగుల తేడాతో విండీస్ ఓటమి
- ఇదే వేదికపై రేపు రెండో వన్డే


రేణుక

స్కోరు వివరాలు

భారత ఇన్నింగ్స్: స్మృతి మంధాన (ఎల్బీడబ్ల్యూ) (బి) జైదా జేమ్స్ 91; ప్రతీక (సి అండ్ బి) హేలీ మాథ్యూస్ 40; హర్లీన్ (బి) డియాండ్రా 44; హర్మన్ ప్రీత్ (రనౌట్) 34; రిచా ఘోష్ (సి) షమిలియా (బి) హేలీ మాథ్యూస్ 26; జెమీమా (బి) జైదా జేమ్స్ 31; దీప్తి శర్మ (నాటౌట్) 14; సైమా ఠాకూర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జైదా జేమ్స్ 4; టిటాస్ సాధు (సి) క్వియానా (బి) జైదా జేమ్స్ 4; రేణుక (సి) షబిక (బి) జైదా జేమ్స్ 0; ప్రియా మిశ్రా (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 25; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 314. వికెట్ల పతనం:** 1–110, 2–160, 3–226, 4–237, 5–264, 6–297, 7–301, 8–309, 9–309. **బౌలింగ్:** డియాండ్రా డాటిన్ 10–0–63–1, హేలీ మాథ్యూస్ 10–1–61–2, షమిలియా 1–0–6–0, కరిష్మా 10–0–62–0, అఫీ ఫ్లెచర్ 5–0–31–0, ఆలియా 6–0–38–0, జైదా జేమ్స్ 8–0–45–5. **వెస్టిండీస్ ఇన్నింగ్స్:** హేలీ మాథ్యూస్ (సి) రిచా ఘోష్ (బి) రేణుక 0; క్వియానా (రనౌట్) 0; రషదా విలియమ్స్ (బి) టిటాస్ సాధు 3, డియాండ్రా (బి) రేణుక 8; షెమైన్ (సి) హర్మన్‌ప్రీత్ (బి) రేణుక 21; ఆలియా (సి) హర్మన్‌ప్రీత్ (బి) రేణుక 13; షబిక (బి) రేణుక 3; జైదా జేమ్స్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ప్రియా 9; అఫీ ఫ్లెచర్ (నాటౌట్) 24; కరిష్మా (సి) రేణుక (బి) దీప్తిశర్మ 11; షమిలియా (సి) జెమీమా (బి) ప్రియా 8; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (26.2 ఓవర్లలో ఆలౌట్) 103. వికెట్ల పతనం:** 1–0, 2–3, 3–11, 4–11, 5–26, 6–34, 7–52, 8–66, 9–84, 10–103. **బౌలింగ్:** రేణుక సింగ్ 10–1–29–5, టిటాస్ సాధు 7–2–24–1, సైమా ఠాకూర్ 2–0–8–0, ప్రియా మిశ్రా 4.2–0–22–2, దీప్తి శర్మ 3–0–19–1.

1602 ఈ ఏడాది మూడు ఫార్మాట్‌లలో కలిపి భారత క్రికెటర్ స్మృతి మంధాన చేసిన పరుగులు. ఒకే ఏడాది అత్యధిక పరుగులు సాధించిన ప్లేయర్‌గా స్మృతి గుర్తింపు పొందింది. ఇదే ఏడాది దక్షిణాఫ్రికా ప్లేయర్ లౌరా వొల్‌వార్ట్ 1593 పరుగులు సాధించి రెండో స్థానంలో ఉంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్‌వాయు ఉద్యోగాలు

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ‘అగ్నిపథ్ స్కీమ్’ ద్వారా అగ్నివీర్ వాయు(ఇన్‌టేక్ 01/2026)బ్యాచ్ నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. అవివాహితులైన పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్ (10+2) లేదా ఇంటర్మీడియట్(సైన్స్ కాని ఇతర సబ్జెక్టులు) లేదా మూడేళ్ల ఇంజనీరింగ్‌డిప్లొమా(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్ /కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి. నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 01.01.2005 మరియు 01.07.2008 మధ్య జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఫేజ్–1(ఆన్‌లైన్ రాతపరీక్ష), ఫేజ్–2(ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, అడాప్టబిలిటీ టెస్ట్–1, అడాప్టబిలిటీ టెస్ట్–2), ఫేజ్–3(మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్), సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 07.01.2025
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 27.01.2025.
» **ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం:** 22.03.2025.
» **ఎంపిక జాబితా వెల్లడి తేది:** 14.11.2025.
» **వెబ్‌సైట్:** https://agnipathvayu.cdac.in

డా.బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో బీఈడీ -ఓడీఎల్ కోర్సులో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని డా.బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఈడీ ఓడీఎల్ కోర్సులో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో బీఏ, బీఎస్సీ,బీకాం, బీసీఏ, బీబీఏ, బీబీఎం, బీఈ, బీటెక్ ఉత్తీర్ణతతో పాటు ప్రాథమిక విద్యలో శిక్షణ పొందిన ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులై ఉండాలి. లేదా ప్రాథమిక విద్యలో టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ పూర్తిచేసి ఉండాలి.
» **కోర్సు వ్యవధి:** రెండేళ్లు.
» **బోధనా మాధ్యమం:** తెలుగు.
» **వయసు:** 01.07.2024 నాటికి 21 ఏళ్లు పూర్తిచేసి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి నిబంధన లేదు.
» **ఎంపిక విధానం:** ప్రవేశ ప్రక్రియ ద్వారా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **రూ.500 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది:** 25.12.2024.
» **హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్‌తేది:** 28.12.2024.
» **ప్రవేశ పరీక్ష తేది:** 31.12.2024.
» **వెబ్‌సైట్:** https://braou.ac.in

ఎన్‌ఎల్‌సీ ఇండియా లిమిటెడ్, తమిళనాడులో జూనియర్ ఇంజనీర్ పోస్టులు

తమిళనాడులోని నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్(ఎన్‌ఎల్‌సీ) జూనియర్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 14. –వేతనం: నెలకు రూ.38,000.
» **విభాగాలు:** సైంటిఫిక్, మైక్రోబయాలజీ, మెకానికల్, సివిల్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఫుల్‌టైం/పార్ట్‌టైం డిప్లొమా, బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:**రాతపరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.12.2024
» **వెబ్‌సైట్:** https://www.nlcindia.in

ఇంటర్వ్యూ.. రాణించే వ్యూహం

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్.. ఐఏఎస్, ఐఎఫ్‌ఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత స్థాయి ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసే పరీక్ష! దేశంలో లక్షల మంది ఉద్యోగార్థులు ఈ పరీక్షలో రాణించాలని కలలు కంటారు. ఎంతో కష్టపడతారు. కాని మూడంచెల సివిల్స్ ఎంపిక ప్రక్రియలో చాలా తక్కువ మంది మాత్రమే తుది దశ ఇంటర్వ్యూకు చేరుకుంటారు. తాజాగా సివిల్స్-2024 మెయిన్స్ ఫలితాలు విడుదలయ్యాయి. జనవరి 7వ తేదీ నుంచి ఇంటర్వ్యూలు మొదలు కానున్నాయి. ఈ నేపథ్యంలో.. సివిల్స్ ఇంటర్వ్యూ విధానం, ఇందులో విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలపై ప్రత్యేక కథనం..

» సివిల్స్ ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థుల సంఖ్య 2,845
» తెలంగాణ, ఏపీ నుంచి 80 నుంచి 90 వరకు ఉంటారని అంచనా
» జనవరి 7వ తేదీ నుంచి ఏప్రిల్ 17వరకూ ఇంటర్వ్యూలు
» విషయావగాహనతోపాటు భావ వ్యక్తీకరణ ముఖ్యమంటున్న నిపుణులు


సివిల్స్ ఇంటర్వ్యూ

1,056 పోస్ట్‌లకు.. 2,845 మంది ఎంపిక

యూపీఎస్సీ 21 సర్వీసుల్లో మొత్తం 1,056 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. తొలిదశ ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్, ఆ తర్వాత రెండో దశ మెయిన్స్‌లో ప్రతిభ చూపిన అభ్యర్థులను తుది దశ పర్సనాలిటీ టెస్ట్‌కు ఎంపిక చేసింది. మొత్తం 2,845 మందికి జనవరి 7వ తేదీ నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనుంది. వీరిలో తెలుగు రాష్ట్రాల నుంచి 80 నుంచి 90 మంది వరకు ఉంటారని ప్రాథమిక అంచనా. ఇంటర్వ్యూకు కేటాయించిన మార్కులు 275.

పర్సనల్ టు ప్రొఫెషనల్

ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులు ప్రిపరేషన్ క్రమంలో వ్యక్తిగత నేపథ్యం నుంచి ప్రొఫెషనల్ ప్రొఫైల్ వరకూ.. అన్ని విషయాలపైనా అవగాహన పెంచుకోవాలి. ఇంటర్వ్యూలో వ్యక్తిగత అంశాలపైనా ప్రశ్నలు ఎదురవుతున్నాయి.అభ్యర్థులు తమ వ్యక్తిగత వివరాలు, పని అనుభవం ఉంటే గత విధి నిర్వహణ, ఇప్పటి వరకు తాము సాధించిన పురోగతి, వాటి ద్వారా తాము పని చేస్తున్న సంస్థకు చేకూరిన ప్రయోజనం వంటి వాటిపై దృష్టిపెట్టాలి.

‘సోషల్ సర్వీస్ లక్ష్యంగా’

ఇంటర్వ్యూలో అభ్యర్థులకు తప్పనిసరిగా ఎదురయ్యే ప్రశ్న.. సివిల్ సర్వీసెస్‌నే ఎంపిక చేసుకోవడానికి కారణం ఏంటి? అని! దీనికి అభ్యర్థులు తక్కున చెప్పే సమాధానం .. సామాజిక సేవ లక్ష్యం!! అయితే ఈ సమాధానాన్ని సమర్థించుకునే భావవ్యక్తీకరణ నైపుణ్యం చాలా అవసరం . ముఖ్యంగా ఇంజనీరింగ్, ఎంబీఏ వంటి కోర్సుల అభ్యర్థులు ‘సోషల్ సర్వీస్ లక్ష్యంగా సివిల్స్’ అనే సమాధానం చెప్పే విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రస్తుతం తాము పని చేస్తున్న సంస్థ ద్వారా సమాజానికి ఉపయోగపడే విధంగా అమలవుతున్న విధానాలు (ఉదాహరణకు.. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్ అయితే.. నేటి డిజిటైజేషన్ యుగంలో సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ద్వారా సమాజానికి కలుగుతున్న ప్రయోజనం తెలియజేయడం) చెప్పగలిగే విధంగా సన్నద్ధంగా ఉండాలి.

డీఏఎఫ్‌పై ఫోకస్

సివిల్స్ ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తాము మెయిన్స్‌కు దరఖాస్తు సమయంలో పూర్తి చేసిన డిటెయిల్డ్ అప్లికేషన్ ఫామ్(డీఏఎఫ్)లో పొందుపర్చిన అంశాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలి. ఉదాహరణకు..హాబీలు, సర్వీసు ప్రాధాన్యత, వ్యక్తిగత నేపథ్యం,పుట్టిన ప్రదేశం వంటివి.

సూటిగా, స్పష్టంగా

ఇంటర్వ్యూ సమయంలో అభ్యర్థులు తమ అభిప్రాయాలను సూటిగా, స్పష్టంగా చెప్పగలిగే సామర్థ్యం అలవర్చుకోవాలి. ఇందుకోసం ఇప్పటి నుంచే ప్రాక్టీస్ చేయడం ప్రారంభించాలి. ఆయా అంశాలపై తమ అభిప్రాయాలను బలపరిచే ఉదాహరణలను సిద్ధం చేసుకోవాలి.

హాబీలపై కసరత్తు

అభ్యర్థులు తాము అప్లికేషన్‌లో పేర్కొన్న హాబీలపై ఇప్పటి నుంచే ప్రత్యేక కసరత్తు చేయాలి. చాలామంది బుక్ రీడింగ్, వాచింగ్ టీవీ, సింగింగ్, ప్లేయింగ్, మూవీస్ వంటి వాటిని పేర్కొంటారు. ఇంటర్వ్యూ సమయంలో వీటిపైనా ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. బోర్డ్‌లో పలు నేపథ్యాల నిపుణులు ఉంటారు. సదరు రచయిత రాసిన ఫలానా పుస్తకం చదివారా.. అందులో మీకు బాగా నచ్చిన అంశం ఏంటి.. లేదా అందులో వివాదాస్పదమైన అంశం ఏంటి.. వంటి ప్రశ్నలు ఎదురవుతాయి. గతేడాది సింగింగ్‌ను హాబీగా పేర్కొన్న అభ్యర్థిని.. ఏదైనా ఒక పాట పాడమని అడిగారు.

స్థానిక పరిస్థితులు, సమస్యలపై అవగాహన

పర్సనల్ ఇంటర్వ్యూకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు తమ స్వస్థలానికి సంబంధించిన సామాజిక, చారిత్రక నేపథ్యంపై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా ప్రస్తుతం స్థానికంగా ప్రాధాన్యం సంతరించుకుంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి మార్గాలపైనా ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి స్థానిక పరిస్థితులు, సమస్యలపై అవగాహనతో పాటు పరిష్కారానికి అనుసరించాల్సిన విధానాలపై దృష్టి పెట్టాలి. అదేవిధంగా అభ్యర్థుల వ్యక్తిగత బలాలు, బలహీనతలకు సంబంధించిన ప్రశ్నలు కూడా ఎదురవుతున్నాయి. తమకున్న బలహీనతల గురించి చెప్పేటప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ‘అగ్రెసివ్‌నెస్’, ‘సహనం తక్కువ’ వంటి సమాధానాలు చెప్పకపోవడమే మేలు.

వర్తమానం ఎంతో కీలకం

సివిల్స్ ఇంటర్వ్యూలో వర్తమాన అంశాలపై తప్పనిసరిగా ప్రశ్నలు అడుగుతారు. ముఖ్యంగా అంతర్జాతీయ ఒప్పందాలు, ద్వైపాక్షిక సంబంధాలు,ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారిన అంశాలపైనా బోర్డ్ సభ్యుల నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి.

కాబట్టి అభ్యర్థులు పర్సనల్, ప్రొఫెషనల్ అంశాలతో పాటు కరెంట్ అఫైర్స్‌పైనా పట్టు సాధించాలి. ఇందుకోసం ప్రతి రోజు కనీసం రెండు దినపత్రికలు సమగ్రంగా, విశ్లేషణాత్మకంగా చదవాలి. అదేవిధంగా ఇంటర్వ్యూ రోజు తప్పనిసరిగా దినపత్రికలు చదివి వెళ్లడం అవసరం . కొన్ని సందర్భాల్లో ‘ఈ రోజు ఏ పేపర్ చదివారు. అందులో మీరు ప్రధానంగా భావించిన వార్త ఏంటి? ఎందుకు’ వంటి ప్రశ్నలు సైతం ఎదురయ్యే ఆస్కారముంది.

ముఖాముఖి చర్చా వేదికగా

పర్సనల్ ఇంటర్వ్యూ అంటే కేవలం కొశ్చన్ అండ్ ఆన్సర్ విధానం అనే అభిప్రాయానికి స్వస్తి పలకాలి. ఇంటర్వ్యూను ఒక చర్చా వేదికగానూ భావించాల్సిన పరిస్థితి ఇటీవల కాలంలో పెరిగింది. 20 నుంచి 25 నిమిషాల వ్యవధిలో నిర్వహించే ఇంటర్వ్యూ.. చిన్నపాటి చర్చగా మారుతున్న పరిస్థితి నెలకొంది. ఇలాంటి సందర్భాల్లో రాణించేందుకు అభ్యర్థులు ఆయా ముఖ్యాంశాలను, సమకాలీన పరిణామాలను కూలంకషంగా తెలుసుకోవాలి. వాస్తవాలు, గణాంకాలతో తమ అభిప్రాయాలను సమర్థించుకునేలా సన్నద్ధత పొందాలి.

సమస్య పరిష్కార నైపుణ్యం

ఇంటర్వ్యూ బోర్డ్ అభ్యర్థుల నుంచి ఆశిస్తున్న మరో లక్షణం.. సమయస్ఫూర్తి,సమస్య పరిష్కార నైపుణ్యం!!. ‘మీరు ఒక ఐఏఎస్ అధికారిగా ఉన్నారు. ఆ ప్రాంతంలో ఫలానా సమస్య ఎదురైంది.. దీనికి తక్షణ పరిష్కారంగా మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?’ వంటివి. ఇలాంటి వాటికి సమాధానం ఇచ్చేటప్పుడు చాలా అప్రమత్తంగా వ్యవహరించాలి. బోర్డును మెప్పించే విధంగా సమాధానం చెప్పాలి. ప్రభుత్వ విధానాలను గౌరవిస్తూ.. పరిష్కార చర్యలు చేపడతామనే విధంగా సమాధానాలు చెప్పాలి.

బాడీ లాంగ్వేజ్

ఇంటర్వ్యూ అభ్యర్థులు తమ బాడీ లాంగ్వేజ్‌పై ఇప్పటి నుంచే కసరత్తు చేయాలి. వ్యక్తిగత శైలి హుందాగా ఉండాలి. పురుష అభ్యర్థులు లైట్ కలర్ షర్ట్స్ ధరించడం హుందాగా ఉంటుంది. అదే విధంగా మహిళా అభ్యర్థులు శారీ, లేదా సల్వార్ కమీజ్‌లను ధరించి ఇంటర్వ్యూకు హాజరవడం సదాభిప్రాయం కలిగేలా చేస్తుంది. ఇంటర్వ్యూ సమయంలో సమాధానాలిచ్చేటప్పుడు బాడీలాంగ్వేజ్ ఎంతో ముఖ్యం. హావ భావాలను నియంత్రించుకోవాలి. నియంత్రిత స్పందన ముఖ్యమని గుర్తించాలి.

సమాధానాల్లో నిజాయతీ

ఇంటర్వ్యూకు సమాధానాలిచ్చే క్రమంలో నిజాయతీగా వ్యవహరించాలి. సమాధానం తెలియకపోతే తెలియదని చెప్పాలి. ఇంటర్వ్యూ సమయంలో అభ్యర్థులు తమ భావోద్వేగాలను నియంత్రించుకునే విధంగా వ్యవహరించాలి. కొన్ని సందర్భాల్లో అభ్యర్థుల సహనాన్ని పరీక్షించే విధంగా అసందర్భ ప్రశ్నలు అడగడం లేదా సమాధానం కరెక్ట్‌గా చెప్పినా.. అది తప్పు అని వాదించడం వంటివి ఎదురవుతాయి. అలాంటి సందర్భాల్లో ఉద్రేకానికి గురి కాకుండా.. బోర్డ్ మెంబర్స్‌ను మెప్పించేలా హుందాగా వ్యవహరించాలి.

అలవర్చుకోవాల్సిన లక్షణాలు

సానుకూల దృక్పథం; సరైన బాడీ లాంగ్వేజ్; భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం; సమకాలీన అంశాలపై అవగాహన; సమయస్ఫూర్తి; సమస్య పరిష్కార నైపుణ్యం ; సహనం, ఓర్పు; పేపర్ రీడింగ్; స్పష్టమైన అభిప్రాయాలు, భావ వ్యక్తీకరణ వంటి మెరుగుపరచుకోవాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
1,176	364
78,042	23,588

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	19,553	△	181
డోజోన్స్	42,853	△	510
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,085	▽	21
డాక్స్	19,885	▽	85
షాంఘై	3,368	▽	2
నికాయ్	38,702	▽	112

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	84.65	85.67
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.90	107.72
€	యూరో	ఒకటి	86.96	89.55
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	53.55	54.89
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.91	54.09
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.46	64.87
SAR	సౌదీ రియాల్	ధామమీటర్	21.78	23.32
UAE D	యూఏఈ దిర్హామ్	ధామమీటర్	22.27	24.03
¥	చైనా యువాన్	ధామమీటర్	12.59	10.77

హెల్త్ ఇన్సూరెన్స్ 'పోర్టింగ్'.. తొందరొద్దు!

- సేవలు, ఫీచర్లు నచ్చకపోతేనే ముందుకు..
- ప్రీమియం తక్కువని ఎంపిక చేసుకోవద్దు
- వెయిటింగ్ పీరియడ్, ఎన్‌సీబీ బదిలీ కీలకం
- సమగ్రంగా తెలుసుకున్న తర్వాతే నిర్ణయం
- లేదంటే ప్రయోజనాలు కోల్పోవాల్సి రావచ్చు

హెల్త్ ఇన్సూరెన్స్ ప్రతి కుటుంబానికి అత్యంత ముఖ్యమైన ఆర్థిక సాధనం. రక్షణ కవచం కూడా. ఎప్పుడు ఏ రూపంలో అనారోగ్యం లేదా ప్రమాదం ఎదురవుతుందో ఊహించలేం. ఖరీదైన వైద్య వ్యయాల భారాన్ని మోయలేం. జీవితకాల కష్టార్జితాన్ని ఒకేసారి ఎత్తుకుపోయే కరోనా మాదిరి విపత్తులు ఎప్పుడు వస్తాయో తెలియదు. వీటన్నింటికీ పరిష్కారమే హెల్త్ ఇన్సూరెన్స్. విస్తృత ప్రచారం నేపథ్యంలో నేడు చాలా మంది ఆరోగ్య బీమా ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకుంటున్నారు. ప్రీమియం కష్టమైనా తీసుకుంటున్నారు. తీరా ప్లాన్ కొనుగోలు చేసిన తర్వాత.. కంపెనీ సేవలు నచ్చకపోవచ్చు. మంచి ఫీచర్లతో తక్కువ ప్రీమియానికే మరో బీమా కంపెనీ హెల్త్‌ప్లాన్ ఆకర్షించొచ్చు. అటువంటి సందర్భంలో కనిపించే ఏకైక ఆప్షన్ పోర్టింగ్. ఒక నెట్‌వర్క్ నుంచి మరో నెట్‌వర్క్‌కు మొబైల్ నంబర్ మార్చుకున్నంత సులభంగానే.. హెల్త్ ఇన్సూ రెన్స్‌ను సైతం పోర్ట్ పెట్టుకుని మరో కంపెనీ ప్లాన్‌లో చేరిపోవచ్చు. పోర్టింగ్‌తో ఎన్నో ప్రయోజనాలున్నాయనడం లో సందేహం లేదు. అదే సమయంలో కొన్ని ఇబ్బందులు కూడా ఉన్నాయి. వీటి గురించి అవగాహన తప్పనిసరి. బలమైన కారణాలుంటేనే, అది కూడా సమగ్రమైన సమాచారం తెలుసుకున్న తర్వాతే 'పోర్టింగ్'ను ఎంపిక చేసుకోవాలన్నది నిపుణుల సూచన.

- సాక్షి, బిజినెస్ డెస్క్



తమ కంపెనీ ప్లాన్‌లోకి 'పోర్ట్' పెట్టుకోవాలంటూ ఇటీవలి కాలంలో మార్కెటింగ్ కాల్స్ రావడం కొందరికి అనుభవమే. బీమా మార్కెట్లో పోటీ పెరిగిపోవడంతో ఈ ధోరణి ఏర్పడింది. కొత్త కస్టమర్ల కోసం మార్కెటింగ్ బృందాలు అన్ని మార్గాల్లోనూ జల్లెడ పడుతున్నాయి. అప్పటి వరకు అసలు ఆరోగ్య బీమా రక్షణ పరిధిలో లేని కస్టమర్లకు హెల్త్ ప్లాన్ ఇవ్వడం మంచిదే. కానీ, ఇతర బీమా కంపెనీల కస్టమర్లను సైతం ఆకర్షించేందుకు కొత్తదారులు వెతుక్కుంటున్నాయి. ''పోర్ట్ పెట్టేసుకుని, మా కంపెనీ ప్లాన్‌లోకి మారిపోండి. మంచి ఫీచర్లు, మెరుగైన కవరేజీతో బీమా రక్షణ పొందండి'' అంటూ ఆఫర్లు ఇస్తున్న ధోరణి కనిపిస్తోంది. వ్యాపార వృద్ధి లక్ష్యాల్లో భాగంగా కొత్త కస్టమర్లను సంపాదించేందుకు కొందరు అనైతికంగానూ వ్యవహరిస్తున్నారు. ఇలాంటి కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. సహేతుక కారణాలు ఉన్నప్పుడే పోర్టింగ్ ఆప్షన్‌ను పరిశీలించాలి.



ఆచరణ వేరు..


ప్రస్తుత హెల్త్ ప్లాన్‌లో రూ.10 లక్షల బేసిక్ సమ్ అష్యూరెన్స్ ఉందనుకోండి. దీనికి మరో రూ.10 లక్షలు నో క్లెయిమ్ బోనస్ తోడయ్యింది. అప్పుడు సదరు పాలసీదారు రూ.20 లక్షల క్లెయిమ్‌కు అర్హులు. పోర్టింగ్‌తో వేరే కంపెనీ ప్లాన్‌లోకి మారాలనుకుంటే.. అప్పుడు రూ.20 లక్షల సమ్ అష్యూరెన్స్‌ను ఎంపిక చేసుకోవాలి. ఒకవేళ పాత ప్లాన్‌లో మాదిరే రూ.10 లక్షల బేసిక్ సమ్ అష్యూరెన్స్‌ను కొత్త సంస్థలోనూ ఎంపిక చేసుకుంటే.. రూ.10 లక్షల నో క్లెయిమ్ బోనస్ కోల్పోయినట్టు అవుతుంది. పోర్టింగ్‌తో రూ.20 లక్షల సమ్ అష్యూరెన్స్ ఎంపిక చేసుకుంటే అంత మొత్తానికి తాజా వెయిటింగ్ నిబంధన కొత్త సంస్థలోనూ అమలు కాదు. ముందస్తు వ్యాధులకు (పాలసీ తీసుకునే నాటికి) 3–4 ఏళ్ల పాటు వెయిటింగ్ పీరియడ్ క్లాజ్ ఉంటుంది. పాలసీ తీసుకుని అన్నేళ్ల పాటు రెన్యువల్ చేసుకున్న తర్వాతే, ఆయా వ్యాధుల తాలూకూ క్లెయిమ్‌లకు అర్హత లభిస్తుంది. కనుక ఒక ప్లాన్‌లో వెయిటింగ్ పీరియడ్ నిబంధనలు అన్నింటినీ పూర్తి చేసిన తర్వాత, మరో కంపెనీకి పోర్ట్ పెట్టుకునే ముందు సమ్ అష్యూరెన్స్ ఎంపికలో వివేకంతో వ్యవహరించాలి.


చేదు అనుభవం..

కేరళ రాష్ట్రానికి చెందిన అజిత్ కుమార్ (53)కు ఎదురైన అనుభవాన్ని ఈ సందర్భంగా చెప్పుకోవాలి. అప్పటికే ఉన్న హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్‌తో కానీ, బీమా కంపెనీతో కానీ అతడికి ఎలాంటి సమస్యల్లేవు. కానీ, ప్రముఖ ఆన్‌లైన్ ఇన్సూరెన్స్ బ్రోకింగ్ ప్లాట్‌ఫామ్ నుంచి ఒకరోజు కాల్ వచ్చింది. పాలసీని పోర్ట్ పెట్టుకోవాలంటూ మార్కెటింగ్ సిబ్బంది సూచించారు. మెరుగైన సదుపాయాలున్న ప్లాన్‌ను పోర్టింగ్‌తో పొందొచ్చంటూ ఆయన్ను ప్రోత్సహించారు. ''11 ఏళ్ల నుంచి నాకు హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో ఆప్టిమా సెక్యూర్ ప్లాన్ ఉంది. అన్నేళ్లలో ఒక్కసారి కూడా క్లెయిమ్ చేయలేదు. అయినా కానీ, పాలసీ ప్రీమియాన్ని గణనీయంగా పెంచేశారు. దీంతో మంచి ఫీచర్లున్న కొత్త పాలసీకి పోర్ట్ పెట్టుకోవాలంటూ పాలసీ బజార్ కస్టమర్ కేర్ ప్రతినిధి నాకు సూచించారు''అని కుమార్ తన అనుభవాన్ని పంచుకున్నారు. కానీ, జరిగిన నష్టం ఏంటో ఆ తర్వాత కానీ తెలియలేదు. పోర్టింగ్ నిర్ణయం పట్ల కుమార్ పశ్చాత్తాపం వ్యక్తం చేశారు.



కుమార్ పూర్వపు పాలసీలో రూ.10 లక్షల సమ్ అష్యూరెన్స్ ఉంది. మరో రూ.10 లక్షలకు నో క్లెయిమ్ బోనస్ (ఎన్‌సీబీ) కూడా ఉంది. అంటే మొత్తం రూ.20 లక్షల బీమా రక్షణ ఉన్నట్టు. పాలసీ తీసుకుని 10–11 ఏళ్లు కావడంతో అన్ని రకాల వెయిటింగ్ పీరియడ్ నిబంధనలను కుమార్ అధిగమించేశారు. పాత పాలసీలోనే కొనసాగి ఉంటే ఎలాంటి క్లెయిమ్‌కు అయినా అర్హత కొనసాగేది. కానీ, పోర్టింగ్‌తో నో క్లెయిమ్ బోనస్ కొత్త పాలసీలోకి బదిలీ కాలేదు. పైగా ఒకే విడత మూడేళ్ల ప్రీమియంలను కుమార్‌తో కట్టించారు సదరు మార్కెటింగ్ సిబ్బంది. వారి సూచనతో సూపర్ టాపప్ ప్లాన్ కూడా కొనుగోలు చేశారు. పాలసీ కొనుగోలు తర్వాత సేవలు దారుణంగా ఉన్నాయని కుమార్ విచారించడం మినహా మరో మార్గం లేకపోయింది. నో క్లెయిమ్ బోనస్, వెయిటింగ్ పీరియడ్ ప్రయోజనాలు అన్ని పోర్టింగ్ కేసుల్లోనూ తప్పనిసరిగా బదిలీ కావాలని లేదు. ఈ విషయంలో బీమా సంస్థల షరతులను అర్థం చేసుకోవాలి.





పోర్టింగ్ ప్రక్రియ ఇలా..

పోర్టింగ్ పెట్టుకోవాలంటే ప్రస్తుత పాలసీ రెన్యువల్ ఇంకా కనిష్టంగా 30 రోజులు, గరిష్టంగా 60 రోజుల గడువు ఉందనగా ప్రక్రియ ప్రారంభించాలి. ఉదాహరణకు ఫిబ్రవరి 28న తదుపరి ప్రీమియం చెల్లించాల్సిన గడువు అనుకుంటే, మీరు రెండు నెలల ముందుగా డిసెంబర్ 31నుంచి ప్రారంభించొచ్చు. రెన్యువల్‌కు 30 రోజుల కంటే తక్కువ వ్యవధి ఉన్నా కానీ, బీమా సంస్థ తన విచక్షణ మేరకు పోర్టింగ్ దరఖాస్తును ఆమోదించొచ్చని ఐఆర్‌డీఏఐ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుత బీమా కంపెనీకి ఎలాంటి సమాచారం ఇవ్వక్కర్లేదు. పోర్టింగ్‌తో ఏ కంపెనీ ప్లాన్‌లోకి వెళ్లాలనుకుంటున్నారో, ఆ కంపెనీని సంప్రదించాలి. పోర్టబులిటీ, ప్రపోజల్ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. పోర్టింగ్ సమయంలో తాజా ఆరోగ్య సమాచారం మొత్తాన్ని వివరంగా వెల్లడించాల్సిందే. అప్పటి వరకు ఏదైనా అనారోగ్యంతో ఆస్పత్రి పాలైనా, లోగడ హెల్త్‌క్లెయిమ్‌ల గురించి కూడా వెల్లడించాల్సి రావచ్చు. ఈ వివరాల ఆధారంగా రిస్క్‌ను మదింపు వేసి బీమా సంస్థ ప్రీమియంను నిర్ణయిస్తుంది. అవసరమైతే అప్పటికే ఉన్న ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రీమియంను పెంచొచ్చు. పోర్టింగ్ దరఖాస్తును కొత్త సంస్థ ఆమోదించి, పాలసీ జారీ చేసే వరకు పాత పాలసీని రద్దు చేసుకోవద్దు. ఎందుకంటే పాలసీదారు ఆరోగ్య చరిత్ర, రిస్క్, ఇతర అంశాల ఆధారంగా కొత్త సంస్థ ప్రీమియంను గణనీయంగా పెంచేస్తే అది అంగీకారం కాకపోవచ్చు. నో క్లెయిమ్ బోనస్, వెయిటింగ్ పీరియడ్ ప్రయోజనాల విషయంలోనూ కొత్త సంస్థ నిబంధనలు నచ్చకపోతే, పోర్టింగ్ అభ్యర్థనను ఉపసంహరించుకుని పాత సంస్థలో కొనసాగొచ్చు.

ఐఆర్‌డీఏఐ ఉత్తర్వులు ఉన్నా...

సమ్ అష్యూరెన్స్, నో క్లెయిమ్ బోనస్, నిర్దేశిత వెయిటింగ్ పీరియడ్, మారటోరియం పీరియడ్‌కు సంబంధించిన అర్హతలను పోర్టింగ్ తోపాటు బదిలీ చేయాలంటూ ఈ ఏడాది ఆరంభంలో బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ)తన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొంది. కానీ, బీమా సంస్థలు తెలివిగా ఈ నిబంధనలను అమలు చేస్తున్నట్టు కనిపిస్తోంది. ఉదాహరణకు.. ప్రస్తుత ప్లాన్‌లో రూ.10 లక్షల బేసిక్ సమ్ అష్యూరెన్స్‌తో, అన్ని వెయిటింగ్ పీరియడ్ నిబంధనలు అధిగమించేసి ఉన్నారని అనుకుందాం. పోర్టింగ్ సమయంలో కొత్త సంస్థలో రూ.20 లక్షల సమ్ అష్యూరెన్స్ ఎంపిక చేసుకుంటే, అప్పుడు పాత ప్లాన్‌లో రూ.10 లక్షలకే వెయిటింగ్ పీరియడ్‌ను పూర్తి చేశారు కనుక, కొత్త సంస్థ కూడా అంతే మొత్తానికి ఆ ప్రయోజనాన్ని కొనసాగిస్తుంది. మరో రూ.10 లక్షల మొత్తానికి అన్ని వెయిటింగ్ పీరియడ్‌లు తాజాగా అమల్లోకి వస్తాయని తెలుసుకోవాలి. దీనర్థం.. అప్పటికే ఉన్న వ్యాధులకు సంబంధించి క్లెయిమ్ మొత్తం రూ.10 లక్షలు మించిన సందర్భాల్లో రూ.10 లక్షలకే పరిహారం పరిమితమవుతుంది. కుమార్ విషయంలో ఈ తప్పిదమే చోటుచేసుకుంది. పాత ప్లాన్‌లో రూ.10 లక్షల బేసిక్ సమ్ అష్యూరెన్స్, రూ.10 లక్షల నో క్లెయిమ్ బోనస్ ఉన్నప్పటికీ.. పోర్ట్ తర్వాత రూ.10 లక్షలకే సమ్ అష్యూరెన్స్‌ను ఎంపిక చేసుకున్నారు. దీంతో నో క్లెయిమ్ బోనస్ కోల్పోవడమే కాకుండా, ఆ మొత్తానికి వెయిటింగ్ పీరియడ్ ప్రయోజనాన్ని కోల్పోయినట్టు అయింది.

పోర్టింగ్ ఏ సందర్భాల్లో..?

ముఖ్యమైన కారణాలుంటేనే పోర్టింగ్‌ను పరిశీలించాలని నిపుణులు సూచిస్తున్నారు. ''ఏజెంట్ల సూచన మేరకు పోర్టింగ్ చేసుకుంటే, ఇన్సూరెన్స్ పాలసీ ప్రపోజల్ పత్రంలో అన్ని వివరాలు సమగ్రంగా ఉన్నాయేమో ఒక్కసారి ధ్రువీకరించుకోవాలి. చాలా సందర్భాల్లో ఏజెంట్లు అధిక కమీషన్ కోసం పోర్టింగ్ పేరుతో, తాజాగా పాలసీలు అంటగడుతుంటారు'' అని హోలిస్టిక్ వెల్త్ సహ వ్యవస్థాపకుడు నిషాంత్ బాత్రా తెలిపారు. ఒకటికి మించిన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు, ప్రీమియం తగ్గుతుందన్న ఆశతో పోర్టింగ్ పెట్టుకునే తప్పిదం చేయవద్దన్నది బాత్రా సూచన. పోర్టింగ్ ద్వారా వచ్చిన పాలసీదారులను కొత్తవారిగానే బీమా సంస్థలు పరిగణిస్తాయి.

పోర్టింగ్ చేసుకున్న తర్వాత తొలినాళ్లలో క్లెయిమ్‌కు వెళితే, అందులోని వాస్తవికతను అవి సందేహించే అవకాశం లేకపోలేదు. మరి పోర్టింగ్ ఏ సందర్భాల్లో పరిశీలించాలన్న సందేహం రావచ్చు. ప్రస్తుత ప్లాన్‌లో లేని మెరుగైన ఫీచర్లు కొత్త ప్లాన్‌లో వస్తుంటే, మరిన్ని వ్యాధులకు కవరేజీ లభిస్తుంటే, అవి తమకు ఎంతో ప్రయోజనకరమని భావిస్తే అప్పుడు పోర్టింగ్‌ను పరిశీలించొచ్చు. అలాగే, ప్రస్తుత ప్లాన్‌లో రూమ్ రెంట్ విషయంలో పరిమితులు ఉండి, పోర్టింగ్‌తో వెళ్లే ప్లాన్‌లో ఎలాంటి రూమ్ రెంట్ పరిమితులు లేనట్టయితే అప్పుడు కూడా ఈ ఆప్షన్ వినియోగించుకోవడం సరైనదేనని బాత్రా సూచించారు. ఇక ప్రస్తుత బీమా సంస్థ క్లెయిమ్‌ల పరంగా ఇబ్బందులు పెడుతుంటే, క్లెయిమ్ మొత్తంలో కోతలు పెడుతుంటే లేదా క్లెయిమ్ ఆమోదంలో చాలా జాప్యం చేస్తుంటే, కస్టమర్ సర్వీస్ విషయంలో సంతోషంగా లేకపోయినా కానీ పోర్టింగ్ సహేతుకమే.



ఇవి తెలుసుకోవాలి..

- పోర్టింగ్‌తో పాత పాలసీలో పొందిన నో క్లెయిమ్, వెయిటింగ్ పీరియడ్ క్రెడిట్ ప్రయోజనాలను కొత్త సంస్థ కూడా నిబంధనల మేరకు అందిస్తుందా? లేదా అన్నది ముందే ధ్రువీకరించుకోవాలి.
- పాత కంపెనీలో ముందస్తు వ్యాధులకు 3 ఏళ్ల వెయిటింగ్ పీరియడ్ నిబంధనను పూర్తి చేశారని అనుకుందాం. పోర్టింగ్ తర్వాత కొత్త సంస్థ ప్లాన్‌లో వెయిటింగ్ పీరియడ్ 4 ఏళ్లుగా ఉంటే.. అప్పుడు మరో ఏడాది తర్వాతే క్లెయిమ్ ప్రయోజనాలకు అర్హత లభిస్తుంది. ఒకవేళ పాత కంపెనీలో వెయిటింగ్ పీరియడ్‌ను సగమే పూర్తి చేసి ఉంటే, అప్పుడు కొత్త సంస్థలో నిబంధనల మేరకు మిగిలిన కాలానికి వెయిటింగ్ పీరియడ్ కొనసాగుతుంది.
- పోర్టింగ్‌కు ప్రీమియం ఒక్కదానినే ప్రామాణికంగా తీసుకోవద్దు. ఎందుకంటే వయసు, ఆరోగ్య చరిత్ర వివరాల ఆధారంగా ఈ ప్రీమియం మారిపోవచ్చు. అధిక రిస్క్‌లో ఉన్నారని భావిస్తే బీమా సంస్థలు అధిక ప్రీమియంను నిర్ణయిస్తాయి.
- హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను నేరుగా బీమా సంస్థ నుంచి తీసుకున్నా, ఏజెంట్ సాయంతో తీసుకున్నా ప్రీమియంలో పెద్ద వ్యత్యాసం ఉండదు. కొన్ని కంపెనీలు ఏ రూపంలో పాలసీ తీసుకుంటున్నప్పటికీ ఒక్కటే ప్రీమియం అమలు చేస్తున్నాయి.
- పోర్టింగ్ తర్వాత అధిక సమ్ అష్యూరెన్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు. మరింత సమ్ అష్యూరెన్స్ ఇవ్వడమా? లేదా అన్న దానిని అండర్‌రైటింగ్ నిబంధనల మేరకు బీమా కంపెనీలు నిర్ణయిస్తాయి.
- అన్ని వ్యక్తిగత, ఫ్యామిలీ ఫ్లోటర్ ఇండెమ్నిటీ పాలసీలకు పోర్టింగ్ అర్హత ఉంటుంది. ఇక గ్రూప్ హెల్త్ పాలసీల్లో కవరేజీ ఉన్న వ్యక్తులు, కుటుంబాలకు మాత్రం.. ఆ గ్రూప్ నుంచి తప్పుకున్నప్పుడు లేదా గ్రూప్ పాలసీలో మార్పులు చేసినప్పుడు (ప్రీమియం పెంపు సహా) లేదా గ్రూప్ పాలసీని ఉపసంహరించుకున్న సందర్భాల్లో పోర్టింగ్‌కు వీలు కల్పించాల్సి ఉంటుంది.
- పోర్టింగ్ దరఖాస్తుపై 15 రోజుల్లో బీమా సంస్థ తన నిర్ణయాన్ని పాలసీదారునకు తెలియజేయాల్సి ఉంటుంది. పాత పాలసీలో ఉన్న కవరేజీకి తక్కువ కాకుండా బీమా రక్షణను కొత్త సంస్థ అందించాలి.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ప్రపంచ పరిణామాలే మార్కెట్‌కు దిక్సూచి | భారత్ చిప్ ఫ్యాబ్రికేషన్ రంగంలో మంచి అవకాశాలు

జోస్ ఆలుక్కాస్ డైమండ్ ఫెస్ట్ ప్రారంభం



హైదరాబాద్: వజ్రాల ప్రేమికులను అసాధారణ ఆఫర్లు, బహుమతులతో సంతోషపరచేందుకు ప్రముఖ ఆభరణాల సంస్థ జోస్ ఆలుక్కాస్ 'డైమండ్ ఫెస్ట్'ను ప్రారంభించింది. ఈ మేరకు విడుదలైన ఒక ప్రకటన ప్రకారం వజ్రాల కొనుగోలుకు సంబంధించి ప్రతి క్యారెట్‌కు ఒక 500 మిల్లీగ్రాముల బంగారు నాణేన్ని వినియోగదారులు ఉచితంగా అందుకుంటారు. వజ్రాల ఆభరణాలపై ప్రతి క్యారెట్‌కు ఫ్లాట్‌గా రూ.15,000 తగ్గింపు పొందవచ్చు. కస్టమర్లు తమ పాత బంగారాన్ని వజ్రాలతో ఎక్స్ఛేంజ్ చేసుకోడానికి తద్వారా అధిక లాభాలను పొందడానికి ఈ వేడుక అవకాశాన్ని కల్పిస్తుంది. వేడుకలో భాగంగా నిర్వహించే లక్కీడ్రాలో గెలుపొందే ఏడు జంటలకు ప్రయాణం, రెండు రాత్రులు బస, ఒక క్యాసినో సందర్శన సహా ఉచిత గోవా పర్యటన బహుమతిగా లభిస్తుందని చైర్మన్ జోస్ ఆలుక్కాస్ ప్రకటనలో పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/ 100కు రూ.లలో)

23-12-2024	
విశాఖ	590-00
చిత్తూరు	583-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	585-00
విజయవాడ	585-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	575-00
వరంగల్	577-00
రిటైల్ ధర	6.35

స్టాక్స్ వ్యూ

ఈప్యాక్ డ్యూరబుల్ | బ్రోకరేజ్: ఎల్‌కేపీ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 462 **టార్గెట్:** రూ. 575

ఎందుకంటే: వేగవంత వృద్ధిలో ఉన్న రూమ్ ఎయిర్ కండిషనర్ (ఆర్‌ఏసీ) విభాగంలో కంపెనీ కీలక పాత్ర పోషిస్తోంది. 2019లో కార్యకలాపాలు ప్రారంభమయ్యాక కంపెనీ ప్రస్తావించదగ్గ స్థాయిలో వృద్ధిని సాధిస్తూ వస్తోంది. గత రెండేళ్ల కాలం (2022–24)లో వార్షిక ప్రాతిపదికన ఆదాయం 24 శాతం చొప్పున ఎగసింది. ఈ కాలంలో కంపెనీ క్లయింట్లతో పటిష్ట స్థాయిలో దీర్ఘకాలిక సంబంధాలను నెలకొల్పుకుంది. కొంతమంది క్లయింట్లతో ఏర్పాటు చేసుకున్న భాగస్వామ్యాలు గత 8 ఏళ్లుగా కొనసాగుతుండటం దీనికి నిదర్శనం. ఈ కాలంలో వ్యూహాత్మకంగా ఆర్‌ఏసీలకు వెలుపల విభిన్న ప్రాడక్టులలోకి ప్రవేశించింది. ఈ జాబితాలో ఎయిర్ కూలర్స్, టాప్‌లోడ్ వాషింగ్ మెషీన్లు, ఎయిర్ ఫ్రయర్స్ తయారీతోపాటు.. చిన్నతరహా కిచెన్ అప్లయెన్సెస్‌ను సైతం అభివృద్ధి చేస్తోంది. వెరసి వివిధీకరణ ద్వారా ఇతర విభాగాలలోనూ పురోగతికి బాటలు వేసుకుంది. మరోవైపు ఆర్‌ఏసీ విభాగం భవిష్యత్‌లోనూ పటిష్ట వృద్ధిని సాధించే అవకాశముంది. 2028–29కల్లా 2.5 కోట్ల యూనిట్లకు అమ్మకాలు చేరగలవని ఒక అంచనా. అంటే వార్షికంగా 18 శాతం వృద్ధిని అందుకోనుంది. తీవ్ర పోటీగల ఆర్‌ఏసీ విభాగంలో కంపెనీకిగల పటిష్ట బ్యాక్‌వార్డ్ ఇంటిగ్రేషన్ సామర్థ్యాలకుతోడు.. ఆధునిక పరిశోధన, అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ) సంబంధ మౌలిక సదుపాయాలు దన్నుగా నిలవనున్నాయి. రానున్న మూడేళ్ల (2024–27)లో అమ్మకాలు 31 శాతం, నిర్వహణ లాభం 34 శాతం, నికర లాభం 55 శాతం చొప్పున వార్షిక వృద్ధిని అందుకోగలవని భావిస్తున్నాం.



సీగల్ ఇండియా | బ్రోకరేజ్: జేఎమ్ ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 351 **టార్గెట్:** రూ. 450

ఎందుకంటే: మౌలికసదుపాయ రంగంలో కార్యకలాపాలు విస్తరించిన సీగల్ ఇండియా తొలుత చిన్నతరహా కన్‌స్ట్రక్షన్ కంపెనీగా ప్రారంభమైంది. గత ఐదేళ్లలో సుప్రసిద్ధ ఈపీసీ సంస్థగా ఆవిర్భవించింది. ఇదే సమయంలో లాభదాయకతతో పాటు.. బ్యాలన్స్‌షీట్‌ను సైతం మెరుగుపరచుకుంటూ వచ్చింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం కంటే దాదాపు 4 రెట్లు అధికంగా రూ. 12,200 కోట్ల ఆర్డర్‌బుక్‌ను కలిగి ఉంది. దీంతో మూడేళ్ల కాలం (2024–27)లో ఆదాయం 22 శాతం, ఈపీఎస్‌లో 18 శాతం వార్షిక వృద్ధిని సాధించగలదని భావిస్తున్నాం. కంపెనీ విభిన్న విభాగాలకు కార్యకలాపాలను విస్తరించడం ద్వారా వివిధీకరణ బాటలో సాగుతోంది. ఇది వృద్ధి కొనసాగేందుకు తోడ్పాటునివ్వనుంది. ఈ నేపథ్యంలో 2026–27 ఏడాదికల్లా నికర రుణం/నిర్వహణ లాభ నిష్పత్తి 0.5 స్థాయికి మెరుగుపరచుకునే అవకాశముంది. ఇక మరోపక్క మధ్యకాలంలో 3 హైబ్రిడ్ యాన్యుటీ (హెచ్ఏఎం) ప్రాజెక్టులను మానిటైజ్ చేసే ప్రణాళికలు వేసింది. తద్వారా విస్తరణ మూలధనాన్ని (గ్రోత్ క్యాపిటల్) సమకూర్చుకోవాలని చూస్తోంది. వెరసి బ్యాలన్స్‌షీట్ పటిష్టతకు దన్నునివ్వనుంది. ఇటీవల కాలంలో కంపెనీ ప్రధాన కాంట్రాక్టర్‌గా అవతరించింది. ప్రధానంగా జాతీయ రహదారుల విభాగంలో కీలక కంపెనీగా నిలుస్తోంది. అయితే జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) ఆర్డర్ల జారీలో మందగమనం, ప్రాజెక్టుల బిడ్డింగ్‌లో పోటీ మరింత పెరగడం, కొత్త విభాగాలలోకి ప్రవేశిస్తున్న కారణంగా బిడ్డింగ్ లేదా ఎగ్జిక్యూషన్‌లో పొరపాట్లు వంటి అంశాలను ప్రధాన రిస్కులుగా పరిగణించవచ్చు.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఫండ్స్ పెట్టుబడులకు హెడ్జింగ్ వ్యూహం?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఫండ్స్‌లో పెట్టుబడులు ఉన్నాయి. హెడ్జింగ్ చేసుకోవడం ఎలా? - శ్యామ్ ప్రసాద్

ఈక్విటీ మార్కెట్ నష్టపోయే క్రమంలో సెన్సెక్స్, నిఫ్టీ, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ ఇలా అన్ని సూచీలు పడిపోతుంటాయి. మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో హెడ్జింగ్ ఆప్షన్ అంతర్గతంగా ఉండదు. కనుక పెట్టుబడులను వివిధ సాధనాల మధ్య వైవిధ్యం చేసుకోవడమే ఇన్వెస్టర్ల ముందున్న మార్గం. వివిధ సాధనాల మధ్య పెట్టుబడుల కేటాయింపుల (అసెట్ అలోకేషన్) ప్రణాళిక కలిగి ఉండడం ఈ దిశగా మంచి వ్యూహం అవుతుంది. ఉదాహరణకు మీ మొత్తం పెట్టుబడుల్లో 50 శాతాన్ని ఈక్విటీలు లేదా ఈక్విటీ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలి. మరో 50 శాతాన్ని డెట్ సెక్యూరిటీలు లేదా డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. ఈక్విటీ మార్కెట్లు పెరగడం కారణంగా ఈక్విటీ పెట్టుబడుల విలువ 70 శాతానికి చేరినప్పుడు.. 20 శాతం మేర విక్రయించి ఆ మొత్తాన్ని డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. అప్పుడు ఈక్విటీ/డెట్ రేషియో 50:50గా ఉంటుంది. ఉదాహరణకు రూ. లక్ష పెట్టుబడిలో రూ.50 వేలను ఈక్విటీల్లో, రూ.50 వేలను డెట్‌లో ఇన్వెస్ట్ చేశారని అనుకుందాం. కొంత కాలానికి ఈక్విటీ పెట్టుబడుల విలువ రూ.70 వేలకు చేరి, డెట్ పెట్టుబడుల విలువ రూ.55 వేలకు వృద్ధి చెందిందని అనుకుందాం. అప్పుడు ఈక్విటీల నుంచి రూ.7,500 పెట్టుబడిని వెనక్కి తీసుకుని డెట్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. అప్పుడు రెండు సాధనాల్లో పెట్టుబడులు సమానంగా ఉంటాయి. ఒకవేళ ఈక్విటీ మార్కెట్ల పతనంతో ఈక్విటీ పెట్టుబడుల విలువ రూ.50 వేల నుంచి రూ.40 వేలకు తగ్గి, డెట్ పెట్టుబడులు రూ.55వేలుగా ఉన్నాయనుకుంటే.. అప్పుడు డెట్ పెట్టుబడుల నుంచి రూ.7,500ను వెనక్కి తీసుకుని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. ఇలా ఒక సాధనంలో పెట్టుబడుల విలువ మరో సాధనంలోని పెట్టుబడుల విలువ కంటే 10–15 శాతం అధికంగా ఉన్నప్పుడు మార్పులు చేర్పులు చేసుకోవాలి. అసెట్ అలోకేషన్ ఆటోమేట్ చేసుకోవడం, రీబ్యాలన్స్ వ్యూహాన్ని సరిగ్గా అమలు చేయడం ద్వారా మార్కెట్ల పతనంపై ఆందోళన చెందకుండా రాబడులను పెంచుకోవచ్చు.

రూ.50 లక్షలను 15 ఏళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ఈ మొత్తాన్ని 12 నెలల సమాన వాయిదాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చా..? - శ్రీ కైవల్య

కొంత రక్షణాత్మక ధోరణిలో అయితే మూడేళ్ల పాటు నెలసరి సమాన వాయిదాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. కొంత రిస్క్ తీసుకునే ధోరణితో ఉంటే 18–24 నెలల సమాన వాయిదాల్లో ఈ మొత్తాన్ని ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. మార్కెట్లో దిద్దుబాట్లు పెట్టుబడుల అవకాశాలకు అనుకూలం. ఇన్వెస్ట్ చేసిన తర్వాత ఆ మొత్తం విలువ తగ్గిపోతే విచారించాల్సి వస్తుంది. అందుకని ఒకే విడత కాకుండా క్రమంగా నెలకు కొంత చొప్పున కొంత కాలం పాటు ఇన్వెస్ట్ చేసుకోవడం సూచనీయం. వైవిధ్యమైన నేపథ్యంతో ఉండే ఫ్లెక్సీ క్యాప్ పథకాలను ఎంపిక చేసుకోవచ్చు. ఇవి వృద్ధి, రిస్క్‌ను సమతుల్యం చేస్తుంటాయి. దీర్ఘకాల లక్ష్యాలకు ఇవి అనుకూలం. మీ వద్దనున్న మొత్తాన్ని లిక్విడ్ లేదా అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్‌లో ముందు ఇన్వెస్ట్ చేసుకోవాలి. వాటి నుంచి ప్రతి నెలా నిర్ణీత మొత్తాన్ని సిస్టమ్యాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ ద్వారా ఎంపిక చేసుకున్న ఈక్విటీ పథకాల్లోకి మళ్లించుకోవాలి.



చిరువ్యాపారులకు గుచ్చుకుంటున్న మనీ'ముల్లు'!

ఏపీలోని కాకినాడ జిల్లా గొల్లల మాడిదాడకు చెందిన ఓ చిరువ్యాపారి బ్యాంక్ ఖాతాను రాచకొండ పరిధిలోని మేడిపల్లి పోలీసులు ఫ్రీజ్ చేశారు.

అదే రాష్ట్రంలోని ఏలూరు జిల్లా కలిదిండికి చెందిన ఓ సెల్‌ఫోన్ వ్యాపారి బ్యాంకు ఖాతాను చెన్నైకి చెందిన సైబర్ క్రైం అధికారులు ఫ్రీజ్ చేశారు.

సాక్షి, హైదరాబాద్

ఈ రెండే కాదు... అనేక సందర్భాల్లో ఇలాంటి చిన్నచిన్న వ్యాపారస్తులు ఇబ్బందులు పడటానికి మనీమ్యూల్స్, వారు సాగిస్తున్న లావాదేవీలే కారణం అవుతున్నాయి. సైబర్ నేరాలకు సంబంధించిన అనుమానాస్పద లావాదేవీలు జరిగిన ఖాతాల ఫ్రీజింగ్, డీ–ఫ్రీజింగ్ విషయంలో స్పష్టత లేకపోవడం, దీన్ని ఆర్‌బీఐ పట్టించుకోకపోవడం, ప్రతి వ్యాపారికీ కోర్టుకెళ్లి న్యాయ పోరాటం చేసే అవకాశం లేకపోవడమే ఈ ఇబ్బందులకు కారణం అవుతోంది. నేషనల్ సైబర్ సెక్యూరిటీ రీసెర్చ్ కౌన్సిల్ (ఎన్సీఎస్సార్సీ) సైతం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టడంతోపాటు ఇండియన్ సైబర్ క్రైం కో–ఆర్డినేషన్ సెంటర్‌తో (ఐ4సీ) కలిసి పనిచేస్తోంది.

ఎవరీ మనీ మ్యూల్స్?

ఏ సైబర్ నేరంలో అయినా సైబర్ నేరగాళ్ల ప్రధాన లక్ష్యం బాధితుల నుంచి అందినకాడికి దండుకోవడమే. ఇటీవల కాలంలో ఎక్కువగా సైబర్ నేరాలన్నీ విదేశాల నుంచే జరుగుతున్నాయి. అయితే కొల్లగొట్టిన సొమ్మును తమ బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేయించుకున్నా లేదా వాటితో లింకై ఉన్న ఫోన్ నంబర్లకు బదిలీ చేయించుకున్నా పోలీసులకు ఆధారాలు లభిస్తాయి. దీంతో సైబర్ నేరగాళ్లకు స్థానికంగా ఉండే కరెంట్ బ్యాంకు ఖాతాల అవసరం ఏర్పడుతోంది. ఇందుకోసం సైబర్ నేరస్తులు కమీషన్ ఆశచూపి స్థానికంగా ఉండే కరెంట్ బ్యాంకు ఖాతాలున్న చిన్న, మధ్యతరహా సంస్థల వ్యాపారులను ట్రాప్ చేస్తున్నారు. ఇలా తెలిసో, తెలియకో బ్యాంకు ఖాతాల వివరాలను సైబర్ నేరగాళ్లకు అందించి కమీషన్‌ను పొందే వారిని మనీమ్యూల్స్ అంటారు. మనీమ్యూల్స్‌కు అడ్వాన్స్‌గా రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు ముట్టజెబుతున్న సైబర్ నేరస్తులు తమ 'పని'కానిచ్చాక 10 నుంచి 15 శాతం కమీషన్‌ను మనీమ్యూల్స్‌కు సంబంధించిన ఇతర ఖాతాల్లోకి బదిలీ చేస్తున్నారు.

కమీషన్ ఖర్చు చేయడానికి కొత్త మార్గాలు

మనీమ్యూల్స్ సైతం కమీషన్‌గా తమకు ముట్టే నగదును ఖర్చు చేసే విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆ మొత్తం పడే బ్యాంకు ఖాతాలను బోగస్ వివరాలతో తెరుస్తున్నారు. అలాగే తమ పేర్లతో లేని సిమ్‌కార్డుల ఆధారంగా పనిచేసే ఫోన్ నంబర్లతోపాటు సెకండ్ హ్యాండ్ ఫోన్లలో యూపీఐ యాప్స్‌ను యాక్టివేట్ చేసుకుంటున్నారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు వాటిల్లో పడే మొత్తాలను సైతం తమ స్వస్థలాల్లో ఖర్చు చేయకుండా... హైవేలు, ప్రధాన రహదారుల్లో ఉన్న చిన్న చిన్న దుకాణాలను ఎంచుకుంటున్నారు. చిరువ్యాపారులకు కమీషన్ ఆశచూపుతూ ఆన్‌లైన్‌లో డబ్బు బదిలీ చేసి నగదు తీసుకోవడం లేదా మరికొన్ని చోట్ల సెల్‌ఫోన్ల వంటి వస్తువులు కొంటున్నారు. ఇలా పరోక్షంగా సైబర్ నేరాలకు సంబంధించిన సొమ్ము ఆయా వ్యాపారుల ఖాతాల్లోకి వెళ్తోంది.

సమగ్ర విధానంపై కేంద్రం కసరత్తు చేస్తోంది




ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) గణాంకాల ప్రకారం ఈ ఏడాది ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 4.5 లక్షల మనీ మ్యూల్స్ బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ అయ్యాయి. వాటిలో అత్యధికంగా దాదాపు 40 వేల ఖాతాలు ఎస్‌బీఐకి సంబంధించినవి ఉన్నాయి. ఎయిర్‌టెల్ మనీ పేమెంట్ యాప్‌కు సంబంధించిన ఖాతాలు 5 వేల వరకు ఫ్రీజ్ అయ్యాయి. వాటిలో కొన్ని అమాయకులైన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వ్యాపారులవి సైతం ఉన్నాయి. తమ ప్రమేయం లేకుండా సైబర్ నేరగాళ్లు, మనీమ్యూల్స్ చేసిన వ్యవహారాలతో ఇబ్బందులు పడుతున్న చిరువ్యాపారుల అంశంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ బ్యాంకు ఖాతాల ఫ్రీజింగ్, డీ–ఫ్రీజింగ్‌కు సంబంధించి సమగ్ర విధానం రూపొందించడానికి కసరత్తు చేస్తోంది.

– డాక్టర్ ఇ.కాళిరాజ్ నాయుడు, డైరెక్టర్, ఎన్సీఎస్సార్సీ

బాధితుల ఫిర్యాదుతో ఖాతాల నిలుపుదల

సైబర్ బాధితుల ఫిర్యాదుతో కేసుల దర్యాప్తు చేస్తున్న పోలీసులు మనీ మ్యూల్స్ ఖాతాలతోపాటు తెలియకుండా ఈ ఉచ్చులో చిక్కుకుంటున్న చిరువ్యాపారుల ఖాతాలను సైతం ఫ్రీజ్ చేస్తున్నారు. దీంతో ఆయా వ్యాపారులు వాటిని డీ–ఫ్రీజ్ చేయించుకోవడం కోసం నానాతిప్పలు పడాల్సి వస్తోంది. సాధారణంగా మనీమ్యూల్ లేదా అతడి ఏజెంట్ ఎంత మొత్తాన్ని చిరు వ్యాపారి ఖాతాలోకి బదిలీ చేశాడో అంతే సొమ్ము ఫ్రీజ్ చేసే అవకాశం ఉండగా పోలీసులు మాత్రం ఖాతా మొత్తాన్ని ఫ్రీజ్ చేస్తూ చిరువ్యాపారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

టుడేస్ గ్రాఫిక్




శిక్షణ పూర్తి చేసుకున్న ట్రాన్స్‌జెండర్ల డ్రిల్‌ను పరిశీలిస్తున్న సీవీ ఆనంద్

మీ పనితీరుపైనే మీ వంటి వారి భవిష్యత్తు

ట్రాన్స్‌జెండర్లతో సిటీ కొత్వాల్ సీవీ ఆనంద్
- నేటి నుంచి ట్రాఫిక్ అసిస్టెంట్లుగా విధులు
- అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచన

సాక్షి, హైదరాబాద్: 'సమాజంలో మీకు ఎదురవుతున్న అవమానాలు, వివక్షను చూసిన ప్రభుత్వం.. నగర ట్రాఫిక్ విభాగంలో పని చేసే అవకాశం ఇచ్చింది. మీ పనితీరు పైనే మీలాంటి వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది'అని ట్రాఫిక్ అసిస్టెంట్లుగా శిక్షణ పూర్తి చేసుకున్న ట్రాన్స్‌జెండర్లను ఉద్దేశించి హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకున్న 39 మంది ట్రాన్స్‌జెండర్లు సోమవారం నుంచి విధుల్లోకి రానున్నారు. ఈ నేపథ్యంలో ఆనంద్ ఆదివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (టీజీసీసీసీ) వారి డ్రిల్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా కొత్వాల్ ఆనంద్ ట్రాఫిక్ అసిస్టెంట్లను ఉద్దేశించి మాట్లాడుతూ.. 'సమాజం ట్రాన్స్‌జెండర్లను వేరుగా చూడటం సరికాదనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. ఇలా వచ్చిన సువర్ణావకాశాన్ని మీరంతా సద్వినియోగం చేసుకుని ఈ పైలెట్ ప్రాజెక్టును విజయవంతం చేయాలి. పక్కాగా పని చేసి నమ్మకం నిలబెట్టుకుంటే ప్రభుత్వం మరికొందరికి, మరిన్ని రంగాల్లో అవకాశం ఇస్తుంది. ఈ పైలెట్ ప్రాజెక్టులో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా పని చేసే ట్రాన్స్‌జెండర్లకు హోంగార్డుల మాదిరి జీతం ఇవ్వనున్నాం. దేశం మొత్తం గమనిస్తున్న ఈ సమయంలో మిమ్మల్ని మీరు నిరూపించుకోవాలి. మీ అందరిపైనా నాకు ఉన్న నమ్మకం ఈ డ్రిల్‌తో మరింత పెరిగింది'అని అన్నారు.



15 అడుగుల బెండ మొక్క

బెండ మొక్క 4 నుంచి 5 అడుగుల ఎత్తు పెరగడం సహజం. కానీ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం విలేజ్‌కు చెందిన అల్లీ అశోక్ ఇంటి ఆవరణలో నాటిన బెండ.. ఏకంగా 15 అడుగులు పెరిగింది. మూడు నెలల క్రితం నాటగా క్రమక్రమంగా కాస్తూ, పెరుగుతూ వచ్చింది. ఇప్పటి వరకు 74 కాయలు కాసినట్లు అశోక్ తెలిపారు. - కేసముద్రం

'మత్తు'రహిత వేడుకలు

టీజీ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పటిష్ట చర్యలు
- నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ వినియోగంపై నిఘా
- మాదకద్రవ్యాల విక్రేతలు, సరఫరాదారులపై ఫోకస్



సాక్షి, హైదరాబాద్: నూతన సంవత్సర (2025) వేడుకలు మాదకద్రవ్య రహితంగా జరిగేలా చూడటమే లక్ష్యంగా తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ) పటిష్ట చర్యలు ప్రారంభించింది. వేడుకల్లో మత్తుపదార్థాల వినియోగాన్ని కట్టడి చేసేందుకు టీజీఏఎన్‌బీ బృందాలు నిఘా పెంచాయి. తనిఖీలు ముమ్మరం చేయడంతోపాటు మత్తు పదార్థాలు విక్రయించే, సరఫరా చేసే వారిపై ఫోకస్ పెంచినట్టు అధికారులు తెలిపారు.

రంగంలోకి 266 పోలీస్ స్నిఫర్ డాగ్స్

స్థానిక పోలీస్, ఎక్సైజ్, టీజీఏఎన్‌బీ అధికారుల సోదాలు ముమ్మరం కావడంతో డ్రగ్స్, గంజాయి ముఠాలు కొత్త ఎత్తులు వేస్తున్నాయి. అధికారులకు పట్టుబడకుండా వాహనాల్లోని రహస్య ప్రదేశాల్లో దాచి డ్రగ్స్, గంజాయి రవాణా చేస్తున్నాయి. ట్రాక్టర్లు, బస్సుల్లో, సీఎన్జీ వాహనాల్లోని సిలిండర్లలో, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ అనిపించేలా ఉండే డబ్బాలలో..ఇలా రకరకాల పద్ధతులలో పోలీసుల కన్నుగప్పి రవాణా చేస్తున్న మాదక ద్రవ్యాలను పోలీసులు గతంలో స్వాధీనం చేసుకున్నారు. నిరుద్యోగులైన యువతుల్ని కూడా డ్రగ్స్ రవాణా కోసం మాఫియా వినియోగిస్తోంది. ఇలాంటి ముఠాలపై పటిష్టమైన నిఘా వేయడంతోపాటు ఇన్‌ఫార్మర్ వ్యవస్థతో మత్తు ముఠాల ఆటకు టీజీఏఎన్‌బీ కృషి చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ యూనిట్లలో కలిపి 266 పోలీసు జాగిలాలకు మాదకద్రవ్యాల గుర్తింపు శిక్షణ ఇచ్చింది. వాటి ద్వారా డ్రగ్స్ రవాణాను సమర్థంగా అడ్డుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల వరంగల్ రైల్వేస్టేషన్లో స్నిఫర్ డాగ్‌తో తనిఖీ చేస్తుండగా..అక్కడికి వంద మీటర్ల దూరంలో ఉన్న ఒక ఇంటి మొదటి అంతస్తులో గంజాయి మొక్కలను కుండీలలో పెంచుతున్న విషయాన్ని ఈ స్నిఫర్ డాగ్ గుర్తించిందని చెప్పారు. టీజీఏఎన్‌బీ తీసుకుంటున్న చర్యలను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రశంసించినట్టు తెలిపారు.

మత్తు కేసుల్లో ఇరుక్కోవద్దు



నూతన ఏడాది వేడుకలను మీ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోండి. అంతే తప్ప మాదకద్రవ్యాల కేసుల్లో ఇరుక్కుని మీరు ఇబ్బంది పడి, మీ కుటుంబ సభ్యులను బాధ పెట్టకండి. మేము ఎక్కడికక్కడ ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం. మాదకద్రవ్యాల వినియోగం, సరఫరాకు సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్నా 1908 టోల్ ఫ్రీ నంబర్ లేదా 8712671111 నంబర్‌లో లేదా http://tganb.tspolice.gov.inలో ఫిర్యాదు చేయవచ్చు.

– సందీప్ శాండిల్య, డైరెక్టర్, టీజీఏఎన్‌బీ

ఇటీవల గుర్తించిన మరికొన్ని కేసులు

- గంజాయి చాక్లెట్లతో స్కూలు విద్యార్థులను, దినసరి కూలీలను టార్గెట్ చేస్తున్న ముఠాలను రాజస్తాన్ వరకు వెళ్లి పట్టుకోవడమే కాకుండా తయారు చేస్తున్న ఫ్యాక్టరీని కూడా అక్కడి అధికారుల సహాయంతో టీజీఏఎన్‌బీ మూయించగలిగింది.
- ఇటీవలే 120 కిలోల ఎఫిడ్రెన్ (ఎండీఎంఏ తయారీకి ఉపయోగించే ముడి సరుకు) తయారీ కేంద్రాన్ని గుర్తించడంలో సఫలీకృతమైంది.
- ఈ ఏడాది డిసెంబర్ 1 నుంచి ఈనెల 20 వరకు 641 కిలోల గంజాయి, 15 కిలోల గంజాయి చాక్లెట్స్ , 1600 గ్రాముల హాష్ ఆయిల్, 1383 గ్రాముల ఎండీఎంఏ, కిలో ఓపియం, 115 గ్రాముల చరాస్, 53 కిలోల పాపి స్ట్రా, 44 గ్రాముల హెరాయిన్‌ను సీజ్ చేశారు.
- మొత్తం 148 కేసులను రిజిస్టర్ చేయించడంతో పాటు స్థానిక పోలీసులతో కలిసి 315 మంది నేరస్తులను అరెస్టు చేశారు.
- ఈనెల 1 నుంచి 20 వరకు మొత్తం రూ.4.45 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను సీజ్ చేశారు.
- రూ.200 కోట్ల పైగా విలువ చేసే డ్రగ్స్‌ను పర్యావరణహిత పద్ధతులలో కాల్చివేశారు.

నేటినుంచి ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా కేంద్రంలో సోమ, మంగళ, బుధవారాల్లో అఖిల భారత విద్యార్థి పరిషత్ 43వ రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ తెలిపారు. ఆమె ఆదివారం సిద్దిపేటలో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మహాసభలను ప్రారంభించి, ప్రసంగించనున్నట్లు తెలిపారు. సభలకు ఏబీవీపీ ఆల్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆశిష్ చౌహాన్ కూడా హాజరవుతారన్నారు. మంగళవారం ఏబీవీపీ పూర్వ కార్యకర్తలతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించిన వ్యక్తికి బుధవారం గౌరీజీ యువ పురస్కారం, రూ.50 వేల నగదు, మెమెంటోను అందించనున్నట్లు తెలిపారు. మహాసభల్లో రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు వెల్లడించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సింగరేణి.. సినర్జీ

ఒకప్పుడు బొగ్గు ఉత్పత్తికే సింగరేణి పరిమితం



- థర్మల్ విద్యుత్ రంగంలో వేగంగా విస్తరణ
- సోలార్ పవర్‌తో నెట్ జీరో దిశగా అడుగులు
- బహుముఖంగా విస్తరిస్తూ సినర్జీగా రూపాంతరం
- నేడు సింగరేణి దినోత్సవం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/గోదావరిఖని: తెలంగాణ కొంగు బంగారం సింగరేణి సంస్థ కీర్తి దశదిశలా వ్యాపిస్తోంది. వందేళ్లకు పైగా బొగ్గు ఉత్పత్తికే పరిమితమైన సింగరేణి.. ఇప్పుడు బహుముఖంగా విస్తరిస్తోంది. థర్మల్, సోలార్, రియల్టీ.. ఇలా బహుముఖంగా విస్తరిస్తూ సింగరేణి సినర్జీగా మారుతోంది. ఈ సంస్థ ఏటా డిసెంబర్ 23న సింగరేణి డే జరుపుకుంటోంది. ఈ నేపథ్యంలో సింగరేణి సంస్థ అభివృద్ధిపై సాక్షి ప్రత్యేక కథనం..

థర్మల్‌తో మొదలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు దగ్గర 1870లో మొదలైన బొగ్గు తవ్వకం.. ఆ తర్వాత గోదావరి లోయ ప్రాంతాలకు విస్తరించింది. అయితే, 1920 డిసెంబర్ 23న సింగరేణి కాలరీస్ పేరుతో లాంఛనంగా ఈ సంస్థ ప్రారంభమైంది. ప్రస్తుతం 18 ఓపెన్‌కాస్ట్, 22 భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సంస్థ పరిధిలో 39,600 మంది కార్మికులు పని చేస్తున్నారు. సింగేణి బొగ్గులో 80 శాతం మేరకు థర్మల్ విద్యుత్ కేంద్రాలకే సరఫరా అవుతోంది. బయట సంస్థలకు బొగ్గు సరఫరా చేయడంతో పాటు సొంతంగా విద్యుత్ తయారు చేయాలని 2010లో సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు 1,200 మెగావాట్ల సామర్థ్యంతో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్‌టీపీపీ) మంచిర్యాల జిల్లా జైపూర్‌లో 2016లో ప్రారంభమైంది. అనతి కాలంలోనే థర్మల్ విద్యుత్ ఉత్పత్తితో అనేక రికార్డులు ఎస్‌టీపీపీ సొంతమయ్యాయి. దీంతో ఇక్కడే మరో 800 మెగావాట్ల కొత్త ప్లాంట్ నిర్మాణం మొదలుపెట్టింది. ఎస్‌టీపీపీ నుంచి వచ్చిన సానుకూల ఫలితాల కారణంగా కొత్తగా రామగుండంలో 1,600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి అడుగులు వేస్తోంది. ఒడిశాలోని నైనీలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైన తర్వాత అక్కడ కూడా 1,200 మెగావాట్ల సామర్థ్యంతో పిట్ హెడ్ థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధమైంది.

నెట్ జీరో దిశగా..

సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తిలో భాగంగా 2018లో తొలిసారిగా రామగుండం 3 ఏరియాలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను సింగరేణి ప్రారంభించింది. ఆ తర్వాత సంస్థ విస్తరించిన 11 ఏరియాల పరిధిలో విరివిగా సోలార్ ప్లాంట్లు ఏర్పాటుచేస్తోంది. ప్రస్తుతం సంస్థ సోలార్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 272 మెగావాట్లకు చేరుకుంది. మరో 22 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇది కూడా అందుబాటులోకి వస్తే సింగరేణి సోలార్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 810 మిలియన్ యూనిట్లకు చేరుకుంటుంది. మరోవైపు 750 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను సంస్థ ఉపయోగిస్తోంది. దీంతో అతి త్వరలో నెట్ జీరో సంస్థగా సింగరేణి మారనుంది. మరో 250 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది.

ఫ్లోటింగ్ సోలార్

మంచిర్యాల జిల్లా జైపూర్‌లో ఉన్న వాటర్ రిజర్వాయర్‌పై 15 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్‌ను 2023 జనవరిలో సంస్థ ప్రారంభించింది. త్వరలోనే మానేరు జలాశయం (300 మెగావాట్లు), మల్లన్నసాగర్ (2,250 మెగావాట్లు) మొత్తంగా కొత్తగా మరో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ల స్థాపనకు సంస్థ సిద్ధమవుతోంది.

మరిన్ని ప్రయోగాలు

రామగుండం, ఇల్లెందులో సుమారు 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లు నెలకొల్పేందుకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసింది. మందమర్రిలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. మణుగూరు ఏరియాలో జియో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తోంది. థార్ ఏడాది ప్రాంతంలో సోలార్, విండ్ పవర్ ప్లాంట్ల స్థాపన విషయంలో రాజస్థాన్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. ఇవే కాకుండా లిథియం మైనింగ్‌పై కూడా సింగరేణి దృష్టి సారించింది. రియల్టీ రంగంలో అడుగు పెడుతూ గోదావరిఖనిలో రూ.12 కోట్లు, కొత్తగూడెంలో రూ.4.5 కోట్ల వ్యయంతో కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి సిద్ధమవుతోంది. గ్రీన్‌హైడ్రోజన్, అమ్మోనియం నైట్రేట్ తయారీ, కార్బన్ డై యాక్సైడ్ నుంచి మిథనాల్ ఉత్పత్తికి చర్యలు తీసుకుంటోంది. కొత్తగూడెంలో వెంకటేశ్ గని, ఇల్లందులో జవహర్ గని తవ్వకానికి అనుమతులు సాధించింది.

సింగరేణి ప్రధాన ఘట్టాలు

1920 : డిసెంబర్ 23 సింగరేణి కాలరీస్‌గా ఆవిర్భావం
1948 : మెషిన్ మైనింగ్ ప్రారంభం
1953 : బ్యాటరీ క్యాప్‌ల్యాంప్
1960 : సంస్థలో 49 శాతం కేంద్రం, 51 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటాల ఏర్పాటు
1975 : ఓపెన్‌కాస్ట్ గనులు ప్రారంభం
1979 : ఎస్‌డీఎల్ యంత్రం
1981 : రోడ్డు హెడ్డర్
1983 : లాంగ్‌వాల్ మైనింగ్
1986 : డ్రాగ్‌లైన్ యంత్రం
2002 : సర్ఫేస్ మైనర్
2006 : కంటిన్యూస్ మైనర్
2008 : భూగర్భ గనుల్లో డీజిల్ యంత్రాలు
2008 : సాప్ యాప్ ప్రారంభం
2009 : 3డీ లేజర్ స్కానర్ (సర్వే)
2010 : లైట్ వెయిట్ క్యాప్‌ల్యాంప్
2018 : సోలార్ విద్యుత్ పరిచయం
2019 : కారుణ్య నియామకాలు
2019 : మహిళా కార్మికులకు ఉద్యోగాలు
2021 : ఆసుపత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్లు
2022 : కమర్షియల్ ఇసుక ఉత్పత్తి
2024 : పంప్‌డ్ స్టోరేజ్ ప్లాంట్
2024 : డిపెండెంట్ల వయసు 35 నుంచి 40 ఏళ్లకు పెంపు
2024 : కార్మికుల కుటుంబాలకు రూ.కోటి ప్రమాద బీమా
2024 : భూగర్భ గనుల్లోకి మహిళా ఇంజినీర్లు
2024 : స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్లు
2024 : ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల కల్పన

సంస్థ సమాచారం

భూగర్భగనులు	22
ఓపెన్‌కాస్ట్‌లు	16
డివిజన్లు	11
రీజియన్లు	3
కార్మికుల సంఖ్య (సుమారు)	39,600
వార్షిక బొగ్గు ఉత్పత్తి (మిలియన్ టన్నుల్లో)	72
కాంట్రాక్టు కార్మికులు (సుమారు)	30,000



విదేశాల్లో పర్యటిస్తున్న డిప్యూటీ సీఎంతో సంస్థ సీఎండీ బలరామ్ (ఫైల్)



సింగరేణి కార్మికులు

పెరుగుతున్న కాంట్రాక్టీకరణ..

సింగరేణిలో ఏటా పర్మినెంట్ కార్మికుల సంఖ్య తగ్గుతోంది. 1990కి ముందు రెగ్యులర్ కార్మికుల సంఖ్య సుమారు 1.20 లక్షలకు పైగా ఉంటే.. ఈ ఏడాది 39,600కు పడిపోయింది. ఇదే సమయంలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సంఖ్య 30 వేలకు పెరిగింది. ఈ ఏడాది సంస్థ 2,165 ఉద్యోగాలను భర్తీ చేసింది. ఇందులో 798 ఎక్స్‌టర్నల్, 1,367 కారుణ్య నియామకాలు ఉన్నాయి. కార్మికుల డిపెండెంట్ల వయోపరిమితిని 40 ఏళ్లకు పెంచటంతో దాదాపు 200 మందికి తక్షణమే లబ్ధి చేకూరింది. సివిల్, ఓవర్ బర్డెన్, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో 80 శాతానికి పైగా స్థానికులకు అవకాశం కల్పించారు. పంచ్ ఎంట్రీ పద్ధతి ద్వారా అడ్రియాల గని జీవితకాలాన్ని మరో 30 ఏళ్లకు పెంచారు.


రూ.కోటి ప్రమాద బీమా

కార్మికులకు సింగరేణి సంస్థ రూ.కోటి ఉచిత ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తోంది. ఈ మేరకు గత ఫిబ్రవరి 27న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీతో ఒప్పందం చేసుకుంది. కాంట్రాక్టు కార్మికుడికి కుటుంబానికి రూ.30 లక్షల పరిహారం అందించేలా ఒప్పందం చేసుకుంది. రామగుండం, మందమర్రిలో నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ సెంటర్లు ఏర్పాటు చేసింది. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు రూ.40 కోట్లు కేటాయించి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. కార్మికుల పిల్లలకు సీబీఎస్ఈ విధానంలో విద్యాబోధన చేసేందుకు ఆర్జీ–2, శ్రీరాంపూర్ ఏరియాల్లోని సింగరేణి పాఠశాలలను ఎంపికచేశారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు కొత్తగూడెం, గోదావరిఖని ఏరియా ఆస్పత్రులను ఆధునీకరిస్తోంది. గుండె వ్యాధిగ్రస్తుల కోసం క్యాథ్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. సొంతంగా 10 పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తోంది.

రూ.796 కోట్ల లాభాల వాటా

సింగరేణి ఈ ఏడాది సాధించిన లాభాల్లో రూ.796 కోట్లను ఉద్యోగులకు వాటాగా అందించింది. కంపెనీ చరిత్రలోనే ఇది అత్యధికమని అధికారులు పేర్కొంటున్నారు. ఈ సారి కాంట్రాక్టు కార్మికులకూ రూ.5 వేల చొప్పున అందజేశారు.

యాదాద్రి బ్రహ్మోత్సవాలకు వేళాయె..



యాదగిరిగుట్ట ఆలయం

సాక్షి, యాదాద్రి: వచ్చే ఏడాది మార్చిలో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు దేవస్థానం ఏర్పాట్లు ప్రారంభించింది. మార్చి 1 నుంచి 11వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో దేశ విదేశాలతో పాటు స్థానిక భక్తులను మమేకం చేయనున్నారు. బ్రహ్మోత్సవాలకు తలమానికంగా ఉండేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నారు.

మార్చిలో ఉత్సవాల నిర్వహణ

- ప్రముఖులతో ప్రవచనాలు, సంగీత విభావరి
- ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు రూపకల్పన
- దేశ, విదేశ భక్తులకు ఆకట్టుకునేలా ఏర్పాట్లు

స్వస్తివచనంతో ప్రారంభం

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 1న స్వస్తి వచనంతో ప్రారంభమై.. డోలోత్సవంతో ముగుస్తాయి. ఈ సందర్భంగా సాహితీ, సాంస్కృతిక, ధార్మిక సభా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. 7న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఎదుర్కోలు, 8న స్వామి అమ్మవార్ల తిరుకల్యాణోత్సవం, 9న దివ్యవిమాన రథోత్సవం, 10 న పూర్ణాహుతి, చక్రతీర్థం, దోపు ఉత్సవం, 11న శతఘటాభిషేకం, డోలోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

గ్రామోత్సవం పేరుతో రథోత్సవం

యాదగిరిగుట్ట, పరిసర ప్రాంత భక్తుల కోసం గ్రామోత్సవం పేరుతో కొండ కింద ప్రత్యేక రథోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా కొండపైన జరిగే రథోత్సవం అనంతరం కొండ కింద భక్తుల కోసం ప్రత్యేక రథోత్సవం నిర్వహించడానికి దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. సాంస్కృతిక కార్యక్రమాలు బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులను అలరించేలా సాంస్కృతిక, సాహితీ, సంగీత, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నారు. ఈ విషయంలో దేవస్థానం ఈవో ఎ.భాస్కర్‌రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మూడు రోజుల పాటు మహాసహస్ర అవధాని పద్మశ్రీ గరికపాటి నర్సింహారావు ప్రవచనాలు వినిపించనున్నారు. మార్చి 6న సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేశ్ సంగీత విభావరి ఏర్పాటు చేశారు. ఆయనతోపాటు తిరుపతి తిరుమల దేవస్థానంలో అన్నమాచార్య కీర్తనలు ఆలపించే ప్రముఖ గాయకుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌తో ప్రత్యేక కార్యక్రమం ఉంటుంది. అంజన్న చరిత్ర గాయని, కరీంనగర్‌కు చెందిన తేలు విజయతో ఒకరోజు, లిటిల్ మ్యూజీషియన్ నిర్వాహకుడు రామాచారితో ప్రత్యేక విభావరి కార్యక్రమాలు ఉంటాయి.



వేగంగా స్వర్ణ కవచం పనులు

ఆలయ విమాన గోపురం స్వర్ణకవచం పనులు వేగం పుంజుకున్నాయి. ఫిబ్రవరి నాటికి పనులు పూర్తి చేయాలన్న సంకల్పంతో దేవస్థానం ఉంది. ఈ మేరకు 60 కిలోల బంగారాన్ని వినియోగిస్తున్నారు. భక్తులు ఇచ్చిన విరాళాలు, దేవస్థానం వద్ద ఉన్న బంగారం, వెండితో స్వర్ణతాపడం పనులు కొనసాగుతున్నాయి. 10,500 చదరపు అడుగుల మేరకు చేయాల్సిన స్వర్ణతాపడం పనులు సగం వరకు పూర్తి కావొచ్చాయి.

కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు

శ్రీ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు కనీవిని ఎరుగని రీతిలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రధానంగా లబ్ధప్రతిష్టులైన కళాకారులతో కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక అలంకారంగా ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నాం. ఇప్పటికే గరికపాటి, మాధవపెద్ది సురేశ్ తదితర ప్రముఖుల సహాయాన్ని తీసుకున్నాం. మరికొందరు ప్రముఖులతో కార్యక్రమాలు రూపొందిస్తున్నాం.

– ఎ.భాస్కర్‌రావు, ఈవో
యాదగిరిగుట్ట దేవస్థానం



'హాని'లైన్ గేమ్స్!

అంతుచూస్తున్నఆన్‌లైన్ గేమ్స్

- డబ్బులొస్తాయన్న ఆశతో అప్పు చేసి మరీ ఆటలు
- తొలుత వచ్చినా, ఆ తర్వాత రూ.లక్షల్లో మోసం
- ఇది తట్టుకోలేక యువత బలవన్మరణాలు
- ఉమ్మడి వరంగల్‌తోపాటు రాష్ట్రంలో పదుల సంఖ్యలో ఘటనలు

సాక్షి, వరంగల్: ఆన్‌లైన్ గేమ్స్ యువత జీవితాలను అగమాగం చేస్తున్నాయి. కరోనా అనంతరం చాలామంది యువత చేతిలో సెల్‌ఫోన్లు ఉండడం వల్ల కూడా.. తమకు తెలియకుండానే ఆన్‌లైన్‌లో పరిచయమయ్యే ఈ గేమ్‌లకు అలవాటు పడుతున్నారు. తొలుత తక్కువ డబ్బులు చెల్లించి ఆడే ఈ ఆట ద్వారా వందల్లో లాభాలు ఇచ్చి అలవాటయ్యేలా చేసి.. ఆ తర్వాత రూ.వేలు, రూ.లక్షల్లో దండుకుంటున్నారు. అప్పులు చేసి.. కుటుంబసభ్యులకు తెలిస్తే పరువు పోతుందోనన్న భయంతో ప్రాణాలు తీసుకుంటున్న యువత సంఖ్య పెరుగుతోంది. 20 రోజుల వ్యవధిలో వరంగల్ జిల్లాలో ఇద్దరు యువకులు ఆత్మహత్య చేసుకోవడంతో ఆన్‌లైన్ గేమ్, బెట్టింగ్ యాప్‌లపై సర్వత్రా చర్చ జరుగుతోంది. వరంగల్ జిల్లా కదారిగూడెం గ్రామానికి చెందిన బత్తిని గణేశ్ ఆన్‌లైన్ గేమ్‌తో పాటు.. వివిధ బెట్టింగ్ యాప్‌లలో రూ.ఏడు లక్షల వరకు డబ్బులు పెట్టుబడులు పెట్టి నష్టపోయాడు. అప్పు ఇచ్చిన స్నేహితులు అడగడంతో తీవ్ర మనోవేదనకు గురై గత నెల 29న హైదరాబాద్‌లోని ఘట్ కేసర్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు. వర్ధన్నపేట మండలం బండౌతాపురం గ్రామానికి చెందిన మరిపట్ల అనుక్ ఆన్‌లైన్‌లో పబ్జీలాంటి గేమ్ ఆడుతున్న సమయంలో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. ఆన్‌లైన్ గేమ్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని చెప్పడంతో అతడికి దఫాలుగా రూ.ఐదు లక్షలు పంపాడు. తిరిగి డబ్బులు రాకపోవడంతో ఈ నెల 15న పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రోజుల వ్యవధిలోనే జరిగిన ఈ ఘటనలతో చాలా మంది యువత తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీంతో తమ కుమారుల కదలికలపై నిఘా వేయడం కనిపిస్తోంది. మృతుల్లో యువతతోపాటు గృహిణులు కూడా ఉన్నారు.



ముందు సరదాగా.. తర్వాత అలవాటై..

సులభ సంపాదన కోసం స్మార్ట్ ఫోన్‌లో వెతికేవారికి ఆన్‌లైన్ రమ్మీ, బెట్టింగ్, ఫ్రీ మనీ ఎర్నింగ్ యాప్స్, సైట్స్ ప్రత్యక్షమవుతున్నాయి. దీంతో చాలామంది ఆన్‌లైన్ గేమ్స్‌ను సరదాగా మొదలెట్టి, ఆ తర్వాత అలవాటు పడి బయటపడలేక జీవితం అగమాగం చేసుకుంటున్నారు. కొందరు అవి ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ యాప్స్ అని తెలియకుండానే ఊబిలో చిక్కుకుంటున్నారు. ఆన్‌లైన్‌లోనే అప్పులు దొరుకుతుండడం ఈ సమస్యను మరింత పెంచుతోంది. నగరాలు, పట్టణాల్లో ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ చదివే విద్యార్థులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగులు ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి.. డబ్బులు పోగొట్టుకొని అప్పులపాలవుతున్నారు.

తల్లిదండ్రులు గుర్తించాలి

డ్రగ్స్, ఆల్కహాల్ లాగే.. ఆన్‌లైన్ గేమ్, బెట్టింగ్‌లకు యువత త్వరగా అలవాటుపడుతోంది. డబ్బులు ఒకసారి రాకపోయినా.. మరోసారి వస్తాయనుకుంటున్నారు. అది సరి కాదని చెప్పినా వినరు. అచేతన స్థితికి వెళ్లిపోయి కొందరు చనిపోతున్నారు. ఇంకొందరు నేరాల బాట పడుతున్నారు. దీన్నే బిహేవియరల్ అడిక్షన్ అంటారు. ఇలాంటి వాటిని తల్లిదండ్రులు ముందే గుర్తించాలి. సైకాలజిస్టుతో థెరపీ, మెడిటేషన్ ఇప్పించాలి. గేమ్‌కు బానిసైన వ్యక్తి అందులోనుంచి బయటకు రావాలని అనుకుంటే సమస్య త్వరగా పరిష్కారమవుతుంది.

– అనూష వినేయత, సైకియాట్రిస్ట్

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న బుక్‌ఫెయిర్‌కు పోటెత్తిన పుస్తక ప్రియులు



క్లుప్తంగా...

పీఎస్‌-4 'మాడ్యూల్‌'లో బుల్లి ఉపగ్రహం



సూళ్లూరుపేట: సతీష్‌ ధవన్‌ స్పేస్‌ సెంటర్‌ షార్‌లోని మొదటి ప్రయోగవేదిక నుంచి ఈనెల 30న ప్రయోగించనున్న పీఎస్‌ఎల్‌వీ సీ60 ప్రయోగంలో భాగంగా పీఎస్‌-4 ఆర్బిటల్‌ ఎక్స్‌పరమెంటల్‌ మాడ్యూల్‌లో స్వేచ్ఛశాట్‌ అనే ఓ బుల్లి ఉపగ్రహాన్ని పంపనున్నారు. ఈ ప్రయోగంలో తెనాలికి చెందిన ఎన్‌ స్పేస్‌ టెక్‌ సంస్థ భాగస్వామ్యం కానుంది. గుంటూరుజిల్లా తెనాలికి చెందిన కొత్తమాను సాయిదివ్య ఎన్‌ స్పేస్‌ టెక్‌ వ్యవస్థాపకురాలిగా ఈ బుల్లి ఉపగ్రహాన్ని తయారు చేసుకుని ఇస్రో సహకారంతో ప్రయోగించనుంది. తమ ఉపగ్రహం కక్ష్యలోకి చేరాక ఇస్రోకు సంకేతాలు పంపితే తమ ప్రయత్నం పలించినట్టేనని ఆమె చెబుతోంది. స్వేచ్ఛశాట్‌ విజయవంతమైతే వ్యవసాయ రంగంలో సమూల మార్పులకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు.

పవన్‌..ప్రగల్భాలు ఆపు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



పెద్దాపురం: డిప్యూటీ సీఎం పవన్‌ కల్యాణ్‌ ప్రగల్భాలు పలకడం ఆపాలని, మన్యం పర్యటన పేరుతో డాంబికాలు మినహా ఆయన పర్యటన వల్ల గిరిపుత్రులకు ఒరిగేదేమి లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సీపీఎం కాకినాడ జిల్లా మహాసభల్లో పాల్గొన్న ఆయన ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. డోలీ మోతలపై చర్యలు తీసుకుంటామని 4 నెలల క్రితం ముఖ్యమంత్రి ప్రకటించిన విషయం తెలియదా అని పవన్‌ను ప్రశ్నించారు. గిరిజన ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసం నెలకో రోజు మన్యం వెళ్లి ఉంటానని, డోలీ మోతలు లేని ఆరోగ్య సంరక్షణకు చర్యలు తీసుకుంటామని పవన్‌ కళ్యాణ్‌ ప్రకటించారన్నారు. కానీ, ఇప్పటికీ మన్యంలో డోలీ మోతలు మినహా కాస్తంత అభివృద్ధి అయినా జరగలేదని అన్నారు.

త్వరలో టీటీడీ చాట్‌బాట్‌!

తిరుమల: చాట్‌ జీపీటీ తరహాలో వాయిస్‌ ఆధారిత టీటీడీ చాట్‌ బాట్‌ అభివృద్ధికి ప్రయత్నిస్తున్నట్లు టీటీడీ ఈవో జె.శ్యామలరావు తెలిపారు. తిరుమల విజన్‌–2047 లక్ష్యాల్లో ఇదొకటిగా ఉందని పేర్కొన్నారు. తిరుమలలో గత ఆరు నెలల్లో జరిగిన అభివృద్ధిపై ఆయన తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. తిరుమల క్షేత్రాన్ని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే తిరుమల విజన్‌–2047 లక్ష్యమన్నారు. గత ఆరు నెలల్లో తిరుమలలో అనేక మార్పులు తీసుకువచ్చామని, భక్తులకు మరింత నాణ్యంగా అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదాలు పంపిణీ చేస్తున్నామన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో ఉన్న 61 ఆలయాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మా విజ్ఞప్తులను పాలక మండలిలో చర్చించాలి

టీటీడీకి విజయ శంకరస్వామి విజ్ఞప్తి



తిరుపతి కల్చరల్‌: టీటీడీ అధికారులకు అన్నమయ్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో సూచించిన పలు విజ్ఞప్తులను ఈనెల 24న జరగనున్న పాలక మండలిలో చర్చించి తగు న్యాయం చేయాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి విజ్ఞప్తి చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మాస్టర్‌ ప్లాన్‌లో భాగంగా తిరుమలలో తొలగించిన అన్నమయ్య ఇంటిని పునర్నిర్మాణం చేయాలని, అన్నమయ్య, హనుమంత విగ్రహాలను యథాస్థలంలో ఏర్పాటు చేయాలని 11 లక్షల మందికిపైగా సంతకాలు సేకరించి టీటీడీ పాలక మండలికి ఇవ్వడం జరిగిందన్నారు. ఇదే విషయాన్ని ప్రస్తుత టీటీడీ పాలక మండలికి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అన్నమయ్య ఇంటి పునర్నిర్మాణంతో పాటు గురువులకు గౌరవ వేతనం ఇవ్వాలని, టీటీడీ అనుబంధ ఆలయాలలో నిత్యం హరినామ సంకీర్తన చేపట్టాలని, భజన బృందాల నమోదు ప్రక్రియ ప్రారంభించాలనే తమ విన్నపాలపై చర్చించి న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు.

'పరిహారం ఇవ్వాలి'

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్రలో వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి హరిబాబు డిమాండ్‌ చేశారు. వరి పంటకు ఎకరాకు రూ.30 వేలు, అపరాలకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారాన్ని సాగు చేస్తున్న కౌలు రైతులకే ఇవ్వాలని కోరారు. వరి, మొక్కజొన్న, మినప, పెసర తదితర పంటల రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య, కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మరో ప్రకటనలో కోరారు.

కడుపు నింపుతున్న.. 'దోసెడు బియ్యం'

పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినూత్న సేవా కార్యక్రమం

- ప్రతి నెలా 3వ మంగళవారం విద్యార్థుల నుంచి బియ్యం సేకరణ
- కళాశాలలో 300 మంది వరకు విద్యార్థులు
- నెలనెలా 100-120 కేజీల వరకు సేకరణ
- 5 కేజీల చొప్పున ప్యాకింగ్‌ చేసి పేదలకు అందజేస్తున్న విద్యార్థులు
- రెండున్నరేళ్లుగా నిరాటంకంగా నిర్వహణ



ఎస్‌సీహెచ్‌వీపీఆర్‌ కళాశాలలో దోసెడు బియ్యం కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యార్థులు



నెలలో మూడో మంగళవారం వచ్చిందంటే..భుజాన పుస్తకాల బ్యాగే కాదు.. ప్రతి విద్యార్థి చేతిలోని బాక్సు నిండా ఇంటి వద్ద నుంచి బియ్యం నింపుకొని కాలేజీకి తెస్తారు. కళాశాలలో ఏర్పాటు చేసిన డ్రమ్‌లో వాటిని పోస్తారు. వచ్చిన బియ్యం మొత్తాన్ని మూడు నుంచి ఐదు కేజీల చొప్పన ప్యాకెట్లుగా చేసి వాటిని పేదలకు అందజేసి వారి ఆకలిని తీరుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు పశ్చిమ గోదావరి జిల్లా గణపవరంలోని శ్రీ చింతలపాటి వరప్రసాదమూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు. హ్యాండ్‌ ఫుల్‌ ఆఫ్‌ రైస్‌ (గుప్పెడు బియ్యం) పేరిట రెండున్నరేళ్లుగా నిరాటంకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. – సాక్షి, భీమవరం

విద్యార్థుల్లో మానవత్వం పెంపుదల..

కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు ఉండగా వాటిలో 300 మంది విద్యార్థులు విద్యాభ్యాసం సాగిస్తున్నారు. విద్యతో పాటు ఎన్‌ఎస్‌ఎస్‌, రెడ్‌ క్రాస్‌ సంబంధిత సేవా కార్యక్రమాల నిర్వహణకు ఇక్కడి అధ్యాపక బృందం, విద్యార్థులు ప్రాధాన్యమిస్తుంటారు. అందులో భాగంగానే 2022లో 'దోసెడు బియ్యం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మనం తీసుకునే ఆహారంలో కొంచెం భాగం ఇతరులకు ఇవ్వడం, విద్యార్థుల్లో మానవత్వాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ప్రతి విద్యార్థీ నెలలో నిర్ణీత రోజున తమ ఇంటి వద్ద నుంచి గుప్పెడు బియ్యాన్ని తెచ్చి కళాశాలలో ఏర్పాటు చేసిన డ్రమ్‌లో వేస్తే.. సేకరించిన మొత్తాన్ని అవసరమైన నిరుపేదలకు అందించాలి. ప్రతినెలా మూడో మంగళవారం క్రమం తప్పకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఏదైనా నెలలో ఆ రోజు సెలవు వస్తే ముందురోజున లేదా మరుసటి రోజున అమలు చేస్తున్నారు. నెలకు దాదాపు 100 నుంచి 120 కేజీల వరకు బియ్యం వస్తుండగా, వాటిని మూడు నుంచి ఐదు కేజీల వరకు బ్యాగులుగా ప్యాక్‌ చేసి గ్రామంలోని మార్కెట్‌ తదితర ప్రాంతాల్లోని నిరుపేదలకు పంపిణీ చేస్తున్నారు. కళాశాల ప్రిన్సిపల్‌ డాక్టర్‌ పి.నిర్మల కుమారి నేతృత్వంలో వైస్‌ ప్రిన్సిపల్‌ పి.మధురాజు, కామర్స్‌, బోటనీ లెక్చరర్లు బి.రాణిదుర్గ, డాక్టర్‌ సీహెచ్‌ చైతన్యల పర్యవేక్షణలో రెండున్నరేళ్లుగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. మూడో మంగళవారం వచ్చిందంటే చాలు తమకంటే ముందే తమ పేరెంట్స్‌ బాక్సులో బియ్యం పోసి సిద్ధం చేయడం ద్వారా ఇప్పటికే తమ కళాశాలలో చేస్తున్న ఈ సేవలో భాగస్వాములయ్యారని విద్యార్థులు చెబుతున్నారు. మిగిలిన చోట్ల విద్యార్థులు ప్రయత్నిస్తే ఒక పెద్ద సేవగా మారుతుందని వారు ఆశిస్తున్నారు.

ఆనందంగా అనిపిస్తుంది



ప్రతినెలా విద్యార్థులమంతా కలసి బియ్యం తెచ్చి పేదలకు పంచడం చాలా ఆనందంగా అనిపిస్తోంది. ఈ హ్యాండ్‌ ఫుల్‌ ఆఫ్‌ రైస్‌ ప్రోగ్రాం మరింత విస్తరించి ప్రతి ఒక్కరూ ఇతరులకు పంచే సేవ చేయటంలో భాగస్వాములు కావాలని కోరుకుంటున్నాను.
– పి.హర్షిత, బీకాం సెకండియర్‌

బియ్యం ఇచ్చి పంపుతారు



నెలలో మూడో మంగళవారం వచ్చిందంటే చాలు కాలేజీకి ఈరోజు బియ్యం తీసుకువెళ్లాలి ఇవిగో అంటూ బాక్సులో పోసి పేరెంట్స్‌ పంపిస్తుంటారు. మా స్టూడెంట్సే కాదు మా పేరెంట్స్‌ కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారు.
– కె.జాయ్‌, బీకాం కంప్యూటర్స్‌, సెకండియర్‌

మార్పుకోసం చిన్న ప్రయత్నం



ఇది కేవలం ఒక సామాజిక సేవా కార్యక్రమం కాదు. పేదరికాన్ని తగ్గించేందుకు, మానవత్వాన్ని పెంచేందుకు, సమాజంలో మార్పు కోసం మా విద్యార్థులు చేస్తున్న చిన్న ప్రయత్నం. ఈ కార్యక్రమం నిర్వహించే బాధ్యత నాకు అప్పగించడచాలా ఆనందంగా ఉంది. – బి.రాణి దుర్గ, కామర్స్‌ లెక్చరర్‌

పంచే గుణాన్ని అలవాటు చేసేందుకు



తమకు ఉన్న దానిలో ఇతరులకు కొంచెం పంచే గుణాన్ని విద్యార్థులకు అలవాటు చేయడం హ్యాండ్‌ ఫుల్‌ ఆఫ్‌ రైస్‌ ముఖ్య ఉద్దేశం. మా కళాశాలలో ప్రిన్సిపల్‌ నిర్మలకుమారి మార్గదర్శకత్వంలో నిర్వహిస్తున్న అత్యుత్తమ సేవా కార్యక్రమాల్లో ఇదీ ఒకటి.
– డాక్టర్‌ సీహెచ్‌ చైతన్య, బోటనీ లెక్చరర్‌

విద్యతో పాటు విలువలు



మా కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు వారిలో మంచి విలువలు పెంపొందించాలన్నదే మా లక్ష్యం. పేద వారి ఆకలిని తీర్చడంలో ఉండే సంతృప్తిని వారు ఆనందిస్తున్నారు. ప్రతినెలా అందరూ ఎంతో ఉత్సాహంగా హ్యాండ్‌ ఫుల్‌ ఆఫ్‌ రైస్‌ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేస్తున్నారు.
– డాక్టర్‌ పి.నిర్మలాకుమారి, ప్రిన్సిపల్‌

ఇంటి ముందు లెటర్‌.. యమడేంజర్‌





క్యూఆర్‌ కోడ్‌తో ఇళ్ల ముందు పడేస్తున్న లెటర్లు

- కొత్తపుంతలు తొక్కుతున్న సైబర్‌ నేరాలు
- మనకు తెలియకుండా ఇళ్ల ముందు లెటర్లు
- అడ్రస్‌ తప్పు ఉంది..స్కాన్‌ చేయండని లెటర్‌పైనే క్యూఆర్‌కోడ్‌
- పొరపాటున స్కాన్‌ చేశారా? ఖాతా ఖాళీ

పలమనేరు: ఇప్పటిదాకా స్మార్ట్‌ఫోన్‌లో వాట్సాప్‌కు లింకులు, ఫేస్‌బుక్‌ హ్యాకింగ్స్‌, బ్యాంకు అధికారుల పేరిట ఫేక్‌ కాల్స్‌, ఓటీపీలు, మన ఫోన్‌ ఎవరికైనా కాల్‌ కోసం ఇస్తే దాంట్లో సెట్టింగ్స్‌ మార్చేయడం, ఫేక్‌ వెడ్డింగ్‌ ఇన్విటేషన్స్‌, ఫోన్‌ హ్యాకింగ్‌, ఏటీఎం సెంటర్ల వద్ద మోసాలు, తాజాగా బయటి ప్రాంతాల్లో విద్యనభ్యసిస్తున్న లేదా ఉద్యోగాల చేస్తున్న వారి నంబర్ల ఆధారంగా వారి కుటుంబీకులకు డిజిటల్‌ అరెస్టులు సర్వసాధారణంగా మారాయి. ఈ సైబర్‌ నేరాలకు సంబంధించి పోలీసులు, వారు ఇచ్చిన టోల్‌ ఫ్రీ నంబర్లు సైతం బాధితులను రక్షించలేకపోతున్నాయి. తాజాగా మరోకొత్త మోసం వెలుగులోకి వచ్చింది. దీన్ని ఎలాంటి వారైనా నమ్మి మోసపోవాల్సిందే.

మీ ఇంటి ముందు ఓ లెటర్‌ను పడేసి..

ఇంటిముందు ఓ లెటర్‌ లేదా కొరియర్‌ ఫామ్‌ పడి ఉంటుంది. దానిపై డేట్‌, వేబిల్‌ నంబరు, కొరియర్‌ లేదా పార్సిల్‌ కంపెనీ పేరు ఉంటుంది. అందులోని స్కానర్‌ను స్కాన్‌ చేసి చేంజ్‌ యువర్‌ డెలివరీ డేట్‌, ఆల్టర్‌నేట్‌ అడ్రస్‌ తదితర వివరాలు ఉంటాయి. దీన్ని నమ్మి మనకేమైనా పార్సిల్‌ లేదా లెటర్‌, వస్తువులు వచ్చాయేమోనని భావించి మన స్మార్ట్‌ఫోన్‌ ద్వారా దానిపై ఉన్న క్యూఆర్‌కోడ్‌ను స్కాన్‌ చేశామో ఇక అంతే సంగతులు. వెంటనే మన ఫోన్‌ హ్యాకర్ల గుప్పెట్లోకి పోతుంది. మనఫోన్‌లో జరిగే అన్ని లావాదేవీలను హ్యాకర్స్‌ డార్క్‌నెట్‌ ద్వారా గమనిస్తుంటారు. ఇందుకోసం పెద్ద నెట్‌వర్క్‌ ఉంటుంది. చాలామంది సాఫ్ట్‌వేర్లు ఇందులో పనిచేస్తూ మనం సెల్‌లో చేసే పనులను గమనిస్తుంటారు. బహుశా మనం ఫోన్‌పే, గూగుల్‌పే నుంచి ఎవరికైనా డబ్బు పంపి మన పిన్‌ను ఎంటర్‌ చేశామంటే ఆ పిన్‌ను వారు గుర్తిస్తారు. ఆపై మన ఖాతాలో ఉన్న డబ్బును మనకు తెలియకుండానే కాజేస్తారు. మన సెల్‌కు డబ్బులు కట్‌ అయినట్లు ఓ ఎస్‌ఎంఎస్‌ మాత్రం వస్తుంది. ఆపై మనం ఏమీ చేయాలన్నా మన సెల్‌ హ్యాకర్ల అదుపులో ఉన్నందున మనం ఏం చేసినా లాభం ఉండదు.

నెల రోజులుగా ఈ మోసాలు..

బెంగళూరులో గత నెల రోజులుగా ఇలాంటి ఫేక్‌ లెటర్లు ఇంటి ముందు పడి ఉండడం, వాటిని స్మార్ట్‌ఫోన్‌లో స్కాన్‌ చేసిన వారి ఖాతాల్లో డబ్బు మాయం కావడం ఎక్కువగా జరుగుతోంది. దీంతో ఈ విషయాన్ని కొందరు సోషల్‌ మీడియాలో ఇప్పుడు వైరల్‌ చేస్తున్నారు. మెట్రోపాలిటన్‌ సిటీలో ఇప్పుడు జరుగుతున్న ఇలాంటి సైబర్‌ మోసాలు మన చెంతకు చేరడం ఎన్నో రోజులు పట్టదు. మన ఇళ్ల వద్ద ఏదైనా స్కానింగ్‌ ఉన్న లెటర్‌ వస్తే కాస్త జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కలంకారిపై అమెరికన్ల మోజు



శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేసిన కొందరు అమెరికన్‌లు శ్రీకాళహస్తి ప్రఖ్యాత కళ అయిన కలంకారి దుస్తులు కొనడానికి ఆదివారం బానోదయ కలంకారి సంస్థకు విచ్చేశారు. ఈ సందర్భంగా కలంకారి గురించి అడిగి తెలుసుకున్నారు. అనేక వస్త్రాలను కొనుగోలు చేశారు. ప్రపంచంలో ఎక్కడా ఇటువంటి ఆర్ట్‌ లేదని వారు కొనియాడారు. – శ్రీకాళహస్తి

అకడమిక్‌ ఇయర్స్‌ను ప్రామాణికంగా తీసుకోండి

సాక్షి, అమరావతి: వచ్చే వేసవి సెలవుల్లో నిర్వహించే టీచర్ల బదిలీల్లో రెండు విద్యా సంవత్సరాలను మినిమం సర్వీస్‌గా, ఎనిమిదేళ్ల లాంగ్‌ స్టాండింగ్‌గా పరిగణించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్‌ ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం షరీఫ్‌ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మే 31 కటాఫ్‌ తేదీగా పరిగణిస్తే 2023 జూన్‌లో ప్రమోషన్‌, బదిలీలు పొందినవారు, 2017లో బదిలీలు పొందినవారు నష్టపోతారన్నారు. ఈసారి అకడమిక్‌ ఇయర్స్‌ను ప్రామాణికంగా తీసుకోవాలని ఆయన సూచించారు.

ఉపాధ్యాయ శిక్షణను వాయిదా వేయండి

ఉపాధ్యాయులకు సోమవారం నుంచి ఈనెల 27 వరకు జరిగే ఎఫ్‌ఎల్‌ఎన్‌ శిక్షణను రెండు వారాలు వాయిదా వేయాలని స్కూల్‌ టీచర్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, చందనరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. క్రిస్మస్‌, నూతన సంవత్సరం, సంక్రాంతి సెలవులు దృష్టిలో పెట్టుకొని వాయిదా వేయాలన్నారు. ఈ శిక్షణను సంక్రాంతి సెలవుల తరువాత నిర్వహించాలన్నారు.

డిటెన్షన్‌ విధానాన్ని ఎత్తివేయాలి

కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 5, 8 తరగతుల డిటెన్షన్‌ విధానాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్‌ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్‌ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య పిల్లలకు అందాలంటే 9వ తరగతి వరకు నాన్‌ డిటెన్షన్‌ విధానం మాత్రమే ఉండాలని లేకుంటే డ్రాపవుట్ల శాతం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

జనవరిలో ఫ్లెమింగో ఫెస్టివల్‌

10, 11, 12 తేదీల్లో తిరుపతి జిల్లాలో నిర్వహణ



సూళ్లూరుపేట: పులికాట్‌ సరస్సును ఆధారంగా చేసుకుని ప్రతి ఏటా ఇక్కడకు వస్తున్న విదేశీ విహంగాలను ప్రపంచం దృష్టికి తెచ్చేందుకు 2001 నుంచి ప్రతి ఏటా ఫ్లెమింగో ఫెస్టివల్‌ను నిర్వహించడం ఆనవాయితీ. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట, దొరవారిసత్రం, తడ మండలాలు కేంద్రాలుగా 2001 నుంచి నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌ను నాలుగేళ్ల తరువాత మరోమారి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరి 10, 11, 12 తేదీల్లో ఈ పండుగను నిర్వహించనున్నారు. ఆంధ్రా–తమిళనాడు సరిహద్దుల్లో 620 చదరపు కిలోమీటర్లు విస్తరించిన పులికాట్‌ సరస్సును కేంద్రంగా చేసుకుంటూ విదేశీ వలస పక్షులు..ఈ సరస్సును ఆహార కేంద్రంగా, నేలపట్టు చెరువును సంతానోత్పత్తి కేంద్రంగా ఉపయోగించుకుంటూ తమ జీవనశైలిని ఎన్నో ఏళ్ల నుంచి కొనసాగిస్తున్నాయి. అక్టోబర్‌, నవంబర్‌, డిసెంబర్‌ల్లో ఈ ప్రాంతంలో వర్షాలు కురిసినప్పుడు కాళంగి, స్వర్ణముఖినది, తమిళనాడులో ఆరణియార్‌ నది, ఏడుకళ్లవారధి, పాముల కాలువ, కరిపేటి కాలువల నుంచి వర్షపునీరు సరస్సులో కలుస్తుంది. బంగాళాఖాతం నుంచి పులికాట్‌ సరస్సుకు ముఖద్వారాల ద్వారా సముద్రంలో ఏర్పడే ఆటుపోట్లుకు ఉప్పునీరు కలుస్తుంది. కాకినాడ పండుగ, విశాఖ ఉత్సవ్‌ తరహాలో ఇక్కడ కూడా ప్రతి ఏటా పండుగను నిర్వహిస్తూ వచ్చారు. అయితే 2020, 2021 సంవత్సరాల్లో కరోనా రావడం ఆపై పరిస్థితులు సహకరించకపోవడంతో నాలుగేళ్ల పండుగను నిర్వహించలేకపోయారు.

ప్రకాశం జిల్లా వాసికి రెండు జాతీయ అవార్డులు



మస్తాన్‌వలికి అవార్డు అందిస్తున్న అష్నీర్‌గ్రోవర్‌

తాళ్లూరు: ఢిల్లీ వేదికగా ఈ నెల 21న జరిగిన భారత్‌ బిజినెస్‌ 2024 అవార్డు, స్మైబిజ్‌ ఐకాన్‌ స్టార్‌ 2024 అవార్డులను ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం తూర్పుగంగవరం గ్రామానికి చెందిన షేక్‌ మస్తాన్‌వలి అందుకున్నారు. మస్తాన్‌వలి ప్రముఖ పారిశ్రామికవేత్త, సీఈఓ ఆఫ్‌ భారత్‌ పే అష్నీర్‌ గ్రోవర్‌ చేతుల మీదుగా శనివారం ఈ అవార్డులను అందుకున్నాడు. మస్తాన్‌వలి మొదటిగా డెక్కన్‌ క్లాప్‌ పెయింటింగ్‌, వాటర్‌ ప్రూఫింగ్‌ ఇండియా ప్రైవేట్‌ లిమిటెడ్‌ కంపెనీ స్థాపించారు. దేశంలో 16 ప్రధాన నగరాల్లో 30 వేల మంది ఇంటి యజమానులకు పెయింట్‌, వాటర్‌ ప్రూఫింగ్‌ సంబంధిత సర్వీస్‌ అందిస్తున్నారు. వాటర్‌ ప్రూఫింగ్‌ ఇంటిగా మార్చి ఆ తర్వాత పెయింటింగ్‌ వేస్తారు. ఈ విధానంపై ఇండియాలోని టాప్‌ 5 పెయింటింగ్‌, వాటర్‌ ప్రూఫింగ్‌ ట్రైనర్స్‌లో ఒకరిగా మస్తాన్‌వలిని గుర్తించి ఈ అవార్డులు ఇచ్చారు.

ఆధ్యాత్మిక సమాచారం

అష్టలక్ష్మి పూజల్లో కేంద్రమంత్రి

రామచంద్రాపురం: తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలంలోని సీతారామాపురం బ్రహ్మర్షి ఆశ్రమంలో అష్టలక్ష్మి ఉత్సవాల్లో ఆదివారం కేంద్ర సాంస్కృతిక శాఖ సహాయ, న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్‌ మేఘవాల్‌ పాల్గొన్నారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

రాటాల్నమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి: భక్తుల పాలిట కల్పతరువు రాట్నాలమ్మవారిని దర్శించేందుకు భక్తులు బారులు తీరారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం రాట్నాలకుంటలోని రాట్నాలమ్మవారికి ఆదివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతో పాటు సమీప జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయానికి పూజా టికెట్లపై రూ.24,190, విరాళాల రూపంలో రూ.4,346, లడ్డూ ప్రసాదంపై అమ్మకంపై రూ.12,225, ఫొటోల అమ్మకంపై రూ.1,295, మొత్తం రూ.42,056 ఆదాయం లభించినట్టు ఈఓ ఎన్‌.సతీష్‌కుమార్‌ తెలిపారు.

ఇంటింటా నీరాజనం



ద్వారకాతిరుమల: తమ ఇంటి ముంగిటకు వచ్చిన శ్రీవారికి భక్తులు పూజాధికాలు నిర్వహించి నీరాజనాలు సమర్పించారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని చిన వెంకన్న దివ్య క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం జరిగిన తిరువీధి సేవ భక్తులకు నేత్రపర్వమైంది. తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. మేళతాళలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణలు, గజ, అశ్వ సేవల నడుమ తిరువీధి సేవను కన్నులపండువగా జరిపారు. ఆలయ ప్రధాన కూడలిలోని ధనుర్మాస మండపంలో శ్రీవారికి, అమ్మవార్లకు అర్చకులు పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను పంచారు.

విద్యా సమాచారం


చౌక్‌బాల్‌ రాష్ట్ర జట్లు ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్‌: చౌక్‌బాల్‌ రాష్ట్ర జూనియర్‌ బాల బాలికల జట్లను ఆంధ్రప్రదేశ్‌ చౌక్‌బాల్‌ అసోసియేషన్‌ కార్యదర్శి ఎస్‌.సుధాకరరావు ఆదివారం ప్రకటించారు. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను జట్లకు ఎంపిక చేశామని, ఈ జట్లకు విశాఖపట్నంలో కోచింగ్‌ క్యాంపు నిర్వహించామన్నారు.

ఫెన్సింగ్‌ రాష్ట్ర జట్లు ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్‌: జాతీయ సీనియర్‌ స్త్రీ, పురుషుల ఫెన్సింగ్‌ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్లు ఏపీ ఫెన్సింగ్‌ అసోసియేషన్‌ అధ్యక్షకార్యదర్శులు వెర్రు నాగేశ్వరరావు, జి.ఎస్‌.వి.కృష్ణమోహన్‌ తెలిపారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్‌ కార్పొరేషన్‌ స్టేడియంలో శనివారం ప్రారంభమైన అంతర జిల్లాల ఫెన్సింగ్‌ పోటీలు ఆదివారం ముగిశాయి. ఏపీ ఫెన్సింగ్‌ సంఘం, కృష్ణాజిల్లా ఫెన్సింగ్‌ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి 141 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. భారత ఫెన్సింగ్‌ సమాఖ్య ఆదేశాల మేరకు నిపుణులైన ఎ.ఫిర్దౌస్‌(తమిళనాడు), నితిన్‌ స్పైస్‌ (ఒడిశా), జ్యోతి రంజన్‌ ఠాగూర్‌ (ఒడిశా) ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారని, పోటీల్లో క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులతో రాష్ట్ర జట్లను సిద్ధం చేశామని రాష్ట్ర సంఘం అధ్యక్షకార్యదర్శులు తెలిపారు.

సాక్షి ప్లస్
ట్రావెల్ ఆర్ట్ & కల్చర్
సోమవారం ॥ 23-12-2024

జైపూర్ ఆర్ట్ సెంటర్
కళాత్మక రాజసం





'రండి, చూడండి, తినండి, కొనండి' ఇది షాపింగ్ మాల్ చేసే హడావుడి కాదు. జైపూర్‌లోని సిటీప్యాలెస్ చేస్తున్న ఆర్టిస్టిక్ హంగామా. పింక్‌సిటీ జైపూర్‌లోని గంగోరి బజార్‌లో ఉంది సిటీప్యాలెస్. ఈ ప్యాలెస్ మొదటి గేట్ నుంచి లోపలికి ప్రవేశిస్తే ఒక విశాలమైన హాలు. అందులో ఇటీవల జైపూర్ సెంటర్ ఫర్ ఆర్ట్ ప్రారంభమైంది. రాజభవనాలంటే రాజుల కాలం నాటి వస్తువులకే పరిమితం కావాలా? కొత్తగా ఏదైనా చేయాలి అదే ఇది అంటున్నారు యువరాజు పద్మనాభ సింగ్, యువరాణి గౌరవికుమారి. రాజపుత్రుల ఘనత, కళాభిరుచి పరంపర కొత్తతరాలకు తెలియాలంటే కొత్త కళాకృతులకు స్థానం కల్పించాలి. వాటిని చూసిపోవడమే కాకుండా తమ వెంట తీసుకుని వెళ్లగలగాలి అంటున్నారామె. అందు కోసం జైపూర్ సెంటర్ ఫర్ ఆర్ట్ పేరుతో కళాకృతుల మ్యూజియం ఏర్పాటు చేశారు.

సర్వతో రుచులు

ఈ ప్యాలెస్‌ను 18వ శతాబ్దంలో మహారాజా సవాయ్ రెండవ జయ్‌సింగ్ నిర్మించాడు. నిర్మించాడనే ఒక్కమాటలో చెప్పడం అన్యాయమే అవుతుంది. ప్యాలెస్ అంటే రాళ్లు, సున్నంతో నిర్మించిన గోడలు కాదు. దేశంలోని రకరకాల నిపుణుల సమష్టి మేధ. పర్యాటకులు జైపూర్ కోటలను, రాజులు ఉపయోగించిన కళాకృతులను చూసి ముచ్చటపడితే సరిపోదు. అలాంటి వాటిని కొనుక్కుని ఇంటికి తీసుకెళ్లాలి. ఇలాగ కళాకృతుల తయారీదారులకు ఉపాధికి మార్గం వేయాలన్నారు గౌరవి కుమారి. అంతేకాదు... రాజస్థాన్ రుచులు ముఖ్యంగా జైపూర్‌కే పరిమితమైన వంటకాలను వడ్డించే సర్వతో రెస్టారెంట్ కూడా ప్రారంభించారు. ప్యాలెస్ అట్లీయర్ పేరుతో ఆభరణాల మ్యూజియానికి కూడా తెరతీశారు. ఇందులో స్థానిక చేనేతకారులు రూపుదిద్దిన చీరలు, సంప్రదాయ ఆభరణాలు, గృహోపకరణాలు చోటు చేసుకున్నాయి. సాధారణంగా రాజుల ప్యాలెస్ పర్యటనకు వెళ్లాలంటే కనీసం రెండు-మూడు గంటల సమయం కేటాయించాలి. బ్రేక్‌ఫాస్ట్ చేసి లోపల ప్రవేశిస్తే మధ్యాహ్నం భోజనం సమయానికి బయటకు రాగలుగుతాం. ఈ సమయాలను పాటించకపోతే ప్యాలెస్ విజిట్‌ని అర్ధంతరంగా ముగించుకుని బయటపడాల్సి ఉంటుంది. ఈ సమస్యకు పరిష్కారమే ఈ సర్వతో రెస్టారెంట్. ప్యాలెస్ ఆవరణలో భోజనం చేయవచ్చు. సాధారణంగా ప్యాలెస్ విజిట్ హైటీ లేదా డిన్నర్ ప్యాకేజీలలో టికెట్ మధ్యతరగతికి అందనంత ఎక్కువగా వేలల్లో ఉంటుంది. ఈ ప్రయోగం మాత్రం అందరికీ అందుబాటులో ఉంది. కాబట్టి జైపూర్ టూర్‌లో సిటీప్యాలెస్ విజిట్‌ని భోజన సమయానికి అనుగుణంగా ప్లాన్ చేసుకోవచ్చు.

మోతీ షాహీమహల్
ఐరన్ మ్యాన్ మెమోరియల్




మోతీ షాహీ మహల్... చారిత్రక నిర్మాణం. అహ్మదాబాద్ నగరంలో షాహీబాగ్‌లో ఉంది. ఇప్పుడది సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితానికి దర్పణం. వల్లభాయ్ పటేల్ జీవితంలో ముఖ్యమైన ఘట్టాలను వివరించే డిజిటల్ స్టూడియో అద్భుతం. డిజిటల్ స్టూడియో జైలు గదుల రూపంలో విభజించి ఉంటుంది. గదులకు ఉన్న ఊచలను పట్టుకుంటే ఒక్కొక్క ఘట్టం ఆడియోలో వినిపిస్తుంది. జాతీయోద్యమంలో భాగంగా పటేల్ జైలు జీవితం గడిపిన సంఘటనలతో పాటు ముఖ్యమైన ఘట్టాలన్నింటినీ ఇంగ్లిష్, హిందీ, గుజరాతీ భాషల్లో వినవచ్చు. వీటన్నింటినీ లేజర్ షోలో చూడవచ్చు. ఇక మ్యూజియంలో ఒక్కో గది ఒక్కో రకమైన వస్తువులతో అలరిస్తుంది. వర్తమానం, ఆహ్వానపత్రాలను పంపించిన ట్యూబ్‌లాంటి వెండి పెట్టెలున్నాయి. ఐరన్ మ్యాన్ చేతుల మీదుగా శంఖుస్థాపన చేయించుకోవడానికి సిద్ధం చేసిన వెండితాపీలు లెక్కలేనన్ని ఉన్నాయి. మెమోరియల్ మ్యూజియం అంటే ఆ వ్యక్తి ఉపయోగించిన చెప్పులు, పెన్నులు, భోజనం చేసిన ప్లేట్‌లు, దుస్తులను మాత్రమే చూస్తుంటాం. సర్దార్ వల్లభాయ్ పటేల్ మెమోరియల్‌లో భారత జాతీయోద్యమం కనిపిస్తుంది. గాంధీ, నెహ్రూలతో పటేల్ కలసి ఉన్న ఫొటోలతో పాటు ఆయా సందర్భాల వివరణ కూడా ఉంటుంది. పటేల్ జీవితంలో ఉపయోగించిన వస్తువులు ఏయే సందర్భంగా ఉపయోగించారనే వివరాలు ఉండడంతో ఫ్రీడమ్ మూవ్‌మెంట్ క్షణక్షణమూ గుర్తుకు వస్తుంది. విశ్వకవి రవీంద్రుడు పదిహేడేళ్ల వయసులో కొంత కాలం ఈ మహల్‌లో బస చేశాడు.

షాజహాన్ విడిది

వల్లభాయ్ పటేల్ మెమోరియల్ ఉన్న భవనం మోతీ షాహీ మహల్... మొఘలుల నిర్మాణాలను తలపిస్తుంది. ఈ షాహీ మహల్‌ని 17వ శతాబ్దంలో షాజహాన్ కట్టించాడు. షాజహాన్ యువరాజుగా ఈ ప్రదేశానికి ప్రతినిధిగా ఉన్నప్పుడు దీనిని నిర్మించాడు, రాజ్యపర్యటనకు వచ్చినప్పుడు అతడి విడిది కూడా ఇందులోనే. ఆ తర్వాత బ్రిటిష్ ఉన్నతాధికారుల నివాసమైంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ భవనం రాష్ట్ర గవర్నర్ అధికారిక నివాసం రాజ్‌భవన్. గవర్నర్ నివాసానికి కొత్త భవనం కట్టిన తర్వాత 1978లో ఈ భవనాన్ని పటేల్ మెమోరియల్‌గా మార్చారు. నరేంద్రమోదీ గుజరాత్‌కి ముఖ్యమంత్రి అయిన తర్వాత 2013లో ఈ మెమోరియల్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అంతర్జాతీయ ప్రమాణాలతో డిజిటలైజ్ అయింది. మ్యూజియం అంతా తిరిగి చూసిన తర్వాత అదే ప్రాంగణంలో ఉన్న పటేల్ విగ్రహం దగ్గరకు వచ్చినప్పుడు 'ద ఆర్కిటెక్ట్ ఆఫ్ మోడరన్ ఇండియా' అనే ఆత్మీయ ప్రశంసను గుర్తు చేసుకుంటూ ఓ నమస్కారం పెడతాం.



ఆదివారం ఆటవిడుపు

మోతీ షాహీ మహల్ చుట్టూ అందమైన గార్డెన్ మొఘలుల చార్‌భాగ్ నమూనాలో ఉంటుంది. దట్టమైన చెట్ల మధ్య పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాట్లు ఉంటాయి. రంగురంగుల వాటర్‌ఫౌంటెయిన్ పిల్లలను అలరిస్తుంది. అహ్మదాబాద్ వాసులకు వీకెండ్ పిక్‌నిక్ ప్లేస్ ఇది. దాదాపుగా నగరంలోని స్కూళ్లన్నీ విద్యార్థులను ఏటా ఈ మ్యూజియం సందర్శనకు తీసుకువస్తుంటాయి. అహ్మదాబాద్ పర్యటనలో మిస్ కాకుండా చూడాల్సిన ప్రదేశం ఇది. ఈ మెమోరియల్ భవనం లోపల మాత్రమే కాదు భవనం బయట పరిసరాలను కూడా ఆస్వాదించాలి. పచ్చటి ఉద్యానవనంలోని చెట్ల కొమ్మల మీద నెమళ్లు సేదదీరుతుంటాయి. చెట్ల మధ్య విహరిస్తూ తినుబండారాలను రుచి చూడాలంటే అనుమతించరు. చాటుగా తినే ప్రయత్నం చేసినా కోతులు ఊరుకోవు. మెరుపువేగంతో వచ్చి లాక్కెళ్తాయి. మ్యూజియం పర్యటనకు అనువైన కాలం అని ప్రత్యేకంగా అక్కరలేదు, కానీ అహ్మదాబాద్‌లో పర్యటించడానికి నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు అనువుగా ఉంటుంది. కాబట్టి క్రిస్మస్, సంక్రాంతి సెలవుల్లో ప్లాన్ చేసుకోవచ్చు. అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్ మెమోరియల్‌కు దూరం ఐదు కిలోమీటర్లు మాత్రమే.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

నృత్యం

అభిరామం నృత్యంతో చెప్పే రామాయణం



ఇతిహాసమైన రామాయణం అందం, భక్తి, సంక్లిష్టతలను ఐశ్వర్య హరీష్ ప్రదర్శించే భరతనాట్యం అన్వేషిస్తుంది. శాస్త్రీయ నృత్యాన్ని బహుభాషా కథనాలతో మిళితం చేసి మన ముందు ప్రదర్శిస్తుంది. రామాయణంలో తెలియని మరో కోణాన్ని ఆవిష్కరించడానికి 'అభిరామం' ప్రదర్శనను ఎంచుకున్నాను అని చెబుతుంది. ఐశ్వర్య హరీష్ పుట్టుకతోనే నృత్యకారిణి అని చెప్పవచ్చు. ఐదు తరాలుగా ఆ ఇంట నృత్యకళాకారులే ఉన్నారు. ఆ విధంగా చాలా చిన్న వయస్సు నుండి తన తల్లి ద్వారా శిక్షణ పొందుతూ ఐశ్వర్య తన స్వంత నృత్య కథల గురించి కలలు కంటూ పెరిగింది. ఇటీవల ముంబయ్‌లో ప్రఖ్యాత నేషనల్ సెంటర్ ఫర్ ది పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ (ఎన్‌సిపిఎ)లో ప్రదర్శన ద్వారా అబ్బురపరిచిన ఐశ్వర్య రామాయణాన్ని నృత్యంగా ఎందుకు ఎంచుకున్నానో వివరించింది.

నృత్యంతో అన్వేషణ

''రాముడు నా ఇష్ట దేవత. నా చిన్నప్పుడు రాముని గంభీరమైన రూపం, అతనిపై పాట, పద్యం, నృత్యం ఏది నేర్చుకున్నా అది నన్ను ఉత్తేజపరిచింది. ఇటీవల, వ్యక్తిగత ఆధ్యాత్మిక సాధనగా వాల్మీకి రామాయణాన్ని దాని అనువాదంతో పాటు చదవడం ప్రారంభించాను. చదివేటప్పుడు కథలో ఇంకా ఏవో తెలియని అంశాల సారంశాం ఉందని గ్రహించాను. చాలా అన్వేషించని కోణాలు ఉన్నాయి. ప్రతి క్యారెక్టర్‌లోనూ రసాలు ఎక్కువ. ఇది నాకు నృత్యంలో అన్వేషించాలనే ఆలోచనను ఇచ్చింది. రామాయణానికి చాలా వెర్షన్లు ఉన్నాయి. అందుకే నా పరిశోధన విస్తృతం చేశాను. దీంతో అనేక అవకాశాలు నాకు లభించాయి. అన్ని వెర్షన్లు కథాంశం చెక్కుచెదరకుండా ఉన్నప్పటికీ, ప్రతి ఒక్కటి విభిన్న దృష్టి, రుచిని కలిగి ఉన్నాయి. ఉదాహరణకు- వాల్మీకి రామాయణం రాముడిని మానవ శ్రేష్ఠతగా చూస్తే, అధ్యాత్మ రామాయణం అతనిని అంతిమ భగవంతునిగా, అద్భుతంగా చూసింది. రామాయణంలో సీత పాత్రకు భిన్నమైన టేకింగ్ ఉంది.

ఆత్మను కదిలించాలి

అభిరామం నృత్య రూపకం వివిధ రామాయణ గ్రంథాల నుండి సేకరించిన ఆరు అరుదైన ఎపిసోడ్‌లను వర్ణిస్తుంది. రామాయణం భారతీయ మనస్తత్వంలో చాలా పాతుకుపోయింది కాబట్టి, నేను కథ టైమ్‌లైన్‌ను నిర్వహించాలనుకున్నాను. రాముడి కథ ప్రతి మట్టిని దాని స్వంత ఫ్లేవర్‌లో తాకింది. నేను దానిని ఉపదేశాత్మకంగానో, సాదాసీదాగానో స్తుతించేలనుకోలేదు. శృంగార భక్తి కోణాన్ని కొనసాగించాను. అదే నన్ను మొదటి స్థానంలో ప్రాజెక్ట్‌లోకి తీసుకువచ్చింది. ఎక్కడి నుంచైనా ఏదైనా ఒక అంశాన్ని తీసుకొని, దానిని మరో కోణంలో వివరిస్తే అది వినోదభరితంగా ఉండాలి అలాగే ఆత్మను కదిలించాలి. ప్రేక్షకుల ఊహల మైదానంలో ఆ అంశం తిరగాలి. నేను ఎంచుకున్న కథ మాత్రమే కాదు నా డ్యాన్స్ ఎలిమెంట్‌ను కూడా కోల్పోకూడదు. దీన్ని మరింత థియేట్రికల్ ప్రెజెంటేషన్‌గా మార్చాలనుకున్నాను.

ఆకర్షించిన అంశాలు

మొదట వాల్మీకి రామాయణాన్నే చదివాను. మా అమ్మ అప్పటికే తులసీదాస్ రచనలపై కొంత పరిశోధన చేసింది. అలా తులసి రామాయణం నుండి నాకు నచ్చిన అంశాలను సేకరించడానికి అది ఒక కిటికీలా ఉపయోగపడింది. కౌసల్య తన నవజాత శిశువుతో చేసిన మొదటి సంభాషణ నన్ను అమితంగా ఆకర్షించింది. అదేవిధంగా, రావణుడి పాత్రను చూస్తే విష్ణువు దైవిక బలాన్ని ఎదుర్కోవడంలో పూర్తి జ్ఞానంతో అతను సీతను అపహరించాడు. రావణుడు మోక్షానికి తన ఏకైక సాధనం – భగవంతుడి చేతిలో మరణం ఇదేనని గ్రహించాడు. తులసీరామాయణం రాముడు, సీత స్వయంవరం, వారి కలయిక గురించి చాలా అందంగా, సుందరంగా కవితాత్మకంగా అన్వేషించబడింది. రావణుడి సోదరి శూర్పణఖ సీతను అపహరించడానికి, ఆమె చేసిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవడానికి తన సోదరుడిని ప్రేరేపించడం ద్వారా రామాయణంలో మలుపు తిరిగింది. అరుణాచల కవి తమిళంలో రామనాటకంలో ఈ క్యారెక్టరైజేషన్‌ని చాలా అందంగా చూపించాడు, రాక్షసి బెంగను అనుభూతి చెందాడు. ప్రొడక్షన్‌లో ఇది మూడో ఎపిసోడ్‌గా తీసుకోబడింది. కథను ఇలా ముందుకు తీసుకెళ్తుంటే హనుమంతుని అద్భుతమైన చర్యలు, సెయింట్ పురందర దాసు కన్నడ పద్యాల పదునుగా బయటకు వచ్చాయి.

తల్లే గురువు

మా అమ్మ నా గురువుగా ఉండటం నాకు దొరికిన అద్భుతమైన ఆశీర్వాదం. చిన్నతనం నుండే సాంప్రదాయ సంగీతం, నృత్యం, కథల రూపంలో ఉండే సాహిత్యం, ఏదైనా సాధించాలనే కల, క్రమశిక్షణతో కూడిన ఆలోచనలతో ఉన్నాను. పరిపూర్ణత గురించి ఎప్పుడూ చర్చలు ఉండకూడదు. అలాగే, నాణ్యతలో ఎప్పుడూ రాజీ పడకూడదు. ఇది నా వారసత్వాన్ని చెక్కుచెదరకుండా కొనసాగించే సవాల్, మరింత పరిపూర్ణత కోసం పట్టుదలతో కూడిన బాధ్యత. దానిని స్వీకరించి ముందు తరాలకు ఇవ్వాలనే నిబద్ధతో కృషి చేస్తున్నాను.

కూర్పులో సవాల్

ప్రతి ఎపిసోడ్ లోనూ కథనంలో మార్పు లేకుండా అందులోని అందాన్ని బయటకు తీసుకురావడానికి ప్రయత్నించాం. సంగీతం, నృత్యం అన్నీ వేర్వేరు వ్యక్తులచే కంపోజ్ చేయబడ్డాయి. కౌసల్య వాత్సల్యమైనా, రాముడు- సీతల శృంగారమైనా, సీత వైభవం, హనుమంతుడి సుందరకాండ ఇలా ప్రతీది 'అందం'లోని అంశమే ఈ నృత్యంలో ప్రత్యేకంగా నిలుస్తుంది'' అని వివరిస్తుంది ఐశ్వర్య.

సంస్కృతి

గిరిజనుల ఐక్యతకు
భారతీయ హార్న్‌బిల్

భారతదేశంలోని ఈశాన్య ప్రాంతంలో ప్రతి డిసెంబర్‌లో నాగాలాండ్‌లోని రోలింగ్ కొండల మధ్య సుందరమైన కోహిమా ప్రాంతం నాగా తెగల సాంస్కృతిక వేడుకలకు కేంద్ర బిందువు అవుతుంది. అక్కడి గిరిజనులు తమ అరుదైన సంస్కృతిని ప్రదర్శించడానికి హార్న్‌బిల్ పండుగను అత్యంత వైభవంగా జరుపుకుంటారు.

వివిధ తెగల మధ్య ఐక్యతకు, శాంతికి, సంస్కృతికి ప్రతీకగా పాతికేళ్లుగా ప్రతియేటా జరిగే ఈ వేడుకలో లక్షన్నరకు పైగా సందర్శకులు పాల్గొన్నారు. దీంతో ఈ వేడుక ప్రపంచమంతటినీ ఆకర్షించింది. పర్యాటకాన్ని ప్రోత్సహించడం, నాగా తెగల శక్తివంతమైన గుర్తింపును వెలుగులోకి తీసుకురావం ఈ వేడుక ముఖ్య ఉద్దేశ్యం. పండుగ సందర్భంగా ఇక్కడ ప్రతి తెగ దాని స్వంత సజీవ నృత్యాలు, పాటలు, ఆచారాలను ప్రదర్శించడమే కాదు నాగా వంటకాలు విభిన్న రుచులను అందిస్తాయి. స్థానిక కళాకారులు, హస్తకళాకారులు ప్రదర్శనలో భాగం అవుతారు. తద్వారా వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం కల్పిస్తుంది. చేతితో నేసిన వస్త్రాలు, సాంప్రదాయ ఆభరణాలు, వివిధ హస్తకళలతో నిండిన స్టాల్స్ పండుగకు వెళ్లేవారికి సాంస్కృతిక ప్రాముఖ్యతతో కూడిన సావనీర్‌లను ఇంటికి తీసుకెళ్లడానికి సరైన అవకాశాన్ని అందిస్తాయి. నిర్దిష్ట తెగలు, వారి విలక్షణమైన సంప్రదాయాలకు నివాళులు అర్పిస్తూ ప్రత్యేక నేపథ్య సాయంత్రాలను ప్లాన్ చేయవచ్చు. ఉదాహరణకు కొన్యాక్ తెగ వారు వారి సంప్రదాయ పచ్చబొట్లు, పాటలు, కథలు వారి జీవన విధానంపై అవగాహన కలిగిస్తాయి. మరొక తెగ వారి ప్రాచీన నృత్యాల ద్వారా చారిత్రక కథలను వివరిస్తాయి.



వివిధ తెగల మధ్య శాంతి

ఈ ఫెస్టివల్ తెగల మధ్య ఐక్యతను పెంపొందిస్తుంది. గిరిజన సంఘర్షణల చుట్టూ తరచుగా గందరగోళ చరిత్ర ఉన్నందున, ఈ పండుగ వివిధ వర్గాల మధ్య అంతరాలను తగ్గిస్తుంది. భవిష్యత్ తరాలకు దేశీయ సంస్కృతుల పరిరక్షణకు భరోసానిస్తూ, నాగా యువకులు తమ మూలాలతో మళ్లీ కనెక్ట్ అవ్వడానికి ఇది ఒక వేదికగా మారుతుంది. వివిధ పోటీలను నిర్వహించి గిరిజన యువతలో గర్వం, ప్రేరణను సృష్టిస్తుంది. రాత్రి సమయాల్లో జరిగే కచేరీలకు వివిధ ప్రాంతాల నుండి బ్యాండ్ లను ప్రదర్శిస్తారు. ప్రతి రోజు ఉత్సాహభరితమైన శ్రావ్యమైన పాటలతో ముగుస్తుంది. స్థానికులు, పర్యాటకులు, ప్రదర్శకులు కలిసి ఆనందాన్ని పొందడానికి వీలు కల్పిస్తుంది. పాతికేళ్లుగా హార్న్‌బిల్ ఫెస్టివల్ నాగా సంస్కృతిని పరిరక్షించడమే కాకుండా దాని అభివృద్ధిని కూడా వాగ్దానం చేస్తుంది. భవిష్యత్ తరాలకు ఈ విలువైన సంప్రదాయాలను వారసత్వంగా, భాగస్వామ్యం చేయడానికి మార్గం సుగమం చేస్తుంది. ఇలాంటి సంప్రదాయ వేడుకలు మన భారతీయ సంస్కృతిని ఇంకా సుసంపన్నం చేస్తూనే ఉన్నాయి అనడానికి హార్న్‌బిల్ ఓ ఉదాహరణగా నిలుస్తుంది.



ఆర్ట్

చీకటి.. వెలుతురు
వి'చిత్రం'

అవార్డ్ విజేత, చిత్రకారుడు దీనా సోఓతేహ్ నీడ-కాంతిలో విలక్షణతను చూపడంలో మాస్టర్. యునైటెడ్ స్టేట్స్‌లో ఉండే ఈ కళాకారుడి చిత్రాలు మిగతా వాటితో పోల్చితే చాలా భిన్నంగా ఉంటాయి. చీకటి నుండి వెలువడే ప్రకాశవంతమైన చిత్రాలను మన కళ్లకు కడతాడు. ఇద్దరు వ్యక్తుల మధ్య పోరాటాన్ని 'చిత్రం'గా చూపుతాడు. గురువెవ్వరూ లేకుండానే తన ఊహల్లో నుండి పుట్టుకువచ్చిన కళ గురించి వివరిస్తుంటే వినేవారు చాలా అబ్బురంగా చూస్తారు.


''మా అమ్మ చిన్నప్పటి నుండి నాలో కళాత్మక అభిరుచిని గుర్తించింది. దానిని పెంపొందించడానికి ప్రాధాన్యతను ఇచ్చింది. నేను మంచి కళాకారుడిగా మారుతానని ముందే అనుకున్నాను. కళను వృత్తిగా కొనసాగించాలనే ఆలోచన చాలా ఆలస్యంగా వచ్చింది. నాకు 12 ఏళ్ల వయసులో నా కుటుంబం యునైటెడ్ స్టేట్స్‌కు వలస వచ్చింది. నాటి పరిస్థితులు చాలా దారుణంగా ఉండేవి. మా అమ్మనాన్నలు విడాకులు తీసుకున్నారు. ఆ సమయంలో మాకు సంబంధించిన న్యాయపరమైన పత్రాలన్నీ నాన్న తనతో తీసుకెళ్లిపోయారు. సరైన పత్రాలు లేకపోవడంతో 18 ఏళ్ల వయసులో చదువుకు స్కాలర్‌షిప్‌కు అర్హత కోల్పోయాను. దీంతో ఎనిమిదేళ్లు వెయిటర్‌గా పనిచేశాను. అప్పుడు నా కెరీర్ వెయిటర్ అనే అనుకున్నాను.

అనిశ్చితి నుంచి నైపుణ్యాలు

మొదట నేను ఫైన్ ఆర్ట్ ఆర్టిస్టును కాదు. సరైన పత్రాలు లేకపోవడం వల్ల వలసదారునిగా ఎనిమిదేళ్లు అనిశ్చితిని ఎదుర్కొన్నాను. ఇష్టపడే పని చేస్తున్నప్పుడే స్థిరత్వం లభించడం ప్రారంభమైంది. నాకు నేను స్వయంగా ఇలస్ట్రేషన్స్ వేసేవాణ్ణి. ఈ సాధన ద్వారా ఇలస్ట్రేషన్ నా నైపుణ్యాలు పెరిగాయి. అది ఎంతగా అంటే బ్యాచులర్ ఆఫ్ ఆర్ట్‌లో డిగ్రీ సాధించాను. మాస్టర్స్ ప్రోగ్రామ్‌ద్వారా స్కూల్ ఆఫ్ విజువల్ ఆర్ట్స్‌లో మరింత అధ్యయనం సాధ్యమైంది. అప్పుడే ఇలస్ట్రేషన్ నాకు సరిగ్గా సరిపోతుందనిపించింది. కథలు చెప్పడం, నేర్చుకోవడం, సమస్యను పరిష్కరించడం, సృష్టించడం... ఇలా ప్రతీది నా మనో వికాసానికి, వృద్ధికి ఇలస్ట్రేషన్ ఆర్ట్ కొత్త తలుపులు తెరిచింది. చివరకు నాది అయిన మార్గంలో ఉన్నట్టు అనిపించింది. ఇదంతా సాధ్యమైంది మా అమ్మ ద్వారా. ఆమే నన్ను నేను గర్వపడేలా చేసింది.

నిశ్శబ్దం నుంచి...

పరధ్యానాన్ని నివారించడానికి సాధారణంగా స్కెచ్ వేయడం ప్రారంభిస్తాను. కొన్నిసార్లు తెల్లవారుజామున 4-5 గంటల సమయాన్ని ఎంచుకుంటాను. ఆ నిశ్శబ్ద సమయం, ప్రపంచం మేల్కొనే ముందు నేను చాలా సృజనాత్మకంగా ఉంటాను. పరధ్యానాల నుండి విముక్తి పొందుతాను. ఏదైనా 'రంగు'లోనే ఆలోచిస్తాను. ఎందుకంటే అది ఏదో ఒక చిన్న సృష్టికి కారణం అవుతుంది. అక్కడ నుంచి నా స్కెచ్‌లకు విస్తృతంగా పని దొరుకుతుంది. ఆరిస్ట్ మార్షల్ అరిస్మాన్ ఎప్పుడూ ఒక మాట చెబుతాడు 'మీకు తెలిసిన వాటిని గీయండి' అని. ఆ పదాన్ని అర్థం చేసుకోవడానికి నాకు సమయం పట్టింది. కానీ, కాలక్రమేణా అది స్పష్టమైంది. కాంతి-చీకటి మధ్య అంతర్గత పోరాటం నాకు తెలిసింది. నేను నా జీవితంలో చాలా చీకటి కాలాలను ఎదుర్కొన్నాను. పోరాటాలకు మించిన అందం వాటిలోనే ఉందని నా ప్రగాఢ నమ్మకం. ఒక అంశంపై తగినంత అవగాహన లేకుండా పని మొదలు పెడితే ఆందోళన కలుగుతుంది. అయితే, ఆ క్షణంలో నేను నా అహం, ఊహాత్మక తీర్పులను, ఫెయిల్ అవుతానేమో అనే భయాలను వదిలేస్తూ ఆర్ట్‌లోకి ప్రయాణిస్తాను'' అని వివరిస్తాడు ఈ చిత్రకారుడు.





పోటీదారులపై కాకుండా..
కస్టమర్ల సేవలపై దృష్టిపెట్టు
- జాక్ మా, ప్రముఖ చైనా వ్యాపారవేత్త

సాక్షి ప్లస్
సోమవారం । 23-12-2024

బిజినెస్ రీల్

చిప్ ఫ్యాబ్రికేషన్‌లో అపార అవకాశాలు

- లిథోగ్రఫీ మెషీన్ల సరఫరా కోసం సెమీకండక్టర్ సంస్థలతో చర్చలు
- కెనాన్ ఇండియా ప్రెసిడెంట్ తొషియాకి నొమురా



న్యూఢిల్లీ: భారత్‌లో చిప్ ఫ్యాబ్రికేషన్‌కి సంబంధించి గణనీయంగా వ్యాపార అవకాశాలు ఉన్నట్లు జపాన్‌కి చెందిన ఇమేజింగ్ ఉత్పత్తుల దిగ్గజం కెనాన్ ఇండియా ప్రెసిడెంట్, సీఈవో తొషియాకి నొమురా తెలిపారు. తమ సెమీకండక్టర్ లిథోగ్రఫీ మెషీన్లను సరఫరా చేసేందుకు, దేశీయంగా సెమీకండక్టర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్న కంపెనీలతో చర్చలు జరుపుతున్నట్లు వివరించారు. చిప్‌ల ఉత్పత్తికి పలు చిప్ తయారీ సంస్థలకు ఇప్పుడు భారత్ కొత్త గమ్యస్థానంగా మారుతోందని పేర్కొన్నారు. మరోవైపు 2024లో తమ వృద్ధి దాదాపు రెండంకెల స్థాయిలో ఉండగలదని, ఏటా ఇదే తీరును కొనసాగించగలమని ఆశిస్తున్నట్లు నొమురా వివరించారు. ప్రధాన వ్యాపారమైన ఇమేజింగ్, ప్రింటింగ్, సర్వైలెన్స్ ఉత్పత్తులతో పాటు కెనాన్ ఇండియా సంస్థ ఫ్లాట్ ప్యానెల్ డిస్‌ప్లేలతో పాటు డయాగ్నోస్టిక్ మెడికల్ ఇమేజింగ్ సొల్యూషన్స్‌పై (సీటీ, ఎక్స్-రే, అల్ట్రాసౌండ్ మొదలైనవి) కూడా దృష్టి పెడుతోంది. హెల్త్‌కేర్ విభాగంలో తమ వ్యాపార వృద్ధికి గణనీయంగా అవకాశాలు ఉన్నాయని నొమురా తెలిపారు. అటు ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోనూ విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. ఐటీ, బీఎఫ్ఎస్ఐ, ఫార్మా తదితర పరిశ్రమలపైనా దృష్టి పెడుతున్నట్లు చెప్పారు.

మరిన్ని విమానాలపై ఆకాశ ఎయిర్ దృష్టి



న్యూఢిల్లీ: విమానయాన సంస్థ ఆకాశ ఎయిర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరిన్ని ఎయిర్‌క్రాఫ్ట్‌లను సమకూర్చుకోవడంపై దృష్టి పెడుతోంది. 2022 ఆగస్టులో కార్యకలాపాలు ప్రారంభించిన కంపెనీకి ప్రస్తుతం బోయింగ్ 737 మ్యాక్స్ రకం విమానాలు 26 ఉన్నాయి. మరో 200 ఎయిర్‌క్రాఫ్ట్‌లకు ఆర్డరిచ్చింది. ఈ ఏడాది 4 విమానాలను అందుకున్నామని, డెలివరీలకు సంబంధించి ఎటువంటి సమస్యలూ లేవని కంపెనీ చీఫ్ వినయ్ దూబే తెలిపారు. మరిన్ని నిధుల సమీకరణ వార్తలపై తాను ఎటువంటి వ్యాఖ్యలు చేయబోనని, తాము ఊహించిన దానికంటే మెరుగ్గా కంపెనీ పరిస్థితి ఆయన పేర్కొన్నారు. దేశీయంగా రెండు సంస్థలదే గుత్తాధిపత్యం ఉంటోందంటూ ఆందోళన వ్యక్తమవుతుండటంపై స్పందిస్తూ.. తమ నియంత్రణలో లేని విషయాలపై సమయం వృధా చేయడం కన్నా తమ సేవలను మరింత మెరుగుపర్చుకోవడంపైనే దృష్టి పెడుతున్నామని దూబే తెలిపారు. అక్టోబర్ గణాంకాల ప్రకారం దేశీ మార్కెట్లో ఇండిగో, ఎయిరిండియా గ్రూప్‌లకు కలిపి 91 శాతం వాటా ఉండగా, ఆకాశ ఎయిర్‌కు 4.5 శాతం వాటా ఉంది.

నేలచూపులు కొనసాగవచ్చు



ఈ వారం ప్రభావిత అంశాలు కరవు...

- డాలర్ ఇండెక్స్, బాండ్ల ఈల్డ్స్ కీలకం
- విదేశీ ఇన్వెస్టర్ల తీరుపై ఇన్వెస్టర్ల దృష్టి
- ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితం
- స్టాక్ మార్కెట్ల ట్రెండ్‌పై విశ్లేషకులు

ముంబై: ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లలో బలహీనతలు కొనసాగవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. మార్కెట్లలో ట్రెండ్‌ను ప్రభావితం చేయగల కీలక అంశాలు కొరవడటంతో విదేశీ ఇన్వెస్టర్ల తీరుపై ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నట్లు తెలియజేశారు. ఇటీవల మరోసారి ఎఫ్‌పీఐలు కొనుగోళ్లను వీడి అమ్మకాల బాట పట్టడంతో సెంటిమెంటు దెబ్బ తిన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రేడర్లు అప్రమత్తంగా వ్యవహరించే వీలున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ సీనియర్ టెక్నికల్ విశ్లేషకులు ప్రవేష్ గౌర్ పేర్కొన్నారు. అయితే గత వారం భారీ అమ్మకాల కారణంగా ఈ వారం కొంతమేర కొనుగోళ్లకూ వీలున్నట్లు అభిప్రాయపడ్డారు. ఉన్నట్టుండి ఎఫ్‌పీఐలు భారీ అమ్మకాలకు తెరతీయడంతో మార్కెట్లు బలహీనపడినట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పెట్టుబడుల ప్రధాన వ్యూహకర్త వీకే విజయకుమార్ తెలియజేశారు.

విదేశీ అంశాలు...

బుధవారం క్రిస్మస్ సందర్భంగా దేశీ స్టాక్ మార్కెట్లు పనిచేయవు. దీంతో ఈ వారం ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితం కానుంది. దీంతో మార్కెట్లలో విదేశీ అంశాలు కీలకంగా నిలవనున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్, రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా వివరించారు. విదేశీ పెట్టుబడులు, గ్లోబల్ మార్కెట్ల తీరు సెంటిమెంటును ప్రభావితం చేయగలవని అంచనా వేశారు. వీటికి తోడు డిసెంబర్ నెల డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగియనుండటంతో ఆటుపోట్లకు అవకాశమున్నట్లు తెలియజేశారు. దేశీయంగా ప్రస్తావించదగ్గ ప్రధాన అంశాలు కొరవడటంతో యూఎస్ నిరుద్యోగ గణాంకాలు, కొత్త గృహాల విక్రయాలు, బాండ్ల ఈల్డ్స్, డాలరు ఇండెక్స్ వంటి అంశాలకు ప్రాధాన్యత ఉంటుందని విశ్లేషకులు పేర్కొన్నారు. ఎఫ్‌పీఐల అమ్మకాలు కొనసాగితే మార్కెట్లు మరింత నీరసించవచ్చని విజయకుమార్, గౌర్ తెలియజేశారు. డాలరుతో రూపాయి మారకం, ముడిచమురు ధరల కదలికలకు ప్రాధాన్యత ఉన్నట్లు విశ్లేషించారు. అయితే విదేశీ మార్కెట్లలోనూ క్రిస్మస్ సెలవుల కారణంగా యాక్టివిటీ తగ్గే అవకాశమున్నట్లు అభిప్రాయపడ్డారు.

గత వారమిలా...

విదేశీ ఇన్వెస్టర్ల భారీ అమ్మకాల నేపథ్యంలో గత వారం మార్కెట్లు డీలా పడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 4,092 పాయింట్లు (5 శాతం) పతనమైంది. 82,000 పాయింట్ల నుంచి 78,042కు దిగజారింది. ఇక ఎన్ఎస్ఈ ఇండెక్స్ నిఫ్టీ సైతం 1,181 పాయింట్లు (4.8 శాతం) కోల్పోయి 23,588 వద్ద ముగిసింది.

ఎఫ్‌పీఐల యూటర్న్..

గత రెండు వారాలుగా దేశీ స్టాక్స్‌లో పెట్టుబడులకు ఆసక్తి చూపుతూ వచ్చిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) గత వారం అమ్మకాల యూటర్న్ తీసుకున్నారు. తొలి రెండు రోజుల్లో రూ. 3,126 కోట్లు ఇన్వెస్ట్ చేసిన ఎఫ్‌పీఐలు చివరి మూడు ట్రేడింగ్ సెషన్లలో రూ. 4,102 కోట్ల విలువైన అమ్మకాలు చేపట్టారు. దీంతో గత వారం నికరంగా రూ. 976 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నట్లయ్యింది. ప్రధానంగా ప్రపంచ కరెన్సీలతో మారకంలో డాలరు ఇండెక్స్ బలపడటానికి తోడు 10ఏళ్ల ట్రెజరీ బాండ్ల ఈల్డ్స్ పుంజుకోవడం ప్రభావం చూపినట్లు నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో దేశీ స్టాక్ మార్కెట్లు గత వారం దాదాపు 5 శాతం పడిపోయిన విషయం విదితమే. గత వారం ఎఫ్ఓఎంసీ వడ్డీ రేట్లను అంచనాలకు అనుగుణంగా 0.25 శాతం తగ్గించినప్పటికీ 2025లో ద్రవ్యోల్బణ అదుపునకు వీలుగా కఠిన పరపతి విధానాలు అవలంబించనున్నట్లు ఫెడ్ చైర్మన్ పావెల్ పేర్కొనడం సెంటిమెంటును దెబ్బతీసినట్లు మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా అసోసియేట్ డైరెక్టర్ హిమాన్షు శ్రీవాస్తవ తెలియజేశారు. అంతేకాకుండా దేశీ కార్పొరేట్ ఫలితాలు నిరాశపరచడం, జీడీపీ వృద్ధి నెమ్మదించడం తదితర అంశాలు జత కలసినట్లు జియోజిత్ స్ట్రాటజిస్ట్ విజయకుమార్ వివరించారు.

విదేశీ విద్యకు ప్రయాణ బీమా దన్ను



రమిత్ గోయల్
చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్, ఫ్యూచర్ జనరాలీ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్



FUTURE GENERALI
TOTAL INSURANCE SOLUTIONS

విద్య కోసం విదేశాల బాట పట్టినప్పుడు కొత్త సంస్కృతులు, సవాళ్లు, వ్యక్తిగత వృద్ధి అవకాశాలు ఇలాంటివి ఎన్నో ఉక్కిరిబిక్కిరి చేసే అనుభవాలు ఎదురవుతాయి. అయితే, ఈ ఉత్కంఠభరితమైన సాహసయాత్రలో రిస్కులు, అనిశ్చితులూ ఉంటాయి. హెల్త్ ఎమర్జెన్సీల నుంచి.. ట్రిప్‌లు రద్దవడం వరకు పలు రకాల సమస్యలు ఎదురుకావచ్చు. అందుకే విదేశాల్లో విద్యాభ్యాసాన్ని ఎంచుకున్నప్పుడు ట్రావెల్ ఇన్సూరెన్స్ అనేది కేవలం ఒక ఆప్షన్ కాదు.. తప్పనిసరిగా తీసుకోతగిన రక్షణ కవచంలాంటిది. ఇందుకు గల అనేక కారణాల్లో కొన్ని...

ఆరోగ్య సంరక్షణకు..

విదేశాల్లో హెల్త్‌కేర్ వ్యవస్థలు, వ్యయాల మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. పలు దేశాల్లో వైద్య వ్యయాలు భారీగానే ఉంటాయి. దీన్ని అధిగమించడం శక్తికి మించిన భారంగా అనిపించవచ్చు. ఉదాహరణకు అమెరికాలో మామూలుగా ఆసుపత్రికి వెళ్లినా వందల కొద్దీ డాలర్ల వ్యయంతో కూడుకున్న వ్యవహారంగా ఉంటుంది. ఇక మిగతా దేశాల్లో ఎమర్జెన్సీ ఎవాక్యుయేషన్ అనేది వేల కొద్దీ డాలర్లతో ముడిపడి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లోనే ఊహించని వ్యయాల భారం నుంచి ఉపశమనం కలిగిస్తుంది ప్రయాణ బీమా. డాక్టర్ విజిట్స్, ఆసుపత్రిలో చేరడం, ఎమర్జెన్సీ మెడికల్ ఎవాక్యుయేషన్లు మొదలైన వాటన్నింటికీ కవరేజీని ఇస్తుంది. ఈ విషయంలో భరోసా లభించడం వల్ల విద్యార్థులు తమ చదువుపై నిశ్చింతగా ఫోకస్ చేసేందుకు వీలుంటుంది.

ప్రయాణాలకు ఆటంకాలెదురైనా..

రాజకీయ అనిశ్చితి, ప్రకృతి వైపరీత్యాలు లేదా వ్యక్తిగతంగా అత్యవసర పరిస్థితులు తలెత్తడం మొదలైన ఊహించని అంశాల వల్ల ప్రయాణ ప్రణాళికలపై ప్రభావం పడొచ్చు. ఒకవేళ మీరు వెళ్లే దేశంలో ప్రకృతి వైపరీత్యం తలెత్తి, ట్రిప్ రద్దు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడి, మళ్లీ కొత్తగా బుక్ చేసుకోవాల్సి వస్తే.. ఆయా వ్యయాలన్నింటికీ ట్రావెల్ ఇన్సూరెన్స్ ద్వారా కవరేజీని పొందే అవకాశం ఉంటుంది. అదనంగా ఆర్థిక భారం పడకుండా మీరు రీషెడ్యూల్ చేసుకోవచ్చు. అంటే మీ ట్రిప్‌ను కుదించుకున్నా లేక అది రద్దయినా.. ప్రయాణ ఏర్పాట్ల కోసం మీరు వెచ్చించిన మొత్తం డబ్బు వృధా కాకుండా చూసుకోవడానికి వీలవుతుంది.

విలువైన వస్తువులకు భద్రత..

విదేశాల్లో విద్యాభ్యాసం కోసం వెళ్తున్నప్పుడు విలువైన ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, ఇతరత్రా అవసరమైన ఎలక్ట్రానిక్స్ వస్తువులను వెంట తీసుకెళ్లే అవకాశం ఉండొచ్చు. సరిగ్గా పాఠాలు ప్రారంభమయ్యే సమయానికి మీ ల్యాప్‌టాప్ పోయిందంటే ఎంత ఇబ్బందికర పరిస్థితి ఉంటుందో ఊహించుకోవచ్చు. అదే ప్రయాణ బీమా ఉంటే ఈ గందరగోళం నుంచి బైటపడేందుకు ఆస్కారం ఉంటుంది. దీనితో ఆయా ఉత్పత్తుల రీప్లేస్‌మెంట్ ఖర్చులతో పాటు కొన్ని సందర్భాల్లో వ్యక్తిగత సామాన్లకు కూడా కవరేజీని పొందవచ్చు.

విదేశాల్లో 24 గంటల ఎమర్జెన్సీ సహాయం..

24/7 ఎమర్జెన్సీ అసిస్టెన్స్ సర్వీస్ అనేది ట్రావెల్ ఇన్సూరెన్స్‌లో అత్యంత కీలకమైన ఫీచర్లలో ఒకటి. లోకల్ డాక్టరును సంప్రదించడం మొదలుకుని అత్యవసరంగా ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవడం వరకు వివిధ ఎమర్జెన్సీ సందర్భాల్లో తక్షణ సహాయం పొందడానికి ఇది ఉపయోగపడుతుంది. ఇంటికి దూరంగా ఉండే సమయంలో విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కేవలం ఒక ఫోన్ కాల్ చేస్తే చాలు సహాయం అందుబాటులో ఉంటుందనే ఆలోచన ఎంతో నిశ్చింతనిస్తుంది.

థర్డ్ పార్టీ లయబిలిటీ

ప్రమాదాలనేవి అనుకోకుండానే జరిగిపోతాయి. మనం ఎంత పరిశోధన చేసి, ఎన్ని ప్రణాళికలు వేసుకున్నా.. సరిగ్గా సమయం వచ్చేసరికి అన్నీ పక్కకు వెళ్లిపోవచ్చు. విదేశాల్లో ఉన్నప్పుడు మనకు తెలియకుండానే ప్రమాదవశాత్తూ థర్డ్ పార్టీలకు ఏదైనా నష్టం కలిగించడం వల్ల పరిహారాన్ని చెల్లించాల్సిన పరిస్థితి తలెత్తవచ్చు. అద్దెకు తీసుకున్న ఇల్లు ప్రమాదవశాత్తూ దెబ్బ తిన్నా, ఏదైనా ప్రమాదంలో ఎవరైనా గాయపడినా .. మీ ట్రావెల్ ఇన్సూరెన్స్ అనేది లీగల్, ఆర్థిక వ్యయాలను కవర్ చేస్తుంది.

దూరదృష్టి ముఖ్యం..

ప్రయాణ బీమా అనవసర ఖర్చు అనే ఉద్దేశంతో పక్కన పెట్టేసేద్దామని అనిపించినా.. విదేశాల్లో విద్యాభ్యాసం చేసేటప్పుడు ఎదురయ్యే రిస్కుల గురించి ఒకసారి ఆలోచిస్తే.. ఇది ఎంతో వివేకవంతమైన పెట్టుబడి కాగలదు. హెల్త్ ఎమర్జెన్సీలు, ప్రయాణాలు రద్దు కావడం, వస్తువులు పోవడం, లీగల్ ఖర్చులు, కాలేజీ ఫీజులపరమైన నష్టాలు మొదలైన వాటన్నింటికీ ట్రావెల్ ఇన్సూరెన్స్‌తో కవరేజీ ఉంటుందనే ఆలోచన కొండంత భరోసానిస్తుంది. మిగతా వాటి గురించి ఆందోళన చెందకుండా నిశ్చింతగా చదువుపై దృష్టి పెట్టేందుకు ఉపయోగపడుతుంది.

న్యూ ఫండ్ ఆఫర్లకు కాల పరిమితులు

- 30 రోజుల్లోగా ఇన్వెస్ట్ చేయాలి
- లేదంటే ఇన్వెస్టర్ తప్పుకోవచ్చు
- సెబీ బోర్డులో నిర్ణయం



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు కొత్త పథకాల రూపంలో (ఎన్ఎఫ్ఓలు) సమీకరించే నిధులను ఇన్వెస్ట్ చేసేందుకు కాల పరిమితులను ప్రవేశపెట్టాలని సెబీ నిర్ణయించింది. అలాగే, అస్సెట్ మేనేజ్ కంపెనీల (ఏఎంసీలు/మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణ సంస్థలు) ఉద్యోగుల ప్రయోజనాలను, యూనిట్ హోల్డర్ల ప్రయోజనాలతో సమీకృతం చేసే నిబంధనలను సడలించాలన్న నిర్ణయానికొచ్చింది. దీనికితోడు అన్ని మ్యూచువల్ ఫండ్ పథకాలకు సంబంధించి స్ట్రెస్ టెస్ట్ ఫలితాలను ఇన్వెస్టర్లతో మరింత పారదర్శకంగా పంచుకోవాలని నిర్దేశించింది. వీటికి సంబంధించిన ప్రతిపాదనలకు బుధవారం నాటి సెబీ బోర్డులో ఆమోదం లభించింది. ఎన్ఎఫ్ఓ ద్వారా సమీకరించిన నిధులను ఏఎంసీలు 30 రోజుల్లో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. ఆలోపు ఇన్వెస్ట్ చేయకపోతే ఇన్వెస్టర్లు ఎలాంటి ఎగ్జిట్ లోడ్ లేకుండా తమ పెట్టుబడులను వెనక్కి తీసుకునేందుకు వెసులుబాటు ఉంటుంది. ''30 రోజుల్లోపు ఇన్వెస్ట్ చేయడానికి వీలైనంత పెట్టుబడులనే ఓపెన్ ఎండెడ్ ఎన్ఎఫ్ఓలో భాగంగా మ్యూచువల్ ఫండ్స్ సమీకరించాలి. ఎందుకంటే ఇవి ఓపెన్ ఎండెడ్ పథకాలు కనుక ఇన్వెస్టర్లు కావాలంటే తర్వాత తిరిగి ఇన్వెస్ట్ చేసుకోగలరు'' అని సెబీ తెలిపింది. ఏఎంసీ ఉద్యోగులకు సంబంధించి కార్యాచరణను సులభతరం చేయాలని నిర్ణయించింది. దీని కింద ఏఎంసీకి చెందిన నియమిత ఉద్యోగులు ఇన్వెస్ట్ చేయాల్సిన కనీస మొత్తాన్ని తగ్గించింది. ఏఎంసీ నుంచి తప్పుకున్న ఉద్యోగికి సంబంధించి పెట్టుబడులకు లాకిన్ పీరియడ్‌ను సైతం తగ్గించనున్నారు. సెబీ నిర్ణయాలను ట్రస్ట్ మ్యూచువల్ ఫండ్ సీఈవో సందీప్ బగ్లా ఆహ్వానించారు. వేగంగా విస్తరిస్తున్న మ్యూచువల్ ఫండ్ పరిశ్రమకు యూనిట్‌దారుల ప్రయోజనాలను పరిరక్షించే నిపుణులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

హార్వర్డ్ ఇండియా కాన్ఫరెన్స్‌లో నీతా అంబానీ



బోస్టన్: వచ్చే ఏడాది ఫిబ్రవరి 15–16 తేదీల్లో అమెరికాలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయం హార్వర్డ్‌లో నిర్వహించే ఇండియన్ కాన్ఫరెన్స్‌లో రిలయన్స్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ నీతా అంబానీ పాల్గొనున్నారు. భారతదేశపు అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల్లో ఒకరైన నీతా అంబానీ.. 'ఫ్రం ఇండియా టు ది వరల్డ్ థీమ్'పై కీలకోపన్యాసం చేస్తారని ఇండియా కాన్ఫరెన్స్ ఎట్ హార్వర్డ్ (ఐసీహెచ్) వెల్లడించింది. సామాజిక సమానత కార్యక్రమాల ద్వారా ఆమె 8 కోట్లకు పైగా జీవితాలను ప్రభావితం చేశారని పేర్కొంది. భారత్ ప్రధానాంశంగా అమెరికాలో నిర్వహించే ప్రతిష్టాత్మక సదస్సుల్లో ఇండియా కాన్ఫరెన్స్ ఎట్ హార్వర్డ్ కూడా ఒకటి. హార్వర్డ్ బిజినెస్ స్కూల్, హార్వర్డ్ కెనెడీ స్కూల్ దీన్ని సంయుక్తంగా నిర్వహిస్తాయి. విధానకర్తలు, వ్యాపారవేత్తలు, సాంస్కృతిక సారథులు మొదలైన వారు ఇందులో పాలుపంచుకుంటారు. రెండు రోజులపాటు జరిగే సదస్సులో ఈసారి వివిధ రంగాలకు చెందిన 80 మంది పైగా వక్తలు పాల్గొంటారని అంచనా.

ఆలుమగలిద్దరూ ఉద్యోగస్తులైతే..



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

గతవారం ఉద్యోగస్తులకు సంబంధించి వారి ఆదాయం విషయంలో కొత్త విధానమా.. పాత పద్ధతా.. ఏది మంచిది.. ఏ విధంగా అయితే పన్ను భారం తక్కువ అవుతుందనేది ఉదాహరణపూర్వకంగా తెలుసుకున్నాం. ఈవారం ఒకే కుటుంబంలో భార్య, భర్త ఇద్దరూ ఉద్యోగస్తులైతే ఎలా ఆలోచించాలో ఎలా ప్లాన్ చేయాలో తెలుసుకుందాం. ఇద్దరూ ఉద్యోగస్తులైనా.. ఇద్దరూ రిటైర్ అయినా.. ఒకరు రిటైర్ అయి ఒకరు ఉద్యోగంలో ఉన్నా ఈ ఆలోచనలను అమలుపరచవచ్చు.

ఇద్దరూ గవర్నమెంటుకు సంబంధించిన వారయితే..

గవర్నమెంటు నుండి జీతం/పెన్షన్ పుచ్చుకున్న వారైతే వారి వారి జీతభత్యాల విధానం వల్ల ఎటువంటి వెసులుబాటు ఉండదు. పే స్కేల్, వేతన ప్రమాణాలు, పే స్ట్రక్చర్.. అన్నీ నిర్దిష్టంగా ఉంటాయి. ఉద్యోగి తనకు అనుకూలంగా మార్చుకునే వెసులాటు ఉండదు. అన్నీ ప్రీ ఫిక్సిడ్. కాలానుగుణంగా పే రివిజన్ ప్రకారం మారతాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఆదాయం వచ్చినదంతా లెక్కించాల్సిందే. ఇద్దరి జీతభత్యాలను, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోండి. ఇద్దరికి ఇంచుమించు సమానమైన జీతభత్యాలు ఉంటే పెద్దగా ఆలోచించే పని లేదు. అంటే ఇద్దరూ ఒకే శ్లాబులో ఉంటే పన్నుభారం మారదు. ఎవరూ కట్టినా ఒకటే! పెద్దగా వెసులుబాటు ఉండదు. ఆస్కారం ఉండదు.

కానీ జీతభత్యాల్లో తేడాలుండి.. ఆ తేడాల వల్ల శ్లాబులు మారే అవకాశం ఉంటే ఏదైనా ఆలోచన చేయడానికి అవకాశం ఉంటుంది.

ఒకరు జీరో.. ఒకరు 10 శాతం
ఒకరు 10 శాతం.. ఒకరు 20 శాతం
ఒకరు 20 శాతం.. ఒకరు 30 శాతం..

ఎక్కువ శ్లాబులో ఉన్నవారైతే కంపల్సరీగా సేవింగ్స్ ఉంటాయి. పీఎఫ్ మొదలైనవి నిర్దిష్టంగా.. అంటే మీ ప్లానింగ్‌తో నిమిత్తం లేకుండా ఉంటాయి. అవి విధిగా చెల్లించవలసిందే. ఎక్కువ శ్లాబులో ఉన్నా వీలున్నంత వరకు సేవ్ చేసి మినహాయింపులు పొందండి. తక్కువ/చిన్న శ్లాబులో కంపల్సరీ సేవింగ్స్‌ని దాటి వెళ్లొద్దు.

సొంత ఇల్లు ఉండి.. దాని మీద రుణం.. వడ్డీ ఉంటే.. ఎక్కువ శ్లాబున్న వారి అకౌంట్లో పేమెంట్లు జరగాలి. క్లెయిమ్ చేసే వారి బ్యాంకు అకౌంట్లోనే డెబిట్లు (ఈఎంఐలు) ఉండాలి. దస్తావేజుల్లో ఇద్దరి పేర్లు ఉంటే సమానంగా క్లెయిమ్ చేయండి. ఒక్కరి పేరే ఉంటే ఆ ఒక్కరే క్లెయిమ్ చేయండి.

ఈ మేరకు, కాగితాలు, ప్లాన్లు సబ్మిట్ చేసినప్పటి నుంచి అప్రూవల్, బ్యాంకు పేమెంట్లు, బిల్లులు, ఒప్పందాలు, రశీదులు, రిజిస్ట్రేషన్ అన్నింటి వరకు అలాగే ఉండేలా జాగ్రత్తపడండి. అలాగే రుణ సౌకర్యంతో కట్టించిన ఇంటి మీద ఆదాయం, వచ్చిన అద్దె సమానంగా అకౌంటు చేయండి. ఒకవేళ అద్దె ఇంట్లో ఉంటే ఎవరో ఒకరు, ఎక్కువ శ్లాబులో ఉన్నవారు, ఇంటద్దె అలవెన్స్ మినహాయింపు పొందండి. ఇద్దరూ విడివిడిగా ఒకే ఊరిలో ఉద్యోగం ఉంటే క్లెయిమ్ చేయకండి. వేరు వేరు ప్రాంతాల్లో ఉంటే ఎటువంటి తప్పు లేదు. ప్లానింగ్ వల్ల నాలుగు రూపాయలు మిగులుతాయి అని అనుకోకుండా మీకు మన శ్శాంతి ఉండేలా ఉండండి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

మిడ్‌క్యాప్‌లో మెరుగైన రాబడులు

హెచ్ఎస్‌బీసీ మిడ్‌క్యాప్ ఫండ్



ఈక్విటీల్లో స్మాల్‌క్యాప్ కంటే మిడ్‌క్యాప్, లార్జ్‌క్యాప్ విభాగంలో ఆటుపోట్లు కాస్త తక్కువగా ఉంటాయి. స్మాల్‌క్యాప్‌లో రాబడులతోపాటు అస్థిరతలు కూడా ఎక్కువే. అందుకే పెట్టుబడుల్లో కేవలం స్మాల్‌క్యాప్ ఒక్కటే కాకుండా లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్ విభాగాల్లోనూ ఇన్వెస్ట్ చేసుకోవడం ద్వారా రిస్క్‌ను వైవిధ్యం చేసుకోవాలని నిపుణులు సూచిస్తుంటారు. మిడ్‌క్యాప్ విభాగంతోపాటు లార్జ్‌క్యాప్‌లోనూ పెట్టుబడులకు అవకాశం కల్పిస్తూ, మెరుగైన రాబడుల చరిత్ర కలిగిన పథకాల్లో హెచ్ఎస్‌బీసీ మిడ్‌క్యాప్ ఫండ్ ఒకటి. దీర్ఘకాల లక్ష్యాల కోసం ఇన్వెస్ట్ చేసే వారు ఈ పథకాన్ని పరిశీలించొచ్చు.

రాబడులు



ఈ పథకం గడిచిన ఏడాది కాలంలో ఇన్వెస్టర్లకు 44 శాతం రాబడులు తెచ్చిపెట్టింది. కానీ, ఈక్విటీ మిడ్‌క్యాప్ విభాగం సగటు రాబడి ఇదే కాలంలో 31.59 శాతంగానే ఉంది. మూడేళ్లలో 26.67 శాతం చొప్పున వార్షిక ప్రతిఫలాన్ని అందించగా, ఇదే కాలంలో మిడ్‌క్యాప్ విభాగం సగటు రాబడి 23.64 శాతంగా ఉండడాన్ని గమనించొచ్చు. ఇక ఐదేళ్లలో 25.40 శాతం, ఏడేళ్లలో ఏటా 15.33 శాతం, పదేళ్లలో ఏటా 17.69 శాతం వార్షిక రాబడులను అందించిన చరిత్ర ఈ పథకానికి ఉంది. మిడ్‌క్యాప్ విభాగం సగటు రాబడుల కంటే అధిక ప్రతిఫలాన్ని అందించింది. 2004 ఆగస్ట్‌లో ఈ పథకం మొదలు కాగా, నాటి నుంచి చూస్తే వార్షిక పెట్టుబడుల వృద్ధి 19.90 శాతంగా ఉంది. గతంలో ఎల్‌అండ్‌టీ మిడ్‌క్యాప్‌ఫండ్‌గా ఇది కొనసాగింది. హెచ్ఎస్‌బీసీ కొనుగోలు తర్వాత పథకం పేరు మారింది.

పెట్టుబడుల విధానం/పోర్ట్‌ఫోలియో

మిడ్‌క్యాప్ ఫండ్ అయినప్పటికీ తన మొత్తం నిర్వహణ ఆస్తుల్లో అధిక శాతాన్ని లార్జ్‌క్యాప్‌లోనే ఇన్వెస్ట్ చేయడం గమనార్హం. రిస్క్ తగ్గించడం, రాబడులను పెంచడం అనే వ్యూహంలో భాగంగా లార్జ్, మిడ్‌క్యాప్ విభాగాల మధ్య పెట్టుబడుల్లో ఫండ్ మేనేజర్లు మార్పులు చేర్పులు చేస్తుంటారు. ప్రస్తుతం మిడ్‌క్యాప్‌తో పోల్చితే లార్జ్‌క్యాప్ వ్యాల్యూయేషన్లు ఆకర్షణీయంగా ఉండడాన్ని గమనించొచ్చు. ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం 11,912 కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఇందులో 98.31 శాతం మేర ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసింది. 1.7 శాతం నగదు, నగదు సమానాల్లో ఉన్నాయి. ఈక్విటీ పెట్టుబడుల్లో 67 శాతం లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఉన్నాయి. మిడ్‌క్యాప్ కంపెనీల్లో 32.68 శాతం ఇన్వెస్ట్ చేసింది. స్మాల్‌క్యాప్‌లో కేవలం 0.46 శాతమే పెట్టుబడులు ఉండడం గమనించొచ్చు. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 72 స్టాక్స్ ఉన్నాయి. ఇందులో టాప్ 10 స్టాక్స్‌లోనే 37 శాతం పెట్టుబడులు పెట్టింది. కనీసం రూ.500 మొత్తంతో ఈ పథకంలో సిప్ మొదలు పెట్టుకోవచ్చు. పోర్ట్‌ఫోలియోని గమనిస్తే.. ఇండస్ట్రియల్స్ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. మొత్తం పెట్టుబడుల్లో 34 శాతం ఈ రంగానికి చెందిన కంపెనీల్లోనే ఉన్నాయి. ఆ తర్వాత బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు 18 శాతం, కన్జ్యూమర్ డిస్క్రిషినరీ కంపెనీలకు 12.53 శాతం, టెక్నాలజీ రంగ కంపెనీలకు 9.37 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
సుజ్లాన్ ఎనర్జీ	4.78
సీజీ పవర్	4.64
డిక్సన్ టెక్నాలజీస్	4.04
పీబీ ఫిన్‌టెక్	3.74
ట్రెంట్	3.62
జొమాటో	3.55
జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ	3.46
హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ	3.40
కమిన్స్ ఇండియా	2.84
మ్యాక్స్ హెల్త్‌కేర్	2.75

మహిళల క్రికెట్‌లో రైజింగ్ స్టార్

నిలకడగా రాణిస్తున్న తెలంగాణ అమ్మాయి గొంగడి త్రిష



ఆసియా కప్ 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్' పురస్కారంతో త్రిష

బ్యాటింగ్‌లో నిలకడ, షాట్లలో కచ్చితత్వం, క్రీజులో నిలిస్తే చక్కని ఇన్నింగ్స్‌లు ఆడగలిగే నేర్పరితనం... ఇవన్నీ ఆ అమ్మాయి సొంతం. మిథాలీ రాజ్ తర్వాత జాతీయ సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించే సత్తా తనలో ఉందని ఆటద్వారా చాటి చెప్పుకుంటున్న టీనేజ్ సెన్సేషన్ గొంగడి త్రిష. తెలంగాణకు చెందిన 19 ఏళ్ల త్రిష ఆదివారం మలేసియాలో ముగిసిన ఆసియా అండర్–19 టోర్నీలో భారత జట్టు విజేతగా నిలిచేందుకు కీలకపాత్ర పోషించింది. 2023లో అండర్–19 మహిళల టి20 ప్రపంచకప్ సాధించిన భారత జట్టులో సభ్యురాలిగా ఉన్న త్రిష దురదృష్టవశాత్తూ మహిళల ప్రీమియర్ లీగ్ ఫ్రాంచైజీల కంటబడటం లేదు. గతేడాది ఆమెను మెగా వేలంలో ఎవరూ పట్టించుకోలేదు. మొన్న మినీ వేలంలోనూ విస్మరించారు. అయినా... త్రిష నిరాశలో కూరుకుపోలేదు. తనపని తాను చేసుకుపోతోంది. రైజింగ్ స్టార్‌గా ఎదుగుతున్న త్రిష హైదరాబాద్ నుంచి మరో మిథాలీ రాజ్ కావాలని ఆశిద్దాం.

– సాక్షి క్రీడా విభాగం

దొరై రాజ్ (మిథాలీ రాజ్), హర్మేందర్ సింగ్ భుల్లర్ (హర్మన్‌ప్రీత్ కౌర్), శ్రీనివాస్ మంధాన (స్మృతి), ఇవాన్ రోడ్రిగ్స్ (జెమీమా), సంజీవ్ వర్మ (షఫాలీ వర్మ) వీరంతా తమ గారాల తనయల కోసం తపించారు. భారత్ క్రికెట్‌లో భాగమయ్యేందుకు కుమార్తెలతో పాటు కలలు కని శ్రమించి సాధించారు. వీరిలాగే తెలంగాణకు చెందిన గొంగడి రామిరెడ్డి కూడా తన ఒక్కగానొక్క బిడ్డ (త్రిష) కోసం పుట్టిన గడ్డ (భద్రాచలం)ను వీడి హైదరాబాద్ వచ్చారు. క్రికెట్లో ఓనమాలు మొదలు అకాడమీలో శిక్షణ కోసం తన స్తోమతకు మించే ఖర్చు చేశారు. తండ్రి కష్టం చూసిన తనయ త్రిష ఆ కళ్లలో ఆనందం నింపాలని నెట్స్‌లో సాధన చేసింది. క్రికెట్‌లో రాటుదేలింది. మైదానంలో రాణిస్తోంది. తాజాగా కౌలాలంపూర్‌లో బంగ్లాదేశ్‌తో ఆదివారం జరిగిన ఆసియా అండర్–19 మహిళల టి20 టోర్నీ ఫైనల్లో త్రిష (47 బంతుల్లో 52; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో అదరగొట్టి భారత జట్టును విజేతగా నిలిపింది. అంతేకాకుండా 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్'తో పాటు 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డులు సొంతం చేసుకుంది. గతేడాది దక్షిణాఫ్రికాలో జరిగిన అండర్–19 మహిళల తొలి టి20 ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన భారత జట్టులోనూ త్రిష సభ్యురాలిగా ఉంది. భద్రాచలంలో ఓ ఫిట్‌నెస్ ట్రెయినర్‌గా పనిచేసే రామిరెడ్డి తన కుమార్తెను అంతర్జాతీయ క్రికెటర్‌గా చూడాలనుకున్నారు. అందుకు భద్రాచలంలో ఉంటే సరిపోదని గుర్తించిన వెంటనే 2013లో సికింద్రాబాద్‌లోని ఈస్ట్ మారేడ్‌పల్లికి మకాం మార్చారు. అక్కడ్నుంచి కోచింగ్ సెంటర్‌కు తీసుకెళ్లడం... ఆమె ఆటపై పట్టుదల కనబరచడం, క్రమంగా ప్రతిభగల క్రికెటర్‌గా మారడం సజావుగా జరిగిపోయాయి. కానీ ఎన్నో ఆశలు పెట్టుకున్న డబ్ల్యూపీఎల్ వేలమే ఆ తండ్రిని కాస్త నిరాశపరిచింది. క్రితంసారి మెగా వేలంలో అన్‌సోల్డ్ క్రికెటర్‌గా మిగిలిపోవడం... ఇటీవల జరిగిన మినీ వేలంలోనూ ఫ్రాంచైజీలు త్రిషను మరోసారి విస్మరించడంతో నిరుత్సాహం కలిగింది. అయితే త్రిష నిలకడగా ఆడుతున్న తీరును బట్టి భవిష్యత్‌లో ఆమెపై ఫ్రాంచైజీలు తప్పకుండా దృష్టి సారిస్తాయనడంలో సందేహం లేదు.

హైదరాబాద్‌లోని సెయింట్ జాన్స్ క్రికెట్ అకాడమీలో క్రికెట్‌లో ఓనమాలు నేర్చుకున్న ఆమె అచిర కాలంలోనే పిన్న వయసులో తెలంగాణ రాష్ట్ర అండర్–19 జట్టు తరఫున స్కూల్ గేమ్స్ సమాఖ్య పోటీల్లో రాణించిన ఆమె కీలక బ్యాటింగ్ ఆల్‌రౌండర్‌గా రాణించింది. 2014–15 సీజన్‌లో హైదరాబాద్ అండర్–19 తరఫున ఇంటర్ స్టేట్ టోర్నమెంట్‌లో పాల్గొంది. అక్కడి నుంచి హైదరాబాద్, సౌత్‌జోన్ అండర్–19 జట్లలో రెగ్యులర్ ప్లేయర్‌గా మారింది. గత రెండేళ్లుగా భారత అండర్–19 జట్టులో ఓపెనర్‌గా రాణిస్తోంది. టాపార్డర్ బ్యాటర్ అయిన త్రిష లెగ్‌స్పిన్ బౌలర్ కూడా! క్రమం తప్పకుడా బౌలింగ్ కూడా వేస్తుంది. ఆదివారం బంగ్లాదేశ్‌తో జరిగిన తుదిపోరులో వికెట్ తీయకపోయినా (3-0-10-0)తో కుదురుగా బౌలింగ్ చేసింది.

అమెరికా అండర్–19 క్రికెట్ జట్టు కెప్టెన్ అనిక రెడ్డి

వచ్చే నెలలో టి20 ప్రపంచకప్



బ్రూమ్‌ఫీల్డ్ (కొలరాడో): వచ్చే ఏడాది జనవరిలో మలేసియా వేదికగా జరిగే మహిళల అండర్–19 ప్రపంచకప్ టి20 క్రికెట్ టోర్నీలో పాల్గొనే అమెరికా జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన అమెరికా జట్టుకు భారత సంతతికి చెందిన తెలుగమ్మాయి కొలన్ అనిక రెడ్డి కెప్టెన్‌గా వ్యవహరిస్తుంది. తెలుగు సంతతికి చెందిన పగిద్యాల చేతన రెడ్డి, ఇమ్మడి శాన్వి, సషా వల్లభనేని కూడా అమెరికా జట్టు తరఫున బరిలోకి దిగనున్నారు. వచ్చే ఏడాది జనవరి 18 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు మలేసియాలోని నాలుగు వేదికల్లో ఈ మెగా ఈవెంట్ జరుగుతుంది. మొత్తం 16 జట్లను నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. డిఫెండింగ్ చాంపియన్ భారత్, వెస్టిండీస్, శ్రీలంక, మలేసియా జట్లకు గ్రూప్ 'ఎ'లో చోటు కల్పించారు. గ్రూప్ 'బి'లో అమెరికా, ఇంగ్లండ్, పాకిస్తాన్, ఐర్లాండ్... గ్రూప్ 'సి'లో న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, నైజీరియా, సమోవా... గ్రూప్ 'డి'లో ఆ్రస్టేలియా, బంగ్లాదేశ్, నేపాల్, స్కాట్లాండ్ జట్లున్నాయి.

అమెరికా అండర్–19 జట్టు: కొలన్ అనిక రెడ్డి (కెప్టెన్), అదితిబా చుడసమ (వైస్ కెప్టెన్), పగిద్యాల చేతన రెడ్డి, చేతన ప్రసాద్, దిశ ఢింగ్రా, ఇసాని మహేశ్ వాఘేలా, లేఖ హనుమంత్ శెట్టి, మాహి మాధవన్, నిఖర్ పింకూ దోషి, పూజా గణేశ్, పూజా షా, రీతూప్రియా సింగ్, ఇమ్మడి శాన్వి, సషా వల్లభనేని, సుహాని థదాని.

విజేత అనాహత్ సింగ్



ముంబై: ఈ ఏడాది అద్భుతమైన ఫామ్‌లో ఉన్న భారత స్క్వాష్ రైజింగ్ స్టార్ అనాహత్ సింగ్ తన ఖాతాలో మరో టైటిల్‌ను జమ చేసుకుంది. ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్‌ఏ) చాలెంజర్ ఈవెంట్ అయిన వెస్టర్న్ ఇండియా స్లామ్ టోర్నీలో 16 ఏళ్ల అనాహత్ సింగ్ చాంపియన్‌గా నిలిచింది. భారత్‌కే చెందిన ఆకాంక్ష సాలుంఖెతో జరిగిన తుది పోరులో అనాహత్ 11–8, 11–8, 11–8తో విజయం సాధించింది. ఈ సీజన్‌లో అనాహత్‌కిది తొమ్మిదో సింగిల్స్ టైటిల్ కావడం విశేషం. పురుషుల సింగిల్స్ విభాగంలో మలేసియాకు చెందిన అమీషెన్‌రాజ్ చందరన్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో చందరన్ 15–13, 6–11, 11–5, 11–3తో విక్టర్ బైర్‌టుస్ (చెక్ రిపబ్లిక్)పై గెలుపొందాడు.

సెమీస్‌లో రష్మిక జోడీ ఓటమి



నవీ ముంబై: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల డబ్ల్యూ50 టోర్నమెంట్‌లో హైదరాబాద్ క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక పోరాటం ముగిసింది. డబుల్స్ విభాగం సెమీఫైనల్లో రష్మిక (భారత్)–జిబెక్ కులమ్‌బయేవా (కజకిస్తాన్) ద్వయం 3–6, 6–3, 5–10తో భారత్‌కే చెందిన రియా భాటియా–జీల్ దేశాయ్ జోడీ చేతిలో పోరాడి ఓడిపోయింది. 83 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక, జిబెక్ రెండు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను మూడు సార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. అయితే నిర్ణాయక 'సూపర్ టైబ్రేక్'లో రష్మిక, జిబెక్ కీలకదశలో తడబడి మూల్యం చెల్లించుకున్నారు.

శ్రియాంశి సంచలనం

డిఫెండింగ్ చాంపియన్ అన్‌మోల్‌పై విజయం ● మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్లో రుత్విక–రోహన్ జోడీ



శ్రియాంశి



బెంగళూరు: జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఆదివారం సంచలనం నమోదైంది. మహిళల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ అన్‌మోల్ ఖరబ్ (హరియాణా) కథ ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. తెలంగాణకు చెందిన శ్రియాంశి వలిశెట్టి అద్భుత ఆటతీరుతో అన్‌మోల్‌ను బోల్తా కొట్టించింది. ఏకపక్షంగా జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో 12వ సీడ్ శ్రియాంశి 21–12, 21–15తో అన్‌మోల్‌ను ఓడించింది. అనంతరం క్వార్టర్ ఫైనల్లో శ్రియాంశి 21–13, 21–14తో సాక్షి ఫొగాట్ (రాజస్తాన్)పై గెలిచి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మహిళల సింగిల్స్ విభాగంలో టాప్–10 సీడింగ్స్ ఎవరూ సెమీఫైనల్‌కు చేరుకోలేకపోయారు. క్వార్టర్ ఫైనల్స్‌లో 16వ సీడ్ తస్నీమ్ మీర్ (గుజరాత్) 21–16, 21–18తో ఏడో సీడ్ ఇషారాణి బారువా (అస్సాం)పై, ఆదర్శిణి శ్రీ (తమిళనాడు) 23–21, 21–12తో శ్రేయా లెలె (గుజరాత్)పై, 13వ సీడ్ దేవిక సిహాగ్ (హరియాణా) 17–21, 21–19, 21–16తో రుజుల రాము (కర్ణాటక)పై నెగ్గారు. నేడు జరిగే సెమీఫైనల్స్‌లో తస్నీమ్ మీర్‌తో శ్రియాంశి; దేవికతో ఆదర్శిణి తలపడతారు.

మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (పీఎస్‌పీబీ)కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి గద్దె రుత్విక శివాని సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. రుత్విక శివాని (పీఎస్‌పీబీ)–రోహన్ కపూర్ (ఢిల్లీ) ద్వయం క్వార్టర్ ఫైనల్లో 21–16, 19–21, 21–14తో టాప్ సీడ్ సతీశ్ కుమార్–ఆద్యా వరియత్ (తమిళనాడు) జోడీని కంగుతినిపించింది. పురుషుల సింగిల్స్ విభాగంలో కె. సతీశ్ కుమార్ (తమిళనాడు), ఎం.రఘు (కర్ణాటక), మిథున్ మంజునాథ్ (రైల్వేస్), రౌనక్ చౌహాన్ (ఛత్తీస్‌గఢ్) సెమీఫైనల్లోకి ప్రవేశించారు.

రూట్ పునరాగమనం

భారత్‌తో వన్డే సిరీస్, చాంపియన్స్ ట్రోఫీ కోసం ఇంగ్లండ్ జట్టు ప్రకటన ● గాయంతో స్టోక్స్ దూరం

లండన్: చివరిసారి భారత్ వేదికగా 2023లో జరిగిన ప్రపంచకప్‌లో ఆడిన ఇంగ్లండ్ సీనియర్ స్టార్ క్రికెటర్ జో రూట్ మళ్లీ వన్డే జట్టులోకి వచ్చాడు. వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరిలలో భారత్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో... ఆ తర్వాత పాకిస్తాన్‌లో జరిగే చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే ఇంగ్లండ్ జట్టును ఆదివారం ప్రకటించారు. భారత్‌తో వన్డే సిరీస్‌కు ముందు జరిగే ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో పోటీపడే ఇంగ్లండ్ జట్టును కూడా ఎంపిక చేశారు. ఈ రెండు ఫార్మాట్‌లలో ఇంగ్లండ్ జట్టుకు వికెట్ కీపర్ జోస్ బట్లర్ నాయకత్వం వహిస్తాడు. టెస్టు ఫార్మాట్‌లో ఈ ఏడాదిని వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్‌తో ముగించనున్న రూట్ చివరి వన్డే 2023 ప్రపంచకప్‌లో ఆడాడు. 33 ఏళ్ల రూట్ ఇప్పటి వరకు 171 వన్డేలు ఆడి 6522 పరుగులు సాధించాడు. ఇందులో 16 సెంచరీలు, 39 అర్ధ సెంచరీలు ఉన్నాయి. పార్ట్‌టైమ్ ఆఫ్ స్పిన్ వేసే రూట్ వన్డేల్లో 27 వికెట్లు కూడా పడగొట్టాడు. మరోవైపు ఇంగ్లండ్ టెస్టు జట్టు కెప్టెన్, ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ భారత్‌తో జరిగే సిరీస్‌కు, చాంపియన్స్ ట్రోఫీకి దూరం కానున్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్ సందర్భంగా స్టోక్స్‌కు తొడ కండరాల గాయం తిరగబెట్టింది. ప్రస్తుతం స్టోక్స్ ఈ గాయం నుంచి కోలుకుంటున్నాడు. ఫలితంగా అతని పేరును సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకోలేదు.

ఇంగ్లండ్ వన్డే జట్టు: జోస్ బట్లర్ (కెప్టెన్), జోఫ్రా ఆర్చర్, అట్కిన్సన్, జేకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, బ్రైడన్ కార్స్, బెన్ డకెట్, జేమీ ఓవర్టన్, జేమీ స్మిత్, లివింగ్‌స్టోన్, ఆదిల్ రషీద్, జో రూట్, సాకిబ్ మహమూద్, ఫిల్ సాల్ట్, మార్క్ వుడ్

ఇంగ్లండ్ టి20 జట్టు: జోస్ బట్లర్ (కెప్టెన్), రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, అట్కిన్సన్, జేకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, బ్రైడన్ కార్స్, బెన్ డకెట్, జేమీ ఓవర్టన్, జేమీ స్మిత్, లివింగ్‌స్టోన్, ఆదిల్ రషీద్, సాకిబ్ మహమూద్, ఫిల్ సాల్ట్, మార్క్ వుడ్.

భారత్–ఇంగ్లండ్ టి20 సిరీస్ షెడ్యూల్

జనవరి 22: తొలి టి20 (కోల్‌కతాలో)
జనవరి 25: రెండో టి20 (చెన్నైలో)
జనవరి 28: మూడో టి20 (రాజ్‌కోట్‌లో)
జనవరి 31: నాలుగో టి20 (పుణేలో)
ఫిబ్రవరి 2: ఐదో టి20 (ముంబైలో)

భారత్–ఇంగ్లండ్ వన్డే సిరీస్ షెడ్యూల్

ఫిబ్రవరి 6: తొలి వన్డే (నాగ్‌పూర్‌లో)
ఫిబ్రవరి 9: రెండో వన్డే (కటక్‌లో)
ఫిబ్రవరి 12: మూడో వన్డే (అహ్మదాబాద్‌లో)



రోహిత్‌కు గాయం



మెల్‌బోర్న్: భారత కెప్టెన్ రోహిత్ శర్మ గాయపడ్డాడు. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో నెట్ సెషన్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తుండగా త్రోడౌన్ స్పెషలిస్ట్ విసిరిన బంతి అతని ఎడమ మోకాలికి బలంగా తగిలింది. దీంతో అతను ప్రాక్టీస్ ఆపేశాడు. అయితే గాయం తీవ్రతపై స్పష్టమైన సమాచారం లేదు. కానీ పేసర్ ఆకాశ్‌దీప్ మాత్రం తమ కెప్టెన్ బాగానే ఉన్నట్లు చెప్పాడు. సోమవారం టీమిండియాకు ప్రాక్టీస్ సెషన్ లేదు. కాబట్టి రోహిత్ కోలుకునేందుకు ఈ సమయం చాలని జట్టు వర్గాలు తెలిపాయి. 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లో భాగంగా నాలుగో టెస్టు ఈనెల 26న మొదలవుతుంది.



హరియాణా స్టీలర్స్ 'టాప్'

పుణే: ప్రొ కబడ్డీ లీగ్ పదకొండో సీజన్ లీగ్ దశలో హరియాణా స్టీలర్స్ జట్టు అగ్రస్థానాన్ని ఖరారు చేసుకుంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 47–30 పాయింట్లతో మాజీ చాంపియన్ యు ముంబా జట్టును ఓడించింది. హరియాణా తరఫున శివమ్ పటారె అత్యధికంగా 14 పాయింట్లు స్కోరు చేశాడు. మొహమ్మద్ రెజా, వినయ్ 6 పాయింట్ల చొప్పున సాధించగా... రాహుల్ 5 పాయింట్లు సంపాదించాడు. యు ముంబా తరఫు సతీశ్ కన్నన్ 9 పాయింట్లతో ఆకట్టుకున్నాడు. 22 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న హరియాణా జట్టు 16 మ్యాచ్‌ల్లో గెలిచింది. ఆరు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఓవరాల్‌గా 84 పాయింట్లతో టాప్ ర్యాంక్‌ను ఖరారు చేసుకుంది. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 42–32 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది. తలైవాస్ తరఫున హిమాన్షు 13 పాయింట్లు సాధించాడు. బెంగళూరు బుల్స్ రెయిడర్ సుశీల్ 15 పాయింట్లతో మెరిసినా తన జట్టును గెలిపించుకోవడంలో విఫలమయ్యాడు. నేడు జరిగే రెండు మ్యాచ్‌ల్లో గుజరాత్ జెయింట్స్‌తో దబంగ్ ఢిల్లీ (రాత్రి 8 గంటల నుంచి); పుణేరి పల్టన్‌తో తమిళ్ తలైవాస్ (రాత్రి 9 గంటల నుంచి) తలపడతాయి. ఇప్పటికే హరియాణా స్టీలర్స్, పట్నా పైరేట్స్, దబంగ్ ఢిల్లీ, యూపీ యోధాస్, జైపూర్ పింక్ పాంథర్స్ 'ప్లే ఆఫ్స్' బెర్త్‌లను ఖరారు చేసుకున్నాయి. చివరిదైన ఆరో బెర్త్ కోసం యు ముంబా, తెలుగు టైటాన్స్ జట్లు రేసులో ఉన్నాయి. బెంగాల్ వారియర్స్‌తో మంగళవారం జరిగే మ్యాచ్‌లో యు ముంబా గెలిస్తే 'ప్లే ఆఫ్స్' బెర్త్‌ను దక్కించుకుంటుంది.




ఎదురులేని కేరళ

సాక్షి, హైదరాబాద్: సంతోష్ ట్రోఫీ జాతీయ సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో కేరళ జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. డెక్కన్ ఎరీనాలో ఆదివారం జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో కేరళ 3–0 గోల్స్ తేడాతో ఢిల్లీ జట్టుపై గెలిచింది. కేరళ తరఫున నసీబ్ రెహమాన్ (16వ నిమిషంలో), జోసెఫ్ జస్టిన్ (32వ నిమిషంలో), షిజిన్ (40వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన కేరళ 12 పాయింట్లతో గ్రూప్ 'బి'లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. తమిళనాడు, ఒడిశా జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్ 1–1తో 'డ్రా'గా ముగిసింది. మేఘాలయ జట్టు 1–0తో గోవా జట్టును బోల్తా కొట్టించింది.



చుట్టూ ఆల్ప్స్ పర్వతాలు, 16వ శతాబ్దం నాటి కట్టడాలతో జానపద కథల్లోని క్రిస్మస్ సంబరాలకు ప్రతీకగా కనిపిస్తున్న ఇది ఆస్ట్రియాలోని హాల్‌స్టాట్ పట్టణంలోని ఓ ప్రాంతం. ప్రఖ్యాత హాలిడే డెస్టినేషన్ కూడా. క్రిస్మస్ సంబరాలకు ఇలా రెడీ అవుతోంది.



ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోవడంతో గడ్డకట్టుకుపోయిన జలపాతం వద్ద ఫొటోలకు పోజిస్తున్న ఓ పర్యాటకుడు. ఉత్తరాఖండ్ రాష్ట్రం చమోలీ జిల్లాలోని మారుమూల నీతీ వ్యాలీలో ఆదివారం కనిపించిన దృశ్యమిది.



రష్యా రాజధాని మాస్కోలో 1961లో నిర్మించిన బంకర్ ఇది. అణు బాంబు దాడిని సైతం తట్టుకునేలా ఒకప్పటి సోవియెట్ యూనియన్ కాలంలో భూమికి 141 అడుగుల లోతులో నిర్మించారు. ఇన్నాళ్లు రహస్యంగా ఉంచిన ఈ బంకర్‌లోకి తాజాగా పర్యాటకులను అనుమతిస్తున్నారు.

కాంగోలో పడవ మునక..

38 మంది మృతి, 100 మంది గల్లంతు

కిన్షాసా: ఆఫ్రికా దేశం కాంగోలో పడవ మునిగిన ఘటనలో కనీసం 38 మంది జల సమాధి కాగా, మరో 100 మంది గల్లంతయ్యారు. ఘటన సమయంలో పడవలో కనీసం 400 మంది ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు అంటున్నారు. దాదాపు 20 మందిని కాపాడినట్లు సమాచారం. సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ప్రయాణికుల్లో ఎక్కు వ మంది క్రిస్మస్ పండగ జరుపుకునేందుకు సొంతూళ్లకు వస్తున్న వారేనని సమాచారం. ఈశాన్య ప్రాంత ఇన్‌గెండె తీరం నుంచి బయలుదేరిన పడవ లూలా మీదుగా బొయెండె వైపు వెళుతోందని సామర్థ్యానికి మించి జనం ప్రయాణిస్తుండటమే ఈ విషాదానికి కారణమని చెబుతున్నారు. ఇదే ప్రాంతంలో నాలుగు రోజుల క్రితం చోటుచేసుకున్న పడవ మునక ఘటనలో 25 మంది ప్రాణాలు కోల్పోవడం గమనార్హం. ఈ ఏడాది జూన్, అక్టోబర్‌ల్లో చోటుచేసుకున్న పడవ మునక ఘటనల్లో 160 మంది చనిపోయారు. రోడ్డు రవాణా భారంగా మారడంతో మారుమూల ప్రాంతాల ప్రజలు ఎక్కువగా జల రవాణాపైనా ఆధారపడుతుంటారు. తీవ్రవాదులు, భద్రతా బలగాలు తరచూ జరిగే ఘర్షణల సమయంలో రహదారులను నిర్బంధిస్తుండటం మరో కారణం.

నైజీరియాలో తొక్కిసలాటలు 32 మంది దుర్మరణం

అబుజా: నైజీరియాలో క్రిస్మస్ సందర్భంగా చేపట్టిన ఆహార పంపిణీలో చోటుచేసుకున్న తీవ్ర తొక్కిసలాట ఘటనల్లో మొత్తం 32 మంది చనిపోయారు. అనంబ్రా రాష్ట్రం ఒకజా పట్టణంలో శనివారం ఓ దాత ఆహార పదార్థాల ఉచిత పంపిణీ చేపట్టారు. వీటి కోసం జనం ఎగబడటం తొక్కిసలాటకు దారి తీసింది. ఈ ఘటనలో 22 మంది ప్రాణాలు కోల్పోయారు. అదేవిధంగా, రాజధాని అబుజాలో ఓ చర్చి కూడా ఇలాంటి బహుమతుల పంపిణీ చేపట్టింది. స్థానికులు ఆదివారం వేకువజామున 4 గంటల సమయానికే అక్కడ గుమికూడారు. ఓ గేటు వద్ద చోటుచేసుకున్న తోపులాటలో కనీసం 10 మంది చనిపోయారని పోలీసులు తెలిపారు.

చిట్టడవిలో చిన్నారులు

స్కూల్ తరఫున టూర్‌కు వెళ్లి అడవిలో చిక్కుకుపోయిన 130 మంది విద్యార్థులు

యూపీలోని కటార్నియా ఘాట్ అడవిలో ఘటన

బహ్రెయిచ్(యూపీ): ప్రకృతి రమణీయతను ఆస్వాదించేందుకు ఎంతో హుషారుగా బయల్దేరిన 130 మంది పాఠశాల విద్యార్థులు చిట్టచివరకు ప్రాణాలను అరచేతిలో పట్టుకుని గజగజ వణికే చలిలో చిమ్మచీకట్లో గడపారు. పెద్దపులులు, చిరుతలు, ఏనుగులు సంచరించే అడవిలో విద్యార్థులు చిక్కుకుపోయారన్న విషయం తెల్సి పోలీసు, జిల్లా యంత్రాంగం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. విషయం తెలియగానే పోలీసులు, అటవీ సిబ్బంది హుటాహుటిన చిన్నారులు చిక్కుకుపోయిన ప్రాంతానికి చేరుకుని వారికి ధైర్యం చెప్పారు. సురక్షితంగా తిరిగి పంపించారు. వన్యప్రాణులు సంచరించే అడవిలో జరిగిన ఈ అనూహ్య ఘటన ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లో పెద్ద చర్చనీయంశమైంది. ఇంతమంది విద్యార్థులను తీసుకెళ్లిన స్కూలు యాజమాన్యం నిర్లక్ష్య, మొండి వైఖరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఘటన వివరాలను జంగ్ హిందుస్తానీ అనే సామాజిక కార్యకర్త బహిర్గతంచేశారు.

అసలేం జరిగింది?

14 నుంచి 18 ఏళ్ల వయస్సున్న 130 మంది విద్యార్థుల బృందం ఒక ఎడ్యుకేషన్ టూర్‌ను ముగించుకుని మార్గమధ్యంలో అటవీ అందాలను చూసేందుకు నేపాల్ సరిహద్దు ప్రాంతాలకు బయల్దేరింది. 130 మంది విద్యార్థులు, స్కూల్ సిబ్బంది సహా మొత్తంగా 155 మంది వేర్వేరు బస్సుల్లో బయల్దేరారు. గోండా జిల్లాలోని ధనేపూర్‌లోని న్యూ స్టాండర్డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో చిన్నారులు ఈ ఎడ్యుకేషన్ టూర్‌కు సిద్ధమయ్యారు. ఎడ్యుకేషన్ టూర్ ముగించుకున్నాక వీళ్ల బృందం నేపాల్ సరిహద్దు దాటి ఆవలి వైపు వెళ్లేందుకు ప్రయత్నించింది. అయితే రూపాయ్‌దీహా సరిహద్దు వద్ద వీళ్లను అధికారులు ఆపేసి వెనక్కి వెళ్లాలని హెచ్చరించారు. దీంతో విద్యార్థులున్న బస్సులు నేరుగా కటార్నియా వన్యప్రాణి సంరక్షణాకేంద్రం దిశగా వెళ్లాయి. పెద్ద పులులు, చిరుతలు, ఏనుగులకు ఈ అడవీప్రాంతం పెట్టింది పేరు. ఐదు ఫారెస్ట్ చెక్‌పోస్ట్‌లను దాటుకుంటూ అంబా గ్రామందాకా వీళ్ల బస్సులు వెళ్లాయి. ఆ గ్రామం చిట్టడవిలో ఉంది. మధ్యలో వీళ్లను స్థానికులు, అటవీ అధికారులు అటుగా వెళ్లొద్దని హెచ్చరించినా స్కూల్ సిబ్బంది వినిపించుకోలేదు. తర్వాత అలాగే ముందుకెళ్లి మళ్లీ నేపాల్ సరిహద్దుకు చేరుకునే ప్రయత్నంచేశారు. అప్పటికే సాయంత్రం ఐదు దాటి చీకటి అలుముకుంది. ఈసారి కూడా అధికారులు వీళ్ల బస్సులను ముందుకు పోనివ్వలేదు.



రాత్రి రైల్వేస్టేషన్‌లో

చేసేదిలేక స్కూల్ సిబ్బంది విద్యార్థులను దగ్గర్లోని బిఛియా రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ రైల్వేస్టేషన్ అడవి మధ్యలో ఉంది. రైల్వేస్టేషన్ ఆరుబయట గజగజ వణికే చలిలో పిల్లలంతా అలాగే ఉండిపోయారు. వాళ్లకు ఎలాంటి ఆహారంలేదు. చలిని ఆపగలిగే దుస్తులుగానీ, కప్పుకోవడానికి దుప్పట్లు ఇతరత్రా ఏమీలేవు. కనీసం తాగడానికి నీరు లేదు. అక్కడ కనీస సదుపాయాలు కూడా లేవు. విషయం ఎలాగోలా జిల్లా మేజిస్ట్రేట్ మోనికా రాణి చెవిలో పడింది. వెంటనే ఆమె సబ్ డివిజన్ మేజిస్ట్రేట్ సంజయ్ కుమార్‌కు తగు ఆదేశాలిచ్చారు. వెంటనే పోలీసులు, అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. అందరికీ సరిపడా ఆహారంతో అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. చలిని తట్టుకోవడానికి వెంటనే అక్కడ భోగిమంటల్లా దుంగలు తగలబెట్టారు. చిమ్మచీకట్లో భయంతో వణికిపోతున్న పిల్లలకు ధైర్యం చెప్పారు. పిల్లలంతా భోజనాలుచేశాక బందోబస్తుగా పోలీసులు వెంటరాగా బస్సులు అన్నీ మళ్లీ తిరుగుపయనయ్యాయి. శనివారం అర్ధరాత్రికి మళ్లీ గమ్యస్థానానికి చేరుకోవడంతో కథ సుఖాంతమైంది. గిరిజనులు, అటవీ అధికారులు చెబుతున్నా వినకుండా అంతమంది చిన్నారులను అడవిలోకి ఎందుకు తీసుకెళ్లారని స్కూల్ సిబ్బందిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బాల్య వివాహాలపై అస్సాం సర్కార్ కొరడా

431 మంది అరెస్ట్

గువాహటి: బాల్య వివాహాలపై రాష్ట్ర ప్రభుత్వం మరోసారి కొరడా ఝుళిపించింది. బాల్య వివాహ ఘటనలకు సంబంధించి తాజాగా మరో 345 కేసులు నమోదుచేసి 431 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరి కొంత మందిని కటకటాల వెనక్కి నెడతామని అస్సాం అదనపు డీజీపీ గుప్తా ఆదివారం ప్రకటించారు. శనివారం రాత్రి చేపట్టిన మూడో డ్రైవ్‌లో వీళ్లందరినీ అరెస్ట్ చేశామని ఆయన పేర్కొన్నారు. సోనిత్‌పూర్, సౌత్ సల్మారా జిల్లాల్లో చిన్నారులను పెళ్లాడిన పురుషులను, వాళ్ల కుటుంబ సభ్యులు, ఇందుకు సహకరించిన వ్యక్తులను అరెస్ట్‌చేశారు. అరెస్టులపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఆదివారం 'ఎక్స్'లో స్పందించారు. ''బాల్యవివాహాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం ఆగదు. అరెస్ట్ అయిన వాళ్లను ఆదివారమే కోర్టుల్లో ప్రవేశపెట్టారు. బాల్య వివాహాల వంటి సామాజిక రుగ్మతలను రూపు మాపేందుకు కఠిన చర్యలు తీసుకుంటాం''అని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. 2023 ఫిబ్రవరిలో 4,387 కేసులు నమోదుచేసి మొత్తంగా 3,425 మందిని పోలీసులు అరెస్ట్‌చేయడం తెల్సిందే. అదే ఏడాది అక్టోబర్‌లో మరోసారి స్పెషల్ డ్రైవ్ చేపట్టి మరో 682 కేసులు నమోదుచేసి 913 మందిని అరెస్ట్ చేశారు. ధుబ్రి జిల్లాలో 59 కేసులు పెట్టి 68 మందిని అదుపులోకి తీసుకున్నారు. బాల్య వివాహాలను అరికట్టడం ద్వారా సమాజంలో సత్ఫలితాలను చూస్తున్నామని అధికారులు తెలిపారు. బాల్యవివాహాల కారణంగా చిన్నారుల చదువులు మధ్యలో ఆగట్లేవు. బాల్యవివాహం చేసుకున్న టీనేజీ అమ్మాయిలు తక్కువ వయసులో గర్భందాల్చడం, ప్రసవ సమయంలో ఆరోగ్య సమస్య కారణంగా అకాల మరణాలు తగ్గాయని అధికారులు పేర్కొన్నారు. మాతా శిశు మరణాల రేటు సైతం కిందకు దిగొచ్చిందని వెల్లడించారు. అప్పుడే ప్రసవించిన తల్లుల మరణాల రేటు 2020–21లో 984గా ఉంటే అది 2023–24లో 371కు తగ్గింది. నవజాత శిశువుల మరణాల రేటు 2020–21లో 9,472గా ఉంటే 2023–24లో అది 4,790కి దిగొచ్చిందని అదనపు డీజీపీ చెప్పారు.

సెనేట్ బరిలో లేను: ట్రంప్ కోడలు



వాషింగ్టన్: అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కోడలు లారా ట్రంప్ ఫ్లోరిడా సెనేటర్ బరి నుంచి వైదొలిగారు. ఫ్లోరిడా సెనేటర్ మార్కో రుబియోను విదేశాంగ మంత్రిగా ట్రంప్ ఎంపిక చేయడంతో ఆయన స్థానంలో లారా సెనేట్‌కు నామినేటవుతారని భావించారు. కానీ తాను పోటీలో లేనని ఆమె ఆదివారం 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. రూబియో స్థానంలో ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్‌ను ఎంపిక చేస్తారని తెలుస్తోంది. ''మా జీవితంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎన్నికల సమయంలో రిపబ్లికన్ నేషనల్ కమిటీకి కో–చైర్‌పర్సన్‌గా పనిచేయడానికి మించిన గౌరవం మరొకటి లేదు. దేశ ప్రజలతోపాటు ఫ్లోరిడా రాష్ట్రం ఇచ్చిన మద్దతుకు కృతజ్ఞతలు'' అని లారా తన పోస్టులో పేర్కొన్నారు.

కశ్మీర్‌లో చిల్లాయ్ కలాన్ షురూ

- శనివారం రాత్రి మైనస్ 8.5 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు
- శ్రీనగర్‌లో 50 ఏళ్లలో అత్యంత చల్లని డిసెంబర్ రాత్రిగా రికార్డ్



దాల్ సరస్సు వద్ద ఉన్న చెక్క వంతెనపై పేరుకుపోయిన మంచు

శ్రీనగర్: కశ్మీర్‌లో అత్యంత కఠిన శీతాకాలం చిల్లాయ్ కలాన్ శనివారం ప్రారంభమైంది. శనివారం రాత్రి మైనస్ 8.5 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఐదు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంత చల్లని డిసెంబర్ రాత్రి ఇదేనని వాతావరణ శాఖ ఆదివారం ప్రకటించింది. 1974 ఏడాది తర్వాత శ్రీనగర్‌లో ఇంతటి అత్యల్ప ఉష్ణోగ్రత నమోదవడం ఇదే తొలిసారికావడం విశేషం. 1974లో మైనస్ 10.3 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యింది. అంతకంటే తక్కువగా అంటే 1934 డిసెంబర్ 13వ తేదీన మైనస్ 12.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడం గమనార్హం. కశ్మీర్ లోయలోని ఇతర ప్రాంతాల్లోనూ కనిష్ఠ ఉష్ణోగ్రతలు గడ్డకట్టే స్థాయి కంటే తక్కువకు పడిపోయాయి. శ్రీనగర్‌లో శుక్రవారం రాత్రి మైనస్ 6.2 డిగ్రీల సెల్సియస్‌గా ఉన్న ఉష్ణోగ్రత శనివారం రాత్రి మైనస్ 8.5 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. తీవ్రమైన చలి కారణంగా ఇక్కడి ప్రసిద్ధ దాల్ సరస్సు ఉపరితలం చాలా చోట్ల గడ్డకట్టుకుపోయింది. నగరంలోని అనేక ప్రాంతాలు, లోయలోని ఇతర ప్రాంతాల్లో నీటి సరఫరా లైన్లతో సహా అనేక నీటి వనరులు గడ్డకట్టాయి. అమర్‌నాథ్ యాత్రకు బేస్ క్యాంపుల్లో ఒకటైన దక్షిణ కశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతం పహల్గామ్‌లో మైనస్ 8.6 డిగ్రీ సెల్సియస్, ప్రసిద్ధ స్కై రిసార్ట్ గుల్‌మార్గ్‌లో మైనస్ 6.2 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. పాంపోర్ పట్టణ శివార్లలోని కొనిబాల్ అనే గ్రామంలో మైనస్ 10.5 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. ఖాజీగుండ్‌లో మైనస్ 8.2 డిగ్రీలు, కుప్వారాలో మైనస్ 7.2 డిగ్రీలు, కోకర్‌నాగ్‌లో మైనస్ 5.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మొదలైన హిమపాతం

శని, ఆదివారాల్లో ఎత్తైన ప్రాంతాల్లో తేలికపాటి మంచు కురిసింది. 27 నుంచి 28 తెల్లవారుజామువరకు కొత్త సంవత్సరం నాడు కూడా మంచు కురుస్తుందని, మరికొన్ని రోజుల పాటు అక్కడక్కడా చలిగాలులు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. 'చిల్లాయ్ కలాన్'40 రోజులుపాటు ఉంటుంది. ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయి మంచు కురుస్తుంది. దీని తర్వాత 20 రోజుల 'చిల్లాయ్–ఖుర్ద్'(తక్కువ చలి) ఉంటుంది. ఆ తరువాత మరో 10 రోజులు 'చిల్లాయ్–బచ్చా'ఉంటుంది. ఈ ఏడాది జనవరి చివరికి చిల్లాయ్ కలాన్ ముగియనుంది.

రీల్ పుష్పలో రియల్ పుష్ప

థియేటర్లో పుష్ప సినిమా చూస్తూ పట్టుబడ్డ డ్రగ్ స్మగ్లర్

నాగ్‌పూర్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో పుష్ప–2 సినిమా నడుస్తున్న ఓ మల్టీప్లెక్స్‌లో నాటకీయ సన్నివేశం చోటుచేసుకుంది. సినిమా నడుస్తుండగానే ఒక్కసారిగా పోలీసులు లోపలికి ప్రవేశించడంతో జనం అవాక్కయ్యారు. ఏం జరుగుతోందో తెలియని సందిగ్ధంలో ఉండగానే ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, వచ్చినంత వేగంగా వెళ్లిపోయారు. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది. పట్టుబడిన వ్యక్తి పేరు విశాల్ మెష్రం అని, ఇతడిపై హత్య, డ్రగ్ స్మగ్లింగ్‌కు సంబంధించిన 27 కేసులున్నాయని పోలీసులు తెలిపారు. 10 నెలలుగా ఇతడు తప్పించుకు తిరుగుతున్నాడన్నారు. పుష్ప–2 సినిమా చూడాలని ఇతడు ఆసక్తి చూపిస్తున్న విషయం తెలిసి సైబర్ నిఘా, ట్రాకింగ్ సాయంతో థియేటర్ వద్ద మాటు వేసినట్లు వివరించారు. గతంలో పట్టుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపైనా దాడికి పాల్పడిన దాఖలాలుండటంతో ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. సెంట్రల్ పార్కు ప్రాంతంలో ఉన్న అతడి వాహనం టైర్లలో గాలి తీసేశారు. సినిమా క్లైమాక్స్‌లో ఉండగా పకడ్బందీగా నిర్బంధించారు!

కృత్రిమ దీవిలో కళ్లుచెదిరే ఎయిర్‌పోర్ట్

ప్రపంచంలోనే అత్యంత భారీస్థాయిలో నిర్మిస్తున్న చైనా

దలియాన్: నిర్మాణరంగంలో అగ్రరాజ్యం అమెరికాను తలదన్నేలా వినూత్న, విశిష్ట కట్టడాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే చైనా మరో ఫీట్ సాధించేందుకు వడివడిగా అడుగులేస్తోంది. తాము సృష్టించిన కృత్రిమ దీవిలో అత్యంత పెద్ద విమానాశ్రయ నిర్మాణాన్ని శరవేగంగా పూర్తిచేస్తోంది. తూర్పు తీరంలో కడుతున్న ఈ ఎయిర్‌పోర్ట్‌కు 'దలియాన్ జిన్‌జౌవూ బే అంతర్జాతీయ విమానాశ్రయం' అని నామకరణం చేసింది. ద్వీపంలో 20 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో దీనిని నిర్మిస్తున్నారు. అత్యాధునిక సకల సౌకర్యాలతో సర్వాంగ సుందరంగా నిర్మిస్తున్నారు. 9 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్యాసింజర్ టెర్మినల్‌కు తుదిరూపునిస్తున్నారు.

2035లో ప్రారంభం

మరో 11 సంవత్సరాల్లో దీని నిర్మాణం పూర్తికానుంది. 2035లో మొదలై ఏటా 8 కోట్ల మంది ప్రయాణికుల రాకపోకలను తట్టుకునే స్థాయిలో దీనిలో ఏర్పాట్లుచేస్తున్నారు. సంవత్సరానికి 5,40,000 విమానాలు రాకపోకలు సాగించేలా నాలుగు రన్‌వేలు నిర్మించి ఇతరత్రా ఏర్పాట్లు చేస్తున్నారు. ''సముద్రతలాన్ని పూడ్చేసి అందులోంచి పుట్టుకొస్తున్న ఈ ఎయిర్‌పోర్ట్ తూర్పున ఉదయిస్తున్న సూర్యుని వంటిది'' అంటూ చైనీస్ సామాజిక మాధ్యమ వేదిక 'వీచాట్'లో దలియాన్ జిన్‌జౌవూ బే అంతర్జాతీయ విమానాశ్రయం యాజమాన్యం ఒక వ్యాఖ్యానాన్ని పోస్ట్‌చేసింది. ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పూర్తయితే కృత్రిమ దీవిలో అందుబాటులోకి వచ్చిన ప్రపంచంలోనే అతిపెద్ద ఎయిర్‌పోర్ట్‌గా ఇది రికార్డులకెక్కనుంది. ప్రస్తుతం హాంకాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయం, జపాన్‌లోని కన్సాయ్ ఎయిర్‌పోర్ట్‌లు ఈ విభాగంలో అతిపెద్ద ఎయిర్‌పోర్ట్‌లుగా ఖ్యాతిపొందాయి. '' నిర్మాణరంగంలో ఇది ఒక కొత్తరకం సవాల్. పటిష్ట నిర్మాణం కోసం మిగతా నేల ప్రాంతాల్లాగా ఇక్కడ మరీ లోతుకు తవ్వకాలు చేపట్టలేం. అలా అని పైపైన కట్టేయలేం. నాణ్యత విషయంలో రాజీ పడకూడదు. నిర్దేశిత సమయంలోపు నిర్మాణం పూర్తిచేయాలి'' అని దలియాన్ ఎయిర్‌పోర్ట్ కన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్ లిమిటెడ్ చీఫ్ ఇంజనీర్ లీ జియాంగ్ వ్యాఖ్యానించారు. దలియాన్ ఝౌషుజి ఎయిర్‌పోర్ట్ ఇప్పటికే నగర అవసరాలను గరిష్టస్థాయిలో తీరుస్తోంది. దాదాపు వందేళ్లుగా సేవలందిస్తున్న ఈ ఎయిర్‌పోర్ట్ ఇక అధిక ప్రయాణికుల రద్దీని తట్టుకోలేకపోతోంది. అందుకే దీనికి సమీపంలోని సముద్రజలాల్లో కృత్రిమ దీవిని సృష్టించి దలియాన్ జిన్‌జౌవూ ఎయిర్‌పోర్ట్‌ను కొత్తగా నిర్మిస్తున్నారు.



కర్ణాటకలోని మంగళూరు శివారులో ఆదివారం నిర్వహించిన కంబాళ పోటీ సందర్భంగా ఓ వ్యక్తి తన దున్నలను బురదలో పరుగెత్తిస్తున్న దృశ్యం

బ్రిటన్‌లో అమెరికా ప్రత్యేక రాయబారిగా మార్క్



వాషింగ్టన్: రియాలిటీ షో 'ది అప్రెంటిస్'ను రూపొందించిన టెలివిజన్ దిగ్గజం మార్క్ బర్నెట్‌ను బ్రిటన్‌లో అమెరికా ప్రత్యేక రాయబారిగా ఎంపికచేస్తున్నట్లు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం ప్రకటించారు. టెలివిజన్ ప్రొడక్షన్ వ్యాపారంలో తనదైన ముద్రవేసిన మార్క్ బర్నెట్ కొత్త పాత్రకు ప్రత్యేక గౌరవం తెస్తారని ఆకాంక్షించారు. ఈ మేరకు సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ పోస్ట్ చేశారు. బర్నెట్ బాధ్యతలు సాధారణ రాయబారి కంటే భిన్నంగా ఉంటాయి. ఈ పదవికి అమెరికా పార్లమెంట్ ఎగువసభ సెనేట్ ఆమోదం అవసరం లేదు. రిపబ్లికన్ అగ్రనేత, బిలియనీర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ వారెన్ స్టీఫెన్స్‌ను బ్రిటన్‌లో అమెరికా రాయబారిగా ట్రంప్ ఇటీవల నామినేట్ చేయడం తెలిసిందే. ఎమ్మీ అవార్డు గ్రహీత అయిన బర్నెట్ లండన్‌లో జన్మించారు. 'సర్వైవర్'అనే రియాలిటీ కాంపిటీషన్ సిరీస్‌ను రూపొందించారు. తర్వాత 'షార్క్ ట్యాంక్', 'ది వాయిస్'వంటి ఇతర హిట్ షోలను నిర్మించారు. 2018 నుంచి 2022 వరకు ఎంజీఎం వరల్డ్‌వైడ్ టెలివిజన్ గ్రూప్ ఛైర్మన్‌గా పనిచేశారు. 2004 నుంచి 15 సీజన్ల పాటు ఎన్‌బీసీలో వివిధ ఫార్మాట్లలో ప్రసారమైన అమెరికన్ రియాలిటీ ప్రోగ్రామ్ 'ది అప్రెంటిస్'బర్నెట్‌కు అతిపెద్ద విజయాన్ని తెచ్చిపెట్టింది.



చైనా నిర్మిస్తున్న కృత్రిమ విమానాశ్రయమిదే

కలకత్తాలో సుప్రీంకోర్టును ఎప్పుడు ఏర్పాటు చేశారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

బ్రిటిషర్ల కాలంలో చేసిన చట్టాలు

ఆంగ్లేయులు భారతదేశానికి ప్రధానంగా వ్యాపారం కోసం వచ్చినప్పటికీ ఆ తర్వాత క్రమంగా ఇక్కడ పరిపాలనపై పట్టు సాధించారు. ఇందులో భాగంగా అనేక చట్టాలకు రూపకల్పన చేశారు. వైస్రాయ్‌లు, గవర్నర్ జనరల్స్ భారతదేశంలో వివిధ సంస్కరణలు ప్రవేశపెట్టారు. మనదేశంలో ప్రస్తుతం అమలవుతున్న అనేక చట్టాలు ఈ రూపం సంతరించుకోవడానికి బ్రిటిషర్ల కాలంనాటి విధానాలు, ఉద్యమాలు, సంస్కరణలు దోహదం చేశాయి. వీటికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను పరిశీలిద్దాం..

- మనదేశంలో స్థానిక స్వపరిపాలన చట్టాలను 1880–84లో చేశారు. లార్డ్ రిప్పన్‌ను భారతదేశంలో స్థానిక పరిపాలనా పితామహుడిగా పేర్కొంటారు.
- లార్డ్ రిప్పన్ 'ఇల్బర్టు బిల్లు'ను ప్రవేశపెట్టాడు. దీన్ని గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలిలో న్యాయశాఖ సభ్యుడైన ఇల్బర్ట్ రూపొందించాడు. దీని ద్వారా భారతీయ మెజిస్ట్రేట్లకు యూరోపియన్ నిందితులను విచారించడానికి అధికారం లభించింది.
- లార్డ్ లాన్స్‌డౌన్ గవర్నర్ జనరల్ కాలంలో 'రెండో కర్మాగారాల చట్టం' అమల్లోకి వచ్చింది.
- భారతదేశంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను 1866లో ఏర్పాటు చేశారు. దీన్ని లార్డ్ డఫ్రిన్ నెలకొల్పారు.
- 'రైతు బాంధవుడు'గా గుర్తింపు పొందిన వైస్రాయ్ లార్డ్ కర్జన్. ఇతడినే 'డూ క్విక్ వైస్రాయ్'గా పేర్కొంటారు.
- లార్డ్ కర్జన్ భారతదేశంలో ప్రత్యేక పురావస్తు శాఖను ఏర్పాటు చేశాడు. పురావస్తు శాఖ మొట్టమొదటి డైరెక్టర్ జనరల్‌గా సర్ జాన్ మార్షల్ పని చేశాడు.
- 1859లో బెంగాల్‌లో భూమిశిస్తు చట్టాన్ని ప్రవేశపెట్టారు.
- దేశభాషా పత్రికల చట్టాన్ని అమలు జరిపిన గవర్నర్ జనరల్ 'లార్డ్ లిట్టన్'.
- లార్డ్ కానింగ్ 1862లో స్వదేశీ సంస్థానాధిపతుల బ్రిటిష్ రాజప్రతినిధులను సామంతులుగా ప్రకటించాడు.
- విక్టోరియా రాణి 1877లో 'భారతదేశ చక్రవర్తి' అనే బిరుదు ధరించారు.
- 1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించింది.
- లార్డ్ కర్జన్ శాశ్వత కౌలు పద్ధతి ద్వారా నిజాం నుంచి బీరార్ ప్రాంతాన్ని వేరు చేసి బ్రిటిష్ పాలిత ప్రాంతాల్లో విలీనం చేశాడు.
- భూటాన్‌ను ఆక్రమించిన గవర్నర్ జనరల్ 'జాన్ లారెన్స్'. బ్రిటిష్ ఇండియా, భూటాన్ మధ్య జరిగిన సంధి పేరు 'సించులా'.
- లార్డ్ కర్జన్ భారత్‌లో తొలిసారిగా సీఐడీలను ప్రవేశపెట్టాడు. ఇతడు విశ్వవిద్యాలయాల చట్టాన్ని కూడా రూపొందించాడు. 1901లో బెంగాల్‌లోని 'పూసా'లో ఇంపీరియల్ అగ్రికల్చరల్ ఇన్‌స్టిట్యూట్ (వ్యవసాయ పరిశోధనా కేంద్రం) నెలకొల్పాడు.
- 1905లో బెంగాల్‌ను విభజించిన బ్రిటిష్ రాజప్రతినిధి 'లార్డ్ కర్జన్'. ఇతడి కాలంలోనే ప్రత్యేక రైల్వే బోర్డును నెలకొల్పారు.
- 1906లో అఖిల భారత ముస్లింలీగ్‌ను స్థాపించారు. ఇదే సంవత్సరం కేంద్ర వ్యవసాయ శాఖను ఏర్పాటు చేశారు.
- జాతీయ కాంగ్రెస్‌ను, ముస్లింలను సంతృప్తిపరచడానికి బ్రిటిష్ ప్రభుత్వం 1909లో మింటో మార్లే సంస్కరణల చట్టం ప్రవేశపెట్టింది. ఈ సంస్కరణలు 'విభజించు, పాలించు' విధానానికి నాంది పలికాయి.
- 1911లో హార్డింజ్ కాలంలో దేశ రాజధానిని కలకత్తా నుంచి ఢిల్లీకి మార్చారు. సుతమతి, కాళీఘట్టం, గోవిందపూర్ గ్రామాల కలయికతో కలకత్తా నగరం ఏర్పడింది.
- ఇంగ్లండ్ చక్రవర్తి అయిదో జార్జ్ భారతదేశాన్ని 1911లో సందర్శించాడు.

భారతదేశంలో 1773–1857 మధ్యకాలంలో ఈస్టిండియా కంపెనీ వ్యాపార, వ్యవహారాలను నియంత్రించడానికి బ్రిటిష్ పార్లమెంటు కొన్ని చట్టాలను రూపొందించింది. వీటినే 'చార్టర్ చట్టాలు' అంటారు.



రెగ్యులేటింగ్ చట్టం-1773

భారతదేశానికి వ్యాపార రీత్యా వచ్చిన ఈస్టిండియా కంపెనీ వ్యవహారాలను నియంత్రించడానికి బ్రిటిష్ పార్లమెంట్ చేసిన తొలి చట్టం ఇది. దీన్ని భారతదేశానికి సంబంధించి 'మొట్టమొదటి లిఖిత చట్టం'గా పేర్కొంటారు. ఈస్టిండియా కంపెనీకి ఈ చట్టం ద్వారా మొదటిసారిగా రాజకీయ, పరిపాలన అధికారాలు సంక్రమించాయి. కంపెనీ వ్యవహారాలను నియంత్రించే ఉద్దేశంతో రూపొందించడం వల్ల దీన్ని 'రెగ్యులేటింగ్ చట్టం' అంటారు. దీని ద్వారా బెంగాల్ గవర్నర్ హోదాను 'గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్'గా మార్చారు. ఇతడికి సలహాలు ఇవ్వడానికి నలుగురు సభ్యులతో కార్యనిర్వాహక మండలిని ఏర్పాటు చేశారు. 'వారన్ హేస్టింగ్స్'ను తొలి గవర్నర్ జనరల్‌గా నియమించారు.కౌన్సిల్‌లో మెజారిటీ ఆధారంగా నిర్ణయాలు తీసుకునేవారు. గవర్నర్ జనరల్‌కు కాస్టింగ్ ఓటు మాత్రమే ఉండేది. 1774లో ఒక ప్రధాన న్యాయమూర్తి, ముగ్గురు సాధారణ న్యాయమూర్తులతో కలకత్తాలో సుప్రీంకోర్టును ఏర్పాటు చేశారు. 'ఎలిజా ఇంఫే' సుప్రీంకోర్టు మొదటి ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించాడు.

పిట్స్ ఇండియా చట్టం-1784

రెగ్యులేటింగ్ చట్టంలోని లోపాలను సవరించడానికి బ్రిటిష్ పార్లమెంటు ఈ చట్టాన్ని 1784లో ఆమోదించింది. నాటి బ్రిటన్ ప్రధాని 'విలియం పిట్' ఈ చట్టాన్ని ప్రతిపాదించారు. దీని ద్వారా 'బోర్డ్ ఆఫ్ కంట్రోల్' అనే నూతన విభాగాన్ని ఏర్పాటు చేసి కంపెనీ రాజకీయ వ్యవహారాలను దానికి అప్పగించారు. అప్పటికే ఉన్న కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్‌ను వాణిజ్య వ్యవహారాలకే పరిమితం చేశారు. గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలికి ప్రెసిడెన్సీ ప్రాంతాలపై ప్రత్యక్ష నియంత్రణ అధికారాన్ని ఇచ్చారు. కార్యనిర్వాహక మండలి సభ్యుల సంఖ్యను నాలుగు నుంచి మూడుకు తగ్గించారు.

చార్టర్ చట్టం-1793

ఈ చట్టం ద్వారా గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్ అధికారాలను విస్తృతం చేశారు. కంపెనీ వ్యాపార గుత్తాధిపత్యాన్ని మరో 20 ఏళ్లకు పొడిగించారు. బోర్డు కార్యదర్శిని పార్లమెంటులో కూర్చోవడానికి అనుమతించారు. బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఉద్యోగుల జీతభత్యాల ఖర్చును భారత రెవెన్యూ నుంచి వినియోగించేవిధంగా,యుద్ధ అవసరాలకు మొత్తం రెవెన్యూను మళ్లించే విధంగా మార్పులు చేశారు.

చార్టర్ చట్టం-1813

ఈస్టిండియా కంపెనీ చార్టర్‌ను మరో 20 ఏళ్లు పొడిగించారు. భారతదేశ వర్తకంపై కంపెనీ గుత్తాధిపత్యాన్ని తొలగించి కేవలం పాలనా పరమైన సంస్థగా మార్చారు. పన్నులు విధించడం, అవి చెల్లించని వారిపై చర్యలను తీసుకునే అధికారాన్ని స్థానిక సంస్థలకు ఇచ్చారు. భారతీయులకు మత, విద్యాపరమైన అధ్యయనం కోసం లక్ష రూపాయలతో నిధి ఏర్పాటు చేశారు. సివిల్ సర్వెంట్లకు శిక్షణా సదుపాయాన్ని కల్పించారు. ఈ చట్టం ద్వారా భారత్‌లో వర్తకం చేయడానికి అందరికీ అవకాశం కల్పించారు.

చార్టర్ చట్టం-1833

ఈస్టిండియా కంపెనీ పాలనను మరో 20 ఏళ్లకు పొడిగించారు. బెంగాల్ గవర్నర్ జనరల్ హోదాను 'ఇండియన్ గవర్నర్ జనరల్'గా మార్చారు. ఈ హోదాలో భారత మొదటి గవర్నర్ జనరల్ విలియం బెంటింగ్. రాష్ట్ర ప్రభుత్వాల శాసనాధికారాలను రద్దు చేసి కార్యనిర్వాహక మండలి సమేతుడైన గవర్నర్ జనరల్‌కు పూర్తి శాసనాధికారాలు కల్పించారు. భారతీయ శాసనాలను క్రోడీకరించడానికి భారతీయ 'లా' కమిషన్‌ను నియమించారు. దీనికి తొలి అధ్యక్షుడు లార్డ్ మెకాలే.

చార్టర్ చట్టం-1853

చార్టర్ చట్టాల్లో చివరిది. అతి తక్కువ కాలం అమల్లో ఉన్న చార్టర్ చట్టం ఇదే. దీని ద్వారా కంపెనీ పాలనను పొడిగించలేదు. ఇకపై ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కాంపిటేటివ్ పరీక్షల ఆధారంగానే జరుగుతుందని నిర్దేశించారు. గవర్నర్ జనరల్ సాధారణ మండలి అధికారాలను శాసన, కార్యనిర్వాహక విధులుగా విభజించారు. శాసనాలు రూపొందించే ప్రక్రియ కోసం 'ఇండియన్ సెంట్రల్ లెజిస్లేటివ్ కౌన్సిల్'ను ఏర్పాటు చేశారు. ఇది బ్రిటిష్ పార్లమెంటులా విధులు నిర్వర్తిస్తుంది. అందువల్ల దీన్ని 'మినీ పార్లమెంట్'గా పేర్కొంటారు. కేంద్ర లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో మొదటిసారిగా స్థానిక ప్రతినిధులకు ప్రాతినిధ్యం కల్పించారు.

భారత రాజ్యాంగ చట్టం-1858

1857 సిపాయిల తిరుగుబాటుతో భారతదేశంలో కంపెనీ పాలన అంతమై చక్రవర్తి (బ్రిటిష్ రాజు/రాణి) పరిపాలన వచ్చింది. బ్రిటిష్ రాణి 1858 నవంబర్ 1న భారత పరిపాలనా అధికారాన్ని నేరుగా చేపడుతూ ఒక ప్రకటన జారీ చేశారు. గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా హోదాను వైస్రాయ్ ఆఫ్ ఇండియాగా మార్చారు. ఇతడు బ్రిటిష్ రాణి పేరుపై దేశ పాలన నిర్వహిస్తాడు. మొదటి వైస్రాయ్ చార్లెస్ కానింగ్. 'భారత రాజ్య కార్యదర్శి' అనే కొత్త పదవిని సృష్టించారు. ఇతడు బ్రిటిష్ మంత్రివర్గానికి చెందిన వ్యక్తి. అన్ని విషయాల్లో ఇతడిదే తుది నిర్ణయం. ఇతడి కార్యాలయం లండన్‌లోనే ఉండేది. ఇతడికి సహాయంగా 15 మంది సభ్యులతో సలహా మండలి ఏర్పాటు చేశారు. మొదటి కార్యదర్శి చార్లెస్ వుడ్.

కౌన్సిల్ చట్టం-1861

దీని ద్వారా గవర్నర్ జనరల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుల సంఖ్యను అయిదుకు పెంచి ఒక్కో సభ్యుడికి ఒక్కో అంశంపై అధికారం ఇచ్చారు. సెంట్రల్ లెజిస్లేటివ్ కౌన్సిల్ ఏర్పాటు చేశారు. దీనికి నామమాత్రపు అధికారాలు ఇచ్చారు. 1860లో బడ్జెట్ పద్ధతి ప్రవేశపెట్టారు.

కౌన్సిల్ చట్టం-1892

కౌన్సిల్ చట్టం–1861లోని లోపాలను సరిదిద్దడానికి ఈ చట్టం చేశారు. కేంద్ర శాసనసభలో అనధికార సభ్యుల సంఖ్య 10కి తగ్గకుండా 16 కంటే మించకుండా.. రాష్ట్ర శాసనసభల్లో 8 మందికి తక్కువ కాకుండా 20మందికి మించకుండా నియంత్రించారు. ఈ చట్టం ద్వారా శాసన మండలి అధికారాలను విస్తృతం చేశారు. బడ్జెట్‌పై చర్చించడం లాంటి అధికారాలను కల్పించారు. గవర్నర్/ గవర్నర్ జనరల్ ముందస్తు అనుమతితో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా శాసనసభల్లో ప్రభుత్వాన్ని ఉద్దేశించి ప్రశ్నలు వేయడానికి సభ్యులకు అవకాశం కల్పించారు.

మింటో-మార్లే సంస్కరణలు-1909

సెంట్రల్, స్టేట్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుల సంఖ్యను, అధికారాలను పెంచారు. తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నిక విధానం ప్రవేశపెట్టారు. ముస్లింలకు ప్రత్యేకంగా నియోజకవర్గాలను ఏర్పాటు చేశారు. వైస్రాయ్, గవర్నర్ల కార్యనిర్వాహక మండలిలో తొలిసారిగా భారతీయులకు సభ్యత్వం కల్పించారు. ఈవిధంగా సభ్యత్వాన్ని పొందిన తొలి భారతీయుడు సత్యేంద్ర ప్రసాద్ సిన్హా.

మాంటెగ్-చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు-1919

ఇవి నూతన రాజ్యాంగ సంస్కరణలకు సంబంధించినవి. రాష్ట్రాల్లో ద్వంద్వ పాలనను ప్రవేశపెట్టారు. ప్రజల ద్వారా ఎంపికైన ముఖ్యమంత్రి నాయకత్వంలోని మంత్రి మండలికి విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం మొదలైన అంశాలపై అధికారం కల్పించారు. వీటిని బదిలీ చేసిన అధికారాలుగా పేర్కొన్నారు. రెవెన్యూ, ఆర్థిక, శాంతి భద్రతలు మొదలైన అంశాలను రిజర్వ్‌డ్ అధికారాల పేరుతో బ్రిటిష్ గవర్నర్ చేతికి ఇచ్చారు. మత ప్రాతినిధ్యాన్ని సిక్కులు, క్రిస్టియన్లు, ఆంగ్లో–ఇండియన్లు, ఐరోపా వారికి కూడా వర్తింపజేశారు. దేశంలో మొదటిసారి కేంద్ర స్థాయిలో ద్విసభా పద్ధతిని ప్రవేశపెట్టారు. ఎగువసభను రాష్ట్రాల మండలి (కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్), దిగువసభను కేంద్ర శాసనసభ (సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ)గా వ్యవహరించారు.

భారత ప్రభుత్వ చట్టం -1935

దీని ప్రకారం అఖిల భారత సమాఖ్య ఏర్పాటుకు నిర్ణయించారు. కేంద్రం, రాష్ట్రాల మధ్య 3 జాబితాల ప్రకారం అధికార విభజన చేశారు. రాష్ట్రాల్లోని ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దుచేసి కేంద్రంలో ద్వంద్వ ప్రభుత్వాన్ని ప్రతిపాదించారు. కేంద్రంలో పాలనాంశాలను రిజర్వుడు, ట్రాన్స్‌ఫర్డ్ అంశాలుగా విభజించారు. ఈ చట్టం ద్వారా బర్మాను భారతదేశం నుంచి వేరు చేశారు. ఒరిస్సా, సింధ్ అనే రెండు కొత్త ప్రావిన్సులను ఏర్పాటు చేశారు. కేంద్రంలో ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, రాష్ట్రాల్లో పబ్లిక్ సర్వీస్ కమిషన్లను ఏర్పాటు చేశారు. భారతదేశంలో విత్త విధానం, రుణ నియంత్రణ కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను స్థాపించారు.

భారత్‌లో ఉన్న భారజల కేంద్రాల సంఖ్య?



ఆధునిక భౌతిక శాస్త్రం

1. సహజ రేడియోధార్మికతలో విడుదలయ్యే కిరణాలేవి?
జ. α, β, γ
2. α, β, γ కిరణాలకు మరో పేరు?
జ. బెక్వరల్ కిరణాలు
3. α-కణం విడుదలైనప్పుడు పరమాణు సంఖ్యలో తగ్గుదల?
జ. 2 యూనిట్‌లు
4. α-కణం విడుదలైనప్పుడు ద్రవ్యరాశి సంఖ్యలో తగ్గుదల?
జ. 4 యూనిట్‌లు
5. α-కణాన్ని కనుగొన్న శాస్త్రవేత్త?
జ. రూథర్‌ఫర్డ్
6. అత్యధిక అయనీకరణ సామర్థ్యం ఉన్న కణం?
జ. α-కణం
7. అత్యధిక చొచ్చుకుపోయే సామర్థ్యం ఉన్న కణం?
జ. γ-కణం
8. సహజ రేడియోధార్మికత ప్రక్రియలో β కణం విడుదలైనప్పుడు పరమాణు సంఖ్యలో పెరుగుదల?
జ. 1 యూనిట్
9. β-కణాన్ని కనుగొన్నవారు?
జ. రూథర్‌ఫర్డ్
10. γ-కణం విడుదలైనప్పుడు పరమాణు సంఖ్య, ద్రవ్యరాశి సంఖ్యలో మార్పు?
జ. ఉండదు
11. γ-కణాన్ని కనుగొన్నవారు?
జ. విల్లార్డ్
12. రేడియోధార్మిక శ్రేణులు ఎన్ని రకాలు?
జ. నాలుగు రకాలు. అవి..
ఎ. థోరియం శ్రేణి లేదా 4n శ్రేణి
బి. యురేనియం శ్రేణి లేదా 4n+2 శ్రేణి
సి. ఆక్టీనియం శ్రేణి లేదా 4n+3 శ్రేణి
డి. నెప్ట్యూనియం శ్రేణి లేదా 4n+1 శ్రేణి
13. సహజ రేడియోధార్మిక శ్రేణుల్లో చిట్టచివరి మూలకం?
జ. సీసం (పరమాణు సంఖ్య = 82, లాటిన్ నామం ప్లంబం pb)
14. రేడియోధార్మికతకు ప్రమాణాలేవి?
జ. బెక్వరల్, రూథర్‌ఫర్డ్, క్యూరి
(రేడియోధార్మికతకు చిన్న ప్రమాణం Bq (బెక్వరల్)
Bq = విఘటనం/ సెకన్
రూథర్‌ఫర్డ్ (R.d)
= 10^6 విఘటనం/సెకన్
రూథర్‌ఫర్డ్ (R.d) = 10^6 Bq
క్యూరీ (C.I)
= 3.7×10^{10} విఘటనం/సెకన్
= 3.7×10^{10} Bq
= $3.7\times10^4 \times 10^6$ Bq
క్యూరీ (C.I) = 3.7×10^4 R.d
(R.d - రూథర్‌ఫర్డ్)
రేడియోధార్మికతకు అతి పెద్ద ప్రమాణం క్యూరీ.
15. ప్రకృతిలోని ప్రాథమిక బలాల్లో అత్యంత బలమైంది?
జ. బలమైన కేంద్రక బలం
16. కేంద్రక బలాలను మీసాన్ సిద్ధాంతంతో వివరించిందెవరు?
జ. యుకావా
17. పరమాణు కేంద్రకం పాల్గొనే చర్యలు?
జ. కేంద్రక విచ్ఛిత్తి, కేంద్రక సంలీనం
18. కేంద్రక విచ్ఛిత్తి ప్రక్రియను వివరించిందెవరు?
జ. అట్టోహాన్, స్ట్రాస్‌మన్, లిసేవెయిట్‌నర్
19. కేంద్రక విచ్ఛిత్తి ప్రక్రియ జరగడానికి ఉపయుక్తమైన కణం?
జ. ఉష్ణీయ న్యూట్రాన్
20. ఉష్ణీయ న్యూట్రాన్ అంటే?
జ. తక్కువ వేగం ఉన్న న్యూట్రాన్
(ఉష్ణీయ న్యూట్రాన్ శక్తి 0.04 ev కంటే తక్కువగా ఉంటుంది)
21. కేంద్రక విచ్ఛిత్తి ప్రక్రియలో విడుదలయ్యే న్యూట్రాన్లు ఏ శ్రేణిలో ఉంటాయి?
జ. గుణ శ్రేణి
న్యూట్రాన్లు విడుదలయ్యే క్రమం: 3, 9, 27, 81, 243, 729....
22. కేంద్రక విచ్ఛిత్తి ప్రక్రియ ఒక యురేనియం మూలకం అంతరించిపోయే వరకు జరుగుతుంది. ఈ చర్య పేరు?
జ. శృంఖల చర్య
23. శృంఖల చర్య ఎన్ని రకాలుగా జరుతుంది?
జ. రెండు రకాలుగా. అవి..
ఎ. అనియంత్రిత శృంఖల చర్య
బి. నియంత్రిత శృంఖల చర్య
24. అనియంత్రిత శృంఖల చర్య ఆధారంగా పనిచేసేది?
జ. ఆటమ్ బాంబు (అణు బాంబు)
25. అణు బాంబు సృష్టికర్తలు?
జ. అట్టోహాన్, స్ట్రాస్‌మన్
26. అణు బాంబును మొట్టమొదటిసారిగా ఏ దేశంపై ప్రయోగించారు?
జ. జపాన్
27. అణు బాంబును మొదటిసారిగా ఏ నగరంపై విసిరారు?
జ. హిరోషిమా
ఆగస్టు 6న హిరోషిమాపై అణు బాంబు వేశారు. కాబట్టి ఆగస్టు 6ను హిరోషిమా డే అని పిలుస్తారు. హిరోషిమాపై విసిరిన బాంబు పేరు లిటిల్ బాయ్.
28. అణు బాంబును జపాన్‌లోని 'నాగసాకి' నగరంపై వేసిన రోజు?
జ. ఆగస్టు 9. అందుకే ఆగస్టు 9ని నాగసాకి డే అని పిలుస్తారు. నాగసాకి నగరంపై వేసిన బాంబు పేరు ఫ్యాట్‌మాన్.
29. నియంత్రిత శృంఖల చర్య ఆధారంగా పనిచేసే పరికరం?
జ. న్యూక్లియర్ రియాక్టర్
30. న్యూక్లియర్ రియాక్టర్‌ను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?
జ. ఎన్‌రిక్ ఫెర్మి
అమెరికాకు చెందిన ఫెర్మి 1942 డిసెంబర్‌లో న్యూక్లియర్ రియాక్టర్‌ను రూపొందించాడు. ఇతణ్ని న్యూక్లియర్ రియాక్టర్ పితామహుడిగా పిలుస్తారు. ఫెర్మి గౌరవార్థం పరమాణు కేంద్రక పరిమాణాన్ని ఫెర్మిలలో కొలుస్తారు. పరమాణు కేంద్రక వ్యాసార్ధం విలువ $=10^{-15}$ m
31. న్యూక్లియర్ రియాక్టర్‌లో ఎన్ని ప్రధాన భాగాలుంటాయి?
జ. 5
32. న్యూక్లియర్‌లో ఉపయోగించే ఇంధన పదార్థాలు ఏవి?
జ. యురేనియం, థోరియం, ప్లూటోనియం.
ఈ ఇంధన పదార్థాలను స్తూపాకార అల్యూమినియం గొట్టాల్లో నింపుతారు.
33. న్యూక్లియర్ రియాక్టర్‌లోని మితకారి పదార్థం ప్రయోజనం?
జ. న్యూట్రాన్‌ల వేగం తగ్గించడం
34. న్యూక్లియర్ రియాక్టర్‌లో మితకారిగా ఉపయోగించే పదార్థాలు?
జ. భారజలం, గ్రాఫైట్, బెరీలియం, పారఫిన్.
భారజలానికి మరో పేరు డ్యూటీరియం ఆక్సైడ్. దీన్ని యురే అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.
- ప్రస్తుతం ఇండియాలో 9 భారజల కేంద్రాలు ఉన్నాయి.
- భారతదేశంలో మొదట పంజాబ్‌లోని నంగాల్‌లో భారజల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.
- తెలంగాణ రాష్ట్రంలోని ఏకైక భారజల కేంద్రం ఖమ్మం జిల్లాలోని మణుగూరులో ఉంది.
- గ్రాఫైట్‌ను లెడ్ పెన్సిళ్ల తయారీలో, భారీ యంత్రాల్లో కందెనగా ఉపయోగిస్తారు.
- లెడ్ పెన్సిల్‌లో లెడ్ ఉండదు.
- గ్రాఫైట్ కార్బన్ రూపాంతరం.
- కార్బన్‌కు అలోహ ధర్మం ఉన్నప్పటికీ గ్రాఫైట్ లోహ ధర్మాన్ని పాటిస్తుంది.
- కార్బన్‌ను 'కింగ్ ఆఫ్ ది ఎలిమెంట్స్' అని పిలుస్తారు.

35. న్యూక్లియర్ రియాక్టర్‌లో వాడే నియంత్రణ కడ్డీల ప్రయోజనం?
జ. చర్యా వేగాన్ని తగ్గించడం
36. న్యూక్లియర్ రియాక్టర్‌లో ఉపయోగించే నియంత్రణ కడ్డీలు?
జ. బోరాన్, కాడ్మియం
37. న్యూక్లియర్ రియాక్టర్‌లో జరిగే కేంద్రక చర్యల వల్ల విడుదలయ్యే ఉష్ణాన్ని బయటకు తీసుకొచ్చేందుకు ఉపయోగపడేది?
జ. శీతల కారిణి
(శీతల కారిణిగా ఉపయోగించే పదార్థాలు భారజలం, ద్రవ సోడియం)
38. కేంద్రక సంలీన చర్యలకు మరో పేరు?
జ. ఉష్ణకేంద్రక చర్యలు
39. సూర్యుడు, నక్షత్రాల్లో నిరంతరం జరిగే చర్యలు?
జ. కేంద్రక సంలీన చర్యలు
40. సూర్యుడి నుంచి లభించే విటమిన్?
జ. విటమిన్–డి
41. హైడ్రోజన్ బాంబు ఏ సూత్రం ఆధారంగా పనిచేస్తుంది?
జ. అనియంత్రిత కేంద్రక సంలీన చర్య
హైడ్రోజన్ బాంబును ఎడ్వర్డ్ టెల్లర్ తయారు చేశారు. ఇతడిని హైడ్రోజన్ బాంబు పితామహుడిగా పిలుస్తారు. మొదటి హైడ్రోజన్ బాంబు పేరు మైక్.
42. కేంద్రక సంలీన చర్యలు భూమి, చంద్రుడిపై జరగకపోవడానికి కారణం?
జ. హైడ్రోజన్‌కు ఉన్న స్వల్ప పలాయన వేగం.
వాయు కణాలు తప్పించుకొని పోయేందుకు కావల్సిన కనీస వేగాన్ని పలాయన వేగం (Ve) అంటారు.
- భూమిపై హైడ్రోజన్ పలాయన వేగం? 11.2 కి.మీ./సెకన్
- చంద్రుడిపై హైడ్రోజన్ పలాయన వేగం? 2.38 కి.మీ./సెకన్
- సూర్యుడిపై హైడ్రోజన్ పలాయన వేగం? 620 కి.మీ./సెకన్

43. కేంద్రక సంలీన చర్యలో పాల్గొనే మూలకం?
జ. హైడ్రోజన్
44. కేంద్రక సంలీన చర్య జరిగిన తర్వాత ఏర్పడే మూలకం?
జ. హీలియం
45. సూర్యుడికి మరో పేరు?
జ. హీలియో

గతంలో అడిగిన ప్రశ్నలు

1. థర్మల్ రియాక్టర్‌లో శక్తిని విడుదల చేసే ముఖ్యమైన మూల పదార్థం?
ఎ) యురేనియం– 235
బి) యురేనియం – 238
సి) యురేనియం– 233
డి) ప్లుటోనియం–233
2. సూర్యుడిలో శక్తికి మూలాధారం?
ఎ) కేంద్రక విచ్ఛిత్తి
బి) ద్రవ్యరాశి లోపం
సి) రేడియో ధార్మికత
డి) కేంద్రక సంలీనం
3. బీటా కిరణాలు వేటిని కలిగి ఉంటాయి?
ఎ) ఎలక్ట్రాన్లు బి) ప్రోటాన్లు
సి) పాజిట్రాన్లు డి) న్యూట్రాన్లు
4. న్యూక్లియర్ రియాక్టర్‌ను విస్ఫోటక దశ నుంచి రక్షించడానికి వాడేవి?
ఎ) కాడ్మియం కడ్డీలు
బి) కార్బన్ కడ్డీలు సి) భారజలం
డి) అల్యూమినియం కడ్డీలు
5. హైడ్రోజన్ బాంబు పని చేసే సూత్రం?
ఎ) కేంద్రక విచ్ఛిత్తి
బి) కేంద్రక సమ్మేళనం
సి) కృత్రిమ రేడియోధార్మికత
డి) సహజ రేడియోధార్మికత
6. న్యూక్లియర్ రియాక్టర్‌లో న్యూట్రాన్‌ల వేగాన్ని తగ్గించేది?
ఎ) భారజలం బి) పాదరసం
సి) హైడ్రోజన్ డి) ఆల్కహాల్
7. అణు రియాక్టర్‌లో ఇంధనంగా ఉపయోగించేది?
ఎ) బొగ్గు బి) యురేనియం
సి) రేడియం డి) భారజలం
8. భారజలం అంటే?
ఎ) మంచు గడ్డ కట్టడం
బి) డ్యూటీరియం ఆక్సైడ్
సి) పొడి మంచు
డి) పైవేవీ కావు
9. భారత అణుశక్తి పితామహుడు?
ఎ) రాజా రామన్న
బి) విక్రమ్ సారాబాయి
సి) సి.వి. రామన్
డి) హోమి జహంగీర్ బాబా
10. రేడియోధార్మికత శక్తిని కనుగొన్నవారు?
ఎ) బెక్వరల్ బి) ఛాడ్విక్
సి) బోర్ డి) లీనార్డ్
11. అణు బాంబు ఆవిష్కర్త?
ఎ) డాల్టన్ బి) అట్టోహాన్
సి) న్యూటన్ డి) ఐన్‌స్టీన్

సమాధానాలు

1) ఎ; 2) డి; 3) ఎ; 4) సి; 5) బి; 6) ఎ; 7) బి; 8) బి; 9) డి; 10) ఎ; 11) బి.

భారత అణు పరీక్షలు

జనరల్ నాలెడ్జ్ ఫర్ గ్రూప్స్

పోఖ్రాన్ -1

భారతదేశం తొలి అణు పరీక్షను 1974లో మే 18న రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో నిర్వహించింది. దీన్ని 'స్మైలింగ్ బుద్ధ'గా పిలుస్తారు. బార్క్ డైరెక్టర్ రాజా రామన్న ఈ అణుబాంబు ప్రాజెక్టుకు నేతృత్వం వహించారు. ఈ బాంబును తయారు చేసిన వ్యక్తి పీకే అయ్యంగార్. ఆ సమయంలో భారత ప్రధాని ఇందిరా గాంధీ.

పోఖ్రాన్ -2

1998 మేలో భారత్ రెండో అణు పరీక్షలను పోఖ్రాన్‌లో నిర్వహించింది. వీటినే పోఖ్రాన్-2 అంటారు. 1998 మే 11న మూడు, మే 13న రెండు అణు పరీక్షలను నిర్వహించారు. ఆ సమయంలో భారత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి. పోఖ్రాన్-2కు మరోపేరు ఆపరేషన్ శక్తి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

పీష్వాలను ఓడించిన పరాక్రమశీలి శంకరమ్మ

తెలంగాణలో ముఖ్యమైన సంస్థానాలు

తెలంగాణ సంస్కృతి నిర్మాణంలో, సాహిత్య వికాసంలో సంస్థానాల పాత్ర మరువలేనిది. ఆంధ్ర ప్రాంతంలో నాయక రాజులు పోషించిన పాత్రను తెలంగాణలో సంస్థానాలు పోషించాయి.

ఆత్మకూరు సంస్థానం

మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఆత్మకూరు సంస్థానం వైశాల్యం 190 చ.కి.మీ. దీని తొలి రాజధాని తివుడంపల్లి. వర్ధమానపురం పాలకుడైన గోన బుద్ధారెడ్డి తిరుపతి వెళ్లినప్పుడు చంద్రగిరికి చెందిన గోపాలరెడ్డి అతడికి సకల సౌకర్యాలు కల్పించాడు. గోపాలరెడ్డి ఆతిథ్యానికి ముగ్ధుడైన బుద్ధారెడ్డి అతణ్ని మగతలనాడు గౌడ పదవిలో నియమించాడు. ఇతణ్నే ఈ సంస్థాన స్థాపకుడిగా చెప్పవచ్చు. ఇతడి చిన్న కుమారుడు చినగోపిరెడ్డి యుద్ధాల్లో బహమనీ సుల్తాన్లకు సహకరించాడు. ఇందుకు ప్రతిఫలంగా ముజఫర్ పరగణాలో నాడగౌడ, సర్ నాడ గౌడ, దేశ్‌ముఖ్, దేశ్‌పాండ్య, దేశాయిగిరి పదవులను పొందాడు.

చినగోపిరెడ్డి మనవడు రెండో గోపిరెడ్డి. ఇతడు అబ్దుల్లా కుతుబ్‌షా సమకాలీనుడు. రెండో గోపిరెడ్డి కుతుబ్‌షా దగ్గర నుంచి అల్లిపురం జాగీర్‌ను పొందాడు. గోపిరెడ్డి సోదరుడు సాహెబ్‌రెడ్డి. కడేచూరు, మగతల సీమలను పాలించేందుకు సాహెబ్‌రెడ్డికి కుతుబ్‌షా అనుమతిచ్చాడు. గోపిరెడ్డి తర్వాత సర్వారెడ్డి ఈ సంస్థానాన్ని పాలించాడు. సర్వారెడ్డి మనవడు రెండో సర్వారెడ్డి. ఇతడు యుద్ధాల్లో ఔరంగజేబుకు సహకరించి దుప్పల్లి జాగీర్‌ను పొందాడు. ఇతడి కుమారుడైన మొదటి తిమ్మారెడ్డి తర్వాతి కాలంలో రాజ్యాన్ని పాలించాడు. తిమ్మారెడ్డి మనవడు రెండో సాహెబ్‌రెడ్డి. ఇతడు కర్ణాటక దండయాత్రల్లో అసఫ్‌జాహీలకు సహకరించి 'సవైరాజా' బిరుదును పొందాడు. ఈ వంశంలో రెండో సాహెబ్ రెడ్డి తర్వాత ఏడో తరానికి చెందినవాడు పెద వెంకటరెడ్డి. ఇతడు నిజాం రాజైన సికిందర్‌జాకు యుద్ధాల్లో సహకరించాడు. ప్రతిఫలంగా అమరచింత, వడ్డెమాను పరగణాల పట్టా పొందాడు. ఇతడు రాజధానిని తివుడంపల్లి నుంచి ఆత్మకూరుకు మార్చాడు. పెద వెంకటరెడ్డి తర్వాత అతడి కుమారుడు బాలకృష్ణారెడ్డి, మనవడు సోమభూపాలరావు సంస్థానాన్ని పరిపాలించారు. సోమభూపాలరావు అమరచింత, వడ్డెమాను పరగణాలను శాశ్వతంగా బిల్‌మఖ్తాగా పొందాడు. సోమభూపాలుడి కుమారుడు రాజా సీతారామభూపాలరావు. ఇతడి కుమారుడైన సవైరాజా రామభూపాలరావు బల్వంత్ బహద్దూర్ సంస్థానాన్ని పరిపాలించాడు. ఇతడు ప్రజలకు ఉపయోగపడే అనేక నిర్మాణాలను చేపట్టాడు. ఇతడి మరణానంతరం భార్య భాగ్యలక్ష్మమ్మ నిజాం నుంచి పరిపాలనా అనుమతి పొందింది. ఈమె కాలంలోనే ఈ సంస్థానం హైదరాబాద్ రాష్ట్రంలో విలీనమైంది.

స్వాతంత్య్రం రాక ముందు భారతదేశంలో 562 సంస్థానాలు ఉండేవి. తెలంగాణ ప్రాంతంలోనూ అనేక సంస్థానాలున్నాయి. కాకతీయులు, కుతుబ్‌షాహీలు, అసఫ్‌జాహీల కాలంలో ఇవి ఆవిర్భవించాయి. వీటిలో ఆత్మకూరు, బోరవెల్లి, సిర్నవెల్లి, దుబ్బాక, దొంతి, దోమకొండ, గద్వాల, జటప్రోలు, పాల్వంచ, పాపన్నపేట, నారాయణపురం సంస్థానాలు ప్రధానమైనవి. సైనిక చర్య అనంతరం నిజాం రాష్ట్రంతో పాటు ఇవి భారత దేశంలో విలీనమయ్యాయి.

నారాయణపురం, రాజాపేట

ఇవి నల్లగొండ జిల్లాకు చెందిన చిన్న సంస్థానాలు వీటికి సొంత అధికారాలు ఉండేవి కావు. నిజాం ఉల్‌ముల్క్ కాలంలో నల్లగొండ జిల్లా గట్టుప్పల్ ప్రాంతంలో ఒక గజదొంగ దురాగతాలకు పాల్పడేవాడు. మంచల్‌రెడ్డి అనే వ్యక్తి ఆ దొంగను చంపి, నారాయణపురం ప్రాంతాన్ని ఇనామ్‌గా పొందాడు. ఇతడి సోదరుడు సోమిరెడ్డి నారాయణపురం పటేల్‌గా నియమితుడయ్యాడు. తర్వాత మంచల్‌రెడ్డి కుమారుడైన రాయన్‌రెడ్డి పాలకుడయ్యాడు. నిజాంను ధిక్కరించిన ఒక సామంతరాజును ఇతడు బంధించి తెచ్చాడు. ఈ చర్యకు మెచ్చిన నిజాం ఇతడికి సర్‌మన్నెవార్, సర్దేశ్‌ముఖ్, సర్దేశ్‌పాండే, సర్‌నాడగౌడ బిరుదులు ఇచ్చి గౌరవించాడు. తర్వాత ఇతడిని రాచకొండ, భువనగిరి, అడవిమర్రి, షాద్‌నగర్, నర్సికొండ, ఇందుర్తి, ఇంద్రియాల, ఇబ్రహీంపట్నం పరగణాల మీద అధికారం కల్పించాడు.

రాయన్‌రెడ్డి 1775లో రాజాపేట కోటను నిర్మించాడు. 1782లో ఇతడి కుమారుడు వెదిరె వెంకట నారాయణరావు పాలకుడయ్యాడు. ఇతడే నారాయణపురం సంస్థానాన్ని స్థాపించాడు. ఇతడి కుమారుడైన రాయన్న మీర్ లాయక్ అలీ, సాలార్జంగ్ లాంటి గొప్ప వారితో కలిసి చదువుకున్నాడు. ఇస్లాం మతాన్ని స్వీకరించాడు. ఇతడికి ఆరుగురు భార్యలు. చివరి భార్య హుస్సేన్ బేగంకు మాత్రమే ఒక కూతురు జన్మించింది. ఆమె పేరు జహీరున్నీసా బేగం. ఆమే ఈ సంస్థాన చివరి పాలకురాలు. రాజాపేట సంస్థానం పరిధిలో కుర్రారం, నమిలె, మాసాయిపేట, కోరుకొండ, పెదపాడు, సాదువెల్లి, చల్లూరు, వెంకిర్యాల, రాజాపేట గ్రామాలుండేవి.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

వనపర్తి సంస్థానం

తెలంగాణలోని పెద్ద సంస్థానాల్లో మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి సంస్థానం ఒకటి. ఈ సంస్థానం సాహిత్యంలో మేటి. దీని పరిధిలో 124 గ్రామాలుండేవి. నూగూరు రాజధానిగా పాలించారు కాబట్టి వీరిని నూగూరు సంస్థానాధీశులని పిలిచేవారు. వీరి పూర్వీకులు నంద్యాలకు చెందినవారు. ఈ సంస్థాన స్థాపకుడు జనుంపల్లి వీరకృష్ణారెడ్డి. ఈ వంశంలో నాలుగో తరంవాడు వేమడి వెంకటరెడ్డి(1625-53). నెల్లూరు, ఉదయగిరి దుర్గాలను జయించడంలో అబ్దుల్లా కుతుబ్‌షాకు ఇతడు సహాయపడ్డాడు. ఈ వంశంలో అష్టభాషా గోపాలరావు ప్రసిద్ధుడు. ఇతడు రెండో వెంకటరెడ్డి కుమారుడు. ఈ వంశంలో బహరీ బిరుదును పొందిన తొలి వ్యక్తి గోపాలరావు. ఇతడు 8 భాషల్లో ప్రసిద్ధుడు. ఇతడు రామచంద్రోదయం అనే కావ్యాన్ని, బాణం అనే సంస్కృత గ్రంథాన్ని రచించాడు. మిన్‌జానీబ్ సర్కారు తరఫున గోపాలరావు రెండేళ్లపాటు జటప్రోలు సంస్థానాన్ని పాలించాడు. ఇతడి దత్తపుత్రుడు మూడో వెంకటరెడ్డి. ఢిల్లీ సుల్తాన్ ఇతడికి సవై బిరుదును ఇచ్చాడు. వెంకటరెడ్డి తన తండ్రి పేరుమీద గోపాలపేట సంస్థానాన్ని స్థాపించాడు.

నూగూరు సంస్థానంలోని 12 గ్రామాలను అందులో చేర్చి, దానికి తన సోదరుడైన రంగారెడ్డిని పాలకుడిగా నియమించాడు. ఈ కాలంలో మొగలుల పరిస్థితి దిగజారింది. ఇదే అదనుగా వెంకటరెడ్డి పన్ను ఎగ్గొట్టాడు. దీంతో సుల్తాన్ సైన్యం ఇతడిపై దండెత్తింది. ఈ దాడిలో ఓడిపోయిన వెంకటరెడ్డి 1711లో ఆత్మహత్య చేసుకున్నాడు. గోపాలరావు కాలంలో ముద్రించిన నూగూరు సిక్కాలు (నాణేలు) సంస్థానానికి ఎంతో పేరు తెచ్చాయి. కానీ 'నూగూరు వెట్టి' వల్ల ఈ సంస్థానం అప్రతిష్ఠ పాలైంది. తర్వాతి కాలంలో ఈ వంశంలో చెప్పుకోదగిన వ్యక్తి మొదటి రామకృష్ణారావు (1807-1822). ఇతడు సంస్థానాన్ని వనపర్తికి మార్చాడు. నిజాం ఇతడికి 1817లో రాజబహద్దూర్ బిరుదునిచ్చాడు. ఇతడు మంచి పండితుడు. చాలా మంది ఫకీర్లు ఇతడి స్నేహితులుగా ఉండేవారు. ఈ సంస్థానంలో అందరిలోకెల్లా ప్రసిద్ధి చెందినవాడు రాజా రామేశ్వరరావు. ఇతడిలో ఆధునిక భావాలు మెండు. ఆంగ్ల విద్య ఆవశ్యకతను గుర్తించిన రామేశ్వరరావు మద్రాస్ వెళ్లి ఆంగ్లం నేర్చుకున్నాడు. 1802లో రెవెన్యూ సెటిల్‌మెంట్ భూమిని కొలిచి సర్వే నంబర్లు వేశాడు. రైతులకు పట్టాలు ఇచ్చే పద్ధతిని ప్రవేశపెట్టాడు. తెలంగాణలో రైతులకు పట్టాలు ఇచ్చిన తొలి సంస్థానం ఇదే. సాలార్జంగ్ కంటే ముందే ఇక్కడ సంస్కరణలు చేపట్టారు. అందుకే సాయుధ పోరాటం ఇక్కడ ప్రభావం చూపలేదు. రాజా రామేశ్వరరావు కులాంతర ప్రేమ వివాహం చేసుకోవడానికి సిద్ధపడ్డాడు. సంస్థానంలో ఆధునిక సిద్ధాంతాలను ప్రవేశపెట్టి నిజాం సర్వసైన్యాధ్యక్ష పదవి పొందాడు. బ్రిటిషర్లు ఇతడికి 'హిస్ హైనెస్' అనే బిరుదును ప్రకటించారు. మూడో రామేశ్వరరావు కాలంలో ఈ సంస్థానం హైదరాబాద్ రాష్ట్రంలో విలీనమైంది.

పాపన్నపేట సంస్థానం

పాపన్నపేట అతి ప్రాచీన సంస్థానం. ఇది ఒకప్పుడు అన్ని సంస్థానాల కంటే పెద్దది. మెదక్ జిల్లా మొత్తం ఈ సంస్థాన పరిధిలో ఉండేది. రాణి శంకరమ్మ పాలనా కాలం నుంచి సంస్థాన చరిత్ర తెలుస్తోందని బి.ఎన్.శాస్త్రి తెలిపారు. సురవరం ప్రతాపరెడ్డి కూడా గోల్కొండ పత్రికలో ఈ సంస్థాన చరిత్రను రాశారు. అందులో రాణి శంకరమ్మ, సదాశివరెడ్డి గురించి మాత్రమే పేర్కొన్నారు. తర్వాతి కాలంలో కొన్ని గ్రంథాల ద్వారా ఈ సంస్థాన చరిత్ర కొంత వెలుగులోకి వచ్చింది.

చిదిరె వంశీయులు ఈ సంస్థాన రాజపురోహితులు. ఈ వంశానికి చెందిన చిదిరె లక్ష్మణశాస్త్రి 1928-29లో సంస్థాన చరిత్రను రచించాడు. ఇందుకోసం రాణి లింగాయమ్మ రాసిన మా పూర్వ వంశావళి, రాజా వెంకట నరసింహారెడ్డి ఉర్దూలో రాసిన మా వంశ చరిత్ర, వెంకటాద్వరి రచించిన మా సంస్థాన చరిత్ర, లింగాయమ్మ చరిత్ర; తిరుమలాచార్యుల శౌర్యరాజ్య వంశావళి, ముదిగొండ రామకృష్ణ కవి శ్రీమజ్జోగినాథ చరిత్ర అనే గ్రంథాలను ఆధారంగా చేసుకున్నాడు. వీటితోపాటు తమ పూర్వీకులు చెప్పిన విషయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నాడు. లక్ష్మణశాస్త్రి సంస్థాన చరిత్ర రాతప్రతిని సురవరం, బిరుదురాజు రామరాజుకు ఇచ్చాడు. కానీ కొన్ని కారణాల వల్ల దాన్ని తిరిగి పొందలేదు. దీంతో తన వద్దనున్న చిత్తుప్రతి ఆధారంగా 1979-80లో మెదక్ రాజుల చరిత్రను ముద్రించాడు. ముడుంగ రంగ కృష్ణమాచార్యులు 2006-07లో 'ఆందోల్-జోగిపేట', 2012లో 'శౌర్యవీర్యరెడ్డి త్రయం' అనే పుస్తకాలు రాశాడు.

ఆందోల్ రాజుల చరిత్ర, మెదక్ రాజుల చరిత్ర, రంగంపేట చరిత్ర అనే వివిధ పేర్లతో పాపన్నపేట సంస్థాన రాజుల చరిత్ర వ్యవహారంలో ఉంది. కాకతీయుల సేనానుల్లో అనంతరెడ్డి ఒకరు. కాకతీయ రాజ్య పతనం తర్వాత ఇతడు సంగారెడ్డి సమీపంలోని కల్పగూరు వచ్చి స్థిరపడ్డాడు. ఇతడు నాటి పాలకులకు సాయం చేసి, వారి నుంచి కల్పగూరు పరగణాను పొందాడు. ఇతడే ఈ వంశ స్థాపకుడు. తర్వాత ఇతడి మనవడైన రామినేడు 1398లో పట్టాభిషిక్తుడయ్యాడని ఆందోల్ తహశీల్దార్ రాసిన మెదక్ చరిత్రలో ఉంది. రామినేడు ఆందోల్ కోటను నిర్మించాడు. 1418లో ఆందోల్‌ను రాజధానిగా చేసుకున్నాడు. కొండాపూర్, ఓంకారపురం, పాటన్‌చెర్వు (పటాన్‌చెరువు), తెలంగాణాపురం, రుద్రారం, మెతుకు, కాపాల, అతినగరం, డాకూరు మొదలైనవి ఇతడి సంస్థానంలో భాగంగా ఉండేవి. తర్వాత భువనగిరి, నిజాంపేట, చందంపేట, దేవరకొండ, నర్సాపూర్, దౌల్తాబాద్ తదితర ప్రాంతాలు కూడా ఇతడి సంస్థానంలో భాగమయ్యాయి.

రామినేడు తర్వాత ముసలారెడ్డి, పెద్దరెడ్డి, అల్లమయ్య చౌదరి, రామిరెడ్డి, మొదటి సదాశివరెడ్డి, పెద్దనరసింహారెడ్డి, లింగాయమ్మ, లింగారెడ్డి తదితరులు ఈ సంస్థానాన్ని పరిపాలించారు. రామదుర్గా వెంకట నరసింహారెడ్డి (1720-60) కాలంలో ఈ సంస్థాన పరిధి తగ్గి చిన్న సంస్థానంగా మారింది. శంకరమ్మ పరాక్రమం చూసిన నరసింహారెడ్డి ఆమెను వివాహమాడాడు. నరసింహారెడ్డి మరణం తర్వాత శంకరమ్మ సంస్థాన పాలన బాధ్యతలను చేపట్టాల్సింది. కానీ ఒక కుట్ర వల్ల రెండో లింగాయమ్మ రాణి అయింది. ఈమె 1760-64 వరకు సంస్థానాన్ని పాలించింది. మహారాష్ట్ర పీష్వాలు నిజాం రాజ్యంపై దండెత్తారు. కానీ శంకరమ్మ తన శక్తియుక్తులతో వారిని ఓడించింది. దీంతో నిజాం ఆమెకు రాయ్‌భాగన్ (ఆడ సింహం లాంటి రాణి) అనే బిరుదునిచ్చి రాణిగా నియమించాడు. 1764లో అధికారంలోకి వచ్చిన శంకరమ్మ రాజ్యాన్ని పునర్ నిర్మించింది. తన తండ్రి పేరు మీద సంగారెడ్డిని, తల్లి పేరు మీద రాజంపేటను నిర్మించింది. తన పేరు మీద శంకరంపేటను, మీరెల్లి పాపన్న పేరు మీద పాపన్నపేటను నిర్మించింది. ఈమె గొప్ప పరాక్రమవంతురాలు, పరిపాలనాదక్షురాలు. శంకరమ్మ పేరు మీద అనేక జానపదులు, వీరగాథలు ప్రచారంలో ఉన్నాయి. అందుకే చరిత్రకారులు ఈమెను రుద్రమదేవి, అహల్యాబాయితో పోల్చారు. వ్యవసాయాభివృద్ధికి శంకరమ్మ అనేక చెరువులు నిర్మించింది. ఈమె గొప్ప సంస్కరణశీలి. దళితుడైన నీరుడి పాపన్నను దళపతి చేసింది.

శంకరమ్మకు సంతానం లేదు. అందువల్ల పేద బాలుడైన సదాశివరెడ్డిని దత్తత తీసుకుంది. 1774లో ఈమె మరణించింది. దీంతో సదాశివరెడ్డి రాజ్యానికి వచ్చాడు. గద్వాల సంస్థానాధీశుడైన సోమనాథ భూపాలుడు ఇతడి ధైర్య సాహసాలకు ముగ్ధుడయ్యాడు. అందుకే ఇతడికి తన కుమార్తె అయిన పార్వతీదేవినిచ్చి వివాహం చేశాడు. సదాశివరెడ్డి కూడా మరాఠా పీష్వాలను ఓడించి నిజాం అలీఖాన్ (రెండో అసఫ్‌జా)కు సహాయం చేశాడు. నిజాం అలీఖాన్ పెద్ద కుమారుడు అక్బర్ అలీ. ఇతడు తండ్రి మీద తిరుగుబాటు చేసి సదాశివరెడ్డి, గాలీబ్‌జంగ్ సహాయం కోరాడు. ఈ సందర్భంగా జరిగిన మూడు యుద్ధాల్లో సదాశివరెడ్డి గెలుపొందాడు. కానీ చివరి యుద్ధంలో ఓటమిపాలై హత్యకు గురయ్యాడు. తర్వాత ఇతడి భార్య పార్వతీదేవి అధికారంలోకి వచ్చింది. రాజా రామచంద్రారెడ్డి బహద్దూర్ ఈ సంస్థాన చివరి పాలకుడు. ఇతడి కాలంలోనే పాపన్నపేట సంస్థానం హైదరాబాద్ రాష్ట్రంలో విలీనమైంది.

Another term for hyperlink is..

BANK EXAMS
Computer Awareness

The Internet is a worldwide network of networks. It can be defined as a global net work of over millions of smaller heterogeneous computer networks consists of a set of national, regional and private. The internet is the common language where by dissimilar computers with various operating systems, are able to communicate with each other using a standard set of protocols.

The Internet is the world's largest computer network, a distinction it has earned by virtue of being a "network of networks." The Internet is an outgrowth of a network (ARPANET) established roughly a quarter-century ago to meet the needs of researchers working in the defense industry in the United States and a few of their colleagues in other countries.

The ARPANET grew slowly, from a handful of computers in 1971 to more than 1000 in 1984. Working with the ARPANET researchers came to regard high-speed computer networks as an indispensable tool for academic research in all fields and in 1986 the US National Science Foundation established NSFNET to provide network connections to more research institutions and improve international network cooperation. In 1987, the Internet served more than 10,000 computers. By 1989 the network had grown to more than 100,000.



Evolution of Internet

- The origin of Internet can be traced to a U.S. Department of Defense (DoD) organization called Advanced Research Projects Agency (ARPA).
- ARPA developed a four node packet switching network called ARPANET in 1969. The network was intended to support the military research on fault tolerant computer networks. DoD wanted to ensure a reliable data transfer in the event of a nuclear war, even if parts of the network has been destroyed.
- As the years pass by, the network grew in size and by 1st January 1983, the ARPANET no longer remained an experimental network but its control was passed over to Defense Communications Agency (DCA).
- The network then became available for the academic research, government employee and contractors.
- The world's fastest and most powerful computers were made available to an academic and scientific community.
- In 1990 the ARPANET was officially decommissioned.

Some of the major networks contributing to the growth of the internet are as follows:

- ARPANET
- USENET (User's network)
- CSNET (Computer science network)
- BITNET (Because it's time network)
- NSFNET (National science foundation network)
- WWW (World Wide Web)
- NREN (National research and education network)
- Intranet

It is said that the Internet is growing at a rate of 20% per month. The data speeds have gone up considerably, which makes the access even faster.

- The event which started as a military assistance program is now largely a private enterprise.

Services on the Internet

The services that are available on the Internet can be classified into two categories:

- Communication services (electronic mail (e-mail))
- Information retrieval services (Web (pages with links and multimedia content of its Web sites))

Applications of Internet

Traditionally the internet has the following applications.

1) E-mail 2) News
3) Remote login
4) File transfer
5) World wide web (www)

MODEL QUESTIONS

1. A ______ is a named location on a disk where files are stored.
1) Folder 2) Pod 3) Version
4) Bag 5) None of the above
2. The ______ allows you to choose where to go and is located below the Standards Buttons toolbar.
1) System menu
2) Address bar 3) Menu bar
4) Tool bar
5) None of the above
3. A _____ is a set of computer instructions that carry out a task on the computer.
1) Program 2) Database
3) Memory file 4) Folder
5) None of the above
4. An operating system version designed for home use is Microsoft Windows XP______
1) Home Edition
2) Media Center Edition
3) Tablet PC Edition
4) All of the above 5) None
5. A user-interface that is easy to use is considered to be______
1) user-happy 2) user-simple
3) user-friendly 4) Interface
5) None of the above
6. When you press and release the secondary mouse button you are______
1) Right-clicking
2) Left-clicking
3) Either 1 or 2
4) All of the above
5) Neither 1 nor 2
7. Another term for hyperlink is______
1) Link 2) Source
3) Bar 4) All of the above
5) None of the above
8. A graphical user interface displays________
1) Graphics 2) Text
3) Both 1 and 2
4) Neither 1 nor 2 5) None
9. The ______ program compresses larger files into a smaller file.
1) Win Zip 2) Win Shrink
3) Win Style 4) Win small
5) None of the above
10. The efficient data structure to insert/delete a number in a stored set of numbers is ________.
1) Queue 2) Linked list
3) Doubly linked list
4) Binary tree
5) None of the above
11. Caps lock, Num-lock are known as _______.
1) Modifier key 2) Toggle key
3) Function key 4) Numeric key
5) None of these
12. Which of the following memories must be refreshed many times per second?
1) Static RAM
2) Dynamic RAM 3) EPROM
4) ROM 5) None of these
13. Anurag is a supercomputer developed in______
1) China 2) USA 3) India
4) England 5) None of these
14. A result of a computer virus can not lead to________.
1) Disk Crash
2) Mother Board Crash
3) Corruption of program
4) Deletion of files
5) None of these
15. Choose the correct way to indicate that a line in a C++ program is a comment line, that is/a line they will not be executed as an instruction.
1) Begin the line with a # sign
2) Begin the line with double slashes (/ /)
3) Begin and end the line with double hyphens (-_-)
4) Indent the line
5) None of these
16. Programming language built into user programs such as Word and Excel are known as_____.
1) 4GLs 2) Macro languages
3) Procedure-oriented languages
4) Visual programming languages
5) None of these
17. Firewalls are used to protect against _______.
1) Unauthorized Attacks
2) Virus Attacks
3) Data Driven Attacks
4) Fire Attacks
5) All of these
18. System software is the set of programs that enables your computer's hardware devices and ______software to work together.
1) Management 2) Processing
3) Utility 4) Application
5) None of these
19. RAM can be thought of as the ______ for the computer's processor.
1) Factory 2) Operating room
3) Waiting room
4) Planning room
5) None of these
20. The CPU and memory are located on the ________.
1) Expansion board
2) Motherboard
3) Storage device
4) Output device
5) None of these
21. Word processing, spreadsheet and photo-editing are examples of ________.
1) Application software
2) System software
3) Operating system software
4) Platform software
5) None of the above
22. To hyperlink on the web page through HTML language, _____ tag is used.
1) <ahref> 2) <a> 3) <link>
4) <hlink> 5) <href>
23. Drop cap option found in which menu?
1) Insert 2) Format 3) Edit
4) Tools 5) None of these
24. A half byte is known as_______.
1) Data 2) Bit 3) Half byte
4) Nibble 5) All of these
25. A piece of computer hardware that is physically placed between two devices each of which manages data in a different way is called________.
1) Modern 2) Interface
3) Clue 4) Data bus
5) All of these
26. ______ tags, when placed on an animal, can be used to record and track in a database all of the animals movements.
1) POS 2) RFID 3) PPS
4) GPS 5) None of these
27. Format for musical data communication between two devices such as computer and synthesizer is called_______.
1) HTML 2) MP3 3) MPEG
4) MIDI 5) None of these
28. Every computer connected to an intranet or extranet must have a distinct_______
1) Firewall 2) Proxy server
3) IP address 4) Domain name
5) None of these
29. A file extension is separated from the main file name with a (n) ______, but no spaces.
1) Question mark
2) Exclamation mark
3) Underscore
4) Period
5) None of these
30. A tuple is a______.
1) Column of a table
2) Two-dimensional table
3) Row of a table
4) Key of a table
5) None of these

KEY

1) 1	2) 2	3) 1	4) 1
5) 3	6) 1	7) 1	8) 3
9) 1	10) 3	11) 2	12) 2
13) 3	14) 2	15) 2	16) 4
17) 1	18) 4	19) 3	20) 2
21) 1	22) 1	23) 1	24) 3
25) 2	26) 2	27) 4	28) 3
29) 4	30) 3		